
డాక్టర్
కొత్త
రవీంద్ర
బాబు

# 1

"శ్యామలేందుగారూ! ఓ శ్యామ్‌గారూ!"

శ్యామ్ వంచిన తల ఎత్తలేదు. పులిహోర బేసిన్ చేతబుచ్చుకుని ఎదురుబడ్డ నీల మరోసారి బిగ్గరగా.

"మిస్టర్ శ్యాం! పులిహోర మారువడ్డించవా?" అని అడిగింది.

తలిరాకు జొంపముల మధ్య వేలవాలు తుహిన కిరణ కోమల రేఖలా మెరసిపోతున్న నీల ప్రశ్నకు బదులు రాలేదు.

పువ్వు దీవెలాటి నీలోత్పల శరీరం స్వల్ప ప్రకంపనకు గురి అయింది.

కారుమొయిళ్ళ కాటుక పొగలు వెలిగకు నల్లకలువల జంట లాటి కనుదోయి చికిలించి శ్యాంవంక చూస్తూ.

"శ్యాం!" అంది ముగ్ధమోహనంగా — మురళి, కామంద మంద మాధురుల రుతులు నింపుకున్న నీల కల స్వనం శ్యాం చెవులకు సోకినట్లు లేదు.!

ఎలదేటి చిరుపాడి సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నెలా, తీయని మల్లెపూదేవెసోనలపై తూగాడు తలిరాకు దోనెలా, తొలిపొద్దు తెమ్మెర తోవలో పయనమై పరువెత్తు కోయిల పాటలా, వెల్లువైపారు వెన్నెలలో మునిగి తేలుతున్న మబ్బుతునకలా భువన సమ్మోహనంగా ఎదుట నిలబడ్డ నీలవంక శ్యాం తలఎత్తి చూడనేలేదు!

పగటికలలు కంటున్న శ్యాం మనసులో మధురభావనా తరంగాలు వువ్వెత్తున ఎగసిపడుతూ వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి!

సొగసైన జవనాశ్వంపై స్వారి చేస్తున్నాడు. ఉత్సాహంతో ముందుకు దుముకుతున్న గుర్రం మెడముందుకు వంగి — ఎక్కుపెట్టిన మన్మధుని చాపంలా వున్నది!

విరిసిన పూదోడిలో రూపుదాల్చిన వుప్పాడి బొమ్మలా నిలబడివున్నది నీల — ఝూమ్మంటూ ఝంకారం చేస్తూ పూ పొదరిండ్లపై పరిభ్రమిస్తున్న భ్రమర సమూహాలు గుంపులుగా నీలవైపు పయనమై పోతున్నాయి!



"అమ్మో! ఈ తేనె టీగలు నీల సుకుమార దేహంపై వాలితే యింకేమైనా వుందా?" భయంతో బిగుసుకుపోయాడు శ్యాం! మరుక్షణం తేరుకుని జవనాశ్వాన్ని అదిలించాడు. పంచరంగుల జవనాశ్వం ముందుకురికింది.

చియ్యబలసిన గండు తుమ్మెదలు రతీదేవిలా మెరసిపోతున్న నీలదేహాన్ని చూచి మోహావేశంతో ఒక్క వుదుటున ఆమె దేహంపై వాలాయి. తుమ్మముళ్ళలాంటి కాళ్ళతో నీల దేహంమీద అటునిటు తిరుగాడసాగాయి.

నీల కెవ్వున కేకవేసింది! విపరీతమైన భయోత్పాతం కల్గించిన వెరపుతో హృదయ విదారకంగా విలపించిందామె!

"వస్తున్నా నీలా! భయపడకు! ఒక్కక్షణంలో నీ దరి చేరి రక్కసి గుంపులా నీ మేనుపై వాలి బాధిస్తున్న తుమ్మెదల గుంపును పారద్రోలుతాను!" అంటూ అశ్వాన్ని ముందుకురికించాడు.

శ్యాం కేక విన్న నీల ముఖంపై క్షణం ఆశారేఖ తళుక్కుమంది. ఉలికిపడ్డట్లు తుమ్మెదల గుంపు ఒక్కసారి గాలిలోకి లేచి చుట్టూ చూచి దూరానవున్న శ్యాంను చూసి ఇనుమడించిన వుత్సాహంతో మరల నీల దేహంమీద వాలబోతున్నాయి!

"ఆగండి!" ప్రళయ భీకర స్వరంతో గర్జించాడు శ్యాం.

"నీల వంటిని ముట్టుకున్నారా మిమ్మల్ని చంపి పాతరేస్తాను!"

తుమ్మెదల గుంపు క్షణం నిశ్శబ్దంగా, చలన రహితంగా వుండిపోయింది.

"తుమ్మెదలు నీల దేహంపై వాలవు!" అనుకుంటూ ముందుకు దౌడుతీస్తున్న సమయంలో పంచకళ్యాణి కుప్పగూలిపోయింది!

గుర్రం, గుర్రంపై శ్యాం నేల మీదపడిపోయారు! తుమ్మెదలు రెట్టించిన వుత్సాహంతో ఝుమ్మని నీలదేహం చుట్టూ పరిభ్రమిస్తూ "ఇంకెక్కడికి పోతావు! సుకుమారమైన నీదేహం మా కందరికీ మరులుగొలుపుతున్నది. నీ అందాన్ని జుర్రుకుని ఆనందిస్తాం!" అంటూ ముందుకురికాయి.

"నీలా! అసహాయ స్వరంతో అరిచాడు శ్యాం! పంచకళ్యాణి వెనుకకాలుకు పొడవాటి తాడుకట్టి వున్నది! పూదోడి హద్దువరకు గుర్రాన్ని పరుగెత్తనిచ్చిన తాడు — నిడివి అయిపోవడంతో పంచకళ్యాణి వెనుక కాలును బలంగా లాగింది!

సరిగా పూదోడి సరిహద్దువద్ద కుప్పగా కూలిపోయింది జవనాశ్వం!

తుమ్మెదల గుంపు ఒక్కసారిగా నీలపై వాలటానికి వుద్యుక్తులవుతున్నాయి.!

"నీలా" ఎలుగెత్తి అరుస్తున్న శ్యాం కంఠధ్వని విన్న భ్రమర సమూహంలో ఆనందాతిశయం పెరిగి ఒక్కసారిగా ఆకాశంలోకి వువ్వెత్తున లేచి పిశాచనృత్యం మొదలెట్టాయి!

"నీలా! నీలా!" శ్యాం గొంతు అంతు తెలియని విరామయుత్వంతో పూడుకుపోయింది.

నిస్పృహాయత, నిర్వేదం, ఆత్మన్యూనతా భావం శ్యాంను నీరసింపజేసాయి!

భరించలేనంత దుఃఖంతో తలదించుకున్నాడు శ్యాం!

కల చెదిరిపోయింది!

శ్యాం తల మరింతగా కుంచించుకుపోయింది!

'ఓ శ్యామలేందుగారూ!" ఎంతో మధురంగా మరలా పిలించింది నీల!

శ్యాం తల మరింతగా కుంచించుకపోయింది.

"పులిహోర!?" నెమ్మదిగా అడిగింది నీల.

'వద్దు' అన్నట్లు తల అడ్డంగా తిప్పాడు శ్యాం.

ఉస్సురంటూ ముందుకు కదిలింది నీల!

విస్తరిలో వున్న పులిహోరను వేలితో అటూ యిటూ కదిలిస్తూ వుండిపోయాడు శ్యాం!

అప్పటివరకూ పగటి కలలు కంటూ అలౌకికానందం చిప్పిల్లిన అతని ముఖం మబ్బు కప్పిన చంద్రునిలా నల్లబడి పోయింది!

యువ్వనోత్సాహంతో జలపాతవేగంతో ముందుకు సాగుతున్న కోరికలనే పంచకల్యాణి గుర్రం పలుపు తాడుకు కట్టబడివుండడంతో బొక్కబోర్ల పడింది!

గత రెండు సంవత్సరాలుగా క్లాస్‌మేట్ నీల ఎదురయినా, మనసులో ఆమె తలపులు మెదలినా యిదే పరిస్థితి ఎదురవుతున్నదతనికి!

వళ్ళు మరచి స్వప్నలోకాలలో విహరిస్తాడు! కాని కనులు తెరచి నీల సుందర రూపం చూడాలన్నా, పన్నెత్తి పలుకరించాలన్నా విపరీతమైన ఆత్మన్యూనతా భావం పెల్లుబుకుతుంది.

అంతవరకు మనసులో ఫౌంటెన్‌లా వువ్వెత్తున ఎగసిపడే కోర్కెలు – యువ్వన సహజనమైన కోర్కెలు – రెక్కలు వచ్చిన గుర్రాల్లా వినువీధిని విహరించే వాంఛలు – గాలి తీసిన బెలూన్‌లా చప్పగా అణగారిపోతాయి!



అంతులేని అగాధకూపంలోకి దిక్కుతెలియకుండా పడిపోతున్నట్లు అనిపిస్తుంది. కెవ్వున కేక వేయాలన్న వాంఛను బలవంతంగా అణచుకుంటాడు! వళ్ళు భయంతో, సిగ్గుతో, అవమాన భారంతో గగుర్పొడుస్తుంది! అవనత వదనుడవుతాడు!

వికసించిన నల్లకలువలలాటి నీల కనుదోయిలో ప్రతిఫలించే అనురాగ ఛాయలు అంతర్ధానమై నిర్లిప్తత,నిరామయత్వం చోటు చేసుకుంటాయి! చప్పున ముందుకు నడిచి వెళ్లిపోతుందామె!

తెలుగు ఎం.ఏ విద్యార్థినీ, విద్యార్థులు ఫైనల్ పరీక్షలు పదిహేను రోజులున్నాయనగా – పరీక్షల టెన్షన్ పోవాలని సరదాగా అమరావతి పిక్నిక్‌కు వచ్చారు! కృష్ణకు అవ తలవొడ్డున వున్న జామతోటలో బారులు తీర్చి కూర్చున్నారు. ఒకవైపున నీల మరోవైపు ప్రియాంకర సహాధ్యాయులకు కొసరి కొసరి వడ్డిస్తున్నారు!

శ్యాం ముందు నుల్చున్న నీల ముందుకు కదిలింది! కొంత దూరంలో బంతిముందు నిలబడ్డ ప్రియ వనమాలి ముందు నిలబడి అతనికి మరో స్వీట్ వడ్డించాలని విశ్వప్రయత్నమూ చేయడం కనపడ్డది నీలకు.

మాలిగారూ! బాదుషా భేషుగ్గా వుంది! మరోటి వడ్డిస్తాను!" నువ్వైక స్వర దివ్య సౌందర్యమూర్తి ప్రియాంకర మృదుమధుర వాక్కులు కోయిలగొంతులో చిక్కుకున్న వసంత గీతిని మరపిస్తూ పక్కన కూర్చున్న తన సహాధ్యాయులను మురిపించాయి. అందుకే కడుపునిండా తినివున్న వాళ్ళు కూడా ప్రియవడ్డిస్తుంటే ఆమె దివ్యరూప విలోకనానందంలో వద్దని చెప్పడం మరచిపోయారు!

కాని అందుకు భిన్నంగా మాలి వంచుకున్న తలను మరింత వంచుకుని హీనస్వరంతో 'వద్దు' అన్నాడు.

"ఒక్కటి వడ్డిస్తాను"

వద్దన్నట్లు తలూపాడు మాలి.

"ప్లీజ్! ఒకటి!" చటుక్కున ఒక బాదుషా మాలి విస్తట్లో వడ్డించబోయింది.

"వద్దు! వద్దు!" రెండు చేతులూ విస్తరిపై అడ్డం పెట్టాడు మాలి.

"పడుచుపిల్ల స్వీట్ వడ్డిస్తుంటే వద్దంటాడు పిడెవ్రడా!" బంతి మొదట్లో కూర్చున్న రాజేష్ పక్కనున్న సుమంత్‌తో అన్నాడు మెల్లగా.

"అందమైన ఆడపిల్లను చూడగానే వంటిమీద తేళ్ళు జెర్రిలూ పాకినట్లు

"ఏడికేమైనా జబ్బేమో?"

"జబ్బేం కాదు! వణుకురోగం! అదీ ఆడపిల్లల్ని చూస్తేనే!"

"చూశావా! ఇంతమంది ఎలిజిబిల్ యంగ్‌మెన్ వుండగా ఆ మాలిగాడిమీద మమకారం చూపు తున్నది ప్రియ!"

"అగాధ సముద్రం లోతులు కనుక్కోవచ్చు గాని అబల హృదయం లోతుల్లో ఏముందో తెలుసుకోలేంరా రాజేష్!"

"అరే సుమంత్! అక్కడ నీల చూడు— శ్యాం ముందు నిల్చుని పక్కా పావుగంట నుండి ఒకటే బతిమిలాడుతుంది."

"క్లాసులో ముప్పై ఆరుమంది హాండ్సం చివల్రిస్ యంగ్‌మెన్ వుండగా యీ నీల, ప్రియలు శ్యాం, మాలిలను చుట్టుకు తిరుగుతారు చూడు!"

"ఏం జేద్దాంగురూ! తమకోసం తపించి పోయేవాళ్ళంటే వాళ్లకు లెక్కలేకపోయె! కనబడగానే అకాల వార్ధక్యం వచ్చినట్లు తలవంచుకుని వణికిపోయే శ్యాం, మాలిలను చూస్తే వాళ్ళల్లో ఏదో వింత ప్రేమ పెల్లుబుకుతున్నట్లుంది!"

"పోనీ మనం కూడా వాళ్ళెదురవగానే తలదించుకుందాం!" అప్పుడు ప్రియ నన్ను, నీల నిన్ను లవ్ చేస్తుంది!"

"గురూ! అదేం లాభంలేదు! నిజం ఏమిటో, అబద్ధం ఏమిటో ఆడపిల్లలిట్టే తెలుసుకుంటారు! అదీగాక నీల ఎదురైతే వళ్ళంతా కళ్ళుచేసుకుని ఆమె అపూర్వ సౌందర్యం చూడాలనిపిస్తుంది గాని వెర్రి వెధవలా తలదించుకోలేన్రా!"

"నిజం చెప్పావు గురూ! నేనూ అంతే!

"అదుగో షాలిని మేడం వస్తున్నారు!" రాజేష్ మాటలు విని నిశ్శబ్దంగా వుండిపోయిన సుమంత్ విస్తట్లోని పులిసోర భక్షించటానికుపక్రమించాడు.

షాలినీ మేడంకు ముప్పై ఏళ్ళుంటాయి. కోల ముఖం! నాజూకు శరీరం! పొడవాటి జడ. నీటిలో కదలాడే మీనద్వయి లాటికళ్ళు! కులుకు నడకతో రాయంచ మందగమనాన్ని ధిక్కరించే విలాసవైభవం. సతతం ఆమె శరీరంనుండి వెలువడే యీవెనింగ్ యిన్‌పారిస్ సెంటు పరిమళం, ఊహాంచలముల తేలియాడిపోతున్నట్లుండే చూపులు — వీధిలో షాలిని మేడం నడిచి వెళ్తుంటే పదేళ్ళ బాలుడి మొదలు పండుముదుసలి వరకు మెడకీళ్ళు విరిగేలా తిప్పుకుని మరీ చూస్తారు! కాని ఏం లాభం! యూనివర్శిటీలో అచ్చోసిన ఆబోతుల్లా గస్తీ తిరిగే పోకిరీ కుర్రకారుకు షాలినిని చూస్తే



సింహస్వప్నం!

కాంపస్‌లో లేడీ స్టూడెంట్ నెవరయినా ఎక్కడైనా అల్లరిపెడ్తున్నారని తెలిస్తేచాలు పోయి ముందు వెనుకలు చూడకుండా అల్లరిచేసే మకురు, యువకులమీద విరుచుకుపడిపోతుంది! తిట్టిన తిట్టు తిట్టకుండా అరగంటసేపు అదుపుతప్పి ప్రవర్తించిన విద్యార్థులను ఝూడించివేస్తుంది! అందుకే మేడమ్ వస్తున్నదంటే చాలు పలుపులు తెంపుకుని పారిపోయే పశువుల్లా కకావికలైపోతారు!

స్టూడెంట్ కుర్రాళ్ళకి ఆమె అంటే భయం ఏర్పడటానికి యూనివర్శిటీలో అనుచానంగా వినవస్తున్న కథ ఒకటి కారణం అయింది!

అయిదారేళ్ళ క్రితం ఒకరోజు బాగా చీకటి పడ్డాక మేడం మరో విద్యార్థినీ కలిసి రిక్షాలో సినిమాకు వెళ్తున్నారు!

వీధి దీపాలు వెలగక ఆ బజారులో కారుచీకటి కమ్ముకుంది! ఆ వీధి దాటితే సినిమా హాలు వస్తుంది! వేగంగా వెళ్తున్న రిక్షా సడన్‌గా బ్రేక్‌పడ్డట్టు తక్కున ఆగిపోయింది!

"మేడం!" కెవ్వున కేకవేసింది సీత. అప్పుడు చూసింది షాలిని. రిక్షా ఎదురుగా నిలబడివున్నాడొక భీకరాకారుడు. కండలు తిరిగిన శరీరం — పిచ్చుక గూడులా నెత్తిన గజిబిజిగా పెరిగిన జుట్టు, గుండెలోని క్రౌర్యాన్ని వెలికి గక్కుతున్నట్లు వంటిమీద ఎర్రరంగు లాల్చీ, చారల లుంగీ, ఎడమచేతిలో మెరుస్తున్న పిడిబాకు — రిక్షావాడు ఎప్పుడో రిక్షా దిగి వుడాయించాడు.

"వరెవా! జోడుగులాబీలు ఒకసారి చేతికిచిక్కాయి!" వికృతంగా నవ్వుతూ ముందుకడుగేసాడు రాజీ!

"మేడం!" అంది సీత. గడ్డిపోచలాగ గజగజ వణికిపోతూ.

రాజీ కళ్ళు కాసేపు షాలినివి కాసేపు సితను మార్చి మార్చి చూడసాగాయి.

విరిసీ విరియని మొగ్గగులాబీ సీత — పూర్తిగా రేకలు విచ్చుకుని పరిమళం వెలార్చుతున్న షాలిని.

అసహాయుల మెడలోని ఆభరణాలు తస్కరిద్దామని బయల్దేరిన రాజీ మనసులో చోరీ ఆలోచన అడుగునబడిపోయింది!

అతివల అందాలు చూసి కనులు చెదిరిన అతని మనసు కట్టుతప్పించుకున్న మదపుటేనుగులా విశృంఖల విహారం మొదలెట్టింది.

చేతిలో పిడిబాకు బొడ్లోదోపుకుని ముందుకు అడుగేసాడు రాజీ.

"అమ్మోయ్! బాబోయ్! నాయనోయ్!" సీత అరుపులతో వీధి మారుమోగింది.

రాజీ మొరటు చేతులు సీత కోమలదేహం చుట్టూ పెనవేసుకుని పోతున్నాయి!

అతని కళ్ళల్లో కనపడుతున్న ఎరుపుజీరను చూచిన సీత భయంతో బిగుసుకుపోయింది. దగ్గరౌతున్న రాజీ ముఖం నుండి నాటు సారా వాసన గుప్పుమని సీతకర్ణపుటాలను తాకింది.

విపరీతమైన భయంతో వణికిపోతూ కనులు మూసుకుంది సీత!

"అవ్! సైతాన్‌కే బచ్చీ!" రాజీ మాటలకు కనులు తెరిచింది సీత.

ప్రళయకాళిలా షాలిని విజృంభించి రాజీ తలమీద బండరాయిని విసిరింది— రాయి తగిలి రక్తం ధారాపాతంగా కారుతూ వెనుతిరిగాడు రాజీ.

రోడ్డుపక్కన వున్న రాళ్ళ గుట్ట నుండి అదేపనిగా రాళ్ళు విసురుతూన్న షాలినిని చూచి సీత మనసులో ధైర్యం వచ్చింది. రిక్షా దిగింది సీత!

తలకు అడ్డంగా చేతులుంచుకుని "రాజీ రాంసింగ్ మీదకే రాళ్ళు విసురుతావా! ఖబడ్దార్!" అంటూ షాలిని మీదకు దూకబోతున్న రాంసింగ్‌వైపుకు రిక్షాను నెట్టింది సీత.

తన చేతులలో అంత శక్తి వుందనుకోలేదు సీత!

రిక్షా తగిలి రాంసింగ్ బోర్లాబొక్కలా పడిపోయాడు!

వీధిలో గలాటా జరుగుతుందని రిక్షావాడు చెప్పగా పరిగెత్తుకు వచ్చిన పోలీస్ కానిస్టేబిల్ కిందపడ్డ రాంసింగ్‌ను లాఠీతో రెండు బాది విజిల్‌వూదాడు. పోలీసులు క్షణాలలో రాంసింగ్‌ను అరెస్టు చేసి తీసుకెళ్లారు.

దొంగతనం, రేప్ ఛార్జెస్ మీద అనేకసార్లు పోలీసు రికార్డుల్లో ఎక్కి చిక్కకుండా తప్పించుకుతిరుగుతున్న రాంసింగ్‌ను అరెస్ట్ చేసారన్నవార్త గుంటూరులో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. రాంసింగ్‌ను కటకటాలవెనక చూడటానికి స్త్రీలతోసహా అనేకమంది పోలీసు స్టేషన్‌వద్ద తర్వాత జైలువద్ద గుమిగూడసాగారు.

యూనివర్శిటీ స్టాఫ్‌వద్దంటున్నా వినకుండా రాంసింగ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతానని బయల్దేరింది షాలిని.

పరమ కిరాతకుడైన పచ్చి రౌడీకి వ్యతిరేకంగా ఒక అబల సాక్ష్యం చెబుతుందని తెలిసి కోర్టు వద్ద అనేకమంది గుమిగూడారు.

కాని ఆరోజు విచారణ జరుగనేలేదు! పోలీసులకు పట్టుబడేంతవరకు రాంసింగ్‌కు



ఎదురులేదు! అతని భీకరాకారం చూసి అతని బొడ్లో వున్న కత్తిచూసి జనం భయంతో పక్కకు తొలగిపారిపోయేవాళ్ళు! ఇప్పుడు ఒక ఆడపిల్ల అతన్ని పట్టిగ్గా నడిబజారులో పోలీసులకప్పగించడమే గాకుండా యీరోజు కోర్టులో బోనెక్కి సాక్ష్యం చెప్పబోతున్నది!

"ఒరే రాంసింగ్! ఇక నువ్వు బతికినా చచ్చినా ఒకటేరా!" ఎవరో అరచినట్లనిపించింది రాంసింగ్‌కు! తను బజారులో నడుస్తుంటే పక్కన ఎవరో

"వాడా?! రాంసింగ్! ఆడపిల్లచేత తన్నులు తిని జైలుకెళ్ళాడు! షేర్‌సింగ్ కాదు చెవలపిల్లి!" అన్నట్లు భ్రాంతి కల్గింది.

"ఒరే షేర్‌సింగ్! కాదు రాంసింగ్! కాదు చెవలపిల్లి యీ బతుక్కంటే పొడుచుకు చావటం మేలురా!" గుండె లోతుల్లోంచీ ఘోష వినపడింది!

రాంసింగ్ చెయ్యి అప్రయత్నంగా పిడిబాకు వుండే ప్రదేశానికి వెళ్లింది! చారలలుంగీపైన బెత్తెడు వెడల్పు లెదరు బెల్టు బిగించి బెల్టు లోపల పిడిబాకు దోపుతాడు రాంసింగ్. సెల్‌లో వేసేముందు పిడి బాకు, బెల్ట్ పోలీసులు తీసుకున్నారని గుర్తొచ్చిందతనికి!

"రాంసింగ్! పొడుచుకు చావటానికి కూడా వీలు లేకుండా ఏం దుర్గతి పట్టిందిరా నీకు!" గుండెల్లో గుబులుగా దిగులు పుట్టింది రాంసింగ్‌కు!

చారల లుంగీ లాల్చీ విప్పించి అరచేతుల చొక్కా పొట్టి లాగు తొడిగించారు పోలీసులు!

అవమానాగ్నితో దహించుకుపోతున్న రాంసింగ్ మనసులో ఆలోచనలు పాదరసంలా అటూ ఇటూ పరుగెత్తసాగాయి.

షాలిని కోర్టులో సాక్ష్యం చెప్పటానికి పది నిముషాల ముందు సెంట్రీ రాంసింగ్ గది తలుపులు తెరిచాడు.

కిటికీ చువ్వకు వురివేసుకు చనిపోయివున్నాడు రాంసింగ్!

వురి వేసుకోవటానికి తాడెక్కడ నుండి వచ్చిందా అని క్షణం విస్తుపోయాడు సెంట్రీ.

రాంసింగ్ వంటి మీద వుండాల్సిన చొక్కా నిక్కరు లేవు. వాటిని పీలికలుగా చింపి ఆ పీలికలతో తాడు పేని ఆ తాడుతో వురివేసుకున్నాడు!

నిందితుడి ఆత్మహత్యతో కేసు విచారణ ఆగిపోయింది!

అదుగో అప్పటినుండి షాలిని మేడం వస్తున్నదంటే చాలు ఆడపిల్లలను అల్లరి

చేయబూనుకున్న విద్యార్థులు గప్‌చిప్‌గా మారిపోతుంటారు!

రాజేష్ సుమంత్ అర్థాంతరంగా మాటలు ఆపిన మరుక్షణం షాలిని మేడం వచ్చి వాళ్ల ముందు నిల్చుంది.

"ఐటమ్స్ అన్నీ వచ్చాయా?" మేడం అడగ్గానే.

"వచ్చాయి మేడం!" రాజేష్, సుమంత్ కోరస్ పాడారు మిగిలిన విద్యార్థులతో పాటు.

"అరే శ్యాం! నువ్వేం తింటున్నట్లు లేదే! నీలా! నిన్ను శ్యాం విషయం ప్రత్యేకంగా చూడమని చెబితే మెదలకుండా వూరుకున్నావా?" షాలిని ప్రశ్న విని తలదించుకుంది నీల. ప్రియ మాత్రం "మేడం! రెండు చేతులూ అడ్డం పెట్టి బెల్లం మొత్తిన రాయిలా వుండిపోతే నీల మాత్రమేం చేస్తుంది?" అని బదులు చెప్పింది.

"మాలి కూడా ఏం తిన్నట్టు లేదే?" అని ప్రియవంక చూస్తూ అడిగింది మేడం.

ఈసారి సమాధానం చెప్పడం నీల వంతయింది. "మోహిని వచ్చి అమృతం వడ్డిస్తానన్నా వద్దని తల అడ్డంగా తిప్పుతాడు మాలి! మానవ మాత్రురాలు — ప్రియ ఏం చేస్తుంది మేడం!"

"పిక్నిక్‌కు వచ్చినా శ్యాంకు మాలికి తలదించుకునే రోగం వదలలేదన్న మాట! వాట్ ఎ పిటీ!"

కాలప్రవాహం ఎవరి కోసమూ ఆగదు! జరిగిపోయిన మధుర క్షణాలు తిరిగిరావు!

"శ్యాం, మాలి బి స్పోర్టివ్ అండ్ బిహేవ్ లైక్ టు చివ్రలస్ యంగ్‌మెన్!" అంది షాలిని.

భోజనాలయి అంతా వుసిరి చెట్టు క్రింద జేరారు! చాప మీద కూర్చుంది షాలిని.

"రాజేష్! ఇలారా!"

రాజేష్ వినయంగా వచ్చి షాలిని ముందు నిలబడ్డాడు.

"ఇవిగో పదిహేను యాపిల్ కాయలు ఇవి పదిహేను కుంకుడు కాయలు! వీటన్నిటినీ ఒక వరుసక్రమంలో అమర్చి తొమ్మిదవ స్థానంలో వున్న కాయను నువ్వు తీసుకోవచ్చు! అలా పదిహేను ఏపిల్స్ తీసుకునే విధంగా యాపిల్స్‌ను కుంకుడు కాయల్ని అమర్చు! గెలుచుకున్న యాపిల్ కాయల్ని కోసి అందరికీ తలో ముక్కా యివ్వాలి సుమా!"

మనసులో "ఓష్! ఇదెంత పని!" అనుకుంటూ ముందుకు వచ్చాడు రాజేష్.

ఏపిల్స్ కుకుండు కాయలు వరుసలో పెట్టాడు. తొమ్మిది స్థానంలో ఏపిల్స్ వుండేలా ఏర్పాటుచేసాడు! ఒకసారి వరుసనుండి మూడు ఏపిల్స్ తీశాడుకూడాను! కాని



మరలా రెండోసారి వరుస నుండి ఏపిల్స్ తీయబోతే కుదరలేదు! కుంకుడుకాయలు చేతిలోకి వచ్చాయి! మళ్లీ యాపిల్స్ కుంకుడుకాయలు వరుస మార్చబోయాడు.

"నో! నో! ఒకే ఒక ఛాన్సు! నీ ఛాన్సు అయిపోయింది. సుమంత్! కమాన్! ట్రై యువర్ లక్!"

సుమంత్ ముందుకొచ్చాడు. రాజేష్ ఏర్పాటు చేసిన వరుసను అటు ఇటు సర్దాడు. మనసులో అటూ ఇటూ గుణించుకున్నాడు.

"రెడీ మేడం"

"ప్రొసీడ్!"

సుమంత్ చేతిలోకి నాలుగు ఏపిల్స్ వచ్చాయి. తర్వాత చేతిలోకి కుంకుడుకాయ వచ్చింది! చిరునవ్వు చిందిస్తున్న అతని ముఖం వెలాతెలా పోయింది!

"సారీ సుమంత్! యువర్ ఛాన్స్ యిజ్ అప్" సుమంత్ చేతిలో యాపిల్స్ వరుసలో పెట్టి వెళ్లిపోయాడు.

"ఇంకెవరైనా ముందుకు వస్తారా! కడుపులో ఆకలి దహించుకుపోతుంది! ఎవరైనా ముందుకు వచ్చి యాపిల్ తీసి అందరికీ తలో ముక్కా యివ్వండి! కమాన్!"

రాజేష్, సుమంత్ వెళ్లిపోయాక మరి నలుగురు ముందుకు వచ్చారు. వరుసనుండి నాలుగయిదు యాపిల్స్ తీసిన తర్వాత వాళ్ల చేతుల్లోకి కుంకుడు కాయాలు వచ్చాయి. ఖిన్నవదనులై వెనుదిగిరిపోయారు!

అప్పుడు ముందుకు వచ్చాడు శ్యాం! కడిగిన ముత్యంలా తళతళ మెరుస్తున్న అతని ముఖంపై చిరుదరహాసం విలసిల్లింది!

చకచక యాపిల్స్ కుంకుడు కాయలు సర్దేసాడు!

"మేడం! ఐ యాం రెడీ!"

"ప్రొసీడ్!"

శ్యాం చక చక యాపిల్స్‌ను వరుసనుండి తీయసాగాడు. తొమ్మిదో స్థానంలో వున్న యాపిల్స్‌ను తీయసాగాడతను. ఎన్ని మాట్లు ఎంచి చూసినా తొమ్మిదోస్థానంలో యాపిల్ వుంది!

శ్యాం పదిహేను యాపిల్స్ తీసుకునేసరికి వరుసలో కుంకుడుకాయలు మాత్రం మిగిలాయి! స్టూడెంట్స్ కరతాళ ధ్వనులతో ఆ ప్రదేశమంతా మారుమోగింది.

నీల యాపిల్స్‌ను ముక్కలుగా కోసి తెచ్చింది. శ్యాం యాపిల్ ముక్కలు అందరకూ పంచసాగాడు.

"శ్యాం! అందరకు యాపిల్ ముక్కలిచ్చావు! ఒకరిని మరచిపోయావు!" అంది

మేడం!

"ఎవరివి?" అన్నట్లు చూశాడు శ్యాం.

మేడం నీలవంక చూపుడు వేలు సారించింది.

* * *

"అమ్మయ్య! ఆత్మారాముడు శాంతించాడు! సార్ కాసేపు సరదాగా పేకాట మొదలెడదాం!" ప్రొఫెసర్‌రావుగారితో అన్నాడు రాజేష్.

రావుగారు తలూపగానే జేబులోంచి పేక తీసాడు రాజేష్.

క్షణాలలో అక్కడ పేకాట సెషన్ మొదలయింది. మూడు నాలుగు బాచెస్‌గా చీలి పేకాట మొదలెట్టారు విద్యార్థులు.

పేకాట సెషన్‌కు కొంచెం దూరంగా వంట ఏర్పాటు పర్యవేక్షిస్తూ వుంది షాలిని.

"అరే! నీలా! టీ పాట్లాం తేవడం మర్చిపోయాం అంతా పేకాటలో మునిగి పోయినట్లున్నారు! పడవ మీద కృష్ణదాటి అమరావతి వెళ్లి టీం పాట్లాం పట్టుకొస్తావా?"

"అలాగే మేడం!" హేండ్ బేగ్ చేత పుచ్చుకుని వెళ్లింది నీల.

పేకాట జోరుగా సాగింది! రాజేష్‌కు ఎప్పుడూ పేకాటలో డబ్బు రావడమేగాని పోవటం వుండదు! అలాంటిది ఆ రోజు వరుసగా డబ్బు పోగొట్టుకోసాగాడు! డబ్బు పోయిన కొద్దీ పట్టుదల పెరిగి స్టేక్‌మొత్తం పెంచసాగాడతను! రాజేష్ వోడిపోవడం – ఆ డబ్బు ప్రొఫెసర్ రావుగారికి రావడం – దాంతో మరింత స్టేక్ పెంచడం యిలా జరిగిపోసాగింది.

మిగిలిన పేకాట బాచెస్ జోరుగా ఆడుతూ వుండిపోయారు. కాలగమనం గుర్తుంచుకున్నట్లు లేరు–

"అరే! నీల యింకా రాలేదేం చెప్మా! ఒంటరిగా ఆడ పిల్లను పంపాను!" అనుకుంటూన్న షాలినికి దూరంగా తోటలో తిరుగుతూ శ్యాం కనపడ్డాడు.

"శ్యాం! ఇలారావొకసారి!"

"ఏమిటి మేడం పిలిచారు!"

"నీల ఒక్కతే గంట క్రితం టీ పాట్లాం కోసం అమరావతికి వెళ్లింది! ఇంకా రాలేదు! ఒకసారి వెళ్లి వస్తావా?"

"అలాగే మేడం!" అంటూ నదివొడ్డుకు వెళ్లాడు శ్యాం!

ఏటి మధ్యన నీటిలో చిన్న పడవ, పడవలో కూర్చుని నీల లీలగా కనపడ్డారు.



అస్పష్టంగా కనబడుతున్న నీల ఆకారం వంక తదేకంగా చూస్తూ నిలబడిపొయ్యాడు శ్యాం!

రకరకాల పూవులు – మల్లె, మొల్ల, విరజాజి, గులాబి, చామంతి, కనకాంబరం, డాలియా. నైట్ క్వీన్ అందతా పరుచుకుపోయాయి. నీటి మీద తేలివస్తున్న రంగురంగుల పూలు – ఆకాశంలో వుండాల్సిన హరివిల్లు స్థాన భ్రంశం పొంది నీటిలో పడ్డట్టు భ్రాంతి కల్గించసాగింది!

గాలికి పూలలోని పుప్పొడి ఒక చోట పోగయి మనిషి రూపందాల్చినట్లు కనపడసాగింది!

"ఆ అమ్మాయి నీల! పుప్పొడి బొమ్మ అనే భ్రాంతి కల్గిస్తున్నది!" శ్యాం మనసులో శృంగార భావ తరంగాలు ఎగసిపడసాగాయి.

"తేనెలూరుతున్న పుప్పొడి బాల నీల లావణ్య దేహాన్ని ఒక్కసారి స్పృశిస్తే! నల్ల కలువల లాటి ఆమె కన్నులలోకి ఒక్కసారి విలోకిస్తే?! పరిమళం వెదజల్లుతున్న ఆమె కోమల దేహాన్ని ఒకసారి కౌగిలించుకుంటే?" కలచెదరిపోయింది! "శ్యాం!" "శ్యాం!" భయకంపిత స్వరంతో ఎలుగెత్తి అరుస్తున్న నీల స్వరం విని వులిక్కిపడ్డాడు!

నీల ఎక్కిన పడవ దరి జేరబోతున్నది. పదిబారలు ముందుకు వస్తే వడ్డు జేర్చుతుంది కూడాను!

గడ్డం, మీసం, గుబురుగా పెరిగిన నడివయస్సు వ్యక్తి నీళ్లల్లో నడుచుకుంటూ పడవ సమీపిస్తున్నాడు.

అతని కళ్లల్లో కనబడుతున్న కాంక్షాలోలత్వాన్ని చూసిన నీలకు ఎందుకో భయం కలిగి అరచింది.

శ్యాం చూస్తుండగానే గడ్డపతను పడవ పక్కకు జేరాడు. అడ్డం వచ్చిన పడవ అతన్ని ఒక్క తోపుతోసి పడ ఎక్కాడు! పశు బలంతో పడవ తన్ని రెండు చేతుల్తో ఎత్తి నీళ్లలోకి విసిరేసాడు. నీళ్లలో పడ్డ పడవతను లేచి కాలికి బుద్ధి చెబుతూ "పారిపో బుల్లెమ్మా! వాడు పిచ్చివాడు! మదపిచ్చి!" అని కేకలు పెట్టాడు.

"శ్యాం! త్వరగా రా! పిచ్చోడొస్తున్నాడు!" నీల అరుపులు ఆ మరుక్షణావే.

"ఎవరికే పిచ్చి!" పళ్లు పట పట నూరుతూ ముందుకు నడిచాడు పిచ్చి అతను. అతను పడవ అంచుమీద చెయ్యి వేయగావే భయంతో నీల పడవ అవతల చివరకు పరిగెత్తింది.

"పారిపోతా వెందుకే చిలకా! ఆగు!" ముందుకు దూకాడు పిచ్చతను.

ఆ క్షణావే పడవ తల్లకిందులయింది. నీల, పిచ్చతను నీళ్లలో పడిపోయారు!

నీళ్లలోపడ్డ నీల లేచి నిలబడింది. నీళ్లు మొలలోతున వున్నాయి.

"ఎంతందంగా వున్నావే చిలకా! నీటిలో తడిచిన అందాలు కైపెక్కిస్తున్నాయే!" అంటూ ఆమె దరిచేరి పుక్కు ముక్కల్లాంటి చేతులమధ్య ఆమెను బంధించసాగాడు పిచ్చితను.

పిచ్చివాడి కబంధ కౌగిలిలో నలిగిపోతూ 'శ్యాం' అని పిలిచింది నీల నీరసంతో! మరుక్షణాన ఆమెకు స్పృహ తప్పిపోయింది!

నీళ్లలో పరుగెత్తుకు వచ్చిన శ్యాం "ఒరేయ్ ఎవ్వడా నువ్వు! వదులు! నీలను వదులు!" అంటూ పిచ్చతని చంకల కిందుగా తన రెండు చేతులూ పోనిచ్చి మెడ వెనకగా రెండు చేతుల వేళ్లను బిగించి బలమంతా వుపయోగించి మెడవంచసాగాడు.

"రేయ్! నువ్వెవడివిరా మధ్యలో! పానకంలో పుడకలా!" అంటూ రెండు చేతుల పిడికిళ్లు బిగించి శ్యాం శరీరం మీద మోదసాగాడు బలం కొద్దీ!

పిచ్చివాడి కౌగిలి నుండి బయటపడ్డ నీల స్పృహలేకుండా నీళ్లలో పడిపోయింది!

నీల చేజారిపోయిందన్న కోపంతో పిచ్చివాడు తెగగింజుకోసాగాడు.

"రేయ్ నిన్ను నరికి పోగులు పెడ్తా! నాగులు కడ్డం రావడానికి నీకెన్ని గుండెల్రా!" భయంకరంగా అరుస్తున్న నాగులు మెడచుట్టూ బిగుసుకున్న శ్యాం చేతులు బలవంతంగా అతని మెడను వంచివేశాయి. బద్దలా ముందుకు వంగిన నాగులు తల క్రమంగా నీళ్లలో మునిగింది. ఉక్కిరిబిక్కిరి అయి శ్వాస ఆడక నోటితో నీళ్లు తాగి అరవటానికి గొంతురాక కుప్పకూలిపోయాడు నాగులు.

అప్పుడు నీల పడివున్న ప్రదేశం వద్దకు పరుగెత్తి నీళ్లలో అచేతనంగా పడివున్న ఆమె దేహాన్ని రెండు చేతుల మీద తీసుకుని ఒడ్డుకు వచ్చాడు శ్యాం.

అచేతనంగా పడివున్న నీలను వెల్లికితలా పడుకోబెట్టి తన పక్కకు తిప్పి ఛాతీపై బలంతగా చేతులతో నొక్కాడు శ్యాం!

నీల నోటినుండి నీరు, నురగ బయటకు వచ్చాయి! రెండు సెకన్లాగి మళ్లీ బలంగా ఛాతీపై నొక్కాడు శ్యాం. ఊపిరితిత్తులలో నిండుగా జేరిన నీరు, నురగ, నోటినుండి ముక్కునుండి వెలుపలికి రాసాగింది. పది పదిహేనుసార్లు ఛాతీపై నొక్కాక నోటినుండి ముక్కునుండి ద్రవం రావడం ఆగిపోయింది!

'ఆహ్' అని సన్నగా శబ్దం చేస్తూ నీల సన్నగా వూపిరి పీల్చుకుంది!

శ్యాం ముఖంపై ఆశారేఖ చిరుహాస రూపంతో మెరిసింది! కృతిమ శ్వాస కల్పించేప్పుడు వంటి మీద బిగుతుగా బిగించినట్లు శ్వాస కల్పించేప్పుడు వంటి మీద బిగుతుగా బిగించినట్లు దుస్తులుండరాదని గుర్తొచ్చి శ్యాం నీల జాకెట్ హుక్స్



ఒక్కొక్కటే తీసివేయసాగాడు.

నీల నోటినుండి ముక్కునుండి వచ్చిన ద్రవాన్ని శుభ్రంగా తుడిచి వేసి మరలా కృత్రిమ శ్వాస కల్పించడానికి ఛాతీపై నొక్కసాగాడు.

మూడు నాలుగునిముషాలలో నీల శ్వాస తనంతతానే మామూలుగా పీల్చుకోవడం సాగించింది.

ఈ లోపల పడవతను చెప్పాడో ఏమో చుట్టుపక్కల తోటలలో పనిచేసే వాళ్లు పరుగెత్తుకు వచ్చారు! మరి రెండు నిముషాలలో పేకాట కట్టిపెట్టి ప్రొఫెసర్ మూర్తి, షాలిని, ప్రియ మిగిలిన సహోధ్యాయులు వచ్చి నీల చుట్టూ గుమికూడారు.

"నీలా! నీలకేమయింది?" అంటూ ప్రియ కళ్ల నీరు కుక్కుకుంటూ ఆదుర్దాగా అడిగింది.

నీల కళ్లు తెరచి చూచింది!

"నీలా! ఎలావుంది?" అని అడుగుతూ అనాచ్ఛాదితమైన ఆమె వక్షస్థలం మీద చీర చెరంగు కప్పింది షాలిని.

'ఒకే' అన్నట్లు తల తిప్పి చుట్టూ నిలబడ్డ మనుష్యుల వంక పరీక్షగా చూడసాగింది.

పడవ సరంగు ఆమె అలా చూడటానికి కారణం అర్థం చేసుకున్నవాడిలా "పిచ్చోడు పారిపొయ్యాడు" అని చెప్పాడు.

నీల ముఖంలో కనబడ్డ ఆదుర్దా ఛాయలు పోయాయి. మళ్లీ చుట్టూరా వున్న మనుష్యుల వంక పరీక్షగా చూడసాగింది.

ఒకపక్కగా తలవంచుకుని నిలబడ్డ శ్యాం వద్ద ఆమె చూపులు నిలబడిపోయాయి.

నాగులుతో పెనుగులాడినపుడు అక్కడక్కడా చిరిగిన షర్టు పాంటు తడిసి నీళ్లు కారుతున్నాయి. అస్తవ్యస్తంగా చెదిరిన జుట్టు నుదుటిని కప్పేస్తున్నది! షర్టు గుండీలు తెగి ఛాతీ కొంత భాగం పచ్చగా మెరుస్తూ కనపడింది. ఛాతీమీద ముంజేతుల మీద చర్మం కమిలి గీరుకుపోయి రక్తం ఓడుతున్నది.

లేచి శ్యాం వంటి మీద గాయాలను సవరించాలని అతని విశాల వక్షస్థలంపై తల ఆనించి సేదదీరాలని ఎంతో ఆర్తిగా కోరుకుంటున్న నీలకు ఆశాభంగమే ఎదురయింది.

వంచిన శ్యాం తల మరింత కుంచించుకు పోయింది!

"పిచ్చివాడి నుండి నిన్ను రక్షించడమే కాకుండా నీళ్లు మింగి స్పృహ కోల్పోయి పడివున్న నీకు ఫస్ట్ ఎయిడ్ చేసి నీళ్లు వెళ్లగక్కించి పోయే ప్రాణాలు కాపాడాడు! శ్యాంలో యింత చివల్రీ వుందని తెలియదు సుమా!" షాలిని మాటలకు నీల మనసు ఆర్ద్రమైంది.

తల తిప్పి మరలా శ్యాం వంక చూచింది నీల. కాని మేడం మాటలు పూర్తవక ముందే శ్యాం అవతలకు వెళ్లిపోయాడు — గుమిగూడిన జనానికి దూరంగా!

శ్యాం అవతలకు వెళ్లిపోయాడని గ్రహించిన నీల చూపులు తిప్పుకుని కనులు మూసుకుంది. అప్పటి వరకు ఆమె మనులో శ్యాం అంటే వువ్వెత్తున ఎగసిపడుతున్న వుత్తుంగ ప్రేమతరంగాలు క్రమంగా నీరసించిపోయాయి.

పడవ సరంగు నాగులు కథ చెప్పడం మొదలుపెట్టాడు.

''నాగులుగారిది అమరావతి పక్కన సల్లెటూరు. కలిగిన కాపురం — లేకలేక పుట్టిన మగబిడ్డకు చివిమా యిరో నాగేస్సర్రావు పేరెట్టుకుందాయున తల్లి! మా దొడ్డ యిల్లాలు — సేతికి ఎవికె లేదు! ఇంటి కొచ్చినోరికి మరియాద సేసి కడుపునిండా తిండిపెడితే గాని తోచదారికి! బిడ్డని అల్లారుముద్దుగా పెంచి పెద్దజేసి ఈడూ జోడూ జూసి సక్కటి సుక్కని తెచ్చి పెళ్లిచేసింది. కోడలు సిలక — పేరు సిలకమ్మ — మంచి అందగత్తె. గుణం మాత్రం గుడిసేటిది. పెళ్లికాక ముందే పక్కింటి కుర్రాడి కలవాటు పడింది! పెళ్లయినాకనా బుద్ధిగా ఉండొచ్చా!— ఊహూ— పై మేత మానలా! కోడలు గుణం దెలుసుకున్న అత్త గుండె గుభేల్‌మంది! కొడుకుకు దెలిస్తే ఏం అగాయిత్తెం జేస్తాడోనని భయపడింది. నయానా భయానా కోడలు సిలక్కి సెప్పసూడబోయింది. ఊహూ! సిలకమ్మ యినకోలా! పైగా ఈ ముసల్ది నా కడ్డాం ఎందుకనుకుందో ఏమో జతగాడితో మంతనాలాడి అతగాడి చేత అత్త గొంతు నులిమి చంపించింది. పురుగు ముట్టుకుని ముసలమ్మ పోయిందని వూరంతా నమ్మబలికింది.

వాటు మాటు వ్యవహారం మరింత గుట్టుగా సాగింది. కాని ఒకరోజు విషయం భర్తకు తెలిసింది. తల్లిని చంపిన విషయమూ తెలిసింది!

పెరట్లో గడ్డివామి సాటున సిలక జతగాడు కల్సుకుంటారనీ తెలిసింది! పెరడు సారీగోడలు మూడు గజాలెత్తు! జంట వామిసాటున జేరగానే అగ్గిపుల్ల ముట్టిచ్చాడు! వామి ముట్టుకుంది. తప్పించుకుందామని ముందుకు పరుగెత్తుకురాబోయారు సిలక, జతగాడ.

ముందు దుడ్డు కర్రతో తల పగలగొట్టి జతగాడ్ని మండే వామిలోకి గిరాటెట్టాడు! మంటల్లో మాడిపోతున్న జతగాడ్ని సూసి యిలయిల్లాడుతున్న సిలకని యిసిరి వామిలో బారేసాడు.

అప్పటికి వూరి జనం వచ్చారు! మంటలార్పాలని ప్రయత్నం జేసారు. కాని కుదరలా! మదపిచ్చితో కళ్లు మూసుకుపోయిన జంట ఎనికలు మాత్రం మిగిల్నాయ్.!

పెద్దింటి యివ్వారం గనుక ఎవరూ మాట్టాడంలా, అప్పట్నుంచీ ఆ యయ్య



పిచ్చోడయ్యాడు. ఒంటరిగా ఆడపిల్ల గనపడితే సాలు తిక్కరేగుద్ది!

అమ్మగారు లేసివేల మంచిది! ఆ బాబు నేపోతే ఏమయ్యేదో!

మదపిచ్చి నాగులు కథవిన్న నీల మనసులో ఒక్కసారి విపరీతమైన భయం చెలరేగి వళ్లు జలదరించింది. చేతులూ కాళ్లూ వణకిపోసాగాయి.

''ఇక తిరుగు ప్రయాణమైపోదాం రావుగారూ!'' అంది షాలిని.

గంట సేపట్లో కృష్ణ ఆవలి వొడ్డు జేరి బస్సెక్కి గుంటూరు వెళ్లిపోయారంతా!

* * *

గుంటూరు వెళ్లగానే నీలను సుశ్రుతా నర్సింగ్‌హోమ్‌కు తీసుకువెళ్లి డాక్టర్ రవికి చూపింది షాలిని.

''నాలోజులపాటు యాంటీ బయటిక్ కాప్సుల్స్ వాడండి, మానసికంగా కోలుకోవటానికి మరింత టైం పట్టవచ్చు! భయం కలిగితే ట్రాన్‌క్విలైజర్ బిళ్లలు వాడండి!'' అన్నాడాయన.

నర్సింగ్ హోం నుండి షాలిని నీలను అరండల్‌పేటలోని ఇంటికి తీసుకుని వెళ్లింది. నీల, ప్రియ, షాలిని అరండల్‌పేటలో ఒక చిన్న ఇంట్లో కాపురం వుండి బస్సులో యూనివర్సిటీకి వెళ్లి వస్తున్నారు! వంటమనిషి తవిడమ్మ ముగ్గురకూ వండి పెడుతోన్నది.

ఇంటికి వెళ్లగానే ''అయ్యో! ఏమయిందమ్మా నీలమ్మ అలా డీలపడిపోయిందేం?'' అంది తవిడమ్మ ఆదుర్దాగా.

''నీలమ్మ కాలుజారి నదిలో పడిపోయింది! చప్పున వేణ్ణీళ్లు సిద్ధం చెయ్యి! స్నానం చేసి పడుకుంటుంది!'' అంది షాలిని.

తవిడమ్మ వేడి నీళ్లు తయారుచేసేప్పటికే నీల మంచంమీద సొమ్మసిల్లి పడిపోయివున్నది.

''రా నీలా! స్నానం చెయ్యి!'' అన్న షాలిని నీల నీరస స్థితి చూసి ప్రియ తను చెరోవైపు సాయం పట్టి ఆమెను స్నానాల గదిలోకి తీసుకొనివెళ్లి తల స్నానం చేయించి పొడి బట్టలు చుట్టి తీసుకువచ్చి మంచంమీద పడుకోబెట్టి వేడి పాలు తాగించారు. అయిదు నిముషాలలో నీల మగత నిద్రలోకి జారుకుంది.

''ప్రియ! అనుకున్న దొకటి ! అయిందొకటి! పిక్నిక్ పార్టీలో శ్యాం నీల, నువ్వు మూలి దగ్గరవుతా రనుకొన్నాను. రెండు యువ జంటల మధ్య చిగురించే ప్రణయ లతలను కనులారా చూసి. సంతోషిద్దామనుకున్నాను! కాని గొంగళి వేసిన చోటనే

వున్నది!"

"మేడం! నీల ఆపదలో ఉన్నంతసేపూ పెద్ద పులిలా విజృంభించిన శ్యాం ఆపద తొలగగానే చెవలపిల్లిలా మారిపోయాడు!"

"అంటే శ్యాం అంతరాంతరాల్లో నీల అంటే అభిమానం వుండివుండాలి. లేకపోతే ప్రాణాలకు తెగించి అతడు నీలను రక్షించి వుండడు! శ్యాం కాపాడకపోతే నీల గతి ఏమయివుండేదో?!"

"నిజమే మేడం!"

"వాట్ ఎబౌట్‌యు? ఎనీ సక్సెస్?"

"లేదు మేడం! ఎన్నిమార్లు పలుకరించినా మాలి తల ఎత్తనే లేదు! మరీ తప్పనప్పుడు తలూపడం తప్ప సమాధానమే యివ్వలేదు!"

"రెండూ రెండే! స్ట్రేంజ్ కేసులు! కానియ్ చూద్దాం! పరీక్షలు దగ్గర కొస్తున్నాయి! బాగా చదువుకోండి!"

"అలాగే మేడం! మేడం! నీలకేం పరవాలేదంటారా?"

"ఏం పర్వాలేదు! విక్స్ పీసా ప్రటా! నీల ఛాతిపై రాస్తాను!"

అర్ధరాత్రప్పుడు తవిడమ్మ "ఓలమ్మో దొంగ, దొంగ" అని అరుస్తుంటే నిద్రలేచింది షాలిని.

"ఏమిటి తవిడమ్మా!"

అప్పటికి తమాయించుకుని, పిచ్చాడొచ్చాడు" అంది తవిడమ్మ.

"ఎక్కడ?"

"అ.. దు.. దుగో!" కిటికీలోంచి తొంగిచూశాడు" షాలిని చప్పున మంచం మీదనుంచి లేచి వీధి వాకిలి తెరిచి వీధిలోకి చూసింది.

నిర్మానుష్యంగా వున్న వీధి చివర లీలగా ఒక ఆకారం వెళ్తున్నట్లు కనబడింది!

"శ్యాం! నీల ఎలావుందో చూద్దామని వచ్చుంటాడు పాపం!" అని మనసులో అనుకుని—

"ఏమిటి తవిడమ్మా! ఎవరూ లేందే!?" అంది.

"నిజం! వొట్టు! నీ తోడు! నీలమ్మ మీద అగాయిత్యం చేయబోయిన పిచ్చాడొచ్చాడు!" వణుకుతూ అంది తవిడమ్మ.

"ఆ! మేం చెప్పకునే మాటలు తలుపుచాటున నక్కి విన్నావన్నమాట!" కోపంగా అంది షాలిని.

"లేదమ్మా! బెదురు చూపులు చూస్తానిలబడ్డాడు. బయం బుట్టి కేకేత్తే



పరుగెత్తాడు! "ఆడు పిచ్చాడే!"

"భయపడకు తవిడమ్మా! ఈసారి వాడొస్తే నాకు చెప్పు! తగిన మర్యాద చేసి పంపుతాను!"

"అలాగేనమ్మా! ఆడిని చూస్తేనే భయం బుడుతున్నది! నేను లోపల నీ మంచం దగ్గర చాపేసుకుని పడుకుంటా!"

"సరే! అలాగే పడుకో!"

షాలిని మంచం ప్రక్కన చాపేసుకుని పడుకుంది తవిడమ్మ. కాసేపట్లో తవిడమ్మ నిద్రపోతున్నట్లు గది అంతా ఆమె గురక వినబడసాగింది!

కర్ణకఠోరంగా వినబడుతున్న తవిడమ్మ గురకతో నిద్రపట్టక షాలిని లేచి కూర్చుంది.

తవిడమ్మ మాట్లాడుతూనే నిద్రపోతుంది. నిద్రపోతున్నప్పుడు వంటి మీద బట్ట వున్నది లేనిది తెలియదు. "కళ్లు మూస్తే దీని గురకతో చెవులు రింగు మంటాయి. కనులు తెరచి చూస్తే దీని నగ్న సుందరాకారం భీతి గొల్పుతుంది!" అనుకుంటూ లేచింది షాలిని.

"ఎంత పని చేసావయ్యా శ్యాం! నీలో ఇంత చిలిపి వుందనుకోలేదు సుమా! అర్ధరాత్రి కిటికీలోంచి తొంగిచూసి తవిడమ్మను భయపెట్టావు!" నెమ్మదిగా గొణుగుతూ నీల మంచం దగ్గరకు వెళ్లింది.

నీల నుదుటి మీద చెయ్యి వేసి చూసింది. చల్లగా తగిలింది! విక్స్ పీసా తీసుకుని నీల గొంతు మీద, ఛాతీపైన నెమ్మదిగా రాయసాగింది.

"శ్యాం! శ్యాం!" నీల నిద్రలోనే గొణగడం విన్నది శాలిని.

అయిదు నిముషాలున్నాక లేచి తన మంచం వద్దకు వెళుతూ ప్రియ నిద్రలో కలవరించడం విని ఆగిపోయింది.

"మాలి! మను చరిత్రలో ప్రవరుడి కారెక్టరైజేషన్ నోట్సు యిస్తారా?"

షాలిని ముఖంపై చిరుదరహాసం విలసిల్లింది "వేరే నోట్సెందుకు? మాలి కేరెక్టరు ర్రాయి!" అనుకుంటూ వెళ్లి మంచంమీద పడుకుంది. ఆ రాత్రి షాలినికి నిద్ర పట్టనే లేదు!

మంచం మీద అటుదొర్లీ ఇటుదొర్లీ గోడ గడియారం టంగు టంగు గంటలుకొట్టడం విన్నది. అయిదు గంటలు కొట్టిన శబ్దం విని లేచి వెళ్లి స్నానం చేసి వచ్చింది.

తవిడమ్మ, నీల, ప్రియ న్నిద్ర లేవలేదు. "కళ్లు మూస్తే చాలు వంటి మీద దుస్తులు

సరిగా వున్నదీ లేనిదీ తెలియదు వీళ్లకు!" అనుకుంటూ ప్రియ నీలల చీరె చెరగులు సరిచేసింది. తవిడమ్మ తొడపై చీరె తొలగిపోయి వుండటం చూసి మనసులో కోపం పెల్లుబికిందామెకు.

"మరో రెండ్రోజులు తవిడమ్మ నా మంచం ప్రక్కన పడుకుంటే పిచ్చేక్కేట్లుంది! వంట మనిషి లేకపోతే పీడాబోయె!" అనుకుంటూ వరండాలో లైటు వేసుకుని మనుచరిత్ర చదవసాగింది.

పాటున కింతులోర్తురె యో కృపారహితాత్మక! నీవు త్రోవనిచ్చోట భవన్నఖాంకురముసోకె కముంగొనుమంచు జూపియప్పాటల గంధి వేదన నెపం బిడి ఏడ్చె గల స్వనంబుతో

వరూధిని దొంగ ఏడుపు పద్యం వద్దకు వచ్చేసరికి షాలిని మనసు రసానందంతో నిండిపోతుంది!

ప్రవరుడిని ఆకర్షించడానికి ఒక ఉపాయం ఆలోచించి విఫలమై చివరకు ఆఖరి ఆయుధంగా ఏడ్పు ఉపయోగించింది!

అసహాయురాలైన అబల ఆఖరి అస్త్రం ఏడుపు అని ఎంత చక్కగా వర్ణించాడు పెద్దన! షాలిని ముఖంపై చిరునవ్వు మొలకెత్తింది!

నీల, ప్రియ — ఇద్దరు శిష్యురాళ్ల మనసుపడిన యువకుల దరిచేర లేక ఆక్రోశిస్తున్నారు.

వయసులోవున్న అబ్బాయి మనసులో ప్రేమ కలిగితే బహిర్గతం చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి!

కాని అదే పని అందమైన అమ్మాయి చెయ్యాలంటే ఎన్నో అడ్డంకులు— అనాది కాలంనుండి ఆధునిక కాలం వరకు!

పేపర్ బాయ్ వచ్చి పేపర్ యిచ్చి వెళ్ళాడు! తవిడమ్మ లేచి పెరట్లోకి వెళ్ళింది.

ఎదురింట్లో వుండే ప్లీడరు పరంధామయ్యగారు వాకిట్లో నిలబడే "మేఐకమ్ యిన్ ప్లీజ్" అన్నారు.

"ప్లీజ్ డుకమ్!" అంటూ లేచి నిలబడింది షాలిని. ఆయన ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాక తనూకూర్చుంది! ఏదైనా ప్రత్యేకమైన పని వుంటే తప్పక ఆయన రారని తెలుసు షాలినికి.

"మేడం! మీ యింట్లో కొత్తగా అబ్బాయి ఎవరైనా వచ్చి జేరాడా?" అని అడిగాడు ప్లీడరుగారు. ఆయన గొంతులో వినపడుతున్న కాఠిన్యానికి ప్రశ్నకూ విస్తుపోతూ—

"లేదే! ఎందుకలా అడిగారు?"



"నిన్ననూ, మొన్ననూ, మిట్టమధ్యాహ్నం వేళ మీయింటి డాబామీద ఒక పోకిరీకుర్రాడు నిలబడి మా యింటివరండాలో నిలబడ్డ మా కోడలి వంక చూసి ఒకటే వెకిలిచేష్టలు— కన్ను గొట్టడం చేయి వూపటం చేస్తున్నాడు!

మా అబ్బాయికి ఈ విషయం తెలిసిందంటే అగ్గిరాముడవుతాడు అందుకని నేను ఈ విషయం మీకు చెబుదామని వచ్చాను!"

"ప్లీడరుగారూ మీరు చెప్పే దేంటో నాకర్థంకావడంలేదు! ఇంట్లో నేను, నీల ప్రియ అని యిద్దరు ఫైనల్ ఎంఏ విద్యార్థినులూ వున్నారు! మా యింట్లోకి పోకిరీ కుర్రాళ్ళొచ్చే అవకాశమే లేదే? అదీగాక నిన్న మేం పిక్నిక్‌కు వెళ్ళాం! మొన్నటంతా యూనివర్శిటీలో పిక్నిక్ ఏర్పాట్లు చూసే హడావిడిలో వున్నాం!" అంది షాలిని.

"మేడం నిన్న మధ్యాహ్నం కోడలు పిలిస్తే మా ఆవిడ కూడా స్పష్టంగా చూసింది! పోకిరీ కుర్రాడు మీడాబా మీద నిలబడి చెయ్యి వూపాడు! విస్తుపోయి చూస్తున్న కోడలుపిల్లను చూసి కన్నుగొట్టాడు!"

"నిజంగానా! వాట్ ఎ స్ట్రేంజ్ యిన్ సిడెంట్ తవిడమ్మా! ఓ తవిడమ్మా! ఇలా రాఓసారి!"

తవిడమ్మ వచ్చి వాకిటి అవతల నిలబడి "అమ్మా ఓసారిలా వస్తారా!" అని పిలిచింది.

షాలిని లేచి వెళ్ళి తవిడమ్మ చేతిలో కాఫీ కప్పులందుకుని ఒక కప్పు ప్లీడరుగారి కిచ్చి ఒక కప్పు తీసుకుంది.

పవిట భుజాలనిండుకూ కప్పుకుంటూ "అమ్మా, ప్లీడరుగారు చెప్పిన మాటలు విన్నాను! మద్దెల నిద్రోతుంటే డాబా మీద అలికిడయింది. బాదంకాయల కోసం పక్కింటి కుర్రాళ్ళు దూకారేమో ననుకున్నా. కోతుల బెడద ఎక్కువగా వుంది! లేప్పోతే బుల్లెమ్మ నల్లరిపెట్టిన పోకిరీ కుర్రాడికి గరిటకాల్చి వాత పెట్టి వుండేదాన్ని! పారీ గోడ చిన్నది ఎత్తు తక్కువ! వెనక వీధిలోంచో పక్క యింటి లోంచో ఎవడో గోడదూకి డాబా ఎక్కుంటాడు!"

తవిడమ్మ మాటలకు పరంధామయ్యగారి మనసు కుదుట పడింది! లేచి నిలబడి రెండు చేతులూ జోడించి—

"పొద్దున్నే వచ్చి మిమ్మల్ని డిస్టర్బ్ చేసాను! క్షమించండి!" అన్నాడు.

"నో!నో! అయామ్ రియల్లీ సారీ ఫర్ ద ఇన్సిడెంట్!"

"ఇందులో మీ తప్పేమున్నదమ్మా! వస్తాను!" అంటూ వెళ్ళిపోయాడు పరంధామయ్యగారు.

షాలిని తల రెండు చేతులలో వుంచుకుని ఆలోచనలో పడిపోయింది "నా యింటి మీదెక్కి పోజులు కొట్టిన పోకిరీ యువకుడెవరో? ఎలాగైనా వాడిని పట్టుకుని తగుబుద్ధిచెప్పాలి, లేకపోతే నేను యింట్లో లేని సమయంలో పక్కయిళ్ళల్లోని వాళ్ళు వెనుకవీధిలో వాళ్ళు వచ్చిడాబా మీద ఎక్కి అల్లరి పనులు చేయవచ్చు!"

ఆ! యస్.ఐ రాజాగారు నీలబంధువు! ఆయనతో చెబితే విషయం ఏమిటో విచారించి పోకిరీ యువకుడెవరో తెలుసుకుని వార్నింగ్ యిచ్చి వెళతాడు"

"అమ్మా!"

"ఏమిటి తవిడమ్మా?"

"మార్కెట్‌కు వెళ్ళి కూరలు తెస్తాను!"

"అలాగే వెళ్ళిరా! ఇదిగో పది రూపాయలు" తవిడమ్మ వెళ్ళిన తర్వాత వరండాలో కూర్చుంది షాలిని.

"నీల ప్రియ లేవనేలేదు! విద్యార్థినులుగా వుంటే నిద్రమేలకువరాదు! చదువు అయిపోయిన నా బోటి వాళ్ళకు నిద్రపట్టదు. ఇదో విచిత్రం!" అనుకుంటూ కెన్ ఫోలెట్ నవల తీసుకుని చదువుసాగింది.

"మేడం! నీలను నిద్ర లేపమంటారా?" అంటూ వరండాలోకి వచ్చింది ప్రియ.

"వద్దు! ఇంకా సేపు నిద్రపోనీయ్!" అంది షాలిని.

లాఠీతో నెమ్మదిగా నేలమీద టకటక బాదుతూ—

"మే ఐ కమ్ యిన్ మేడమ్?" అన్నాడు యస్.ఐ. రాజా.

"ఓ! మీరా!? నూరేళ్ళాయుష్షు! మీగురించి యిప్పుడే అనుకుంటున్నాను! రండి! కూర్చోండి! ప్రియా! ఫ్లాస్కులో కాఫీ వుంటుంది! కప్పులో పోసి తీసుకురా!" అంది షాలిని.

"చిన్న పని వుండి వచ్చాను!"

"మాకే మీతో పని కల్గింది!"

"నేను వచ్చింది..."

"నీల ఏక్సిడెంటు విషయం కనుక్కుందామనా?"

"ఆ విషయం వాళ్ళ క్లాస్ మేట్ రాజేష్ చెప్పాడు. మా యింటి పక్కనే వాళ్ళయిల్లు! నేను వచ్చింది అఫిషియల్ డ్యూటీ మీద!"

"మరి యిలా మఫ్టీలో వచ్చేరేం? ఏమిటి పని?"

"మీదగ్గర పని చేసే వంటతను"

"రాజాగారూ! మా దగ్గర వంటతను ఎవరూ పనిచెయ్యటంలేదు! తవిడమ్మ అని



ఒక అమ్మాయి పల్నాడు ప్రాంతం మనిషి రెండు నెలలనుండి పనిచేస్తుంది. బహునమ్మకస్తురాలు!"

"ఇది వరలో ముసలమ్మ ఒకావిడవుండేది!"

"సీతమ్మ అని ముసలమ్మ వుండేది! రెండు సంవత్సరాలుగా ఆమె వంట పని చేస్తుండేది! రెండు నెలలనాడు ఎందుకో భయపడి పని మానుకుంది!"

"ఆమె" భయపడటానికి కారణం?"

"ఒకరోజు చీకటి పడగానే నల్లటి ముసుగేసుకున్న పిశాచంవచ్చి గొంతు పిసుకబోయిందని చెప్పింది" ఈ రోజుల్లో యింకా పిశాచాలేమిటి సీతమ్మా?" అంటే "కాదమ్మా! అది పిశాచమే! నా మొగుడుకు యింకో భార్య వుండేది! వున్నన్నాళ్ళు నన్ను వేధించుకు తిన్నది. చివరకు పురుగు ముట్టుకుని చనిపోయింది! చస్తే మాత్రం కోపం పోతుందా? నలభై ఏళ్ళుగా నా కోసం ప్రపంచం అంతా గాలించిందట! ఇప్పుడు నాపీక పిసికి చంపుతానంటుంది!

"నేనిక్కడా నువ్వక్కడా ఎందుకే ముండా! రా ఇద్దరం ఆయన కాళ్ళదగ్గర పడివుందాం?" అంది"

"సీతమ్మా! అదంతా నీ భ్రమ! పిశాచాలంటూ వుండవు! మన మనసులో ఆలోచనలే పిశాచా ల రూపంలో కనపడతాయి!" అన్నాను.

"లేదమ్మా! చిన్నవాళ్ళు! మీకే విషయాలు తెలియవు! మా వూరెళ్ళి నాగాచారి చేత పూజచేయిస్తాను! ఆయన యిచ్చిన తాయెత్తు కట్టుకుంటే పిశాచాలు ఏమీచేయలేవు!

"వెళ్ళొస్తా! నాకు సెలవిప్పించండి!"

అంటూ ఎంత చెప్పినా వినకుండా వెళ్ళిపోయింది! చక్కగా పనిచేసి పెట్టేవంటామె వెళ్ళిపోయింది ఎలాగురా అని అనుకుంటుంటే ఈ తవిడమ్మ వచ్చింది."

"అమ్మా! పొద్దుపోయింది! ఈ రాత్రికి మీ పంచలోపడుకోనివ్వండి" అంది. 'అలాగే' అన్నాను. తెల్లారిలేచిం దగ్గర్నుండి నాకు వంట పనుల్లో సాయం చేయసాగింది. మాటల సందర్భంలో తనకు నా అన్నవాళ్ళు లేరంది. వేలువిడిచిన అన్న గుంటూరులో వున్నాడని కొండంత ఆశతో వస్తే అతను ఎప్పుడో బదిలీ అయి రాయలసీమ ప్రాంతం వెళ్ళాడని తెలిసిందండి "ఇక్కడే వుండి వంటచేస్తావా?" అన్నాను.

"అలాగే నమ్మా! ఈ జానెడు పొట్టకు కావాల్సింది గుప్పెడు మెతుకులు! ఎక్కడుంటేనేం?" అంది.

అప్పట్నుంచీ తవిడమ్మే మాకు వంటచేసి పెడుతున్నది!"

"మేడం! తవిడమ్మను ఒకసారి పిలుస్తారా?"

కూరలు తేవటానికి మార్కెట్ కెళ్ళింది! ఆమె చాలా మంచిది! ఎంతో అణకువగా పనిచేస్తుంది!"

"మేడం! మీరు నన్ను క్షమించాలి! తవిడమ్మ దుస్తులు, పెట్టె ఎక్కడ వున్నాయి?"

"వంట గదిలో అలమారులో ఆమె ట్రంకుపెట్టె వుంది! ఎందుకు?"

"పని వుంది! పదండి చూద్దాం!"

షాలిని ప్రియ వెంట రాగా రాజావంట గదిలోకి వెళ్ళి అలమూరులోని ట్రంకుపెట్టె బయటకు లాగి లాటీతో తాళం పగుల గొట్టాడు.

"ఇన్‌స్పెక్టరుగారూ!" కోపంగా అభ్యంతరం చెప్పబోయిన షాలిని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయినవి.

"ట్రంకు పెట్టెలో నగలు, కరెన్సీ నోట్లు, పాంటు షర్ట్, డ్రాయర్లు బనియన్లు, పైన చీరెలు జాకెట్లు వున్నాయి.

వీధి వాకిలి దగ్గర చప్పుడైతే రాజా వెనుదిరిగి నిశ్శబ్దంగా వుండమన్నట్లు షాలినికి ప్రియకు సైగ చేసి వరండా వైపుగా నడిచాడు.

లోపల కడుగు బెడుతున్న తవిడమ్మ రాజాను చూసి క్షణం తటపటాయించింది. మరుక్షణం కూరల సంచి జారవిడిచి బయటకు పరిగెత్తింది.

రాజా విజిల్ తీసి వూదాడు! వీధిలో జనం పరుగెత్తిన చప్పుడు వినపడింది. నిముషం తర్వాత తవిడమ్మ చేతులకు బేడీలు వేసి ఈడ్చుకొచ్చారు పోలీసులు.

"రాస్కెల్! ఆడ వేషం వేస్తే నిన్ను గుర్తుపట్టలేమనుకున్నావా! పద స్టేషన్‌కు కాన్‌స్టేబిల్స్ వీడిని చాలా జాగ్రత్తగా స్టేషన్‌కు తీసుకువెళ్ళండి!" అన్నాడు రాజా!

గింజుకుంటూ తప్పించుకు పోవటానికి ప్రయత్నిస్తున్న తవిడమ్మను లాటీలతో అదిలిస్తూ లాక్కెళ్ళసాగారు కాన్‌స్టేబిల్స్!

"మేడం! మీ వంట మనిషి అసలు పేరు కృష్ణ! వూసరవెల్లిలా వేషం మారుస్తుంటాడు! ఆడ వేషం వెయ్యడంలో సిద్ధహస్తుడు.

మీ యింటికి రాక ముందు మాచర్లలో ఒంటరిగావుండే ఒక ధనిక విధవ రాలింటిలో వంట మనిషిగా జేరి ఒకరాత్రి ఆమెను హత్యచేసి డబ్బు నగదు తీసుకుని వుడాయించాడు. అతనికోసం జిల్లాలో పోలీసు ఫోర్సువంతా ఎలర్టుచేసి వుంచారు.

చివరకీ రోజు చేతికి చిక్కాడు"

"దిసీజ్ రియల్లీ ప్రిపోస్టరస్ మిస్టర్ రాజా!"



"ఎక్స్యూజ్ మి ఫర్ ది ఇన్‌కన్‌వీనియెన్స్!"

"నోనో! ఐ మస్ట్ థాంక్యూ! కాని రాజాగారూ... అది— వాడు— రాత్రి వచ్చినా మంచం పక్కన పడుకున్నాడు. ఆ విషయం గుర్తుకు వస్తే నా వంటిమీద గొంగళి పురుగులు పాకినట్లు అనిపిస్తున్నది!

రాత్రి వాడు...?!"

"మేడం! జరిగిపోయింది ఒక పీడకలగా మర్చిపోండి.

బైది బై! హౌ యీజ్ నీల?" అంటూ నీల మంచం దగ్గరకు వెళ్ళాడు రాజా.

అప్పుడే కళ్ళు తెరిచిన నీల "అంకుల్! పొద్దున్నే వచ్చారేం!" అంది నీరసంగా!

"ఏంలేదమ్మా! కొంచెం పని తగిలివచ్చాను! ఎలా వుందివంట్లో!"

"కొంచెం నీరసంగా వుంది అంతే! ఐయాంవోకే?"

బజార్లో వినపడ్డ అరుపులు విని రాజా, షాలిని, ప్రియ బయటకు వచ్చారు! ప్లీడరు పరంధామయ్య గారి కోడలు ఆయన భార్య వీధిలో నిలబడి పెద్దగా అరుస్తున్నారు!

"వీడే! నిన్న మొన్న డాబా ఎక్కి అల్లరి చేసాడు!"

"సిగ్గులేక చీరకట్టుకున్నాడు చూడండి!"

ప్లీడరుగారి పని మనిషి రామమ్మ ముందుకువచ్చి చీపురు జాడిస్తూ "దొంగసచ్చినోడా! యిదేం ఏసంరా! నీకు తోడబుట్టినాళ్ళు లేర్రా! అవ్వ" అని అరిచింది.

వాకిట్లో నిలబడ్డ షాలినికి విగ్గువూడిపోయి క్రాఫ్ బయట పడ్డ కృష్ణ కనపడ్డాడు! పోలీసులు అటూ యిటూ తోసే సరికి నెత్తికి అతుక్కుని వున్న విగ్గు కాస్తా కిందబడిపోయింది.

కాబోలు— కృష్ణ ముఖం వెలాతెలా పోయింది! క్రాఫు వంటి మీద అస్తవ్యంగా వున్న చీరె—

రామమ్మ శివమెత్తిన దానిలా అరవసాగింది. "చచ్చినాడా నీవంటిన నా సీరేందిరా! వుప్పతావా లేదా!" అంటూ అతని మీద పడి చీర లాగెయ్యబోయింది!

రాజా "వూ! చప్పున తీసుకెళ్ళండి! ఇక్కడ యింకో క్షణం వుంటే తవిడమ్మ వస్త్రాపహరణం జరుగుతుంది!" అని హెచ్చరించగానే కాన్‌స్టేబిల్స్ కృష్ణను లాక్కొని వెళ్ళారు!

కృష్ణ అవతలకు వెళ్ళినా కసి పోక తిట్లకు లంకించుకుంది రామమ్మ.

"మాయదారి సచ్చినోడు! ఉ ఆడి జిమ్మడి! రోజూ వచ్చి నా పక్కనే కూరుసుని ఎంతయిదిగా మైదుమాటలు సెప్పేవాడు! మాసంకూర సేసా తిందూగానిరా అని

పిలిసేవోడు!

ఓ రోజు మిట్టమధ్యాన్నం లోపలకు పిలిచి "వోరూలేరు అంతా కాలోజీకెళ్ళారు! చక్రబంగా ఏన్నీళ్ళు తానం చెయ్యి ఆయిగా వుంటది అంటే నమ్మేనమ్మా! సచ్చినాడు వచ్చి యీపు రుద్దివెళ్ళాదు! ఈడ్ని పోయిలో బెట్టా!"

రామమ్మ వైనవైనాలుగా కృష్ణ విషయాలు వీధిలో వాళ్ళందరికీ చెప్పసాగింది. ఇరుగూ పొరుగూ జనంజేరి రామమ్మను వుసికొల్పి మరిన్ని విషయాలు చెప్పించసాగారు!

షాలిని వాకిట్లో నిలబడలేక లోపలకు వచ్చేసింది! "రామమ్మ బయటకు చెప్పుకుంటుంది! తను చెప్పుకోలేదు! తవిడమ్మ— కాదు కృష్ణ — కాళ్ళుపట్టి తలకు అమృతాంజనం రాసి కళ్ళకు కాటుక దిద్ది— ఎన్నిమార్లు సపర్యలు చేయలేదు.

ఇంకా నయం! తలస్నానం చేయబోయేముందు అమ్మా తలంటుతాను" అని అడిగితే వద్దన్నాను! లేకపోతే బాత్‌రూంలో నగ్నంగా వున్న నా దేహాన్ని తలంటే నెపంతో చూసి వుండేవాడు కాబోలు!" కుర్చీలో కూలబడ్డ షాలిని వళ్ళు జలదరించింది. వంటినిండా అరిచేతులు అరికాళ్ళతో సహా చెమటలు పట్టేంది! కళ్ళు తిరిగినట్లయి లేచి మంచంమీద పడుకుంది!

* * *

అరండల్ పేటలో రెండు లైన్ల అవతల రూమ్‌లోవున్న శ్యాం, మాలి పరీక్షలు దగ్గర పడుతున్నాయన్న భయంతో పుస్తకాలు ముందుంచుకున్నా చదువులేక చదివినా కాన్‌సెంట్రేట్ చేయలేక పోతున్నారు!

"అరే శ్యాం! పరీక్షల ముందు ఈ పిక్నిక్ పెట్టేవుండాల్సింది కాదురా!" అన్నాడు మాలి—

"మాలీ! నా పరిస్థితి మరీ అన్యాయంగా వుందిరా! కన్నుమూస్తే నీల సుందర సుకుమార దేహం కనపడుతుంది!"

కావి నీల ఎదురైతే ఆమెను కన్నెత్తి చూడలేను!

అర్ధరాత్రి నిద్రపట్టక నీల రూందగ్గరకు వెళ్ళాను! కిటికీ లోంచి ఎదరుగా మంచం మీద నీలపడుకొని నిద్రపోతున్నది!

అలా కాసేపు నిలబడి దూరాన్నుంచైనా నీలను చూద్దాం అనుకుంటుండగా వంటమనిషి లేచి కేకలు పెట్టేంది.

భయం పుట్టి పరుగెత్తుకువచ్చాను!"



"శ్యాం! నువ్వు నిద్రపట్టక పోయి నీలను చూచి వచ్చావు! నేను రాత్రంతా భయంకరమైన కలలు కని సొమ్మసిల్లిపోయ్యాను!"

"ఏమిట్రా ఆ కలలు?"

"కన్ను మూయగానే కాటుక వర్షంలో తడిచిపోయినట్లు వళ్ళంతా నల్లబడిపోయింది! ఇదేమిటి వింతగా వుంది అని కుడిచెయ్యి పైకెత్తాను! చిత్రం! వేళ్ళు సన్నగా నల్లరంగు వేసివున్న తీగెల్లా సాగివున్నాయి! ఇదేమిటి! అని చేయి విదిల్చాను. వేళ్ళమధ్య సన్నటి పొరగమ్మినట్లు వున్నది! చేతులు వుండవలసిన స్థానంలో రెక్కలున్నాయి! ముక్కునుండి సువాసన వస్తున్నది! నోటి నుండి "ఝుం" అని ఝుంకారం వినపడసాగింది! ఆశ్చర్యపోతూ చేతులు (రెక్కలు) విదిల్చాను! ఆకాశంలోకి ఎగిరిపోతున్నానేమిటి అనుకుంటుంటే నేను తుమ్మెద ఆకారం ధరించినట్లు తెలియవచ్చింది!

"ఓహ్! ఇదీ బాగుంది! చక్కగా ఆకాశం అంతా తిరిగి చూస్తాను!" అనుకుంటూ రివ్వున పైకి ఎగిరాను!

సుందర నందనోద్యాన వనంపై విహరిస్తున్నాను. రకరకాల పూవులు. మల్లె, మొల్ల, విరజాజి, చామంతి, నైట్‌క్వీన్, డాలియా, కనకాంబరం, నీలాంబరం, రాధామనోహరం, మాలతి రంగురంగుల పూవులు ఇంద్రధనుస్సులోని వివిధవర్ణాలు నేలమీద విరజిమ్మినట్లు సరిగా వుద్యానవనం మధ్య పెద్దగులాబిపొద పసుపు పచ్చ రంగుగులాబి పువ్వు పరిమళం వెదజల్లుతూ సానపెట్టిన వజ్రంలా మెరుస్తున్నది!"

'నా శ్రమ ఫలించింది! ఆకాశంలో విహరించి విహరించి రెక్కలు నొప్పెడుతున్నాయి! క్షణం రోజాపువ్వు మీద వాలి విశ్రాంతి తీసుకుంటాను!' అనుకుంటూ గులాబి పువ్వు మీదవాలాను! పుప్పొడి కణాలు అతుక్కుని వున్న కాళ్ళు గులాబి పూరెమ్మల లోపలకు వెళ్ళిపోసాగాయి!

నన్ను నేను విడదొక్కుకోజూసాను! ఊహూ! ఊబిలో కూరుకుపోతున్నట్లు అంతకంతకూ లోపలకు కూరకుపోసాగాను, రెక్కలు విదల్చిఎగిరిపోవాలని చూసాను, ఊహూ రెక్కలు కదలలేదు!

ఊపిరి ఆడక వుక్కిరి బిక్కిరి అయిపోసాగాను. ఝుం అంటూ అరుద్దామనుకున్నాను! గొంతు పెగలిరాలేదు! చుట్టూ చీకట్లు కమ్మకు రాసాగాయి! మెత్తటి గులాబి రేకులనుకున్నవి గొంతును కఠినంగా నులుమసాగాయి!

స్పృహ కోల్పోయేట్లువుంది! అప్పుడర్థం అయింది! గులాబి పువ్వనుకుని మాంసాహార పుష్పం మీద వాలాను!

తుమ్మెదల నాకర్షించి భక్షించే వృక్ష సంతతి పుష్పం అది! కాని సమయం మించిపోయింది! ప్రాణం కడగట్టి పోతున్నది!

అప్పుడు మెలకువ వచ్చింది!"

కల గురించి మిత్రుడికి చెప్పినందువలననే మాలికి శరీరంలో సన్నని వణకు పుట్టింది.

శ్యాం మాలి భుజం మీద నెమ్మదిగా తడుతూ కలల గురించి భయపడకూడదురా మాలీ! కలల్లో కనపడే వన్నీ నిజమైతే ఈ ప్రపంచం స్వరూపం ఈ విధంగా వుండదు!"

"కాదురా! నా విషయంలో మటుకు ఎంతో కొంత నిజం లేకపోలేదు!"

నీకు నా గత చరిత్ర చెప్పలేదు! అమ్మ చిన్నప్పుడే పోయింది! డబ్బు సమకూర్చగల సుఖాలను అనుభవిస్తూ తీరికలేకుండా కాలం గడుపుతుండేవాడు. నాన్న! ఇంట్లో ఆడవాళ్ళులేని లోటు కొట్టవచ్చినట్లుండేది! రెండు పూటలాసరైన భోజనం వున్నా లేకపోయినా స్కాచ్‌విస్కీ దొరికేలా చూసుకునేవాడు నాన్న! కావలసినపుడు కోరుకున్న యువతులను యింటికి తెప్పించుకునేవాడు. ఇంట్లో నేను వొకడ్ని వున్నానన్న గమనంలేకుండా రాసక్రీడలలో మునిగిపొయ్యేవాడు!,

ఆలనా పాలనా చూచేవాళ్ళుండేవాళ్ళు లేరు! ఆకలి అయితే వేళకు అన్నం పెట్టేవాళ్ళు లేరు! నా ఆరోయేట మొదటిసారి సిగరెట్ కాల్చాను! నాన్న తప్పతాగి సోఫాలో పడినిద్రపోతుంటే ఆయన జేబులోంచి సిగరెట్ తీసుకుని నోటిలో పెట్టుకున్నాను! అగ్గిపుల్ల వెలిగించడం చేతగాక వేళ్ళు కాల్చుకున్నాను చివరికు అయిదు నిముషాలు కష్టపడి సిగరెట్ వెలిగించాను. నాన్న జేబులోని సిగరెట్లు ఆయన నిద్ర పోయేపుడు కాలుస్తూ ఎంత ఆనందాన్ని పొందే వాడిని! నేను ఎంతో పెద్ద వాడినైపోయినట్లు అనుభూతి పొందేవాడిని సిగరెట్ కాలుస్తున్నంతసేపు!

ఏడో ఏట రాయల్ స్కాచ్ రుచి చూసాను. గొంతులో మంటతో ఆపూటల్లా వాంతి చేసుకున్నాను! పది హేనోయేట మొదటిసారిగా వేశ్యతో కలిసాను!

అప్పట్నుంచి వీలయినపుడు స్త్రీ సుఖం పొందుతుండేవాడిని! చురుకైన వాడిని కావటంతో పరీక్షలు పాసవుతూ ఒకో తరగతి దాటిస్తూండేవాడిని. కాలేజికి వచ్చాను!

పరువంలోని ఆడపిల్లలను ఎలా వలలో వేసుకోవాలా అనే ధ్యానతో రాత్రింబగళ్ళు మునిగిపొయ్యేవాడిని.

పి.యు.సి రెండో సంవత్సరం చదువుతుండేపుడు ఒకసారి అర్ధరాత్రి దాటాక రెండో ఆట సినిమా చూసి యింటికి బయల్దేరాను. కరెంటుపోయింది. జోరున వర్షం



మొదలయింది. పక్కన వున్న పంచరంగుల మేడ వరండాలో జేరాను! వర్షం ఉధృతమైంది! ఎడాపెడా కొట్టిన జల్లుతో తడిసి ముద్దఅయ్యాను! చలికి వణుకు వచ్చింది! మేడ సింహద్వారం తలుపులు తెరచిన శబ్దం వినపడింది.

"లోపలకు రండి!" మృదుమధుర స్వరం వినపడింది. ఒక్కసారిగా జల్లువచ్చి పూర్తిగా తడిసి పొయ్యాను! చప్పున లోపలకు వెళ్ళాను!

"అరే! పూర్తిగా తడిసిపొయ్యారే!" అంటూ శుభ్రమైన పొడిటవల్ చేతికి ఇచ్చింది. తల తుడుచుకున్నాను. తడి షర్టు పాంట్‌నుండి నీరు కారుతుండటంతో ఫలితంలేక పోయింది.

బయట వాన ఎక్కువైన సందడి వినపడింది.

"వాన యిప్పట్లో తగ్గదు! తడి బట్టలతో ఏం వణికిపోతారు!"

తడి బట్టలు విడిచి ఏం చేయాలి? మెదలకుండా వుండిపోయాను.

"ఇదిగో బొంబే డైయింగ్ బెడ్‌షీట్! ఇంట్లో పంచ లుంగీలులేవు! ఇది లుంగీలా కట్టుకోండి!"

బయట వర్షం జోరు హెచ్చింది! వంట్లో వణుకు హెచ్చింది! ఆమె చెప్పినట్లు చేసాను!

"రండి! లోపల కూర్చోండి!" ముందుకు దారి తీసింది. పెద్దహాలు నిండా సోఫాలున్నాయి! నేలమీద పర్షియన్ కార్పెట్ పరచివుంది. అగరువత్తుల ఘుమఘుమ!

సోఫాలో కూర్చున్నాను! తడిబట్టలు విడిచినా వంట్లో వణుకుతగ్గలేదు.

"స్కాచ్‌విస్కీ రెండు పెగ్గులు పుచ్చుకుంటే మజాగా వుంటుంది!" అనుకున్నాను మనసులో! నా ఆలోచనలు గ్రహించినట్లు విస్కీ సీసా గ్లాసు తెచ్చి నా ముందుంచింది!

"వంట్లో వణుకు పోవాలంటే చుక్కను మించిన మందులేదు!" అంది మనోహరంగా నవ్వుతూ!

నేను విస్కీ చప్పరిస్తుంటే శుభ్రమైన టర్కీటవల్ తెచ్చి నా జుట్టు తుడువ సాగింది!

వంట్లో బయల్దేరిన వణుకు తగ్గిపోసాగింది!

నరాలల్లో వేడి పుట్టసాగింది! బయట వానజోరు హెచ్చినట్లు గాలి విసురుకు కిటికీ తలుపులు కొట్టుకుంటున్నట్లు శబ్దం వినవచ్చింది.

చలి వణుకుపోయి తాపం మదనతాపం వంట్లో పెరిగిపోసాగింది! ఏకాంతం బయటవాన గొంతు లోంచి లోపలకు దిగుతూ కోరికల కళ్ళేలను సడలిస్తున్న విస్కీ, ఎదురుగా అపరిచిత అందాల సుందరి నా మనసు చదువుతున్నట్లు ఆమె "ఇంత

పడకలో ఈ పెద్ద హాలులో ఎందుకు?! రండి!'' అంటూ నా చెయ్యి పుచ్చుకుని తీసుకుని వెళ్ళింది.

కేవలం మిణుకుమిణుకు మనే కొవ్వొత్తి వెలుగులో కూడా ఆ గది అందం నన్ను ముగ్ధుడిని చేసింది. పట్టు పరుపులు పరిచిన పందిరి మంచం చుట్టూ జలతారు దోమతెర గోడలనిండా అద్భుత సౌందర్యం వేలార్చుతున్న సుందరీ మణుల చిత్రాలు గదిలో ఒక ప్రక్కన పాలరాతి నగ్న సుందరి ఒక్కసారిగా నాలో ఏదో ఆవేశం పెల్లుబికింది! అమాంతం ఆ అమ్మాయిని రెండుచేతులతో ఎత్తుకుని మంచంవైపుగా నడిచాను.

''ఏమిటిది?! వదలండి!'' ఆమె గొంతులోనుండి వస్తున్న మాటలు నన్నే మాత్రమూ బాధించలేదు కసరాకులు మెసవినకోయిల కూజితంలా మరింతగా నన్ను కవ్వించాయా మాటలు.

''అడ్డు చెప్పవద్దు! ప్లీజ్!'' విస్కీ మైకంలో ముద్దుగా వినపడ్డాయి నా మాటలు.

జలతారు దోమతెర తొలగించి అపరిచిత సుందరిని మంచంమీద వుంచాను.

మంచం మీద పరుండి నా వంక చూస్తున్న ఆమె ''అ?!'' అంటూ తన రెండు చేతులతో ముఖం కప్పుకుంది!

''ఏమయిందీ?'' అంటూ వెనక్కి తిరిగి చూసాను. గదిలో ఎవరూలేరు!

మరి ఆమె కనులలో కనపడ్డ సిగ్గు దొంతరలకు కారణం అర్థంకాలేదు!

మరలా వెనుదిరిగి చూసాను నేను లుంగీలా కట్టుకున్న బాంబేడైయింగ్ బెడ్‌షీట్‌గది వాకిలి దగ్గరపడి వుంది!

ఆ అమ్మాయిని ఎత్తుకున్నపుడు వంటికి చుట్టుకున్న బెట్‌షీట్ జారిపడి పోయివుంటుంది!

''ఎదురుగా నగ్నంగా నిలబడిన నన్ను చూసి సిగ్గుపడుతూ ఉందా అమ్మాయి!'' అనుకున్నాను.

ముఖాన్ని కప్పుకున్న చేతివేళ్ళ సందునుండి ఆమె చూస్తూవుంది! ఆమె చూపులలో అది వరకు కనపడ్డ సిగ్గు దొంతరలు బేల తనం లేవు!

ఇది సీరియల్

నవలాపథకం

మొగలీ పువ్వంటి మొదటి భాగం

---

ఆంధ్రభూమి

సచిత్రవారపత్రిక

సీరియల్ నవలా పుస్తక పథకం—6

2

# మొగలీ పువ్వంటి

## డాక్టర్ కొత్త రవీంద్రబాబు

**జరిగిన కథ**

అమరావతి పిక్నిక్‌కని వస్తారు ఎమ్.ఏ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు. శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు. షాలిని మేడమ్ అంటే విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి కృష్ణ ఆవలి వడ్డుకు వెళ్ళివస్తూన్న నీలను పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్. షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది. హాస్పిటల్‌లో చేరిన నీలకు శ్యామ్, ప్రియలు సపర్యలు చేస్తారు.

# 2

నగ్నంగా కనపడే నవయువకుని కుతూహలంగా చూడాలనే కాంక్షతో పాటు సంభ్రమం ఆశ్చర్యం ఆనందం విభ్రమం కొంచెంగా భయం రకరకాల భావాలు కెలిడియా స్కోప్‌లో రంగుల్లా ఆమె చూపులలో మిళితమైపోయి కనపడ్డాయి.

ఆమె చూపులలో క్షణక్షణం మారుతున్న భావాలను గమనిస్తున్న నా శరీరంలో ఒక మూల ప్రారంభమైన కాంక్ష క్రమంగా పెరిగి వళ్ళంతా సర్వాంతర్యామిలా వ్యాపించసాగింది. చుక్కలుగా తుంపరులుగా జాలువానగా మొదలైన వర్షం ప్రళయ ఘోష మిన్నుముట్టే ఝుంఝామారుతంతో కూడిన కుంభవృష్టిలా మారినట్లు విపరీతమైన మదనతాపం నా శరీరంలోని ప్రతి అణువుమా జ్వలింపజేసింది!

ముందుకు వంగి మంచం మీద పడున్న పడతి వలువలు ఒక్కొక్కటే తీసివేయసాగాను! రివ్వున వీచినగాలికి రెపరెపలాడుతున్న కొవ్వొత్తిఆరిపోయింది.

“వద్దు! వద్దు!” యువతి గొంతు నుండి వస్తున్న ధ్వనులు— అవ్యక్త మధురధ్వనులు నన్ను మరింతగా కవ్వించాయి! నేనేం చేస్తున్నానో తెలియకుండా కాలగమనం మర్చి ప్రవర్తించాను!

అందమైన ఆడపిల్ల పొందు ఎరుగని వాడిని కాను! కాని ఆ రాత్రి విశృంఖల విహారంగా ‘కొత్త బిచ్చగాడు పొద్దెరగడు’ అన్నట్లు ప్రవర్తించాను! ఆమె ప్రవర్తన అందుకు తగినట్లేవుంది! “వద్దు!” అంటూనే కవ్విస్తూ నన్ను రెచ్చగొట్టి నాలో వేడి చల్లారకుండా చేసింది!

కురిసిన కొద్దీ వానజోరు హెచ్చసాగింది! అనుభవించిన కొద్దీ కొత్తకోర్కెలు చిగుర్చించి మనసును ఉద్రేక పరచసాగాయి! శరీరం అలసి సొలసి సొమ్మసిల్లి పోయింది! కాని అలసిన గుర్రాన్ని కొరడాతో కొట్టినట్లు మనసు కోరికలనే కొరడాతో శరీరాన్ని విశ్రాంతి తీసుకోనివ్వలేదు!

పూర్తిగా అలసి పోయిన గుర్రాన్ని కొరడాదెబ్బలు కూడా కదలించలేవు! డస్సి పోయిన దేహంపై మనసు తన ప్రభావం చూపలేక పోయింది! నిస్తేజంగా మంచంపై పరుండి పోయాను! బడలిన దేహంలో ఒక మూల మనసులో కోర్కెల నెగడు కొనసాగుతూనే వున్నది!



క్రమంగా మనసను గ్లాని ఆవరించింది: ఆదమరచి నిద్రపోయాను!

మెలకువ వచ్చింది! కనులు తెరిచాను. సూర్యకిరణాలు వేడిగా కళ్ళమీద పడటంతో కనులు మూసుకున్నాను! రాత్రి జరిగిందంతా కలకాదుగదా అని అనుమానపడ్డాను!

“వద్దు!” “ఆ!” “ఊహూహు” “నాటీబాయ్” అవ్యక్త మధురధ్వనులు కలస్వనంతో వినపడసాగాయి. చేయివేసి చూసాను! పక్కనున్న వయ్యారిభామ నగ్నదేహం తగిలింది. నా చేయి ఆమె వంపులను స్పర్శిస్తున్నందునో ఏమో ఆమెలో స్వల్ప ప్రకంపన కలిగింది. పక్కకు తిరిగిందామె.

కనులు తెరిచి చూచాను. నగ్న సుందరి వెనుకభాగం కనబడింది. “గంగ కద్దరికీడు యిద్దరిమేలు గలదే!” అన్న చాటు పద్యం గుర్తొచ్చి నాలో నేను నవ్వుకున్నాను!

ఆవలించి లేచాను. బడలిక వలన కనులు మూతలు పడసాగాయి! కళ్ళు నులుముకుని సుందరి దేహం ఆపాదమస్తకం చూడసాగాను! వీపు మధ్యభాగం లో మచ్చలు కనపడ్డాయి! నాలో ఏదో కుతూహలం రేకెత్తింది!

లేచి నిలబడ్డాను. మంచంమీద నిద్రిస్తున్న అమ్మాయి ఎడమ కాలివేలొకటి లేదు! పాదం మీద పుండుకనపడింది!

“ఈ అమ్మాయి ఏదైనా వ్యాధితో బాధపడటంలేదు గదా?” అనుకుంటుంటే నా వళ్ళు జలదరించింది.

ఎందుకో నాకక్కడవుండ బుద్ధికాలేదు! గిరుక్కున వెనుదిరిగి నడవసాగాను. వంటి మీద నూలుపోగులేదన్న విషయం గుర్తొచ్చి సిగ్గు అభిమానం ముంచుకొచ్చాయి. హాలులో పడివున్న పాంటు షర్టు తొడుక్కుని తలుపు తెరుచుకుని వీధిలో అడుగెట్టాను!

ఎదురుగా చిల్లర కొట్టు ముందు యిద్దరు యువకులు నిలబడివున్నారు. నా వంక ఎంతో జాలిగా చూడసాగారు. ముందుకు నడువసాగాను!

“కుష్టు ముండ కొత్త కుర్రాణ్ణి పట్టింది రోయ్!”

“వాడి ముఖం చూడు ఎలా పీక్కుపోయివుందో”

“ఎంత ‘కక్కుర్తి’ అయితే మాత్రం...”

ఇక వినలేక ముందుకు పరిగెత్తాను.

ఇంటికివెళ్ళి భళ్ళునవాంతి చేసుకున్నాను. వళ్ళంతా దిగచెమటలు కారిపోయింది!

అమృతం తాగుతున్నానమకుని కాలకూట విషం పానం చేసాను, అమర సుఖం అనుభవిస్తున్నానుకుని పరమ నికృష్టకార్యంలో పాలు పంచుకున్నాను!

పైగా ఈ విషయం నలుగురికీ తెలిసిపోయింది ఇక వూరిలో తలెత్తుకు తిరుగలేను! వళ్ళంతా దురదగొండి రసం పూసినట్లు కంపరం పుట్టిపోసాగింది.

రెండుచేతులతో ముఖం కప్పుకుని బావురుమని ఏడ్చాను. పుట్టి బుద్దెరిగి నాక అలా ఏడ్చి ఎరుగను! పరాభవం, అవమానం, భయం, ఆందోళన, మోసపోయానన్న భావం నన్ను ముంచెత్తాయి!

ఇంట్లో ఏవరూ లేరు! నాన్న రేసులకని మద్రాసు వెళ్ళాడా క్రితం రోజే!

గంటల తరబడి ఏడ్చి నీరసంగా పడిపోయాను. ఆ సాయంత్రం మంటల జ్వరం వచ్చింది! మూలుగుతూ నేలమీద పడివున్నాను.

పనిమనిషి వచ్చి మంచంమీదకు జేర్చింది. డాక్టరు వచ్చి చూసాడు. మూసిన కన్ను తెరువకుండా అలా పదిరోజులు పడివున్నాను!

ఆ పదిరోజులు విపరీతమైన కలవరింతలతో వులికిపడిపోయానట!

జ్వరం తగ్గేసరికి చిక్కి సగమై పోయాను! జుట్టు సగం వూడిపోయింది! వళ్ళు పీక్కుపోయి అకాలవార్ధంక్యం వచ్చినట్లు కుంగిపోయాను!

కనులు మూసినా కనులు తెరిచినా ఏదో భయంకరాకారం మనసులో మెదలు తుండేది. ఆడవాళ్ళను ముఖ్యంగా అందమైన యువతులను చూడగానే విపరీతమైన భయం, అసహ్యం మనసులో మెదిలేవి!

నేను బాగా కోలుకుని మామూలు మనిషినవటానికి దాదాపు సంవత్సరం పట్టింది!

కాని అప్పటికీ యిప్పటికీ అందమైన యువతి ఎదురవగానే నా వంటిమీద తేళ్ళు, జెర్రులూ గొంగళి పురుగులూ పాకినట్లు అనిపిస్తుంది!

అరే శ్యాం! అసల విషయం చెప్పాలి! భయంకరమైన ఆ కాళరాత్రి అనుభవం తర్వాత నాలో లైంగిక వాంఛ నశించింది!

యవ్వన సహజమైన లైంగికోద్రేకం కూడా నాలో కలుగ టంలేదా తర్వాత!''

''అరే మాలీ! అందమైన ఆడపిల్ల ఎదురవగానే అత్తపత్తిప్పట్టంలా ముడుచుకుపోయే నీ మనసులో యింత బడబానంలా దాగి వుందన్న మాట! ఐయాం రియర్లీ సారీ!''

''ఏమిటి! మిత్రులిద్దరూ తీవ్రంగా చర్చించుకుంటున్నారు!'' రాజేష్ గదిలోకి వచ్చిన దాకా అతని రాకను గమనించని మాలి శ్యాం ఒక్కసారి ముఖముఖాలు చూసుకున్నారు!

''సారీ! మీరేదో రహస్యంగా మాట్లాడుకుంటున్నారు కాబోలు!

రాజేష్‌కు ఏదో ఒకటి చెప్పి పంపకపోతే అతను అక్కడ నుండి కదలడనిపించింది శ్యాంకు.



'ఏం లేదురా! పింగళి సూరన కళాపూర్ణోదయానికి సుగాత్రి శాలీనుల కథ ఆయువు పట్టు అనే విషయం గూర్చి చర్చించుకుంటూ వున్నాము ఇంతలోనువ్వొచ్చావు!

''అలాగా కళాపూర్ణోదయానిక సుగాత్రి శాలీనులనే యిద్దరు స్నేహితుల కథ ఆయువు పట్టంటావు! నేనలా అనుకోవటంలేదే?

''చంపకురా భాయ్ సుగాత్రి శాలీనులు భార్యాభర్తలు నగలు ధరించి మంచి పట్టు చీరె కట్టుకుని లక్ష్మీదేవిలా మెరిసిపోతూ శోభనంగదిలో అడుగిడిన సుగాత్రి వంక కన్నెత్తి చూడదు శాలీనుడు భర్త ప్రవర్తనకు కారణం తెలియని సుగాత్రి క్రమంగా చిక్కిశల్యమై నగచి వేసారి పాత చింకి పాత కట్టుకుని తోటలో చెట్ల పాదల వద్ద శ్రమిస్తూ వుంటే శాలీనుడిలో ఆమె యెడల విపరీతమైన ఆకర్షణ జనిస్తుంది.

ఆ తర్వాత దంపతుల మధ్యవున్న అడ్డుగోడ తొలగి స్వర్గసుఖాలను భవిస్తారు''

''ఏం కల్పనరా శ్యాం. అందమైన భార్యను అవతల అట్టిపెట్టే చవటాయ్‌వుంటాడంటారా! అదీ విష్కారణంగా ఏదో ఈరోజుల్లో కట్నం తేలేదని భార్య వంక కన్నెత్తి చూడని వాళ్ళుంటారనుకో!''

''శిల్పి ఉలితో నగిషీలు చెక్కినట్లు సూరన తన కావ్యానికెన్నోవిధాల మెరుగులు దిద్దాడు.''

''లేదురా శ్యాం! వాడి ముఖం! కాస్త షెల్లీ కాస్త కీట్సు డ్రామాలలో విషయాలు సంగ్రహించి వాటిని పెంచాడు! వట్టి కాపీ సరుకు''

''ఒరే ఆపరా నీ ప్రేలాపన! సూరన పదహారవ శతాబ్దం వుత్తరభాగంలో వాడు! ఇంగ్లండులో షేక్స్‌పియర్, ఫ్రాన్స్‌లో రబెల్లే, ఇటలీలో ఆర్లండో మొదలైన సాహితీవేత్తలకు యించుమించు సమకాలీనుడు. నంద్యాల రాజు అడిగితే అపూర్వ కథాసంవిధానంతో శృంగార ప్రాయంగా, పుణ్య వస్తు వర్ణనాకర్ణీయంగా కళాపూర్ణోదయం వ్రాసాడు!''

''నీదంతా చాదస్తం! అంతా మన పూర్వీకులు రాసారంటావు! సరే వస్తా! లీలామహల్లో 'పారిస్ బైనైట్' సినిమా ఆడుతుందట! త్వరగా వెళ్ళకపోతే టికెట్లందవు?'' అంటూ వెళ్ళిపోయాడు రాజేష్.

''ఒరే శ్యాం! ఆ రాజేష్‌గాడొట్టి యిడియట్. వాడితో సాహిత్య చర్చంకు పూనుకోవడం వట్టి తెలివి తక్కువ పని''

''వాడి సంగతి నాకూ తెలుసు! అయితే ఆఖ్యానవరిష్టుడు అని పేరొందిన

సూరనను, తెలుగులో మొట్టమొదటి నవల అని చెప్పదగిన మహాకావ్యం 'కళాపూర్ణోదయం' వ్రాసిన సూరనను అవమాన పరుస్తుంటే వూరుకోలేకపోయాను''

''రాజేష్‌కు చదువుమీద ధ్యాసలేనే లేదు. తెలుగు ఎంఏ పూర్తవగానే వాళ్ళ బాబాయి నడుపుతున్న కాలేజిలో అతని కోసం రిజర్వు చేసి వుంచిన లెక్చరర్ పోస్టులో చేరిపోతాడు! మా వాడు కాబోయే లెక్చరర్ అని వాళ్ళ నాన్న రెండు లక్షల కట్నం ముందుగానే తీసుకుని ఒక నల్లటి అమ్మాయిని కోడలుగా చేసుకున్నాడు.

ఆ అమ్మాయి అంటే వీడికి గిట్టదు! అందుకని భార్యను ఏదో వొక వంకపెట్టి హింసించి పుట్టింటికి పంపు తూంటాడు''

''భార్యను అవతల అట్టిపెట్టే చవటాయ్ వుంటాడా అన్నాడు!''

''మొదటి రాత్రి టివి తేలేదు! ఛీ! నా కక్కర్లేదు! అని భార్యను పుట్టింటికి పంపాడు. పుణ్యాత్మురాలు టివి తీసుకుని మరలా రాజేష్ దగ్గరికొచ్చింది.

'ధూత్! మోటార్. సైకిల్ తేంది గడప తొక్కవద్దు' అన్నాడు.

మామ మోటారు సైకిల్ కొని తెచ్చాడు. రవ్వల వుంగరం, సోఫాసెట్, ఫ్రిజ్, ఫారిన్ వాచీ– హిరణ్యాక్ష వరాలన్నీ కోరుకున్నాడు. ఓపికగా అన్నీ సమకూర్చిపెట్టింది భార్య! దాదాపుగా ఇక అడగటానికి ఏమీ మిగల్లేదు! ఏదో వంక పెట్టి భార్యను పుట్టింటికి పంపటానికి వీల్లేకపోయింది!

ప్రేమగా భార్యను దగ్గరకు తీయటానికి మనసొప్పలేదు! ఎలాగైనా భార్య పడకగదిలో రాకుండా వుంటే చాలు అని అనుకోసాగాడు.

గదిలోకి వచ్చిన భార్యపై తన రాక్షస ప్రవృత్తి ప్రయోగించసాగాడు. సిగరెట్‌తో వంటిమీద సున్నితమైన భాగాలపై కాల్చేవాడు. జుట్టుపట్టుకుని వంగదీసి వీపుమీద పిడుగుల వర్షం కురిపించేవాడు! బ్లేడుతోకోసి గుండు సూదులతోగుచ్చి బాధించేవాడు. పరమ పైశాచికంగా హింసిస్తే ఇక భయంతో భార్య తనవద్దకు రాదని మనసులో అనుకున్నాడు.

కాని అతని భార్య అతను ఎంత హింసించినా అతని దగ్గరకు రావటం మానుకోలేదు! హింసించిన కొద్దీ భర్త దగ్గర జేరాలనే వాంఛ అధికమవసాగిందామెలో.

తుమ్మెద రెక్కల బారులా పొడవాటి వాల్జెడ ఊపుకుంటూ ప్రేమ నింపుకున్న చూపులతో గదిలో అడుగిడుతున్న భార్య వాల్జెడను కత్తిరించి వేశాడు!

పాపం ఆ అమ్మాయికి విపరీతమైన బాధ కలిగింది. బావురుమని ఏడుస్తున్న



భార్యను మెడబట్టి బయటకు గెంటాడు.

వీధి వాకిలిముందు కూర్చుని విలపిస్తున్న ఆ అమ్మాయి దగ్గరకు ఎదురింటి ఆఫీసరుగారి వంట నాయరు వచ్చాడు! అతనికి తెలుగు రాదు! ఈ అమ్మాయికి మలయాళం రాదు! అతిదీనంగా అవమానాగ్ని పాలయిన అతివను ఓదార్చాడు.

భర్త పైశాచిక ప్రవృత్తితో భయపడిపోయిన ఆ అమ్మాయిని అనునయించి, బుజ్జగించి సేదదీర్చాడు! విచిత్ర, విపరీత, విపత్కర పరిస్థితులలో ఇద్దరి మధ్య ప్రేమ జనించింది!

భర్త తిట్టి కొట్టి బయటకు వెళ్ళగొట్టడం! నాయరు ప్రేమగా లాలించి అక్కున జేర్చుకోవటం – ఇలా కొన్నాళ్ళు సాగింది.

విషయం ఎన్నాళ్ళు దాగుతుంది! ఒకరోజు నాయరు విషయం తెలిసి భార్యను నిగ్గతీసి నిజంతెలుసుకుని బయటకు గెంటుదామని కోపంగా యింటికి వచ్చాడు రాజేష్.

కాని అప్పటికే కాలహరణం అయిపోయింది. తాళికట్టిన నరరూప రాక్షసుడిని వదలి మనసు పడినవాడితో
వెళ్ళిపోయింది రాజేష్ భార్య! దొంగకు తేలు కుట్టినట్లు కిమ్మనకుండా వుండిపోయాడు రాజేష్''

''సరే అద్భుతమాట వీడి కథ! అరే మేడం! మీరెప్పుడొచ్చారు?'' వాకిట్లో నిలబడ్డ షాలిని మేడంను చూసి సంభ్రమంగా లేచి నిలబడ్డాడు శ్యాం!

''శ్యాం! నీలకు మంటల జ్వరం వచ్చింది! చీటికి మాటికి వులికిపడుతున్నది! కబురు చేద్దామంటే వాళ్ళ డాడీ వ్యాపార వ్యవహారాల నిమిత్తం జపాన్ వెళ్ళాడు.

నువ్వు వెళ్ళి డాక్టరు రవిగారిని పిలుచుకుని వస్తావా?''

''అలాగే మేడం?''

''త్వరగా రావాలి! ప్రియ ఒక్కతే వున్నది! నేను ఇంటికి వెళ్తున్నా?''

''ఇప్పుడే వెళ్తున్నా మేడం!''

షాలిని వెళ్ళిన మరుక్షణమే దుస్తులు మార్చుకుని బయటకు పరుగెత్తాడు శ్యాం.

డాక్టరు రవి నర్సింగ్‌హోమ్ వైపుగా వెళ్తున్న శ్యాం మనసులో ఆందోళన ఎక్కువైంది. 'నీలకు ప్రమాదం ఏం జరుగదు గదా? పిచ్చివాడు రేప్ చేయటానికి ప్రయత్నించిన విషయం నీలను మానసికంగా ఎంతో కృంగదీసి వుంటుంది! ఆ తర్వాత నీళ్ళలో పడిపోయి నీళ్ళుమింగి శారీరకంగా దెబ్బ తిన్నది! మనసూ శరీరం రెండూ దెబ్బ తిన్నసుకుమారి నీలకు త్వరలో స్వస్థత చిక్కితే బాగుండును!' అనుకుంటూ డాక్టర్ రవి మృకుత నర్సింగ్‌హోంకు వెళ్లాడు.

"సార్!" అంటూ ఎదురుగా నిలబడ్డ శ్యాం వంక చూస్తూ

"ఏమిటి శ్యాం! వంట్లో బాగాలేదా?"

"లేదు సార్! నీల..."

"నీల..."

"నీలకు విపరీతమైన జ్వరం వచ్చింది! మీరు వెంటనే రావాలి!"

"అలాగా! నిన్న రాత్రి ఆమెను చూసాను! అప్పుడు..."

"సార్! మీరు వెంటనే రావాలి! నీలకు ఏం బాగాలేదు?"

ఆడపిల్లను చూచి ఆమడ పరిగెత్తే శ్యాం నీలకోసం ఆదుర్దా పడటం చూసి 'శ్యాం మనసులో మదనుడి బాణాలు గుచ్చుకోలేదు కదా! లవ్ మేక్స్ స్ట్రేంజ్ కాంబినేషన్స్!' అనుకుంటూ—

"పద శ్యాం!" అంటూ బేగ్ పుచ్చుకుని ముందుకు నడిచాడు.

కారు దిగి లోనికి వస్తున్న డాక్టరు రవిని చూడగానే షాలిని మనసు కుదుటపడింది.

"అమ్మయ్య మీరొచ్చారు! ఇప్పటివరకు భయపడిపోయాను! రండి" అంటూ లోపలకు దారితీసింది.

"రాత్రి బాగానే వుందే! ఇంతలో ఏమయింది?" అంటూ లోపలకు నడిచాడు డాక్టర్ రవి.

నీల విపరీతంగా రొప్పుతున్నది! నీరసంతో కన్నులు అరమూసుకుపోతున్నాయి! డాక్టర్ రవిని చూసి ఆమె కళ్ళలో ధైర్యం వచ్చింది అన్నట్లు భావం తళుక్కుమంది. మరుక్షణం నీరసంగా కనులు మూసుకుంది.

స్టెతస్కోప్‌తో ఆమె గుండె వూపిరితిత్తులు పరీక్షించసాగాడు రవి. నీల గుండె విపరీతమైన వేగంతో కొట్టుకుంటున్నది! వూపిరితిత్తులలో విపరీతమైన గురక విజిల్ వూదినట్లు వినపడసాగింది. కుడివైపు వూపిరితిత్తి క్రిందిభాగంలో ఏమాత్రం కదలిక లేదు శబ్దాలు వినరాలేదు!

క్లినికల్ థర్మామీటర్ నీల నుదుటి మీదుంచాడు రవి. అర నిముషమున్నాక మాట అయిదు డిగ్రీల జ్వరం నమోదయింది!

"అరే! ఇంత జ్వరం వచ్చిందేమి?" అంటూ నీల చేతిగోళ్ళ వంక చూసాడు.

గులాబి రంగు గోళ్ళు నీలం వర్ణం దాల్చి వున్నాయి!

"ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"తవిటమ్మ అని మా ఇంట్లో వంటమనిషిని పోలీసులొచ్చి పట్టుకెళ్ళారు! ఆ విషయం విని ఇలా అయింది?"



"అంత మాత్రానికేనా?"

"తవిటమ్మ ఆడది కాదు! గజదొంగ కృష్ణ ఆడవేషం వేసుకుని మా ఇంట్లోవంట పనిచేసాడని తెలిసింది! నీల హార్లిక్స్ తాగుతుండగా ప్రియ ఆ విషయం చెప్పింది!

ఒకసారి నీల తల స్నానం చేస్తుండగా తవిటమ్మ వేషంలో కృష్ణ ఆమెకు తలరుద్ది వెళ్ళాడు! ఆ విషయం గుర్తొచ్చి కొలమారి వుక్కిరిబిక్కిరి అయింది నీల. అప్పట్నుంచీ విపరీతమైన రొప్పు, దగ్గు, ఆయాసం వచ్చాయి. భయంతో శ్యాం రూముకు వెళ్ళి మిమ్మల్ని చప్పున పిల్చుకు రమ్మని చెప్పాను"

"నీలను వెంటనే హాస్పిటల్‌లో జేర్పించాలి!
పోనీ ఇప్పుడిలా నా కారులో ఆమెను తీసుకువెళ్దాం!"

"అలాగే డాక్టర్ రవీ! నీలా! లేమ్మా!" అంది షాలిని.

నీల కనులు తెరచింది. లేచి కూర్చుందామని శరీరంలోని శక్తినంతనూ కూడదీసుకుని ప్రయత్నించింది! కాని లేవలేకపోయింది.

"అరే! నీల ఎంత నీరసపడిపోయింది! పోనీ నేను ప్రియ నీలను ఎత్తుకొని వచ్చి కారులో పడుకోబెడతాం లెండి!" అంది షాలిని.

"వద్దు మేడం!" అంటూ శ్యాం ముందుకువచ్చి ఒక చేయి నీల నడుంకింద మరో చేయి మెడకింద వేసి ఆమెను ఎత్తుకుని బయటకు నడిచాడు. శ్యాం వంక కృతజ్ఞత వెల్లివిరిసే చూపులతో చూసిన నీల మరుక్షణంలోనే స్పృహ కోల్పోయింది.

నీల స్పృహ కోల్పోయిందని గమనించిన శ్యాం "డాక్టర్‌గారూ!" అన్నాడు.

"పద! నర్సింగ్‌హోంలో జేర్పించి చేయవలసినది చేద్దాం!" అంటూ ధైర్యం చెప్పాడు రవి.

సుశ్రుత నర్సింగ్‌హోంలో అడుగిడగానే "సిస్టర్! నీలను ఎమర్జన్సీ రూంలో జేర్పించండి! రెస్పిరేటర్ తగిలించి ఆక్సిజన్ బాగా సరఫరా అయేట్లు చూడండి!" అన్నాడు.

శ్యాం నీలను ఎత్తుకుని రెస్పిరేటర్ వున్న బెడ్ వద్దకు నడిచాడు. మల్లెపూచెండులా జాగ్రత్తగా నీలను మంచంమీద పడుకోబెడుతున్న శ్యాం వంక ఆశ్చర్యంగా చూసింది నర్సు. డాక్టర్ రవి వచ్చి యింజక్షన్ చేసి రెస్పిరేటర్ మాస్క్ నీలకు తగిలించాడు.

అప్పటివరకు నిశ్శబ్దంగా నిలబడ్డ ప్రియ రెస్పిరేటర్ మిషన్ చూసి "డాక్టర్‌గారూ! నీలకేం ప్రమాదం లేదు గదా?" అంది ఆదుర్దాగా.

రవి బదులు చెప్పకుండా రెస్పిరేటర్ వాల్వ్ సరిచేయసాగాడు. రెస్పిరేటర్ నుండి ప్రాణవాయువు బెల్లోస్‌లోకి వచ్చి అక్కడ నుండి నీల వూపిరితిత్తులలోనికి వెళ్ళసాగింది.

బలంగా నీల వూపిరితిత్తులలోనికి తోసుకు వెళ్తున్న ఆక్సిజన్ వూపిరితిత్తులలో నిల్వ వున్న కార్బన్‌డయాక్సైడ్ శాతం ఎక్కువగా వున్న గాలిని బయటకు నెట్టివేయసాగింది! దాదాపు అయిదు నిముషాలు గడిచిన తర్వాత నీల గోళ్ళవంక చూసాడు రవి!

నీలం రంగు తగ్గింది!

"ఫరవాలేదు! షి విల్ కం రౌండ్" అన్నాడు రవి! క్షణమాగి "అయితే ఆమె బాగా కోలుకునేదాకా చాలా శ్రద్ధగా చూడాలి! మా సిస్టర్స్ బాగా చూసుకుంటారు గాని స్వంత మనుష్యులు కూడా వుంటే బాగుంటుంది!" అన్నాడు.

"నేను ప్రియ ఒకరి వెనుక వొకరు ఆమె దగ్గర వుంటాం!" అంది షాలిని.

అలాగే అన్నట్లు తలూపింది ప్రియ.

డాక్టరు రవి థియేటర్ సిద్ధం చేయించాడు. థొరాసిక్ సర్జన్‌ను ఫోన్‌చేసి పిలిపించాడు. నీలను థియేటర్‌కు తీసుకుని వెళ్ళి బ్రాంకోస్కోపీ జరిపారు. సన్నని బ్రాంకోస్కోప్ వూపిరి తిత్తులకు గాలిని చేరవేసే గొట్టాలను (బ్రాంకై) క్షుణ్ణంగా పరిశీలించసాగింది. కుడివూపిరితిత్తి కింది భాగంలోని బ్రాంకస్ లోపల చిన్న ఆకు అడ్డుపడివుంది. బ్రాంకోస్కోప్‌తో అమర్చిన సన్నని ఫోర్సెప్స్‌తో ఆ ఆకును తొలగించాడు థొరాసిక్ సర్జన్. నీల నీళ్ళలో మునిగినప్పుడు ఉక్కిరిబిక్కిరి అయి నీళ్ళు తాగినప్పుడు ఆ ఆకు లోపలకు వెళ్ళి వుంటుంది. బ్రాంకస్ లోపల ఇరుక్కునివున్న ఆ ఆకు నీల హార్లిక్స్ తాగుతూ అకస్మాత్తుగా తవిటమ్మ సంగతి విని ఆందోళన చెంది కొంమారింది. హార్లిక్స్ కొంత వూపిరితిత్తులలోనికి వెళ్ళి ఆకును మరింత కిందకు నెట్టివేసింది. దాంతో సీసాకు బిరడా పెట్టినట్లు ఆకు బ్రాంకస్‌ను పూర్తిగా మూసివేసింది.

ఆకును తొలగించగానే నీల కుడి ఊపిరితిత్తి దిగువభాగం లోనికి మరలా ఆక్సిజన్ వెళ్ళసాగింది, బుస్‌మన్న శబ్దంతో, వూపిరి తిత్తులలో చేరి వున్న ద్రవాన్ని సక్షన్‌తో పూర్తిగా లాగివేస్తూ—

"ఇక ఈమె కోలుకోవాలి! అయితే ఇన్‌ఫెక్షన్ గ్రటా రాకుండా చూసుకోవాలి!" అన్నారు థొరాసిక్ సర్జన్.

"అలాగే సార్!" అన్నాడు డాక్టర్ రవి. థియేటర్ బయట ఆందోళనగా తిరుగుతున్న షాలిని, కనుల నీరు కుక్కుకుని దిగులుగా కూర్చున్న ప్రియ డాక్టర్ రవి బయటకు రావడంతో ఆయన దగ్గరకు వచ్చారు.

"ఊపిరితిత్తులలో ఈ ఆకు ఇరుక్కుని వుంది. అది తీసివేసారు గనుక ప్రమాదం తప్పినట్లే?" అన్నాడు.



రవి తన చేతిలో వుంచిన ఆకును అప్రయత్నంగా జారవిడిచింది షాలిని. ఏదో విషకీటకాన్ని చూచినట్లు భయభ్రాంతురాలైందామె!

షాలిని అలా భయభ్రాంతురాలవడం చూసి కొంచెం విస్మితుడైన రవి కిందపడ్డ ఆకును తీసుకుని వెళ్తూ "ఈసారి క్లినికల్ మీటింగ్‌లో ఈ ఆకును చూపించాలి!" అన్నాడు.

నీలను థియేటర్ నుండి బయటకు తీసుకుని వస్తుంటే ఆమె దగ్గరజేరి ఆప్యాయంగా చెదిరిన ఆమె కురులు సవరించసాగింది షాలిని.

"నీలా! నీలా!" అంటూ ప్రియ పిలిస్తే కనులు తెరిచి చూచింది నీల. గుర్తు పట్టానన్నట్లు క్షణం నీల చూపులో తీక్షణత హెచ్చింది! మరుక్షణం నీల కళ్ళు వరండా అంతా పరిశీలనగా చూడసాగాయి.

'శ్యాం కోసం గాబోలు ఈ అమ్మాయి యింత నీరసంగా వుండి చూస్తున్నది! స్పృహ లేనంతాసేపూ నీలకోసం ఆదుర్దా పడుతూ తీరా నీలను బయటకు తీసుకురాగానే ఎక్కడకు మాయమైపోయాడీ శ్యాం!' అనుకూంటూ—

"శ్యాం! శ్యాం!" అని బిగ్గరగా పిలిచింది షాలిని.

"ప్రియా! చూడమ్మా శ్యాం ఎక్కడకు వెళ్ళాడో!" అందామె ప్రియతో.

ప్రియ సుశ్రుత నర్సింగ్‌హోం వరండాలు గాలించి చూచి శ్యాం కనపడకపోయేసరికి వీధి గేటు వద్దకు వెళ్ళింది.

బజారు చివర పరుగులాటి నడకతో వెళ్తున్న శ్యాం ఆకారం చూసి

'శ్యాం నీలను ప్రేమిస్తున్నాడు. సందేహం లేదు. కానీ ఎందుకో ఆమెకు ఎదురవటానికి జంకుతున్నాడు!' అనుకుంది ప్రియ.

రూంలో మంచంమీద ప్రశాంతంగా నిద్రపోతున్నది నీల. ప్రియ, షాలిని పక్కన వున్నకుర్చీలలో కూర్చున్నారు! ఇద్దరికీ కడుపులో ఆకలి దహించుకుపోతున్నది. పొద్దుటి నుండీ జరుగుతున్న సంఘటనల పరంపర వలన భోజనం ఏర్పాట్లు చేసుకునే వెసులుబాటు కలుగలేదు!

'శ్యాం ఇంతలో మాయమైపోయాడు! లేకపోతే అతనిచేత ఏదైనా టిఫిన్ తెప్పించుకుని వుండేవాళ్ళం!' అని షాలిని మనసులో అనుకుంటూ యధాలాపంగా వాకిలివైపు చూసింది.

శ్యాం వాకిలి నుండి లోపలకు వస్తూ కనబడ్డాడు. అతని చేతిలో బుట్ట, కారియర్, భుజానికి ఫ్లాస్కు తగిలించి వుంది. విస్తర్ల కట్ట, పళ్ళబుట్ట, కారియర్ బల్లమీదుంచుతూ "మేడం! మీరూ ప్రియ భోంచేయండి!" అన్నాడు.

రిస్టువాచీ వంక చూసుకుని "అరే! మూడు గంటలయింది. ఇప్పుడు నీకు ఏ హోటల్‌వాళ్ళు భోజనం కారియర్ ఇచ్చారు?" అంది షాలిని.

"హోటల్ కాదు మేడం! మహాలక్ష్మి మెస్! మహాలక్ష్మిగారిని బాగా కాకాపట్టి మళ్ళీ వంట చేయించి కారియర్ పట్టుకొచ్చాను. మీరూ, ప్రియ భోం చేయండి!"

"భలేవాడివయ్యా శ్యాం! ఇంతకీ నువ్వు భోం చేసావా? నీ వాలకం చూస్తే నువ్వూ భోంచేసినట్లు లేవు?"

తలదించుకున్న శ్యాంను పరికించి చూస్తూ "సరే కారియర్‌లో భోజనం ముగ్గురం తిందాం! రా!" అంటూ కారియర్‌లో అన్నం కూరలు మూడు విస్తరాకులలో సర్దింది షాలిని.

టేబిల్ చుట్టూ కుర్చీలు వేసుకుని కూర్చుని భోంచేయసాగారు షాలిని, ప్రియ, శ్యాం.

విస్తరిలో అన్నం కెలుకుతూ మాటిమాటికీ మంచంమీద పడుకున్న నీల వంక చూస్తున్న శ్యాంను చూసి "సందేహం లేదు! శ్యాం నీలను ప్రేమిస్తున్నాడు! అతని చూపులలో వ్యక్తం అవుతున్న ఆందోళన, ఆదుర్దా, ఆవేశం ఆ సంగతి చెప్పక చెప్తున్నాయి!" అనుకుంది ప్రియ.

"నీలకు స్పృహ రాగానే కళ్ళు తెంచుకున్న గుర్రంలా పరుగెత్తుకుపోతాడు శ్యాం! ఇతని విచిత్ర ప్రవృత్తి వెనుక ఏదో బలీయమైన కారణం వుండివుంటుంది!" అనుకుంది షాలిని.

భోంచేసాక షాలిని "ప్రియా! నీలను చూస్తూ వుంటాను. నవ్వు ఇంటికి వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుని రా!" అని ప్రియను ఇంటికి పంపింది. ప్రియ వెళ్ళిపోయాక నిద్రముంచుకొస్తుంటే తల బల్ల మీదుంచుకుని నిద్రపోయింది.

బయట ఆవరణలో ఏదో ప్రమాదం ముంచుకొచ్చిన కేసు తాలూకు విజిటర్స్ కేకలు వినబడి ఉలిక్కిపడి లేచింది షాలిని.

కరెంటు పోయింది. సీలింగ్ ఫాన్ ఆగిపోంది. నీల మంచం దగ్గర కూర్చుని న్యూస్ పేపర్ మడచి నీలకు విసురుతున్నాడు శ్యాం!

"దగ్గర ఎవరూ లేనప్పుడు ఇతని మనసులో ప్రేమ ఇలా బహిర్గతమవుతుంది! ఎవరైనా ఎదురైనా, నీలకు స్పృహ వచ్చినా ఇతడు పత్తాలేకుండా పరారయిపోతాడు" అనుకుంది. అంతలోనే నిద్ర ముంచుకువచ్చి తల బల్లమీద ఆనించి నిద్రపోయింది.

డాక్టర్ రవి సాయంత్రం రౌండ్సుకు వచ్చి "అరె మేడం నిద్రపోతున్నారే!" అంటూ నీలను పరీక్షించి "శ్యాం! నీల పరిస్థితి మెరుగ్గానే వున్నది. మేడమ్‌ని ఇంటికి వెళ్లమనకపోయ్యావా?" అన్నాడు.



అప్పుడే కళ్లుతెరచిన షాలిని "ఒళ్లంతా నొప్పులు! తలనొప్పిగా వుంది!" అంది.

"పోనీ ఇంటికి వెళ్లి పడుకోండి! సిస్టర్ నీలను చూస్తుంటుంది! ఏమైనా కబురు తెలియజేయాలంటే శ్యాం వున్నాడు!" అన్నాడు డాక్టర్ రవి.

"ఇష్టం లేకపోయినా మీరు చెప్పినట్లు చేయక తప్పేట్లులేదు! శ్యాం! ప్రియ వచ్చేవరకు ఇక్కడే వుండు!" అని చెప్పి వెళ్లిపోయింది షాలిని".

షాలిని వెళ్లిన కాసేపట్లో నర్సు వచ్చి నీల టెంపరేచర్, బిపి, పల్స్ చూసి శ్యాంతో "మీరు కొంచెంసేపు అవతలకు వెళ్తారా! చీరె, జాకెట్ మార్చాలి!" అంది. బయటకు వెళ్తున్న శ్యాంతో "పోనీ వేడిగా కాఫీ పట్టండి! గంటయ్యాక తాగిస్తాను"అంటే మహాలక్ష్మమ్మ మెస్ దగ్గరకు పరుగెత్తాడు శ్యాం ఫ్లాస్కు తీసుకుని.

మహాలక్ష్మమ్మను కాకాపట్టి కాఫీ తయారుచేయించుకుని ఫ్లాస్కులో పోయించుకుని తిరిగివచ్చేసరికి సిస్టర్ నీలకు బట్టలుమార్చి రూమ్ క్లీన్ చేసి వుంచింది!

"మీరు కుర్చీలో కూర్చుని చూస్తుండండి! పక్క రూంలో పేషెంట్‌ను చూసి వస్తాను!
" అంటూ బయటకు వెళ్లింది సిస్టర్.

మంచం ప్రక్కన కుర్చీలో కూర్చుని వాన నీటిలో తడిసిన మల్లెమొగ్గలా మెరిసిపోతున్న నీలవంక చూస్తూ కూర్చున్నాడు శ్యాం!

"ఈ అమ్మాయి గురించి ఆలోచిస్తుంటే నా మనసు కట్టు తప్పిపోతుంది! హైరింజన్ గుండె దడదడ కొట్టుకుంటుంది! శరీరంలో ప్రతి అణువు ఆనందంతో పరవశిస్తుంది! నీలను నా బాహువులలో బంధించాలనీ, ఇంద్ర నీల మణుల శకలాల లాంటి ఆమె ముంగురులను సవరించాలనీ, గులాబి మొగ్గల్లావున్న ఆమె వదనాన్ని ముద్దులతో ముంచెత్తాలనీ   అగాధ సముద్రాల లోతులను గుర్తుకుతెచ్చే ఆమె కనులలోకి చూస్తూ కాల గమనం తెలియని కర్తవ్యంతో విమూఢునిలా ప్రవర్తించాలనీ, పగడాల కాంతితో పోటీపడే ఆమె పెదవులను వేలి కొనలతో మెమ్మదిగా స్పృశించాలనీ, ఆమె సౌందర్య విలోకనానంద రస వాహినిలో మునిగి తన్మయుడినవాలనీ   అలా ఎన్నో కోరికలు కలుగుతుంటాయి!

కాని నీల అపురూప సౌందర్యం సొంతం చేసుకోగల అర్హత నాకున్నదా అన్న ప్రశ్న మొదలయినప్పుడు అంతులేని ఆత్మన్యూనతా భావం నన్ను కబళించి వేస్తున్నది!" అనుకున్నాడు శ్యాం!

ఎం.ఏ క్లాసులో చేరిన మొదటి రోజునే మెరుపు తీగెలా మెరిసిపోతున్న నీల రూపం శ్యాంను ఆకర్షించింది! ఆ క్షణంనుండి అతని మనసులో సంఘర్షణ మొదలైంది!

శ్యాంలో శారీరకంగా యవ్వన సహజమైన మార్పులువచ్చినా మనసుమాత్రం పసిబాలుని మనసులా — తల్లి అహల్య ఒడిలో తలపెట్టుకుని నిద్రించే శిశువులా — లైంగికావేశం ఏ మాత్రం చొరబడకుండా వుండిపోయింది!

యవ్వనారంభంలో సహ విద్యార్థులు తమలోతాము అమ్మాయిల అందాల్ని వర్ణించుకుంటూ వారితో ప్రేమ సంభాషణలు జరపాలనీ, స్నేహం పెంపొందించుకోవాలనీ — వీలుంటే ఇంకా ముందుకువెళ్లిపోయి కొంగ్రొత్త సుఖాలను రుచిచూడాలని విపరీతంగా వుబలాటపడేవారు. కానుకు కక్కుర్తి పడే కామినులతో తాము ఎలా రమించింది నిర్లజ్జగా చెప్పుకునే వాళ్లు కొందరు — అంత ధైర్యంలేని వాళ్లు బ్లూ ఫిల్మ్లు చూసి, బూతు పుస్తకాలుచదివి తృప్తిపడేవాళ్లు! మిగిలిన వాళ్లు అందమైన అమ్మాయిలను చూసి మానసికంగా తృప్తి పడుతుండే వాళ్లు!

అందమైన అతివ ఎదురైనా ఏ విధమైన ఉద్రేకం పొందనిది బహుశ శ్యాం ఒక్కడేనేమో?! కాలేజీలో జేరి క్లాస్‌మేట్స్‌ను పరిశీలించి చూశాక తనలో ఏదో లోపం వున్నదేమో అని మొదటిసారి అనిపించింది శ్యాంకు! కాని ఆ విషయమై ఎప్పుడూ ఎక్కువగా ఆలోచించే తీరికా అవకాశం కలుగలేదతనికి అంత క్రితం.

నీలను చూసిన రోజే ఆ విషయం గూర్చి తీవ్రంగా ఆలోచించసాగాడు శ్యాం! ప్రశ్నలు — సమాధానాలు మనసులో మొదలయ్యాయి.

"నేను వివాహం చేసుకుంటే నీలను చేసుకుంటాను! ఈ అతిలోక సౌందర్యవతి కన్న అందమైన యువతి మరి ప్రపంచంలో వుండదు!"

"వివాహం చేసుకుని...?"

"తర్వాత ఏం చేస్తావు?"

"ఆమె సన్నిధిలో నాశేష జీవితం గడిపివేస్తాను?"

"అంతేనా? భర్తగా ఆమెకు శారీరక సుఖం అందివ్వాల్సిన అవసరం వుంది! ఆ బాధ్యత నీవు విస్మరించగలవా?"

"నీలను పువ్వులలో పెట్టి పూజిస్తాను! మా మేడ "రాజగృహం"లో హంసతూలికా తల్పంపై కూర్చుండబెట్టి ఆమెకు ఏలోటురాకుండా చూచుకుంటాను!"

"నీ ఐశ్వర్యంతో సమకూడని సుఖం మరోటున్నది. నువ్వెంత అందగాడివైనా, యవ్వనంతో నువ్వెంత మిసమిసలాడినా నీలకు కావలసిన సుఖం నీవు ఇవ్వలేవు!"

"లేదు! లేదు! నేను!... నేను...."

"నవ యవ్వనవతి, రూపవతి, సత్శీల అయిన యువతికి ఇవ్వవలసిన ఆనందంఇచ్చే శక్తి నీకున్నదా!"



"......"

"నిజం చెప్పు! నీలో ఆ శక్తి లేదు!"

"అవును! కానీ నాలో ఏవిధమైన లోపంలేదు! అందరు యువకులలో వచ్చే యవ్వన సహజమైన మార్పులూ నాలోవచ్చాయి!"

"కాని ఒక యువతికి లైంగికానందం ఇవ్వగల శక్తి నీలోలేదు! నువ్వు వాసన లేని, తుమ్మెదలు వాలని కాగితం పువ్వుతో సమానం! కాగితం పువ్వు చూడటానికి బాగుంటుంది! అంతే!"

"లేదు! లేదు! ఎన్నికష్టాలుపడి అయినా ఆ శక్తిని పొందుతాను!"

"ఆ! అలా దారికి రా! నీలో వుండాల్సిన, నీలో లేని శక్తిని పొందేంతవరకు నీల గురించి పిచ్చి భ్రమలు పెంచుకోకు" మనసులో మెదిలే ఆలోచనలో కొలిక్కి వచ్చాక కర్తవ్యం ఏమిటో బోధపడింది శ్యాంకు.

సెక్స్ స్పెషలిస్ట్ మకరధ్వజ్ దగ్గరకు వెళ్లాడు. పెద్ద హాలు — గోడల నిండా భారతీయ, హాలీవుడ్ సినీ తారల ఫోటోలు తగిలించి వున్నాయి!

మకరధ్వజ్ వెనకాల మేరిలిన్ మన్రో నిలువెత్తు నగ్న చిత్రం వుంది. పెద్ద బల్ల వెనుక రివాల్వింగ్ సోఫాలో కూర్చున్నాడు మకరధ్వజ్! చేతి వేళ్లనిండుకూ రవ్వల వుంగరాలు తళుక్‌మంటున్నాయి.

శ్యాం దగ్గరినుంచి వాకిట్లో వున్న యువకుడు యాభై రూపాయలు తీసుకుని లోపలకు పంపాడు!

"రా భాయ్! రా! కూర్చో!"

బిడియ పడ్తూ వెళ్లి బల్ల ముందున్న సోఫాలో కూర్చున్నాడు శ్యాం!

"అందమైన ఆడపిల్లను చూచి నీ మనసులో కోరిక కలగడం లేదుకదూ?!"

అవునన్నట్లు తలూపాడు శ్యాం!

"ఆ! చూశావా! జబ్బేమిటో ఇట్లే కనుక్కున్నాను! ఎన్నాళ్ల నుండి నీకీలోపం?"

శ్యాంకు ఏమని జవాబు చెప్పాలో తోచలేదు! మిన్నకుండిపోయాడు.

"ఒకరోజా... పోనీ ఒక గంటా ఎంతసేపట్నుంచి నీకీలోపం!" తన మాటలకు తనే పగలబడి నవ్వాడు మకరధ్వజ్.

"నేను, నేను... అసలు ఇంతవరకు నా కలాంటి ఆలోచనలే రాలేదు!"

"అరే! స్ట్రేంజ్ కేస్! ఇంతవరకు నీకు ఆ దృష్టే లేదన్నమాట! నీ వయస్సు?"

"ఇరవై సంవత్సరాలు!".

"నీ వయసుకు నేను ఇరవై మంది అందమైన ఆడపిల్లలను అనుభవించాను!" మీసం కొనలు మెలివేస్తూ అన్నాడు మకరధ్వజ్.

"పోనీ మేస్టర్ బేషన్ చేసుకునే అలవాటుందా?"

"ఆ! అంటే?!"

"అరే! నువ్వో ముదురు కేసులా వున్నావు! రాత్రి నిద్రపోయేప్పుడు ఇంద్రియ స్ఖలనం జరుగుతూంటుందా?"

శ్యాంకు ఏమని సమాధానం చెప్పాలో తోచలేదు.

"రాత్రి నిద్రపోయేప్పుడు నీకు తెలియకుండా అండర్‌వేర్ మీద మరకలు పడతాయా?"

"ఆ! అప్పుడప్పుడూ అలా జరుగుతుంటుంది!"

"సరి! మరింకేం! ఇలా లోపలకు రా!" అంటూ లోపల గదిలోకి దారితీశాడు మకరధ్వజ్!

గది గోడల నిండా నగ్న సుందరీమణుల ఫోటోలున్నాయి. ఒక బల్లమీద బాటరీ, వైర్లు, రబ్బరు గొట్టం, పెద్ద సిరంజి ట్యూబు రంగు రంగుల సీసాలున్నాయి.

"పాంటు, షర్టు అండర్‌వేర్‌తో సహా తీసి బల్లమీద పడుకో!"

అలాగే చేశాడు.

"అరే! కేసలం తొందరగానే వుంది! చాలా ముదురుకేసు! గట్టి వైద్యం చేయాలి! డబ్బు ఖర్చవుతుంది! సిద్ధమేనా?" ట్యూబు బల్లమీదుంచుతూ అన్నాడు మకరధ్వజ్.

తలూపాడు శ్యాం!

రబ్బరుట్యూబ్ కొస శ్యాం పురుషాంగానికి తగిలించి రెండోకొస వాక్యూమ్ పంపుకు బిగించి పంపు పిస్టన్ ముందుకూ వెనక్కూ లాగసాగాడు మకరధ్వజ్.

"ట్రీట్‌మెంట్‌కు మంచి రెస్పాన్స్ వస్తుంది భాయ్. నాలుగంగుళాలు, నాలుగున్నర, అయిదు, ఆరు, ఆరున్నర! అబ్బా నా చేయి నొప్పెడుతుంది!" అంటూ పంపు బల్ల మీదుంచాడు.

వేలు విదిలించుకుంటూ "చూశావా! ట్రీట్‌మెంట్ ఇన్‌స్టెంట్ సక్సెస్! ఇక నీకేం తిరుగులేదు పో!"

మకరధ్వజ్ మాటలువిని పొంగిపోయాడు శ్యాం! దుస్తులువేసుకుని బయటకు వెళ్ళబోయాడు.

"మాట! వాకిట్లో నిలబడ్డ గోవింద్‌కు వంద రూపాయలు ఫీజు ఇచ్చి వెళ్ళు!"

మరుసటి రోజు సాయంత్రం మరలా దిగులుగా వచ్చి శ్యాం వంక చూస్తూ "క్యా



భాయ్! రాత్రంతా హాయిగా, తీయగా ఆనందంగా కోరుకున్న అమ్మాయితో గడిపావు గదూ!" అన్నాడు మకరధ్వజ్.

తల అడ్డంగా తిప్పిన శ్యాం వంక ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటి భాయ్! మకరధ్వజ్ ట్రీట్‌మెంట్ ఫెయిలవడమంటూ వుండదు! ఇలారా!" అంటూ లోపల గదిలోకి తీసుకుని వెళ్లాడు.

వేలి సత్తువకొద్దీ వాక్యూమ్ పంప్ పిస్టన్ లాగుతూ 'ఆరున్నర అంగుళాలు' అంటూ చేతులు నొప్పి పుట్టే ట్రీట్‌మెంట్ ఆపి ఫీజు వంద రూపాయలు పుచ్చుకున్నాడు.

వారం రోజుల వాక్యూం పంప్ ట్రీట్‌మెంట్ వలన ఏమీ ప్రయోజనం వుండకపోయ్యే సరికి

"భాయ్! నీది మరీ ముదురు కేసు! కరెంట్ ట్రీట్‌మెంట్ ఇస్తాను!" అంటూ బాటరీ టెర్మినల్స్ నుండి పురుషాంగంలోకి కరెంటు పంపించాడు.

"ఆ కరెంటు ట్రీట్‌మెంట్‌కు తిరుగులేదు! ఇలా స్విచ్‌నొక్కానో లేదో అలా రిజల్టు కనబడుతుంది! ఇక నీ మనసులో దిగులు పోగొట్టుకొని హుషారుగా వుండు" అన్నాడు మకరధ్వజ్.

మకరధ్వజ్ ఎంత చెప్పినా, ఏమి చేసినా రూముకు వెళ్లిన తర్వాత యథాపూర్వస్థితి కొనసాగుతున్నదని తెలుసుకుని అతని ట్రీట్‌మెంట్ వలన ఫలితం లేదని గ్రహించాడు శ్యాం!

ఆఖరుసారిగా మకరధ్వజ్‌ను కలుసుకోవడానికి వెళ్లినప్పుడు "ఏంభాయ్! ఫలితం కనబడిందా?" అని నవ్వుతూ అడిగాడతను.

తల అడ్డంగా తిప్పాడు శ్యాం.

"కామోద్దీపన లేహ్యం అని ఈ రోజే కాశ్మీర్ నుండి వచ్చింది! ఈ లేహ్యం పట్టించావంటే నరాలలో బలం, శక్తి వస్తుంది. ఒక్కసారి వాడి చూస్తే మరి వదలి పెట్టవు! లేహ్యం వంటికి తగిలితే చాలు వెంటనే ఫలితం చూపుతుంది!" అంటూ భరణి చేతికిచ్చి "అసలు ఖరీదు మూడు వందలు! నువ్వు చాలా రోజులనుండి వస్తున్నావు గనుక రెండొందలివ్వు! నేను డబ్బు మనిషిని గాను! స్నేహానికి ప్రాణమిస్తాను! అందుకే నా పేరు ఆంధ్ర దేశమంతా మారుమోగుతున్నది!" అన్నాడు.

లేహ్యం రాసిన పది సెకనులలో ఒక విధమైన దురద, మంట, సూదులతో తాకినట్లు అనిపించింది శ్యాంకు.

వాక్యూం పంపు ట్రీట్‌మెంట్, కరెంట్ ట్రీట్‌మెంట్‌లాగానే కొన్ని సెకనులు ప్రభావం చూపించింది లేహ్యం!

"అమ్మయ్య! ఇప్పటికి మామూలు మనిషినయ్యాను!" అని శ్యాం సంతృప్తాంతరంగుడయ్యేలోపల గాలి తీసిన బెలూన్‌లామారిపోయి అంతులేని నిర్వేదానికి లోనయ్యాడు శ్యాం.

పంపు, కరెంట్, లేహ్యం తాత్కాలికంగా బహుకొద్ది సమయం మాత్రం తనలో ఏదో మార్పును తెస్తున్నాయనీ కాని ఆ మార్పు నిలబడడంలేదని తెలుసుకుని కృంగిపోయాడు శ్యాం! కాలేజీకి వెళ్లినపుడు నీల దూరంగా కనబడగానే పక్కకు తప్పుకున్నాడు ఎప్పటి మాదిరిగానే! ఆ తర్వాత పది పదిహేను రోజులు సరిగా భోంచేయ లేకపోయాడు. శ్యాం! కన్ను మూస్తే నిద్ర పట్టేది కాదు! కన్ను తెరిస్తే నీల రూపం కనబడి మనసులోకి ఆత్మన్యూనతా భావాన్ని ఇనుమడింపజేసేది!

కాఫీ హోటల్‌లో కాఫీ తాగుతూ బల్ల మీదున్న పేపర్ వంక యధాలాపంగా చూశాడు శ్యాం.

"రతి రాజు రాక! ఆత్మన్యూనతా భావంతో కృంగిపోయే నవ యువకులకు సంపూర్ణ యవ్వన ఫలం అనుభవించటానికి అవకాశం కల్పించే పూర్తి కోర్సు ట్రీట్‌మెంట్! కనీ వినీ ఎరుగని సదవకాశం! అధునాతన పద్ధతులలో ఊహాతీతమగు ట్రీట్‌మెంట్!

ఆంధ్ర దేశం అదృష్టం కొద్దీ లభించిన సువర్ణావకాశం భిషగ్విరాట్ రతిరాజు రాక!" కింద రతిరాజు ఏ లాడ్జిలో ఎంతకాలం వుండేదీ రాసివుంది.

కొంచెంసేపు తటపటాయించాడు శ్యాం! "ఏ పుట్టలో ఏ పాముందో? పోయివస్తే వచ్చే నష్టమేముంది! అయినా ఇంకా నాకు జరుగబోయే అనర్థం ఏముంటుంది?" అనుకున్నాడు.

పేపర్ ఎనౌన్స్‌మెంట్ ప్రకారం మొదటి తేదీన నందనవన లాడ్జికి వెళ్లాడు శ్యాం.

లాడ్జి లాబీలోనూ బయటా గుంపులుగా నిలబడి ఆవేశంగా చర్చించుకుంటున్నారు యువకులు.

"గురూ! డబ్బు పోతేపోయింది! ఏమి స్లైడ్స్, ఏమి సినిమాలు, ఏమి బొమ్మలు, ఏమి ఫోటోలు!"

"చూస్తే ఏమొస్తుందిరా చవటాయ్! మరి కాస్త తిక్కరేగుతుందీ అంతే!"

"అంతేనా! వెయ్యి రూపాయలు అవతలపారేస్తే ట్రెయినింగ్ పేరు చెప్పి రాత్రంతా కోరుకున్న అనుభవాన్ని సొంతం అయేట్లు చేస్తాడు!"

"అదెలా సాధ్యం భాయ్!"



"గట్టిగా మాట్లాడకు ఎవరైనా వింటారు!"

"ఏం వింటే!"

"ఎక్కువ పబ్లిసిటీ జరిగి బయటకు పొక్కితే పోలీసులతో ఇబ్బంది! మళ్లీ మకాం మార్చాల్సి వుంటుంది!"

"ట్రైనింగ్ తీసుకోవాలంటే?"

"నాకేం తెలియదు! నాకేం రాదు అను! వెయ్యి రూపాయలు తీసి బల్లమీదుంచు! తర్వాత చూస్కో! జీవితమంతా గుర్తుంచుకోవాల్సిన అనుభవం పొందుతావు."

"గురూ నీకిదంతా ఎలా తెలుసు? నువ్వుగాని?"

"చవటాయ్! నోట్లో వేలు బెడితే కొరకలేని వాడివి గనుక వచ్చువుచ్చు అనుమానాలొస్తాయి నీకు!"

"వూరికే అన్నా గురూ! కోపం తెచ్చుకోకు!"

"మాట లెందుకురా? అడుగు దూరంలో మజావుంటే" "పద!" "పద!" అంటూ అయిదారుగురు యువకులు మెట్లమీదుగా పైకి వెళ్తుంటే వాళ్ల వెంట తనూ వెళ్లాడు శ్యాం! చేతుల్లేని గౌను తొడుక్కున్న అమ్మాయి "ఎస్! వాట్ డుయు వాంట్!" అని అడిగింది.

"ఉయ్ వాంట్ టు సీ రతి రాజు!" అన్నాడు వదరుబోతు యువకుడు.

"ఎపాయింట్‌మెంట్ వుందా?"

"ఊహూ!"

"పూర్తి కోర్సు ట్రీట్‌మెంట్ అయిదు వందలు!"

యువకులలో ఒకతను అయిదువందలు కట్టాడు అతనికో కార్డు టైపుచేసి ఇచ్చింది.

శ్యాం అయిదువందలు కట్టాక అతనికీ ఒక కార్డు ఇచ్చింది.

"బాస్‌కు యివ్వాళ తీరికుండదు! రేపు సాయంత్రం ఆరు గంటల తర్వాత రండి! వీలుంటే మిమ్మల్ని చూస్తారు!" అంది. డబ్బుకట్టని యువకుల ముఖాలలో ఏదో మిస్ అవుతున్నామనే నిరుత్సాహం ద్యోతకమైంది.

అప్పటి వరకు చిరునవ్వు చిలుకరిస్తున్న గౌను యువతి ముఖం సీరియస్‌గా మారింది – "ఇక మీకిక్కడేం పని? వెళ్లిరండి!" అన్నట్లు. అయినా ఆమెనే చూస్తూ వుండిపోయేవాళ్లేమోగాని మరో అయిదారుగురు యువకులు లోపలకు వచ్చి వున్నవాళ్లను పక్కకు నెట్టుకుంటూ ముందుకు వెళ్లారు.

"ఎస్. వాట్ డు యు వాంట్!" చిరునవ్వు నవ్వుతూ అడిగింది కొత్తగా వచ్చిన వారిని!

"గురూ! ఇక కిందకు దిగాల్సిందే! మన వంక కన్నెత్తిచూడదా అమ్మాయి!" అన్నాడు వదరుబోతు యువకుడు. శ్యాంతో సహా అందరూ కిందకు దిగి వచ్చేశారు!

మరుసటి రోజు సాయంత్రం ఆరింటికి తిరిగి వచ్చాడు శ్యాం. హోటల్ చుట్టూ నిన్నటికంటే ఎక్కువ మంది వున్నారు!

శ్యాంను రతిరాజు గదిలోకి తీసుకొని వెళ్లింది సెక్రటరీ!

పొట్టి కురచ మనిషి! నెత్తిమీద మూడు నాలుగంగుళాల ఎత్తున నల్లగా రింగులు తిరిగిన జుట్టు. విగ్గు కాదు కదా అని అనుమానం వచ్చింది శ్యాంకు. తెల్లగా పాము కుబుసంలా మెరుస్తున్న లాల్చీ తెల్లటి పట్టు లుంగీ ధరించాడు.

"కూర్చోండి!" అరవ యాసతో మాట్లాడాడు రతిరాజు.

"యామిటి ప్రాబ్లం? స్టార్టింగ్ ట్రబులా?"

అడ్డంగా తలూపాడు శ్యాం.

"మరియామి? స్టేయింగ్ పవర్ తగ్గిందా?"

మళ్లీ అడ్డంగా తలూపాడు శ్యాం. ఆశ్చర్యంగా శ్యాంవంక చూస్తూ "మిస్టర్ శ్యాం! నీకు ఇరవై ఏళ్ల వయసుంటే ఇంకా అనుభవం లేదా?"

అవునన్నట్లు తలూపాడు శ్యాం.

"అడడే! రొంబ గడ్డు కేసు! మరకతం! ఓ మరకతం" రతిరాజు అరుపులు విని వచ్చింది సెక్రటరీ మరకతం.

"ఈయనకు పూర్తి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి! ముందు సినిమా స్లైడ్లు, తర్వాత మాస్క్వెస్‌రూమ్, తర్వాత ట్రైనింగ్ రూము!"

"అలాగే సర్!" అంటూ శ్యాంను బయటకు రమ్మని సైగచేసింది మరకతం.

రూంబయట "ట్రీట్‌మెంట్ రెండువేలవుతుంది" అన్నది. మాట్లాడకుండా జేబులోంచి డబ్బు తీసి ఇచ్చాడు శ్యాం.

"రండి!" ముందుకు నడిచింది మరకతం. అడగగానే డబ్బివ్వడంతో అతనంటే గౌరవం పెరిగిందామె మనసులో!

హాలు దగ్గర ఆగి నెమ్మదిగా తలుపు తట్టింది. తలుపు వోరగా తెరుచుకుంది. "లోపలకు వెళ్లండి" నెమ్మదిగా అంది మరకతం!

లోపల హాలులో పది పన్నెండు కుర్చీల్లో వివిధ వయస్కులైన పురుషులు కూర్చున్నట్లు లీలగా కనబడింది మసక చీకట్లో శ్యాంకు.

"రండి! కూర్చోండి!" బికినీ డ్రెస్ ధరించిన యువతి శ్యాం చేయిపట్టుకుని



తీసుకుని వెళ్లి కాళీ కుర్చీలో కూర్చోబెట్టింది!

"చిల్డ్ బీర్ తీసుకుంటారా?"

"వద్దు!" నెమ్మదిగా అన్నాడు శ్యాం. అర నిముషంలో గోల్డ్‌స్పాట్ సీసా పుచ్చుకుని వచ్చింది. గోల్డ్‌స్పాట్ సిప్ చేస్తూ విడియో స్క్రీన్ కేసి చూడసాగాడు శ్యాం!

యవ్వనమదంతో మిసమిసలాడుతున్న యువతీ యువకులు రతిక్రీడకు సన్నద్ధులవుతూ ఒకరినొకరు కవ్వించుకుంటున్న వీడియో కేసెట్‌చూస్తూ ఉత్సాహం పట్టలేక మూలుగుతూ, అరుస్తూ వున్నారు గది లోని పురుషులు.

స్క్రీన్ మీద యువతీ యువకులు గాఢాలింగనం చేస్తూ తనివిదీర ముద్దుల వర్షం కురిపిస్తున్నారు!

వీడియో చూస్తున్న పురుషుల కళ్ళు బికినీ యువతి మీదకు అప్రయత్నంగా వెళ్లాయి. నిశ్చలంగా నిలబడివుందామె! ఆమెను కౌగిలిలోకి తీసుకుంటున్నట్లు సుధాపానాన్ని మించిన ఆమె అధరాపానాన్ని గ్రోలుతున్నట్లు ఊహాలోకాలలో విహరించసాగారు! ఠంగున గంట కొట్టినట్లు వినబడింది. త్రుళ్లిపడి స్క్రీన్ వంక చూశారు. యువకుడు ధరించిన దుస్తులు ఒక్కొటే వొలచివేసింది యువతి! నగ్నంగా నిలబడ్డ యువకునిలో కోరికలు పెరిగి దహించివేయుటం గమనించారు. అతని చూపులనిండా కాంక్ష నిండివుంది! నెమ్మదిగా! బహునెమ్మదిగా యువతి వలువలు తీసివేయసాగాడు యువకుడు. హాలులో అలజడి ఎక్కువైంది.

"స్లోకోచ్!" "బిక్విక్!" "త్వరగా!" "నేనైతేనా!" "ఇంతసేపా" కామెంట్లు జోరుగావినబడ్డాయి. యువతీ యువకులిద్దరూ నగ్నంగా కనబడ్డారు స్క్రీన్ మీద. హాలులోని పురుషులందరూ ఎలర్టుగా మారిపోయారు! కరెంటుపోయి హాలుచీకటయింది! కరెంటు పోయిన మరుక్షణంలో ఎవరో తనముందు నిల్చున్నట్లనిపించింది శ్యాంకు!

ఎవరిదో ఉచ్ఛ్వాస నిశ్వాసాల తాకిడి ముఖానికి తగులసాగింది! రోజ్ లావెండర్ పరిమళం గుప్పుమంది!" బికినీ యువతి దగ్గరకొచ్చింది!" అనుకున్నాడు శ్యాం! తన తలను ఎవరో రెండు చేతులతో పైకి ఎత్తినట్లు అనిపించింది! తడిగా మెత్తగా వున్న రెండు పెదవులు తన పెదవులను మృదువుగా స్పృశించినట్లు అనిపించింది! ఆశ్చర్యంతో శ్యాం పెదవులు కొద్దిగా విచ్చుకున్నాయి. పిప్పర్‌మెంట్ (చూయింగ్‌గమ్) వాసన కొడుతున్న బికినీ యువతి నాలుక శ్యాం పెదవుల మధ్య నుండి లోపలకు వెళ్లి అతని పండ్ల వరుస, నాలుక, అంగుళిని సుతారంగా స్పృశిస్తూ అదే సమయంలో చేతి వేలి కొనలతో అతని జుట్టుకుదుళ్లను కదిలించి వేయసాగింది.

శ్యాం మనసులో విపరీతమైన జుగుప్స బయలుదేరింది! "ఈ అమ్మాయి ఇలా ఎంతమందిని ముద్దెట్టుకుందో?" అన్న ప్రశ్న అతని మనసులో పురుగులా తొలచసాగింది. ఏమాత్రం రెస్పాన్స్ ఇవ్వని శ్యాం పెదవులు నాలుకను మరీ మరీ ముద్దిడుతూ అతనికి మరింత దగ్గరగా జరగ సాగిందా యువతి! నేల మీద మోకాళ్లకుపై కూలబడిందో ఏమో అమె తల శ్యాం తల లెవెల్‌లోకి వచ్చింది! శ్యాం ఛాతీ ఆ అమ్మాయి ఛాతీల మధ్య ఏ మాత్రం చోటులేకుండా అతన్ని హత్తుకుపోయింది.

ఊపిరి ఆడనట్లనిపించింది శ్యాంకు! బికినీ యువతి చేతులు శ్యాం శరీర భాగాలను సున్నితంగా స్పృశించసాగాయి!

విపరీతమైన వికారభావం మనసులో పెల్లుబికి ఆమెను రెండు చేతులతో బలంగా అవతలకు నెట్టివేశాడు శ్యాం.

"అరే ఏమిటిది?" అంటూ మరల దగ్గరవబోయిందామె! ఈసారిమరింత బలంగా యువతిని నెట్టివేశాడు శ్యాం!

మరుక్షణం లైట్లు వెలిగాయి! బికినీ యువతి బ్రా, బికినీ సవరించుకుంటూ గది మూల కనబడింది. మరుక్షణం బికినీ యువతి గోడనున్న స్విచ్ నొక్కింది. లైట్లారిపోయి వీడియో ఆన్‌అయింది.

స్క్రీన్‌మీద జంట కనబడ్డారు! హాలులోని పురుషులలో ఉద్రేకం ఎక్కువయి, సన్నగా ఈలలు, అరుపు లు మొదలయ్యాయి.

"ఓరి శుంఠాయ్! తుమ్మ మొద్దులా నిలబడతావేం"

"యాక్షన్! యాక్షన్!"

"గుడ్డిగుర్రంలా నిలబడ్డాడు!"

"ఆడపిల్ల కవ్విస్తుంటే కదలిక లేదు చూడు!"

"అడవి మనిషి!"

"అసలు విషయం తెలీదేమో!"

ఒక్కసారిగా కామెంట్లాగిపోయ్యాయి. తెరమీద జంట మైథున కార్యక్రమం మొదలెట్టారు!

రకరకాల మైథున భంగిమల ఎగ్జిబిషన్ కొనసాగింది వీడియో తెరపై. ఆ తర్వాత. గంటన్నర తర్వాత సినిమా అయిపోయింది. హాలులో లైట్లు వెలిగాయి.

హాలులో కూర్చున్న వాళ్లలో అయిదారుగురు వృద్దులు — నలుగురు మధ్య వయసువాళ్ళు, తను వొక్కడే యువకుడు అనుకున్నాడు శ్యాం!

హాలులోని మిగిలిన పురుషుల కళ్ళు బికినీ యువతి శరీరాన్ని చూపులతో



తినివేస్తున్నాయి. వాళ్ల చూపులకే శక్తివుంటే ఆ యువతి వంటి మీదున్న కొద్దిపాటి ఆచ్ఛాదన ఎప్పుడో భస్మమైవుండేది!

ఎవరికివారు తమను తాము విడియో సినిమాలో నటించిన హీరోగాను బికినీ యువతి హీరోయిన్‌గాను వూహించుకుని వూహాల ఆనందలోకాల్లో వూయల లూగసాగారు!

ముందుగా హాలుబయటకు నడిచాడు శ్యాం!

"కమాన్ మిష్టర్ శ్యాం! లెటస్ గోటు ద స్లైడ్ రూం" అంటూ ముందుకు దారితీసింది మరకతం!

చిన్న గదిలో చిమ్మ చీకటిగావుంది. శ్యాం చేయి పుచ్చుకుని నడిపించుకుని వెళ్లింది మరకతం! శ్యాం కుర్చీలో కూర్చోగానే స్క్రీన్ మీద స్లైడ్స్ కనపడేట్లు స్విచాన్ చేసింది.

స్లైడ్ షో ఏడీవ్‌ — ఈవ్ స్లైడ్‌తో మొదలయింది మరకతం వ్యాఖ్యానం. స్లైడ్‌లో కనబడే విషయాలను ఎంతో రసవత్తరంగా, శృతిపేయంగా వర్ణించసాగింది.

రతి — మన్మధుల శృంగారం అనేక స్లైడ్స్ — భువన మోహిని రతి — నిరాసక్తంగా ఉన్నప్పుడు పూబాణాలు వింట సంధించి వదులుతున్నాడు మన్మధుడు. ఒకేసారి ఐదు బాణాలువచ్చి రతి శరీరంలో వివిధ భాగాలను తాకి ఆమెలోని స్తబ్దతను పోగొడుతున్నాయి,! క్రమంగా రతీదేవి కనులలో వెలుగు కనబడింది. మన్మధుని క్రీగంట చూచింది రతి! రెట్టించిన వుత్సాహంతో పూల బాణాలు వదుల్తూ దగ్గరకు రాసాగాడు మన్మధుడు — అరవిదం, అశోకం, చ్యూతం, నవమల్లికం, నీలోత్పలం అయిదు పుష్పబాణాలు! తమాలతల లాటి చేతులు చాచి మన్మధుని కౌగలించుకోటానికి సమాయత్తమైంది రతి! ఆ తర్వాత రతీ మన్మధులు అనంగ రసానందం అనుభవిస్తున్న వివిధ భంగిమలు.

స్లైడ్స్ మారాయి. ఖజురహో దేవాలయ శిల్పాలు పురుషునిలో జడత్వాన్ని వదిలించి మనసును వుల్లాసపరచి మన్మధ క్రీడకు పురికొల్పే సజీవ మూర్తులు — తర్వాత వివిధ దేవాలయాలలోని నగ్న శిల్పాలు!

వాత్సాయన సూత్రాల కనుగుణంగా వివిధ భంగిమలలో యువతీ యువకుల ఫోటోల స్లైడ్స్ ఆ తర్వాత ఒకదాని వెనుక ఒకటి చూపుతూ సవివరంగా వ్యాఖ్యానం చేయసాగింది మరకతం.

స్లైడ్స్ అయిపోయాయి. లైటు వేసింది మరకతం శ్యాంలో ఏవిధమైన రెస్పాన్స్ వచ్చిందో చూద్దామని అతనివేపు తిరిగింది.

కనులు మూసుకుని నిద్రపోతున్నాడు శ్యాం! ఉస్సురని నిట్టూరుస్తూ "శ్యాం?"

అని పిలిచింది.

ఉలికిపడి లేచాడు శ్యాం!

"నిద్రపోయినట్లున్నారు! స్లైడ్స్ మళ్లా వేసి చూపనా?"

"వద్దు! ఆ స్లైడ్స్ చూడలేక కళ్ళు మూసుకున్నాను. చూస్తే వికారం వచ్చినట్లు అనిపించింది!"

"మరి ఇందాక వీడియో సినిమా చూపినప్పుడు అలా అనిపించలేదా?"

"అపుడు కూడా కళ్ళు మూసుకునే వున్నాను!"

"సరి! సరి! పద మేనిక్విన్ రూంకు వెళదాం" ముందు దారితీసింది మరకతం.

పెద్ద హాలు నిండా ప్లాస్టిక్ బొమ్మలు! దూరంనుండి చూస్తే హాలు వాకిలి దగ్గర నిలబడి చూస్తే సజీవ మూర్తులనే భ్రాంతి కల్గించే బొమ్మలు.

సంపూర్ణ యవ్వనమదంతో మిసమిసలాడే యువతీ యువకుల బొమ్మలు!

కళ్యాణ మల్లుని కామశాస్త్ర బోధినిలో సూచించిన వివిధ మైథున క్రియలను చూపుతున్నవా బొమ్మలు! హాలు చివర డబుల్‌కాట్ మీద నగ్న యువతి బొమ్మ వున్నది! కాట్‌కు ఒకమూల అంటించిన చీటీ మీద "ఫర్ యువర్ ప్లెషర్ ఓన్లీ!" అని రాసివుంది! ప్లెషర్ అని రాసివున్నచోట పెన్సిల్‌తో కొట్టివేసి కింద ప్రాక్టీస్ అని రాసారెవరో!

మరకతం హాల్లోని లైట్లు, ఫాన్‌లువేసి తిరిగిచూసింది!

హాలులో శ్యాం లేడు! చప్పున బయటకు నడిచింది మరకతం! బయట వరండాలో నిలబడివున్నాడు శ్యాం. అతని ముఖం తెల్లగా పాలిపోయివున్నది!

"ఈ హాలునుండి మెడబట్టుకు గెంటినా ఎవరూ బయటకు వెళ్లరే! నువ్వేమిటి ఇలా వచ్చేశావు?" చిరునవ్వు చిలకరిస్తూ అంది మరకతం.

"ఏంలేదు! తలనొప్పిగా వుంటే బయటకు వచ్చాను"

"అలాగే! పదేరండి!" ముందుకు నడిచింది మరకతం! రాయంచ గమనాన్ని ధిక్కరిస్తూ మరకతం ఆమె వెనుక నిరాసక్తంగా శ్యాం గదిలో అడుగుపెట్టాడు.

గదికి సరిగా మధ్యలో డబుల్ కాట్, డన్‌లప్‌బెడ్ పరచినది వుంది. మంచం వున్నంత లెక్కనా గోడలకు అద్దాలు బిగించి వున్నాయి.

విశ్వామిత్రుడి తపోభంగంచేస్తున్న మేనక చిత్రపటం బహు సహజంగా చిత్రీకరించబడినది, మంచం తలవైపు ఫ్రేములో బిగించబడివున్నది.

శ్యాం మంచం దగ్గరకు నడిచి మేనక చిత్రంవంక తదేకంగా చూడసాగాడు.

మేనకలో నీల పోలికలున్నట్లు భ్రమకలిగి క్షణం విచలితుడై స్థాణువులా



నిలబడిపోయాడతను!

ఈసారి ఛాన్స్ తీసుకోదలచుకోలేదు మరకతం! రూమ్ తలుపు లోపల గడియవేసి తాళం వేసింది! తాళం చెవి టేబిల్ సొరుగులో వేసింది!

"అమ్మయ్య! ట్రీట్‌మెంట్ మొదలెట్టే లోపలే యితను పారిపోవటానికి వీలులేకుండా చేశాను!" అనుకుంటూ వోరకంట శ్యాంను చూసింది.

శ్యాం మేనక పెయింటింగ్ వంక తదేకంగా చూస్తుండడం గమనించి "పరవాలేదు! దుర్రాడు దారిలో కొస్తున్నాడు అనుకుంటూ స్విచ్ నొక్కింది.

మంచం నెమ్మదిగా బహు నెమ్మదిగా తిరుగసాగింది! మంచం అడుగున యిరుసు సాకెట్ వున్నది. స్విచ్ నొక్కగానే మంచం నెమ్మదిగా తిరిగే ఏర్పాటు వున్నది!

ఒంటి మీద వలువలు వొక్కొకటి తీసివేయసాగింది మరకతం, స్ట్రిప్ టీజ్ డాన్సరులా బహు నెమ్మదిగా బహు వాకవక్యంగా జాకెట్, బ్రా తీసి అవతల పడవేసింది! ఈవెనింగ్ ఇన్ పారిస్ సెంట్ ముఖంమీద, మెడమీద, వక్షస్థలం మీద స్ప్రే చేసుకుంటూ అద్దంలో తన అందాన్ని చూసుకుని తానే మురిసిపోసాగిందామె.

"నెమ్మదిగా బయట పడుతున్న నా అందాలనుచూసి శ్యాంకు వెర్రెత్తి పోతుంటుంది! పాపం! నవ యవ్వనంతో మిసమిస లాడుతున్న ఇతను ఇంతవరకూ ఆ అనుభవం ఎరుగడట! ఫూల్ ఫెలో! అతని మనసులోని బెదురు పోగొడితేచాలు కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అన్నట్లు తనివితీరా తృప్తిగా అనంగ రసానందంలో మునిగి తేలుతాడు! ఆ తర్వాత జీవితాంతం అతనికీ రాత్రి గడిపిన మధుర ఘడియలు గుర్తుంటాయి!"

పావుగంట తర్వాత నగ్నంగా మంచంవైపు తిరిగింది మరకతం!

శ్యాం లేడక్కడ!

"శ్యాం! శ్యాం!" అంటూ గది నాలుగు మూలలూ చూసింది. కిటికీ తలుపు తెరచుకుని వుంది! ఊచలు లేని కిటికీ నుండి తొంగిచూసింది మరకతం!

కిటికీ పక్కన డ్రైనేజీ పైపు వుంది! "పైపు పట్టుకుని కిందకు జారిపోయివుంటాడు" అనుకుంటూ విపరీతమైన నిరుత్సాహం ముంచెత్తింది మరకతాన్ని.

"తలుపు తాళం వేశాను! పంటెంచి మందేదెక్కడికి పోతుంది? అనుకున్నాను! రూపవంతుడు, యవ్వనవంతుడు కొత్తబిచ్చగాడు అని మురిసిపోయాను!

పడినకష్టం యావత్తు వృథాయింది! అనుకుంటూ మంచం మీద వాలిపోయింది మరకతం!

మూడో అంతస్తునుండి డ్రైనేజి పైపు పట్టుకుని కిందకు జారి వెనుదిరిగి చూడకుండా రూమువైపుగా పరుగెత్తుకు వెళ్లాడు శ్యాం!

రతిరాజు కొంగ్రొత్త వైద్యవిధానం అతనిలో ఆసక్తిని కల్పించడం పోయి విపరీతమైన జుగుప్స కల్గించసాగింది. అందుకే ప్రాణాలకు తెగించి మూడో అంతస్తునుండి కిందకుజారి పారిపోయి వచ్చేశాడు.

గదిలో ఒంటరిగా కూర్చుని రొప్పుతూ ఆలోచించసాగాడు శ్యాం!

నీల కనుపించేంత వరకు ఒకే ఒక స్త్రీని ప్రేమించాడు శ్యాం. ఆమె అతని తల్లి అహల్య. చిన్న వయసులోనే తండ్రి పోతే మూడంతస్తుల మేడ రాజగృహంలో అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసింది! ప్రపంచంలో స్త్రీ అంటే అమ్మ అనుకునేవాడు శ్యాం!

వంట్లో యవ్వన సహజమైన మార్పులు వచ్చిన అతని మనసులో ఏ విధమైన మార్పూ రాలేదు!

కాని నీలను చూచిన దగ్గర్నుండి తన మనసులోను శరీరంలోనూ ఏదో లోపంఉన్నదనీ, ఆ లోపం సవరించుకుని నీలను తనదాన్ని చేసుకోవాలని ఒక ప్రగాఢమైన కోరిక అతని మనసులో పెరిగి పెంపొందసాగింది!

అందుకే మకరధ్వజ్ దగ్గరకు, రతిరాజు దగ్గరకు కొండంత ఆశతో వెళ్లాడు శ్యాం!

కాని అందరు యువకుల మీద, ఎంతో మంది వృద్ధుల మీద ప్రభావం చూపిన చిట్కాలు శ్యాం ఎడ ఫలించ లేదు! పైగా అన్నీ చూశాక అతనిలో ఆత్మన్యూనతా భావం పెరిగిపోయింది! లైంగికావేశమే ఎరుగని తను సాముగరిడీలు చేసినట్లు విడియో సినిమాలోను, స్లైడ్స్‌లోను, బొమ్మలలోను చూసినట్లు నీలకు లైంగికానందం ఇవ్వగలడా?

"ఈ జీవితంలో నాకు కావలసినవన్నీ వొనగూడివున్నాయి. ఐశ్వర్యం, అందం, ఆరోగ్యం, రూపం, యవ్వనం, తెలివి — కాని అందమైన ఆడపిల్లను సంతృప్తి పరచగల శక్తి నాలో లేదు! నా జీవితం నిరర్థకం, నీలను వివాహమాడలేని నేను ఈ ప్రపంచంలో వుండడం అనవసరం!" అనుకుంటూ విపరీతమైన నిరాశకు లోనయ్యాడు శ్యాం!

బజారుకు వెళ్లి సీసాడు స్లీపింగ్ పిల్స్ తెచ్చుకున్నాడు శ్యాం! సీసాలోని బిళ్లలు చేతిలోకి వంపుకొని మింగబోయే ముందు తల్లి అహల్య రూపం మనసులో మెదిలింది!

తల్లి, తండ్రి, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు అన్నీ తనేఅయి ఏలోటూ రాకుండా పెంచి పెద్దచేసిన అమ్మ — తన మీదే పంచ ప్రాణాలు కేంద్రీకరించి పెట్టుకుని బతుకుతున్న అమ్మ తన ఆత్మహత్య వార్త విని ఎంత తల్లడిల్లిపోతుందో? భయంకర



దుర్వార్త విని అమ్మ బతికి వుంటుందా?

వీల్లేదు! అమ్మ చనిపోవటానికి వీల్లేదు! ఆమె మనోక్షోభ పడరాదు!

"అమ్మా! నేను ఆత్మహత్య చేసుకోను! జీవించివుంటాను! నీకోసం జీవించి వుంటాను! ఈ జన్మకాదు! వేయిజన్మ లెత్తినా నీ రుణం తీర్చుకోలేను! అమ్మా! పసిపిల్లవాడిలా తల రెండు చేతులలో ఉంచుకుని రోదించాడు శ్యాం.

ఆ రోజు నుండి శ్యాం మనసులో నీల ఎడల ఒక విధమైన ఆకర్షణ — ఆ ఆకర్షణను మింగివేసే ఆత్మ న్యూనతా భావం — ద్వైధీ భావ సంఘర్షణతో తల్లడిల్లిపోతూ వున్నాడు.

నీల కనుమరుగైనంత సేపూ ఆమె గురించి ఏమేమో ఊహిస్తుంటాడు — పగటి కలలుకంటాడు! నీల ఎదురైతే విపరీతమైన ఆత్మ న్యూనతా భావం మనసును కృంగదీసి తలదించుకుంటాడు!

కాని పిక్నిక్‌లోను ఆ తర్వాత నీల ప్రమాదస్థితిలో ఉన్నప్పుడు ఆమెను వదలి వుండలేకపోతున్నాడు!

నేను నీలను వదలివుండలేను! కాని నేను నీలను వివాహం చేసుకోలేను! చేసుకుని ఆమె నిండు జీవితం నాశనం చేయలేను!" అనుకుంటూ కనులలో సుడులు తిరుగుతున్న నీటిని చేతితో తుడుచుకోసాగాడు శ్యాం.

"అరె శ్యాం! నీలకెలావుంది?" వాకిట్లో నిలబడి ప్రశ్నిస్తున్న మాలి మాటలకు వులిక్కిపడ్డాడు శ్యాం.

చివాలున లేచి నిల్చుని

"బ...బ... బాగానే వుంది!" అన్నాడు.

"ఏమిట్రా నీకు సడెన్‌గా వత్తివచ్చినట్లుంది!"

"లె...లె... లేదు!"

అప్పుడే స్పృహ వచ్చి కనులు తెరచి చూస్తున్న నీల అదే పనిగా శ్యాం వంక చూడసాగింది!

శ్యాం వత్తిమాటలు వింటూంటే ఆమె ముఖంలో చిరుహాసం విరిసింది. లోపలకు వచ్చిన సిస్టర్ "ఏమ్మా! కాఫీ తాగుతావా?" అంటే "ఊ" అంది నీల.

ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులోకి పోసి నీలను నెమ్మదిగా మంచం మీద కూర్చోబెట్టి కాఫీ తాగించింది సిస్టర్. నీల కాఫీ తాగాక రూంబయట నుల్చున్న శ్యాం, మాలితో "చూస్తూవుండండి! నేనిప్పుడే డాక్టర్ గారికి ఫోన్ చేసి వస్తాను! పేషెంట్‌కు స్పృహ రాగానే ఫోన్ చేయమన్నారు డాక్టర్ గారు!" అంటూ వెళ్లింది.

సిస్టర్ నీలను పేషెంట్ అని సంబోధించడం విన్న శ్యాం మనసు చివుక్కుమంది! వల్లబడిన శ్యాం ముఖంవంక చూస్తూ ఏమిటిరా శ్యాం! ఏమయింది? సెడెన్‌గా అలా అయిపోయావు?'' అని అడిగాడు మాలి.

శ్యాం సమాధానం చెప్పేలోపల ''శ్యాంగారూ! నీలకెలావుంది?'' అంటూ వచ్చింది ప్రియ.

తన పక్కన వున్న మాలిని చూసి ప్రియ కళ్లల్లో అనురాగ భావం తళుక్కుమనడం గమనించాడు శ్యాం!

''ఈమె మాలిని ప్రేమిస్తున్నది! సందేహం లేదు! వాడూ ఈమెను ప్రేమిస్తున్నాడు! కాని వాడి మనసు అనేక సంవత్సరాల నాడు జరిగిన భయంకర సంఘటన వలన తూట్లుపడిపోయి వున్నది!

నీలను ప్రేమిస్తూ నేను, ప్రియను ప్రేమిస్తూ మాలి వ్యథల పాలవుతున్నాము!! శక్తి వుడిగి మాలి, అసలుశక్తిలేని నేనూ కాగితం పూలలా నిరర్థకంగా జీవితాలు గడపాలి! అనుకుంటూ ప్రియకు సమాధానం చెప్పటానికి ఆలస్యం చేశాడు శ్యాం.

ఈ లోపల నీల హీనస్వరం ''ప్రియా!'' అని పిలవటంతో ''వస్తున్నా'' అంటూ చెంగున లోపలకు పరుగెత్తింది ప్రియ.

మరు నిముషంలో డాక్టర్ రవి గేటుదగ్గర కారుదిగి లోపలకు వస్తూ ''గుడ్ న్యూస్ ఫర్ యు శ్యాం! నీలకు స్పృహ వచ్చిందట!'' అంటూ లోపలకు వెళ్లి నీలను పరీక్షించి—

''అదృష్టవంతురాలివమ్మా! బాగా కోలుకున్నావు!'' అన్నాడు.

''థ్యాంక్యూసర్!'' అంది నీల.

''యుమస్ట్ థాంక్ మేడమ్ ప్రియ అండ్ లాస్ట్ బట్ నాట్‌ది లీస్ట్ దట్ యంగ్ మాన్ శ్యాం!'' అంటూ గది బయటకు వచ్చి శ్యాంతో.

''ఇక నీలకేం పరవాలేదు!'' అని అన్నాడు. డాక్టర్ రవికి థాంక్స్ చెప్పటానికి శ్యాంకు గొంతు పెగలి మాట కూడా రాలేదు.

నీల మంచం మీద నుండి తన వైపుగా అనురాగ పూరితమగు చూపులు ప్రసరించటమే అందుకు కారణం.

''సర్! పరీక్షలకు చదువుకోవాలి! వెళ్తాను!'' అంటూ పరుగులాటి నడకతో హాస్పిటల్ నుండి వెళ్లిపోయాడు శ్యాం.

''ఏమయ్యా మాలి! ఏమిటి నీ ఫ్రెండ్ శ్యాం అలా వెళ్లిపోయాడు'' అని అడిగాడు రవి

''ఏం లేదు సార్! శ్యాం పరీక్షలలో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాలని పట్టుదలగా



చదువుతున్నాడు! తప్పని పరిస్థితులలో మేడం మాట కాదనలేక రూంనుండి బయటకు కదిలాడు. నీల ఇంప్రూవ్ అయిందని మీ నోట విన్నాక వెళ్లిపోయాడు!''

ప్రియ బయటకు వచ్చింది!

''సార్! నాకు పని ఉంది!'' అంటూ తిరిగిచూడకుండా వెళ్లిపోయాడు మాలి!

''ఏమ్మా ప్రియా నీల ఏమంటున్నది!''

''సరైన సమయంలో వచ్చి నీలను కాపాడారు! 'ఆదుర్దా పడవద్దు' అని మేడమ్‌కు తెలియజేయమంది నీల!''

''అలాగా! రండి! నా రూంనుండి మేడమ్‌కు ఫోన్ చేయండి! అయినా మీ ఇంట్లో ఫోన్ లేదుగదా.''

''మా ఇంటి ఎదురుగా వున్న ప్లీడరు పరంధామయ్య గారింట్లో ఫోనువుంది!'' అంటూ డాక్టర్ రవి రూమ్‌నుండి షాలినికి ఫోన్ చేసింది ప్రియ.

ప్రమాదం తప్పినా నీలను మరి రెండు రోజులపాటు నర్సింగ్ రూములోనే ఉంచమన్నాడు రవి.

ఆ రెండు రోజులూ కాఫీ, టిఫెన్, భోజనం వేళకు నీల రూంకు వస్తుండేవి.

మొదటి రోజు ''ఎవరు తెచ్చారు?'' అని నీల అడిగితే వార్డు బాయ్ ''ఎర్రగా, పొడుగ్గా వుంటాడు, వుంగరాలజుట్టు, కోల ముఖం — అదుగో ఆయన ఇచ్చి వెళ్తున్నాడు. చాలా మంచాయన. నాకు ఇరవై రూపాయలిచ్చాడు!'' అని జవాబు చెప్పాడు.

అతని మాటలు విన్న షాలిని ఇంకెవరు — శ్యాం పనే అది! పోనీ అదీ మంచిదే! ఇంట్లో వంట మనిషి లేదు! శ్యాం గనుక మనకు కాఫీ భోజనం పంపకపోతే చాలా ఇబ్బంది పడేవాళ్లం!'' అంది.

''ఆయన మీకేమవుతారమ్మా! అమ్మాయిగారి కెలావుందీ? ఏమిటీ? అని అన్నీ వివరంగా అడిగి తెలుసుకుంటారు! ''లోనకొచ్చి చూసెల్లండి — అమ్మాయిగారు బాగున్నారు'' అంటే పనుంది! వస్తా!'' అని ఎల్లిపోతారు'' అన్నాడు వార్డుబాయ్.

శ్యాం హాస్పిటల్ ఆవరణలోపలకు రాకపోయినా తన యోగక్షేమాలు వివరంగా కనుక్కుంటున్నాడన్న విషయం నీలకు తృప్తి కలిగించింది.

డాక్టర్ రవి సిస్టర్ హడావిడి పడుతూ వెళ్తుంటే వాళ్లవెంట పరుగెడుతున్నాడు వార్డ్‌బాయ్! కుతూహలం ఆపుకోలేక వాళ్లవెంట వెళ్లింది షాలిని.

గదిలో ఉన్న యువతి తెగ మూలుగుతూ వున్నది. ముఖం పాలిపోయివుంది!

''అరే! ఈ అమ్మాయి సుందరి ఇంగ్లీషు ఎం.ఏ స్టూడెంట్ ఇక్కడ వున్నదేమిటి?''

అనుకుంటూ గది వాకిలి దగ్గరే నిలబడింది షాలిని. సుందరి తండ్రి గాబోలు గది వాకిలి ప్రక్కన నిలబడి కళ్ళు తుడుచుకుంటున్నాడు!

సుందరి కుడికాలి గిలక పైభాగంలో చిన్న ఇన్‌సెషన్ ఇచ్చి సిరను వెలికి తీసి అందులోకి కాన్యులా పోనిచ్చాడు డాక్టర్ రవి. కాన్యులాకు సెలైన్ డ్రిప్ తగిలించగానే ధారాపాతంగా సెలైన్ వదిలాడు!

సుందరి నాడి చూశాడు. చాలా బలహీనంగా వుంది! బి.పి చూడటానికి సిస్టర్ విశ్వప్రయత్నం చేసిందిగాని వీలుగాలేదు! బాటిల్‌లో డొపామిన్ వేయండి! మరో బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్‌కు ఏర్పాటుచేద్దాం!" అన్నాడు డాక్టర్ రవి.

సుందరి తండ్రిని పిలిచి చీటీరాసి బ్లడ్‌శాంపిల్ సీసా ఇచ్చి రక్తం సీసా తెమ్మని పంపాడు.

లోపలకి వచ్చిన షాలినితో "మేడం! ఈ అమ్మాయి మీ కాలేజీ స్టూడెంటే! దురదష్టవంతురాలు!" అన్నాడు.

"ఏమయిందామెకు?"

"జరగకూడనిదే జరిగింది! కోరికలను అదుపు చేసుకోలేక తొందరపడింది! నాలుగో నెలలోనాటుమంత్రసాని వద్దకు అబార్షన్ చేయించుకోవాలని వెళ్లింది! పరిస్థితి విషమించి అపాయకర పరిస్థితిలో ఆమెను తీసుకుని వచ్చి ఆసుపత్రిలో జేర్పించారు! మొన్నటినుండి చేయవలసిన వైద్యం చేస్తూనేవున్నాము! ఇవ్వాళ పరిస్థితి విషమించింది!"

ఇది సీరియల్
నవలాపథకం
మొగలీ పువ్వంటి రెండవ భాగం

ఆంధ్రభూమి
సచిత్రవారపత్రిక
సీరియల్ నవలా పుస్తక పథకం—6


3

# మొగలీ పువ్వంటి

## డాక్టర్ కొత్త రవీంద్రబాబు

### జరిగిన కథ

అమరావతి పిక్నిక్‌కని వస్తారు
ఎమ్.ఏ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు.
శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ
ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు.
షాలిని మేడమ్ అంటే
విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి
కృష్ణ అవలి వద్దుకు వెళ్ళివస్తూన్న నీలను
పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్.
షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ
స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది.
అబార్షనై హాస్పిటల్‌లో చేరిన సుందరి మరణిస్తుంది.
సుమంత్‌కు అతడి పోలికలున్న వ్యక్తి ఎదురవుతాడు.



# 3

''అలాగా! మరి ఈమె దగ్గర ఎవరూ లేరే?''

''మేడం! ఈమె తల్లి చిన్నతనంలోనే పోయింది. తండ్రి కష్టపడి ఈమెను పెంచి పెద్దజేసి చదువు చెప్పిస్తున్నాడు?''

''అయితే ఇపుడు ఈమె దగ్గరవుండేవాళ్ళు లేరన్నమాట! ఈ పరిస్థితికి కారకుడైన యువకుడు ఎవరో? అతన్ని పిలిచి ఈమె దగ్గర వుండమని చెప్పకపొయ్యారా?''

''మేడం! ఎంత అడిగినా ఈమె అతని పేరు చెప్పడం లేదు!''

''చూశారా డాక్టర్! ముల్లు వచ్చి అరిటాకుమీద పడ్డా అరిటాకు ముల్లుమీద పడినా ఫలితంవొకటే! ఆడ జన్మే అనర్థకపు జన్మ!''

''మేడం! మీరు సుందరి దగ్గర ఈ రాత్రికి కనిపెట్టుకు వుండగలరా? ఆమె తాలూకు బంధువులెవరూ లేరు. నర్సింగ్ హోమ్‌లో ప్రమాదస్థితిలో ఉన్న కేసులు చాలావున్నాయి! సిస్టర్ ఈమె దగ్గర రాత్రంతా వుండటానికి వీలుకాకపోచ్చు!''

''అలాగే డాక్టర్ రవి! నీలకెటులితిరిగి కులాసాగానే వుంది! ఈ రాత్రి నేను సుందరి దగ్గరే వుంటాను! అవసరమైతే సిస్టర్‌కు కబురుచేస్తాను!''

బ్లడ్ బాటిల్ తెచ్చాడు సుందరి తండ్రి! బ్లడ్ డ్రిప్ స్టార్ట్ చేసి వెళుతూ ''మేడం! మీకు ఏమాత్రం అనుమానం వచ్చినా కబురు చేయండి!'' అంటూ వెళ్లిపోయాడు డాక్టర్ రవి.

''అమ్మా! నేను సుందరిని ఈ స్థితిలో చూడలేను! వాకిలి దగ్గర కూర్చుంటాను '' అంటూ కనుల నీరు కుక్కుకుంటూ బయటకు వెళ్లాడు సుందరి తండ్రి!

పాలిపోయిన సుందరి ముఖం వంక ఒకో చుక్కా పడుతున్న బ్లడ్ డ్రిప్ వంకా చూస్తూ కూర్చుంది షాలిని.

''ఈమెను వంచించి తన కోర్కెలు తీర్చుకుని పని తీరి పబ్బం గడుపుకున్నాక ఎంగిలి విస్తరును గిరవాటెట్టినట్లు వదలివేసిన దుర్మార్గుడెవడో? అతని పేరు తెలిస్తే వెళ్ళి వాడి జుట్టు పట్టుకుని ఈడ్చుకువస్తాను! ఆ చెంపా ఈ చెంపా వాయించి వాడిచేత



ఈమె మెడలో తాళికట్టిస్తాను!'' మనసులో వుడికిపోసాగింది షాలిని.

సుందరిలో ఏదో చలనం వచ్చింది. ఆమె పెదవులు కదలసాగాయి. నెమ్మదిగా గొణుగుతుంది సుందరి. దగ్గరకు జరిగి చెవులు రిక్కించి విన్నది షాలిని. ''సుమంత్! సుమంత్!''

''సుందరీ! సుందరీ''• నెమ్మదిగా పిలిచింది షాలిని. సుందరి కన్నులు తెరచిచూసింది.

''మేడం! మీరా?!''

''నేనేనమ్మా! ఎలా వుంది నీకు?''

''నీరసంగా వుంది. వళ్ళంతా నొప్పులు!''

''పరవాలేదమ్మా! అంతా తగ్గిపోతుంది!''

''మేడం! శరీరరుగ్మత తగ్గుతుందేమో! తూట్లుపడిన మనసులో గాయాలు మానవు మేడం!''

''సుందరీ! నువ్వెంతో తెలివికలదానివనుకున్నాను!'' సుందరి విదావస్తురాలు నిండుకుండ అనుకుంటారు కాంపస్‌లో! తొందరపడి ఇలాటి అభాగ్యస్థితి కెందుకొచ్చావమ్మా?''

''అతని అందం నా కనులపై పొరను కప్పింది! అతని ఐశ్వర్యం నన్ను మత్తులోముంచింది! తేనెపూసిన మాటలు నాలో విచక్షణను వశింపజేసాయి!''

''సుమంత్‌లో ఇంత నీచప్రవృత్తి దాగివున్నదా?''

''మేడం!''

''సుమంత్ అని ఎలా తెలుసుకున్నావనా? ఇందాక నువ్వు అతని పేరు పలవరించావు!''

''లాభంలేదు మేడం!''

''ఎందుకని?''

''అతనికిదివరకే వివాహమైంది!''

''మరి నువ్వెందుకు పొరపాటు పనిచేసావు?''

''ఆ విషయం తెలిసేసరికి జరుగకూడనిది జరిగిపోయింది!''

''సుందరీ! ఆడపిల్ల జీవితం లేత అరిటాకు లాటిది! ముల్లుపడినా చీరుకుపోతుంది, ముల్లుకు తగిలినా చీలికలవుతుంది!''

''మేడం! అభాగినుల కథలన్నీ ఒకేరకంగా వుంటాయేమో?'' నేను ఎలా సుమంత్ వలలో పడిందీ మీకు వివరంగా చెబుతాను!''

"వద్దమ్మా! నీరసంగా వున్నావు! తర్వాత చెబుదూగాని!"

"చెప్పనీయండి మేడం! చెప్పుకొనేవాళ్ళు లేక తల్లడిల్లి పోయాను! తర్వాత చెప్పడానికి నేనుండకపోవచ్చు"

"సుందరీ!"

"మేడం! నేను వున్నాలేకపోయినా నాకు జరిగిన అన్యాయం లోకానికి తెలియాలి! అందుకే మీకు జరిగిన కథ చెబుదామనుకుంటున్నాను.

అద్దెకు మేముంటున్న మేడ మీద గదిలో సుమంత్ జేరాడు! మేమూ మేడ వెనుకనున్న చిన్న అవుట్‌హౌస్‌లో పదిహేను సంవత్సరాలుగా అద్దెకుంటున్నాము! ఇంటావిడ విధవరాలు! ఇంటి అద్దెపెట్టుకుని కాలం గడుపుతుండేది! సుమంత్ అద్దెకు గది తీసుకున్న రోజున-ఇంటావిడ నాతో—

"అమ్మాయి! మేడ మీద్ద గది కాలేజి కుర్రాడికి అద్దెకిస్తున్నాను! కుర్రాడు చాలా బుద్ధిమంతుడు! అతనికి చాలా ఆస్తివుందని విన్నాను!" అంది.

నేను "అలాగా?" అని వూరుకున్నాను. ఇంటావిడ వయసు అరవై సంవత్సరాలుంటుంది. రూములో జేరగానే "అక్కా! అక్కా!" అని ఇంటావిడను పిలవడం మొదలెట్టాడు సుమంత్!

"తమ్ముడి" మీద ఎనలేని ఆప్యాయత మొదలైంది యింటావిడ మాణిక్యమ్మకు. తీరిక సమయంలో నాకు సుమంత్ ఆస్తి వివరాలు చెప్పేది.

"సుందరీ! సుమంత్‌కు పాతిక ఎకరాల మాగాణీ పదెకరాల జాంతోట! పల్లెటూళ్ళో పెద్ద మేడ! బాంకులో పదిలక్షల కరుకులు మూలుగుతున్నాయి! కుర్రాడు మంచి రూపవంతుడు! చిదిమితే పాలుగారే బుగ్గలు! శ్రీరామచంద్రమూర్తి మళ్ళీ అవతారమెత్తినట్లు వుంటుంది అతన్ని చూస్తే!

తల్లీ తండ్రీ కొకడే బిడ్డ! నా వరాల తమ్ముడి కోసం ఈ ప్రపంచంలో ఎక్కడో అక్కడ చక్కటి చుక్క పుట్టి పెరుగుతూ వుంటుంది!

సుమంత్ పెళ్ళాడిన పిల్లదే అదృష్టం! అమాయకురాలైన పేద యువతి మనసు మీద ఆమె మాటలు బాగా పనిచేసాయి!

"అమ్మాయి సుందీ! పాపం సుమంతపొద్దున్నేలేచి కాఫీకోసం మైలుదూరం ఎక్కడ నడిచివెళ్తాడు! ఇదిగో ఇడ్లీప్లేటు ఇదుగో కాఫీగ్లాసు! పోయి తమ్ముడికిచ్చి రామ్మా! పెద్దదాన్ని! మెట్లన్నీ ఎక్కివెళ్ళాలంటే నాకు కాళ్ళునొప్పెడతాయి!" అంది ఓ రోజు పొద్దున్నే. అప్పటినుండి అతనికి కాఫీ టిఫిన్ జేరవేసే పని నామీద పడింది!

మాణిక్యమ్మ సుమంత్‌కు కాఫీ ఫలహారాలు పంపడంలో వేరే స్వార్థం వున్నది!



మద్రాస్‌లోవున్న తన చెల్లెలు కూతురు మంజులను సుమంత్‌కిచ్చి చేయాలనే ఆశ మనసులో పెట్టుకుని ఆమె అతనికి అతి మర్యాదలు చేసేది!

సందర్భవశాత్తు ఆ విషయం పక్కింటి ఆమెతో చెబుతుంటే విన్నాను కూడా!

రూపం యవ్వనం ఆస్తి అంతస్తులన్నీ వున్న సుమంత్ అంటే నా మనసులో మంచి అభిప్రాయం కలిగింది! రాత్రింబగళ్ళు మాణిక్యమ్మ సుమంత్‌ను పొగుడుతూ వుండటం నా మనసులో అతని మీద మరులుగొనేలా చేసింది!

ఇరుగుపొరుగు వాళ్ళు మాణిక్యమ్మతో నీకేమమ్మా! నీ చెల్లెలి కూతురుకు బంగారు బాబులాంటి అల్లుడిని తెచ్చుకుంటున్నావు!" అంటున్నప్పుడు నా మనసులో క్షణం పాటు అసూయ కలిగేది.

వేడిరక్తం ప్రవహించే యువతీ యువకుల మధ్య సాన్నిహిత్యం ఏర్పడటానికి ఎంతోకాలం పట్టదు మేడం! కాఫీ టిఫిన్ జేరవేయటానికి సుమంత్ రూముకు వెళ్తున్న నన్ను అతను ఏదో మిషతో మరింత సేపు అక్కడ వుండేట్లు చేసేవాడు. నేను వెళ్ళే సమయానికి గదిలో పుస్తకాలు చిందర వందరగా పడేసి వుంచేవాడు.

"అరే! పుస్తకాలిలా పడివున్నాయి!" అంటూ సర్దిపెట్టేదాన్ని. మంచంమీద పరుపు దుప్పట్లు గజిబిజిగా పడివుంటే తీసి సర్దేదాన్ని.

టిఫిన్ తిని కాఫీ తాగితే ఖాళీ ప్లేటు గ్లాసు తీసుకువెళ్దామని ఎంతసేపు నిలబడ్డా టిఫిన్ తినేవాడు కాదు!

"అక్క తన చెల్లెలి కూతుర్ని పెళ్ళి చేసుకుంటాననే ఆశతో కాఫీ టిఫిన్ పంపుతున్నది! కాని ఎదురుగా కుందనపు బొమ్మలాటి సుందరిని పెట్టుకుని ఎవరో పురాంగ్‌వుతాన్‌లాటి అమ్మాయి నెలా చేసుకుంటాను?" అన్నాడొకరోజు.

"ఎవరా సుందరి?" కోపంగా అడిగాను.

"చెప్పుకో చూద్దాం!"

"ఏమో బాబూ! నాకు తెలియదు!"

"ఫోటో చూపిస్తే గుర్తుపట్టగలవా?" సమాధానం చెప్పలేదు నేను! మనసులో వుడికిపోతూ నిలబడ్డాను.

"మీకంత కోపంవస్తే నేను కాఫీ తాగను! ఇదిగో అమ్మాయి ఫోటో!"

ఫోటోను చూసిన నా మనసులో పన్నీటి జల్లు కురిసినట్లయింది! సుమంత్ చేతిలోవున్నది నా ఫోటోనే! సంభ్రమం, ఆశ్చర్యం, ఆనందం నా మనసును అల్లకల్లోలం చేసివేసాయి.

"సుందీ! నీ ఫోటో ఎక్కడిదనా ఆశ్చర్యపోతున్నావు. ఇదిగో ఇలా లాకెట్ చూడు

ఇందులో వున్నది నీ ఫోటోనే! ఎప్పుడు నా గుండెలమీద నీవు నివసించాలని నీ ఫోటో ఈ లాకెట్‌లో వుంచాను!'' అంటూ మెడలో వేలాడుతున్న బంగారు గొలుసు తీసి చూపాడు.

''ఇదిగో! నా పర్స్‌లోనూ నీ ఫోటోనే! నేను నిన్ను చూడాలనుకున్న మరుక్షణం పర్స్ తెరుస్తాను! అందాల సుందరి రూపం చూసి మనసులో ఆనందపడతాను!''

''నేను చదివే ప్రతి పుస్తకం అట్టమీద నీ ఫోటో అంటించాను! అయితే నేను బహుస్వార్థ పరుడను సుమా!

నీ ఫోటో ఇతరులు చూడకుండా వుండటానికై పుస్తకాలన్నిటికి అట్టలువేసాను! ఎవరూ లేనప్పుడు అట్టతీసి నీ ఫోటో చూస్తాను!

అందుకే నా పుస్తకాలెవరికీ అరువివ్వను. ఇదిగో నా రిస్ట్‌వాచ్ వెనుకబాగంలోను నువ్వేవున్నావు!'' సంతోషంతో మాటలు కరువయ్యాయి నాకు! సుమంత్‌ను ఆ క్షణం నుండి ప్రేమించకుండా వుండలేకపోయాను!

ఒకరోజు ఉదయం కాఫీ టిఫిన్ పట్టుకు పైకి వెళ్ళాను. సుమంత్ మంచం మీదనుండి లేవలేదు.

''సుమంత్!'' నెమ్మదిగా పిలిచాను.

''ఊ!'' నూతిలోనుండి వచ్చినట్లుంది అతని సమాధానం.

''ఏమయింది! సుమంత్?'' దగ్గరకు వెళ్ళి అతని నుదిటిమీద చేయివేసి చూసాను. వేడిగా తగిలింది!

''అరే! వళ్ళుమండిపోతున్నది! ఎప్పట్నుంచీ జ్వరం?''

''నిన్న సాయంత్రం నుండి!''

''మరి నన్ను పిలువలేదే?''

''మంచం మీద నుండి లేవలేకపోయాను! ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు సుందీ వస్తుందా అని ఎదురుచూడసాగాను!'' నీరసంగా బదులు చెప్పాడు.

''అయ్యో! అలా ఎందుకు చేసావు! కేకవేస్తే విని వచ్చేదాన్ని! డాక్టరుగారిని పిలుచుకువచ్చి మందిప్పించేదాన్ని.

''పిలవలేకపోయాను. పేరుపెట్టి నిన్ను పిలిస్తే అందరూ అపార్థం చేసుకుంటారనుకున్నాను''.

''పిచ్చి సుమన్! ఏదో అనుకుంటారని నువ్వు బాధపడుతూ వుండిపోయావా? ఇలా ఎప్పుడూ చేయకు! వుండు! వెళ్ళి డాక్టరుగారిని తీసుకువస్తాను!''

''వద్దు సుందీ! నిన్న సాయంత్రం కాలేజినుండి వస్తూ డాక్టరుగారికి చూపించి వ



చ్చాను! మందులు అలమారాలో వున్నాయి!''

''ఉదయం మందులు వేసుకున్నావా?''

''ఉహూ!'' కాప్స్యూల్సు బిళ్ళ మింగించి కాఫీ తాగించాను! తడిగుడ్డతో నుదురు తుడిచాను! అరగంట వున్నాక లేచి కిందకు వెళ్ళబోయాను!

''సుందీ!'' సుమన్ హీనస్వరంతో పిలుస్తుంటే ఆగిపోయాను! వెనుదిరిగి దగ్గరకు వెళ్ళాను.

''జ్వరంకంటే ఒంటరి తనం నన్ను బాధిస్తున్నది! మరికొంత సేపు నువ్విక్కడే వుండరాదా?''

''అలాగే సుమన్! అంతకన్నా ముఖ్యమైన పని నాకేముంటుంది?''

సుమంత్‌కు వచ్చిన జ్వరం నాలుగురోజులకుగాని తగ్గలేదు! ఈ లోపల మా ఇద్దరిమధ్య వున్న సాన్నిహిత్యం అనేకరెట్లు పెరిగింది.

అతను పత్యం తీసుకున్న మొదటిరోజునే మొదటిసారి మేమిద్దరం హద్దులుదాటి...! అప్పట్నుంచీ వీలయినప్పుడు కోరిన సుఖం అనుభవిస్తూ ఆనంద లోకాలలో విహరించసాగాము! నా శరీరంలో ఏదో మార్పులు వస్తున్నాయని గమనించాను! సుమన్‌తో ఆ విషయం చెబుదామనుకున్నాను. కాని ఆరోజు ఒక సంఘటన జరిగింది. ఉదయాన్నే ఒక యువతీ ముసలాయన సుమంత్ గదికి వచ్చారు! వద్దనుకుంటున్నా వాళ్ళమాటలు వినపడ్డాయి.

''అబ్బాయి! పండగకింటికి రాలేదేం?'' డబ్బాలో రాళ్ళువేసి మోగించినట్లు వున్నది ముసలాయన గొంతు! సుమంత్ సమాధానం వినపడలేదుగాని ఖంగుమని కంచుఘంటలా ఆ అమ్మాయి మాటలు వినపడ్డాయి.

''ఎందుకొస్తాడు నాన్నా! నువ్వు అడగగానే అడిగినంత డబ్బు ఇస్తుంటివి! అది తీసుకుని ఏ రంగులరామ చిలకతోనో కులుకుతుంటాడు! మామ సొమ్ము మజాచేస్తాడు. బెజవాడలో జరిగింది మర్చిపోయావా?''

''ఏం అల్లుడూ! నిజమేనా? మళ్ళీ ఇక్కడేదైనా పిచ్చివేషాలు మొదలెట్టావా?''

''అందుకు సందేహమా? కుక్కతోక వంకర పోతుందా? మొన్న నా స్నేహితురాలు పద్మనయినా వుత్తరం రాసింది ''నీ మొగుడు మళ్ళీ రాసక్రీడలు మొదలెట్టాడని!''

''లేదు! అంతా అబద్ధం!''

''నాన్నా!'' ఇల్లెగిరిపోయేలా అరిచిందా అమ్మాయి.

''ఏమిటమ్మా?''

"మీ అల్లుడిగారి పర్స్‌లో ఈ ఫోటో చూడు!"

"ఆ! ఎవరిదీ ఫోటో!"

"నాన్నా!" ఎవరో చచ్చిపోయినట్లు పెద్దగా ఏడ్చిందా అమ్మాయి.

"నీ గొంతుకోసావే తల్లీ! నూరేళ్ళ జీవితం నాశనం జేసావే! పువ్వుల్లో పెట్టి పూజ చేసుకున్నాను. కసాయి కత్తితో తెగనరుకుతాడను కోలేదే!" రోడ్డు రోలరు రాళ్ళమీద దొర్లినట్లు కర్ణకఠోరంగా వినబడ్డాయి ముసలతని మాటలు.

"ఉరేసుకు చస్తాను నాన్నా! అంతకంటే నాకు మార్గంలేదు!" తండ్రి కూతురు చేస్తున్న గలాటా విని మాణిక్యమ్మ, ఇరుగుపొరుగు వాళ్ళూ పోగయ్యారు! గది తలుపులు వేసుకుని లోపలే వుండిపోయ్యాను నేను!

"హవ్వ! పెళ్ళయి కాపురం చేసుకుంటున్న కుర్రాడితో ప్రేమాయణం మొదలెట్టిందిగాక ఫోటో కూడా ఇచ్చింది చూసారా! ఇంత తెంపరి తనం ఎక్కడైనా వుందా?" మాణిక్యమ్మ అరుపులకు మరింత కుంచించుకుపోయాను!

ఆ రోజే సుమంత్‌ను తీసుకుని వెళ్ళిపోయారు అతని మామ, భార్య! సుమంత్ వెళ్ళిపోయినా నాకు పాట్లు తప్పలేదు! నన్ను పురుగుకన్నా హీనంగా చూడసాగారు ఇరుగుపొరుగు. అందరికన్నా మాణిక్యమ్మ ప్రవర్తన నన్ను కృంగదీసింది! ఆ పరిస్థితులలో కడుపుతో వున్నానన్న విషయం నాన్నకు చెప్పలేక నేను మంత్రసాని దగ్గరకు వెళ్ళాను! పరిస్థితి విషమించటంతో డాక్టరుగారి దగ్గరకు రాక తప్పలేదు!"

"సుందరీ! నేనిప్పుడు వెళ్ళి సుమంత్‌ను జుట్టుపట్టుకు లాక్కొస్తాను!" భద్రకాళిలా అరిచింది షాలిని.

"వద్దు మేడం! తెలిసి తాకినా తెలియక తాకినా నిప్పును అంటుకుంటే వళ్ళుకాలుతుంది! ఇప్పుడు ఏం చేసినా ప్రయోజనం వుండదు! మరో ఆడపిల్ల బతుకులో నిప్పులు కుమ్మరించి ఇప్పటికే పాపం చేసాను! మేడం! మరోమాట! ఎటుదిరిగీ నేను బతకను!

ఈ విషయం నలుగురికీ తెలిసి నా కథ కనువిప్పు కాగలదనే ఆశతో మీకు చెప్పాను! కండకావరంతో కాలుజారబోయే ముందు ఒకసారి ఆలోచించివుంటే జరగబోయే అనర్థం అర్థం అయివుండేది!

అందుకే నా కథ చెప్పాను మేడం! సుందరికి వూపిరి తీసుకోవటం కష్టం కాసాగింది!

"అరే సుందరీ! ఏమయింది!" ఆదుర్దాగా అడిగింది షాలిని.

"ఏ... ఏం... లేదు" ఎక్కిళ్ళు వచ్చాయి సుందరికి.



"సిస్టర్! సిస్టర్! ఒక్కసారి ఇలా రండి!" పెద్దగా అరచింది షాలిని.

"ఏమయిందమ్మా?" పరిగెత్తుకు వచ్చింది సిస్టర్. సుందరివంక చూస్తూనే "అయ్యో! ఇలా అయిపోయిందేమిటి" అని ఆక్సిజన్ మాస్క్ తగిలించి బయటకు పరుగెత్తింది డాక్టరు రవిని పిలుచుకు వద్దామని! సుందరి తండ్రి గదిలో అడుగుపెట్టి రెండుచేతులతో ముఖం కప్పుకుని బావురుమని ఏడుస్తూ బయటకు వెళ్ళిపోయాడు. లోపలకు వచ్చిన డాక్టరు రవి సుందరి వంక చూసి నిట్టూర్చి లాంఛనంగా స్టెతస్కోప్‌తో హృదయచలనం ఏమయినా వుందా అని చూడసాగాడు.

"ఊహు! సెప్టిక్‌షాక్ కేసులింతే! మేడం! షి యీజ్ యాన్ అన్‌లక్కీ గర్ల్! క్షణికోద్రేక ఫలితానికి విందు జీవితాన్ని మూల్యంగా చెల్లించింది!" డాక్టరు రవి మాటలు విని కనుకొలకుల వెంట జారుతున్న నీటిని తుడుచుకుంటూ వుండిపోయింది షాలిని.

* * *

నీలను నర్సింగ్‌హోంనుండి డిస్చార్జ్ చేసారు డాక్టరు రవి! పండ్లరసం, హార్లిక్స్, బ్రెడ్, బిస్కట్లు బలవర్థకాహారం ఆమె శరీరంలోని నీరసాన్ని త్వరగానే పోగొట్టాయి కాని ఆమె మనసులోని అంతర్మథనం— గిరగిర తిరిగే రంగులరాట్నంలా ప్రశాంతతకు దూరం చేసింది!

తవిడమ్మ వేషంలో కృష్ణరావడం సుందరి మరణం షాలినిని కృంగదీసాయి. వెనుకటి దర్పం ఆత్మవిశ్వాసం ధయిర్యం పోయి దిగులుగా వుంటున్నది! కిచెన్ చూడటం, పనిమనిషిచేత కావలసిన సరుకులు తెప్పించటం మేడంను, నీలను వుషారుగా వుంచాలని ప్రయత్నించటంతో ప్రియకు వూపిరాడటం లేదు! ఒకరోజు సాయంత్రం...

"నీలా! పుస్తకం తీయవేం?"

"ఏమిటోగా వుంది! చదవాలనిపించడం లేదు!"

"ఇప్పటివరకు మొదటి రెండు రాంకులూ శ్యాం, మాలినవే! తర్వాత రెండు రాంకులూ మనిద్దరివీ! ఎలాగైనా పబ్లిక్ పరీక్షలో మొదటిరెండు రాంకులనుండి శ్యాం, మాలినను నెట్టివేయాలని ఇన్నాళ్ళుగా ప్రయత్నంచేసి చేసి ఒక్కసారిగా పరీక్షల ముందు ఇలా చతికిలబడి పొయ్యాం! ఎలాగే?"

"ఏం చెయ్యను... పుస్తకం తీస్తే శ్యాం రూపం కనబడుతుంది!"

"నిజం చెప్పావు నీలా! నీకు శ్యాం నాకు మాలి కాంపెన్సేషన్

చెడగొడుతున్నారు..."

"ఎటుదిరిగీ పరీక్షలు దగ్గరకొచ్చాయి! పదిరోజులలో యూనివర్శిటీ వదిలి వెళ్ళిపోతాం!"

"నీలా! ఐడియా వచ్చింది! మహమ్మదు కొండ దగ్గరకు వెళ్ళకపోతే కొండ మహమ్మదు దగ్గరకు వస్తుంది. శ్యాం, మాలిల మనసుల్లోని నిస్పృహ, నిరాశ, నిష్క్రియత్వం పోగొట్టటానికి మనమే చొరవ తీసుకుంటే ఎలా వుంటుంది?" సమ్మోహన రూపం...

"ప్రియా! మంచి ఐడియా! పరీక్షలయ్యాక నేను శ్యాం ఇంటికి ఏదో ఒక నెపం మీద వెళతాను! అలాగే నువ్వు మాలి ఇంటికి వెళ్ళు! లెటస్ ట్రై అవర్ లక్!"

"సరే ఇక పుస్తకం తెరువు! అరుగో మేడం వస్తున్నారు!"

* * *

శ్యాం, మాలిల రూంలో అదే సమయంలో ఇదే విషయమై మరోవిధమైన సంభాషణ సాగింది!

"అరే మాలీ! త్వరలో పరీక్షలైపోతాయి! ఆ విషయం తలుచుకుంటనే దిగులుగా వుంది!"

"శ్యాం! నా పనీ అందుకు భిన్నంగా లేదురా!"

"పుస్తకం తెరిస్తేచాలు— ఎక్కుపెట్టే నాగుండెపై మదనుడు వదుల్తున్న పూబాణం— నీలోత్పల— అదే నీల కనపడుతుంది! కాలేజి కాంపస్‌లో నీల ఎదురైనప్పుడు తలదించుకున్నా దూరంగా వున్నప్పుడు ఆమెరూపం విలోకిస్తూ ఆనందిస్తుండే వాడిని! కొద్దిరోజులలో శెలవలిస్తారు— ఇంటికి వెళ్ళాలి! ఇంటి దగ్గర అమ్మ నాకోసం ఎదురుచూస్తుంది! పోనీ ఇంటికివెళ్ళకుండా ఇక్కడే గుంటూరులో వుందామా అంటే నీల ఈ వూళ్ళోనే వుంటుందన్న గారంటీలేదు!"

"శ్యాం! నానాగుమీసాల నూత్నయవ్వనంలో జరిగిన భయంకరానుభవం తర్వాత ఇంతవరకు నేనే యువతినీ కన్నెత్తి మరి చూడలేదు! కాని — కాని — ఇప్పుడు కనులు మూసినా తెరచినా అందాల సుందరి ప్రియ సమ్మోహన రూపం కనబడుతుంది! ఎదురుగా వచ్చినప్పుడు తేరిపార చూడలేకపోయినా నా మనోనేత్రంతో ఆమె ప్రియరూపం చూస్తూ ఆనందిస్తున్నాను. ప్రియ బాంధవిగా మారిన ప్రియరూపం ఇక కనపడదు అన్న విషయం నన్ను బాధిస్తున్నది!"



శ్యాం మాలి ఇలా దీర్ఘాలోచనలో, మునిగివున్న సమయంలోనే దాదాపు పదిమంది లోపలకు తీసుకువచ్చా రు!

"బావయ్యా! ఓ బాయ్యా!"

"మామయ్యా! ఓ మాయ్యా!"

గిరజాల జుట్టు ముఖానికి దట్టంగా పౌడర్ పామి చౌకరకం సెంటు పూసుకుని పెదాలకు లిప్‌స్టిక్ వేసుకొని హైహీల్స్ టకటకలాడిస్తూ చదరంగావున్న చాతీమద నిలువకుండా జారిపోతున్న చీరెచెరగులను సవరించుకుంటూ మాటిమాటికి సిగ్గు అభినయిస్తూ కళ్ళల్లో కాంక్ష అంతలో సిగ్గు, అభిమానం వద్దు వద్దన్నట్లు చిరాకు, ఆనందం కవ్వింపు క్షణం ... యువకునిలా మరుక్షణం సిగ్గుపడే యువతిలా హావభావ ప్రకటనలు చేస్తూ ముందుమల్చున్న ఆకారం వెనుకనున్న వారిని అదలించింది.

శ్యామ్ మాలి ఒక్కసారిగా నిశ్చేష్టులైపోయారు. ఆ సమయంలో ఆ గుంపు తమ గదిలోనికి తోసుకురావటం వాళ్ళిద్దర్నీ బాధా తప్తులను చేసింది. నిశ్చేష్టులై మిన్నకుండిపోయిన శ్యాం మాలిల ముందు వుత్సాహంగా పాటపాడుతూ డాన్సు చేయసాగారు!

అక్కయ్యంటే ఆరికి కోపం
బావయ్యంటే ఈరికి తాపం

ఎవరికిగాని దేహం మాది. కాసేపు. పడ తుల్లా సిగ్గునభినయించి కవ్విస్తూ కాసేపు రొమ్ము చరుచుకుని లేని మీసం కొనలను మెలిపెడ్తూ ఆడ— మగ— రెండువేషాలు మార్చి మార్చి చూపిస్తూ కోలాహలం చెయ్యసాగారు. కోలాహలంగా నృత్యం చేస్తున్న తృతీయ జాతి సమూహం అరుపులకు కేకలకు పక్క రూములలోవున్న విద్యార్థులు శ్యాం మాలిల రూములోపలకు వచ్చారు. లోపలచోటులేక మిగిలిన వారు వరండాలో నిలబడిపోయ్యారు.

ప్రేక్షకులెక్కువయ్యేసరికి వుషారెక్కువైంది గుంపుకు. ఒకడు మెడలో తగిలించుకున్న హార్మనీ వాయించసాగాడు. మరొకడు నడుముకు కట్టుకున్న తబలా మీద దరువు వేయసాగాడు.

పాటపాడుతూ పాడుతూ సడెన్‌గా ఆపి "బావయ్యా ఈ మోటు సచ్చినోడు నన్నేంజేసాడో చూడు?" అంటూ వాకిలి దగ్గరనుల్చున్న యువకుని దగ్గరగా మొహం పెట్టి పైట కొంగు తొలగించి ఛాతీ చూపబోయాడు బృందం లీడరు.

"వద్దు! చూడలేం!" అన్నాడు వాకిట్లో నిలబడ్డ యువకుడు!

మళ్ళీ పైటకొంగు సరిచేసుకుంటూ సచ్చినాడా! వుండు నీ పని బడతా! వావొంటి

మీద సెయ్యేసావో నీవొళ్ళు సీరిపారేస్తా! కండలూడేట్లు బరుకుతా! సీపురుకట్ట దిరగేసి బాదుతా! ఆ!" అంటూ పక్కనున్న అతన్ని బెదిరించాడు బృందం లీడరు! లావుగా పొట్టిగా కుదిమట్టంగా వున్న రెండో అతను "రాయే పిలకా! అంతకోపం ఎందుకే! ముచ్చటపడినందుకే అంతకోపం దేనికే?" అంటూ పొడుగ్గావున్నతన్ని అమాంతం కౌగిలించుకున్నాడు.

"సచ్చినాడా! వదులు! పబ్లిగ్గా ఏందిది? సిగ్గూ శరమూలేదూ నీకు?" అంటూ అతని కబంధ కౌగిలినుండి విడిపోవాలని విపరీతంగా గుంజుకుంటూ పగలబడి నవ్వుతున్న విద్యార్థుల వంక చూస్తూ.

"ఓ బావయ్యో! ఓ మామయ్యో! ఈ సచ్చినాడు నన్ను బలాత్కారం చేస్తున్నాడు. రచ్చించండి! రచ్చించండి!! పబ్లిగ్గా పదిమందిలో అత్యాసారం చేస్తున్నాడు! సూత్తా వూరుకుంటారా!" అంటూ ఒక్కవుదుటున తనను వొడిసి పట్టుకున్నతన్ని పట్టు విడిపించుకుని వినోదం చూస్తున్న విద్యార్థుల మధ్య కురికాడు.

"తప్పించుకుపోతావటే! ఆనక నీ పని జెబుతా!" అంటూ అశ్లీలపదాలు రువ్వుతూ బూతుపనులు గుర్తుకువచ్చేలా చేతులూ కాళ్ళూ వూపుతూ వుండిపోయాడు లావాటి అతను!

పగలబడి నవ్వుతున్న విద్యార్థులవద్ద కొసరి కొసరి డబ్బులు వసూలు చేసుకుని మరీవెళ్ళారు తృతీయ ప్రకృతి వ్యక్తులు! వాళ్ళవెనకే వినోదం చూడవచ్చిన వాళ్ళూ వెళ్ళారు.

"అరే మారీ! నాకో అనుమానం వచ్చింది!"

"లీడరు ముఖంలో సుమంత్ పోలికలున్నయ్యనేనా".

"అవున్రా అతను పాంటు షర్టు తొడుక్కుంటే సుమంత్‌లా వుంటాడ్రా!"

"అతను సుమంత్ అన్నలా కాదు అక్కలా కాదు కాదు తోడపుట్టిన (ది) వాడిలావున్నాడు! అదెలా సాధ్యం?! సుమంత్ తండ్రి ధనవంతుడు. తల్లి తండ్రులకు సుమంత్ ఒకడే బిడ్డ! అడుగో రాజేష్ వస్తున్నాడు! అతడిని అడుగుదాం!"

"ఏమిటి శ్యాం ఏదో డిస్కస్ చేస్తున్నట్లున్నారు! పరీక్షల్లో ఏం ప్రశ్నలు వస్తున్నయ్యో తెలిసాయూ ఏం?"

"లేదురా! టెన్షన్‌వల్ల పుస్తకాలు ముట్టడం లేదు! ఇందాక బజారులో ఒక వ్యక్తి కనపడ్డాడు అతనిలో సుమంత్ పోలికలున్నాయి! అంటాడు మారి! సుమంత్‌కు అన్నదమ్ములు లేరు అంటాను నేను! అదీ మా వాదన!"

"సుమంత్‌కు ఒక అన్నవుండేవాడట! అతనికి మూడు సంవత్సరాల వయసులో



తిరుపతికొండ మీద తలనీలాలు యివ్వటానికి వెళ్ళినప్పుడు తప్పిపోయాడట! ఇప్పటికీ ఆ విషయం తలచుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది వాళ్ళమ్మగారు!

ఇంతకీ ఆ వ్యక్తి ఎక్కడ కనపడ్డాడు? శ్యాం, మారి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. అసలు విషయం చెప్పటం మంచిదిగాదనిపించింది వాళ్ళిద్దరకూ!

"ఇందాక శంకర విలాస్ సెంటర్ దగ్గర స్కూటర్‌మీద వెళ్తున్న ఒక వ్యక్తి సైడ్‌ఫోజులో అచ్చు సుమంత్‌లా వున్నాడు!"

"అలాగా! అతనేవైపుగా వెళ్ళాడు?"

"అతనా? అతను.... బ్రాడీపేట వైపుగా వెళ్ళాడు!"

"సరే! అతను మళ్ళీ కనపడితే నాకు చెప్పండి అతనేగనుక సుమంత్ అన్న అయితే వాళ్ళమ్మగారు ఎంతో సంతోషపడుతుంది.

వస్తా్రనా!" అంటూ వెళ్ళిపోయాడు రాజేష్!

* * * *

తలవంచుకుని బజారులో వస్తున్న సుమంత్‌ను దూరంగా చూసిన సుందరి తండ్రి రాఘవయ్య పరిగెత్తుకు వచ్చి అతని కాలర్ పుచ్చుకున్నాడు.

"వదలు! వదులు! ఏమిటిది?" కోపంగా అతన్ని విదిలించబోయాడు సుమంత్!

"నా బిడ్డ ప్రాణాలు నిలువునా తీసావు! నిన్ను అంత తేలికగా వదుల్తాన్రా?" బుసలుకొడుతూ అన్నాడు రాఘవయ్య.

"ఛీ! ఏమిటి నువ్వనేది? నడిబజారులో చొక్కాపట్టుకొంటావా? ఎవరు నువ్వు?"

"నిన్నే నమ్మి సర్వస్వం నీ కప్పజెప్పి ఫలితంగా ప్రాణాలు పోగొట్టుకొని గుప్పెడు బుగ్గిగా మిగిలిన సుందరి తండ్రినిరా! నీవంటి నీచులను ప్రాణాలతో వదలకూడదు!" కోపంతో వూగిపోతూ సుమంత్ గొంతునులమబోయాడు రాఘవయ్య. ఆవేశంతో వూగి పోతున్న రాఘవయ్యను బలంగా నెట్టి వేస్తూ "నీకు డబ్బు కావాలంటే మర్యాదగా అడుక్కోరాదూ? ఇలానడిబజారులో న్యూసెన్సు చేస్తావా?" అన్నాడు సుమంత్‌చుట్టూ పోగవుతున్న జనాన్ని చూస్తూ.

చుట్టూ పోగయిన వారిలో కొందరు రాఘవయ్యను సుమంత్ దగ్గర్నుండి లాగివేసారు.

"ఒరేయ్! నీకంటే కసాయివాడు నయంరా! నా బిడ్డను నాశనం చేసింది చాలక నాకు ముష్టి వేస్తావ్రటా! ఒరే! నీ నెత్తురు కళ్ళజూస్తా! నిన్ను నరికి పోగులు పెడ్తా!"

గర్జించాడు రాఘవయ్య.

గంగిగోవులా అమాయకంగా మొఖం పెట్టి "చూసారా సార్! యిదీవరస! కడుపులో నొప్పిగా వుండి బిళ్ళలు తెచ్చుకుందామని బజారుకు వస్తే గొంతు పిసుకబోయాడు! మీరందరూ రాకపోతే నా ప్రాణాలు నిలువునా తీసేసేవాడే!" అన్నాడు సుమంత్.

"అలాగా! అతను మీకేమవుతాడు!" అని అడిగాడొక నడివయసు వ్యక్తి.

"అతనెవరో నాకు తెలియదు! చూస్తే మెంటల్ రోగిలా వున్నాడు!"

"ఒరేయ్! నాకు మెంటల్ అంటావురా! నిన్ను... నిన్ను నిలువునా పాతేస్తా! ఒరేయ్!" పట్టుకున్న వాళ్లను వదిలించుకుని సుమంత్‌మీదకు దూకాడు రాఘవయ్య.

"అమ్మో! పిచ్చాడు! చంపేస్తున్నాడు!" భయభ్రాంతుడైన సుమంత్ కేకలకు చుట్టూ చేరిన జనం బలవంతంగా రాఘవయ్యను అవతలకు ఈడ్చుకుపొయ్యారు!

పీలికలైపోయిన టెర్లిన్‌షర్ట్ సరిచేసుకుంటూ దడదడలాడుతున్న గుండెను చేత్తో అదమిపట్టుకుని లేచి ముందుకు నడువసాగాడు సుమంత్.

డోలు మద్దెల హోర్మనీ పెట్టెలు మెడలలో తగిలించుకున్న గుంపు ఎదురయింది.

"అక్కయ్యంటే ఆరికి కోపం

బావయ్యంటే ఈరికి తాపం... అంటూ ఒక ఆకారం ఎదురవటంతో విచలితుడై నిలబడిపోయాడు సుమంత్.

ఆ ఆకారం వడుం చుట్టూ గట్టిగా చుట్టుకున్న లుంగీ లంగాలా వున్నది! వంటికి అతుక్కున్నపల్చటి లాల్చీ జాకెట్‌లా వుంది. పల్చటి సిల్కు కండువా వల్లె వాటులా వేసుకుని మాటి మాటికీ జారిపోతున్న "పైట"ను సరిచేసుకుంటూ తగని సిగ్గు నభినయిస్తోందా ఆకారం.

ఎదురైన వింత గుంపును అసహ్యంగా చూస్తున్న సుమంత్ ముఖంలో రంగులు మారాయి!,

వింత గుంపు లీడరు ముఖం చూస్తూనే నివ్వెర పోయాడు సుమంత్!

లీడరు ముఖంలో అచ్చు గుద్దినట్లు కనపడుతున్న తన పోలికలను చూచి "నో!" "నో"! అని అరుస్తూ పరుగెత్తుకు వెళ్ళిపోయాడతను.

పరిగెత్తుకుపోతున్న సుమంత్ వెంటపడి పరుగెత్తి.

"బాయ్యా! ఓ బాయ్యా! నామీదెందుకంత కోపం?" అంటూ ముందుకు వచ్చి నుల్చున్నాడు లీడరు.

అతని ముఖం వంక తిన్నగా చూడలేక తలదించుకుని ముందుకు సాగిపోయాడు



సుమంత్.

అప్రయత్నంగా "తమ్ముడూ!" అని పిలిచాడు లీడరు. వులికి పడిపోయాడు సుమంత్! వళ్ళు జలదరించి నరనరాలు జివ్వుమన్నాయి! గుండెలో ముల్లుగుచ్చుకున్నట్లు గిలిగిలలాడిపోయాడు! అసహ్యం కోపం బాధ అనుమానం అతన్నిపట్టి కుదిపాయి.

మూర్తీభవించినట్లు... 

మమ్మూర్తులా తన పోలికలున్న వింత ఆకారం ముందు ఎక్కువసేపు నిలబడటం మంచిదిగాదనిపించింది సుమంత్‌కు! వెనుదిరిగి చూడకుండా వేగంగా పరుగెత్తుకుపోయాడతను.

గ్రూపు లీడరు 'సాంబ" నిర్ఘాంత పోయి నిలబడ్డాడు. అతని మనసు పొరలలో ఏవో జ్ఞాపకలు మెదిలాయి! ఎదురుగా వున్న యువకుని కుడి చెవికింద నయాపైసంత పుట్టు మచ్చ! అతను తన తమ్ముడే!

"అన్నదమ్ములిద్దరిదీ ఒకటే పోలిక! పెరిగి పెద్దయితే కవలపిల్లలనుకుంటారు!"

"పచ్చటి పసిమి ఛాయ! ముట్టుకుంటే పాలుగారేట్లు వున్నారు!"

"ఇంతకీ ఆ తల్లి అదృష్టవంతురాలు! ముద్దుల మూటగట్టే యిద్దరు కొడుకులు!"

తమ్ముడిని ఎత్తుకోవాలని తాపత్రయపడటం "వద్దమ్మా! పడేస్తావు!" తల్లి వారించటం.

"అమ్మా! ఒక్కసారి ఎత్తుకుంటానే!" అని తను అనటం.

ముద్దులమూటగట్టే తమ్ముడిని ఎత్తుకుని తిరగటం అంతలో నాన్నవచ్చి తననూ తమ్ముడిని చెరో చేత్తో ఎత్తుకోవటం. అపురూపమైన జ్ఞాపకాలు కలిగించిన అపరిమితానందంతో అతని ముఖం వెలిగిపోయింది.!

అంతలో భయంకరమైన సంఘటనలు భూతకాలంలో జరిగినవి పెనుభూతాంలా మనసును భయలిహ్వొలుడిని చేసాయి!

తిరుపతికొండమీద తల నీలాలు సమర్పించుకోవటం జనసమ్మర్దంలో తప్పిపోవటం భయంకరమైన దాదా దావూద్ ముఠా చేత చిక్కి అనేక క్రూరహింసలు పాలయి హైద్రాబాద్ జాగీర్దార్ సలీమ్ జనానాకు సపర్యలు చేయటానికి శాశ్వతంగా మగతనం పోగొట్టుకుని జేరటం. సలీమ్ జనానాలోని ఆడవాళ్ళ ఆకతాయి చేష్టలు భరించి పెద్దవాడవటం. జాగీర్లుపోయి, ఆస్తిపోయి సలీమ్ బికారి అవటం. వీధులపాలయిన తను శివగ్రూపులో చేరటం, శివ మరణం తర్వాత గ్రూపు లీడరవటం గుర్తొచ్చాయి 'సాంబ'కు.

"రెండు నిముషాల ముందు నాకు కనపడిన వ్యక్తి నా తమ్ముడు కాదుగదా? కాకపోతే

అతని లో నాపోలికలు ఎందుకుంటాయి?

నేను దిక్కులేని అనాథను కాను! నాకు అందరిలా అమ్మా నాన్నా వున్నారు! ఒక తమ్ముడు కూడా వున్నాడు. దాదా దావూద్. చేతిలో పడివుండకపోతే అందరిలానేనూ మామూలుగా జీవితం గడుపుతూ వుండే వాడిని! క్రాఫ్! సైడెబర్న్స్,పై పెదవి మీద సన్నని మీసం, బెల్బాస్ పాంట్ షర్ట్ వేసుకని స్టైల్ గా బజారులో తిరుగుతూ అందమైన అమ్మాయిలు ఎక్కడ కనపడతారా అని ఎదురు చూస్తూ వుండే వాడిని!

ఇందాక కనిపించిన తను నా తమ్ముడు కాదుకదా?" సాంబ మనసులో ఆ క్షణాన భయంకరమైన సంఘర్షణ మొదలైంది.

పరుగెత్తుకు వెళ్ళి తమ్ముణ్ణి కలుద్దామనే ఆతురత ఒకవైపు పెల్లుబకగా మరోవైపు "నా ఆకారాన్ని నన్ను చూచి తమ్ముడు నన్ను ఆదరిస్తాడా? అమ్మా నాన్నా నన్ను చూసి చీదరించుకుంటారేమో?!

ఒకవేళ వాళ్ళు నన్ను ఆదరించినా చుట్టుపక్కలవున్నవాళ్ళు నావంక అసహ్యంగా చూస్తారు! వేలెత్తి చూపుతారు! నేను ఎదురైతే కుష్టురోగి ఎదురైనట్లు పక్కకు తప్పుకుంటారు! నావల్ల నా వారికి అవమానం తప్ప మరేమీ దక్కదు!

ఒకవేళ నా అదృష్టం బాగుండి నన్ను అమ్మా నాన్నా ఆప్యాయంగా చూసుకుని, సంఘంలో నాకు తగు స్థానం దొరికినా నాకు మనశాంతి వుండదు.

నాలా కనుపించి నాలా ఆలోచించి నాలా ప్రవర్తించే నా గ్రూపు మధ్య వున్నప్పటి ఆనందం అప్పుడు వుండదు! నీటినుండి బయటపడ్డ చేపలా గిలిగిల కొట్టుకుంటాను.

తిట్టినా, కొట్టినా!, చీదరించినా, కసురుకొన్నా వదలకుండా నీడలా నన్ను వెన్నంటి వుండే నా ముఠాను వదలి వెళ్ళి నేను సాధించుకునేదేమీలేదు!

ఒకవైపు రక్తపాశం మరో వైపు స్నేహ బంధం. ఒకవైపు ప్రేమ బంధం మరోవైపు ఆకర్షణానుబంధం! మనసులో పువ్వెత్తున ఎగసిపడే విరుద్ధ భావ సంఘర్షణకు తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అయిపోసాగాడు సాంబ. వంటిమీద అయినుముక్క కరిగి నీరు కారినట్లు చెమట నీరు కారసాగింది. చేతివేళ్ళలో సన్నని వణుకుగా మొదలైన ప్రకంపన వళ్ళంతాపాకి విద్యుతాఘాతం తగిలినవాడిలా గజగజ వణికిపోసాగాడు. రత్నం, వెంకులు, సుందూ, శంకరి, సుబ్బు, దాసు, రాంజీలను దేశం నలుమూలలనుండి ఏరి తీసుకు వచ్చి సర్వ భ్రష్టులను చేసి నలీంజనానాలో జేర్చాడు దావూద్. నలీం ఆస్తి పోయి, జనానాను పోషించలేక దేశం వదలిపొయ్యాడు. బేగం లంతా చెట్టుకొకరు పుట్టకొకరైపొయ్యారు. బజారు పాలయిన భ్రష్టజాతిని శివ జేరదీసాడు. శివదగ్గరవున్న అనేక మంది భ్రష్టులలో తామూ కలిసి పొయ్యారు!



శివకు కోపం వస్తే హంటర్‌తో వళ్ళంతా కమిలిపోయేట్లు కొట్టేవాడు. బాధకు తాళలేక గిలగిల లాడుతుంటే అతని కళ్ళల్లో వింత ఆనందం మెరిసేది. సంతోషం వచ్చినా అంతే! కోడి పలావు, సారా తిన్నంత తాగినంత దొరికేది. ప్రతి ఫలంగా అతను చేయమన్న పనులన్నీ చేయాల్సి వచ్చేది. జేబులు కత్తిరించటం. చిల్లర దొంగతనాలు, దోపిడీలు, కాగజ్ మహల్ లోని అందమైన ఆడపిల్లల యవ్వనాన్ని కొందామనుకునే విలాస పురుషులను వెతికి వెంటతీసుకురావటం, కాగజ్ మహల్ నుండి తప్పించుకుపోయే పిట్టల్ని వెతికి పట్టుకువచ్చి బుద్ధివచ్చేలా చిత్రహింసలు పెట్టటం. వెర్రి తలలు వేసే శివ పశుకామవాంఛల్ని తీర్చుకోవటానికుపయోగపడటం. అసహజమైన అసహ్యకరమైన పనులను అతి సహజంగా చేయటాని కలవాటుపడి పోయాడు! శివకు సంతోషం కలిగినప్పుడు తగు బహుమానం లభిస్తుండేది! ఒకసారి..

"అరే సాంబా! మహల్ నుండి మాలతి, తప్పించుకుపోయింది! సిటీ నాలుగుమూలలూ గాలించి పట్రా! దొరికిన తర్వాత ఏం చేస్తావో నీయిష్టం!" అన్నాడు.

బస్టాండు, రైల్వేస్టేషన్, బజారు కూడలి ప్రదేశాలుగాలించి చూసాడు. సిటీబస్‌లో వెళ్తూ కనపడింది మాలతి! ఆటోలో బస్‌ను వెంబడించి మాలతి బస్ దిగగానే జబ్బ పుచ్చుకుని లాక్కు వచ్చాడు ఆటో దగ్గరకు.

"వదులునన్ను! రక్షించండి! హెల్ప్!" అని అరుస్తున్న మాలతి నోటిమీద చేయివుంచాడు. నీటి నొడ్డున గిల గిల కొట్టుకుంటున్న చేపలా గింజుకుంటున్న మాలతిని ఆటోలో వేసుకుని కాగజ్ మహల్ దగ్గరకు వచ్చాడు. కాగజ్ మహల్‌ను చూడగానే సాంబ చేయికొరికి పారిపోవాలని చూచింది మాలతి. మహల్ నుండి మందివచ్చి మాలతిని లోపలకు లాక్కువెళ్ళారు.

"శెభాష్ సాంబా! ఈ పిశాచాన్ని చీకటి కొట్లోకి లాక్కువెళ్ళు. నాలుగురోజులు ఖుషీదీరా అనుభవించు. బుద్ధి తెచ్చుకుని దారిలోకి వచ్చాక పాసింజర్లని పంపుదాం! "అన్నాడు శివ!

"వద్దు! నువ్వు చెప్పినట్లు వింటా! ఇంక మహల్ నుండి బయటకు వెళ్ళను!" ఏడుస్తూ శివ పాదాల మీద పడింది మాలతి.

"ఘాత్తైంది! లం..కానా! నిన్ను వెతికి తేవటానికి సాంబ ఎన్ని కష్టాలు పడ్డాడు! కష్టానికి తగ్గ ప్రతిఫలం వుండాలి! అయినా పట్టుబోయి పారేసి లోనకు వచ్చే ప్రతివాడికి ఉపయోగపడేముందు సాంబతో గదిలోనకెళ్ళాలంటే బయమెందుకే! ఛీ ఛీ! "అంటూ విసురుకొని బాయిలో మాలతిని ఒక్కతన్ను తన్నాడు శివ. ఎగిరి వెళ్ళి అవతలపడింది

మాలతి.

తల నేలకేసి బాదుకుంటున్న మాలతిని ఎత్తుకుని వెళ్ళాడు సాంబ. కాగజ్‌మహల్ కింద అంతస్తులో నేలమాళిగ గదివుంది. దాన్నే చీకటి కొట్టని అంటారు కూడాను. చీకటి కొట్టులోకి మాలతి నెత్తుకు వెళ్ళాడు సాంబ. ఆరంగుళాల వెంటిలేటర్ ద్వారా వచ్చే వెలుగు తప్ప ఆ గదిలోకి వెలుగురాదు. గది చల్లగా వేసవికాలంలో కూడా వణకుపుట్టేట్లు వుంటుంది. శివ అనుజ్ఞ అయితే లోపల లైటు వెలుగుతుంది, ఫాన్ తిరుగుతుంది. గది మధ్య కొయ్యబల్ల వుంది! మూలన కుండీలో నీళ్ళు వున్నాయి!

మాలతిని ఎత్తుకు వెళ్ళి గది మధ్యన వున్న కొయ్యబల్లమీద పడుకోబెట్టాడు సాంబ. తుఫానుగాలికి వణకిపోయే చిగురాకులా కంపించి పోసాగింది మాలతి.

"సాంబ! నీకు దణ్ణం పెడతా! నన్నేం చెయ్యకు!" వెక్కుతూ అంది మాలతి.

ఫక్కున నవ్వాడు సాంబ. భయంతో వణకిపోతున్న కుందేలుపిల్లను చూచి నవ్వే హాయినా లా వికృతంగా నవ్వాడతను!

నవ్వులాపి "ఛ! కాలక్షేపం చెయ్యకు! రా! దగ్గరకు రా! చూడు చెమటకంపుతో నీచీరె కంపుకొడుతుంది! చప్పున విడిచెయ్"

"వద్దు! వద్దు!" రెండుచేతులూ భుజాలమీద బలంగా ఆనించి సాంబ ప్రయత్నాని కడ్డుపడబోయింది మాలతి.

మాలతి ఆర్తనాదాలు సాంబలో విపరీతమైన శక్తిని కలిగించాయి. క్షణాలలో మాలతి చీరె చినిగి పీలికలై కిందపడిపోయింది. లంగా, జాకెట్, బ్రా అన్నీ ముక్కలుగా చిరిగి గది నాలుగు మూలలా చెల్లా చెదరుగా పడిపోయాయి.

నగ్నంగా పడివున్న మాలతిని చూడగానే సాంబ మనసులో చివుక్కుమన్నది! పంచభక్ష్య పరమాన్నాలను ఎదురుగా వడ్డించిన తర్వాత భోక్తకు పక్షవాతరోగం వచ్చి నోరుపడిపోయి నిస్సహాయంగా వుండిపోయినట్లు క్షణం నిస్సహాయంగా వుండిపోయాడు. పరువంతో మిసమిసలాడుతున్న మాలతి దేహాన్ని చూస్తూనే కసి, కార్పణ్యం, కక్ష పెరిగిపోయ్యాయతని మనసులో!

లాగి చెంపకాయకొట్టాడు సాంబ. అతని చేతి కాఠిన్యంలో అసురోచిత పశుబలం వచ్చింది! "అమ్మా!" అని అరవబోయిన మాలతికేక స్వరపేటికదాటి రాలేదు. విపరీతమైన బాధవలన కలిగిన షాక్‌తో మూర్ఛపోయింది మాలతి.

స్పృహతప్పి పడిపోయిన మాలతినేంచేయాలో తోచలేదు! కుండలో నీళ్ళు తెచ్చి ముఖంమీద చిలకరించాడు. అయిదు నిముషాలలో కళ్ళుతెరచి చూడసాగింది. అప్రయత్నంగా రెండు చేతులు జోడించి నమస్కరించిందామె మూర్తీభవించిన



దైన్యంలా, కాని సాంబలో ఏ మాత్రం కరుణ కలుగలేదు.

ఏం చేయాలిప్పుడు? "అనుకున్నాడు సాంబ. కాగజ్‌మహల్‌లోని అనేక గదులలో రాత్రిళ్ళు జరిగే కామకేళీకలాపాలను కిటికీ సందులలో నుండి చూచిన సాంబ మనసులో విపరీతమైన కోర్కెలు పైకెగసాయి. వంటికతుకున్న లుంగీ, లాల్చీ తీసి దూరంగావిసిరేసి మాలతిని తన కౌగిలిలో బిగించి గాఢంగా హత్తుకున్నాడు.

స్పృహకోల్పోతున్న మాలతి పెదాలను ముద్దెట్టుకున్నాడు. మాలతి శరీరం అంతా ముద్దుల వర్షంకురిపించసాగాడు. విటులు డబ్బుతో కొనుక్కున్న ఆడదాన్ని శరీరంలో ఏఏభాగాలను ముద్దిడుతారో గుర్తొచ్చిందతనికి!

అప్పుడే స్పృహవస్తున్న మాలతికి వంటిమీద గొంగళి పురుగులు పాకినట్లనిపించింది! కనులు తెరచి సాంబచేస్తున్న పనిని చూడగానే విపరీతమైన అసహ్యం జుగుప్స కలిగాయామెకు.

"ఛీ!" తుపుక్కున్న వూసిందతని ముఖంమీద!

"ఏం చేసావే భడవాఖానా!" అంటూ బలంగా చెంపమీద కొట్టాడు. మళ్ళీ స్పృహ కోల్పోయింది మాలతి.

సాంబ మనసులో కసి పెరిగింది. ముద్దులు పెట్టిన చోట కాట్లకుక్కలా కొరకసాగాడు!

"అమ్మోయ్" "బాబోయ్" "చంపుతున్నావురోయ్" పులిపంజాదెబ్బతిన్న లేడికూనలా గిలిగిల లాడిపోయింది మాలతి.

శరీరంలో కలిగే బాధకంటే సాంబను నగ్నంగా చూస్తున్నప్పుడు మనసులో కలుగుతున్న అసహ్యాన్ని భరించటం కష్టమైపోసాగిందామెకు!

పళ్ళు బిగబట్టి నొప్పి వోర్చుకుంటూ కళ్ళురెండూ గట్టిగా మూసుకుంది మాలతి!

సాంబ మనసులో విపరీతమైన కోపం కలిగింది. అతను ఏమైనా సహించగలడు గాని తనను చూచి ఎవరైనా జుగుప్సా భావం, అసహ్యం ప్రదర్శిస్తే వోర్చుకోలేడు. ఒక ఆడది పైసా కోసం వళ్ళమ్ముకునేది తనని చూచి అసహ్యించుకోవటం క్షమించరాని నేరంగా తోచిందతనికి.

"కళ్ళు తెరువ్!" గర్జించాడుసాంబ. అసంకల్పంగా కళ్ళు తెరచి చూచింది మాలతి! మరుక్షణంలోనే తీరని అసహ్యం జుగుప్సవలన కనులు మూసుకుంది!

"బజారు లం..కానా! కళ్ళు తెరువ్!" ఇంకా గట్టిగా అరిచాడు సాంబ.

మాలతి కనులు తెరువలేదు! బలంకొద్దీ ఆ చెంపా ఈచెంపా వాయించాడు. మాలతి తన సర్వశక్తులనూ కూడదీసుకుని కళ్ళు బలవంతంగా మూసుకునే వుంచింది!

''పదిరూపాయలు పారేస్తే ఎంత అసహ్యంగా వున్నవాడిపక్కనైనా జేరతావు! ఇప్పుడెందుకే నీలుగులుపోతావ్?!'' మాలతి వంటిని ఎడాపెడా బాదుతూ అరిచాడు సాంబ. కళ్ళు మరింత బలంగా మూసుకుంది మాలతి.

మాలతి కింద పెదవిని కసుక్కున కొరికాడు సాంబ. విపరీతమైన బాధ కలిగింది మాలతికి! గాయంనుండి రక్తం చుక్కలుగా కారసాగింది.

అతికష్టంమీద తనను తాను నిగ్రహించుకున్నది మాలతి. చురుకుమని కాలింది కింది పెదవి!

''అబ్బా!'' అంటూ కళ్ళు తెరించింది. వెలుగుతున్న సిగరెట్ కొనతో పగిలిన కింద పెదవి మీద కాల్చుతున్నాడు సాంబ.

మాలతి రెండు చేతులూ జోడించి నమస్కరించింది.

''నువ్వు చెప్పినట్లు చేస్తా! నన్నేం చెయ్యకు!''

''అయితే లేచి నాకో మంచిముద్దు ఇవ్వు!''

నిస్సహాయంగా, బేలగా చూచింది మాలతి.

''దూది గోతాంలా వుండే మార్వాడీ సేట్ అడగగానే వళ్ళంతా ముద్దులతో ముంచెత్తలేదేమే? ఎందుకు తటపటాయించావు?''

మార్వాడీ సేట్ గుర్తుకురాగానే గజగజవణికిపోయింది మాలతి!

నడి వయసు దాటుతున్న నట్వర్‌లాల్‌కు మూడో భార్య పోయి మూణ్ణెల్లయింది. మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని మహోత్సాహపడిపోయాడతను!

మూడుకోట్లకు అధిపతి నట్వర్‌లాల్ చిత్తచాంచల్యం గూర్చి లోకానికావరకే తెలిసిపోయింది!

వయసులో వుండగా విచ్చలవిడిగా తిరిగిన ఫలితంగా నడివయసురాకముందే 'శక్తి' కోల్పోయాడు సేట్. సేట్ మొదటి భార్య పది సంవత్సరాలు కాపురం చేసి వురేసుకు చచ్చింది. రెండో భార్య తొమ్మిది సంవత్సరాలు కాపురం చేసి విషం మింగి చచ్చింది. మూడో భార్య ఎనిమిది సంవత్సరాలు కాపురంచేసి కిరసనాయిలు పోసుకుని ముట్టించుకుని చచ్చింది!

ముగ్గురూ నిస్సంతుగానే చచ్చారు! నిజానికతనికి శారీరకంగా స్త్రీ అవసరం లేనిస్థితి కలిగాకే మొదటి భార్యను పెండ్లాడాడు!

శారీరకంగా భార్యను తృప్తిపరచలేడుగనుక మానసికంగా తనకు తృప్తికలగటానికై వింత ప్రవృత్తి నలవరుచుకున్నాడు నట్వార్‌లాల్.

కొరడా తీసుకుని భార్యను చితకబాది ఆమె గోడు గోడున ఏడుస్తుంటే విపరీతమైన



ఆనందం కలిగేది సేట్‌కు. చాకుతో వంటిమీదగాట్లు పెట్టి గాయాలమీద స్పిరిట్ వర్లి భార్య గిలగిలలాడుతుంటే పకపక నవ్వేవాడు!

భరించినవాళ్ళు భరించి ఆత్మహత్య చేసుకున్నారు అతని భార్యలు ఒకరి తర్వాత ఒకరు! పిల్ల నిచ్చే వాళ్ళు లేరని నిర్ధారించుకున్నాక కాగజ్‌మహల్‌కు వచ్చేవాడు సేట్. ఒకరాత్రి వచ్చాడు సేట్ అలవాటు ప్రకారం కాగజ్‌మహల్‌కు. అంత ఆస్తిపరుడు సేట్ వచ్చినందుకు వుబ్బి తబ్బిబ్బయి మంచి సందరసు క్యూలో నిలబెట్టాడు శివ!

ఒక మూలన గడగడలాడుతూ నిలబడ్డ మాలతి మీద సేట్ చూపులు నిలిచిపోయ్యాయి!

* * *

అంతకు కొద్ది నిమిషాలముందు హాలులోకి వస్తూ, కాగజ్‌మహల్‌లోని పూలమొగ్గలు ఒకరితో ఒకరనుకుంటున్న మాటలు గుర్తొచ్చాయి మాలతికి.

''హాల్లో కూర్చున్న సేట్ కళ్ళు ఎవరిని సెలెక్ట్ చేసుకుంటాయో వాళ్ళు చచ్చిన శవాల్లా తయారవుతారు పొద్దుటికల్లా!''

''ఏం?''

''వాడో ఎంత పశువు! అందరు మగాళ్ళు చేసేపని వాడు చెయ్యలేడు! అందుకు బదులు జేబులో హంటర్ పెట్టుకు వస్తాడు. ఆ హంటర్‌కు గాజుపొడి తుమ్మజిగురు అంటించి వుంటాయట. శివ కోరిన డబ్బిచ్చి కావాలనుకున్న పిల్లను గదిలోపలకు తెచ్చుకుంటాడు!''

''హంటరెందుకు?''

''ఎందుకా? బట్టలు విప్పి బాదటానికి! బాధతో గోడుగోడున ఏడుస్తుంటే దుమ్మలగొండిలా నవ్వుతాడు! చర్మం చిట్లి రక్తం వచ్చి చేకలు పెడుతుంటే చూచి సంతోషిస్తాడు!''

''అదేమిటే?''

''అదో రాక్షస ప్రవృత్తి! బాధతో ఏడుస్తున్న పిల్లవంటిమీద పడి కొల్లకుక్కలా కరుస్తాడు. తెల్లవారే సరికి సగం చచ్చి పీనుగలాగ తయారవుతుంది వాడు కోరుకున్నపిల్ల! భూలోకంలో యమలోకం రుచి చూస్తుంది!''

''అమ్మో! అయితే ఎలాగే?''

''ఏముంది! తెరగబడి కొరడా లాక్కుని వాడిని వాయగు బాదితే తిక్క తెలుస్తుంది!''

"ధైర్యముండి అంతపని చెయ్యాలేగాని...."

"అమ్మో! ఇంకేమైనా వుందా?"

"ఏం?"

"అంత మంచి పాసింజరును బాధ పెట్టినందుకు శివ చిత్రహింసలు పెడతాడు! సేట్ పెట్టే బాధల్ని మించి బాధిస్తాడు"

"కుందేలు పిల్లను చూచి మీదకు దూకబోయే తోడేలులా క్రూరంగా తనవంక చూస్తున్న సేట్‌ను చూడగానే గజగజలాడిపోయింది మాలతి.

ధగధగలాడే రవ్వల వుంగరాలతో నిండివున్న ఎడమచేతి చిటికిన వేలిని మాలతి వైపుగా చూపాడు సేట్!

మాలతి తప్ప మిగిలిన వాళ్ళందరూ నిట్టూర్చి సంతోషంగా వెళ్ళిపోయారు!

పెనుగాలికి కంపించే లేత అరటి ఆకులా గడగడ వణికిపోతున్న మాలతిని గదిలోకి నెట్టాడు వెంకులు!

కుడి ముంజేతికి చుట్టుకున్న విరజాజి మాలను వాసన చూస్తూ లోపలకు వచ్చాడు సేట్! సేట్ లాల్చీ మీద సెంట్ స్ప్రే చేసి విస్కీ సీసాలోంచి గ్లాసులోకి వంపి తగు మాత్రం సోడా కలిపి బయటకు వెళ్ళిపోయాడు వెంకులు"

పోతూపోతూ తలుపు వెలుపల గడివేసి మరీ వెళ్ళాడతను.

తలవంచుకుని నిలబడి వున్న మాలతి వంక తదేకంగా చూస్తూ విస్కీ చప్పరిస్తూ—

"నీ పేరేపిటి చిలకా?" అని అడిగాడు సేట్. ఉరుము వురిమినట్లు వున్న అతని కంఠధ్వని విని భయంతో తల మరీ దించుకుంది మాలతి.

"నిన్నే పిలిచేది!" మేకపిల్ల మెడ నరకబోయే కసాయివాడి గొంతులా వినపడింది సేట్ గొంతు మాలతికి.

తల ఎత్తి చూసింది మాలతి. నీటి పొరలు నిండి నకములనుండి బేలగా చూస్తున్న మాలతిని చూచి కైపెక్కుతున్న సేట్ మనసులో ఉషారెక్కువైంది.

"రావే చిలకా!" అన్నాడు మంచంమీద తన పక్కన చోటు చూపిస్తూ.

రెండు చేతులూ జోడించి అతనికి దణ్ణం పెట్టి "నన్నేం చేయకు సేట్ జీ!" అంది పరమ దీనంగా!

"నన్నేం చెయ్యకు!" అని కసాయివాడిని ప్రార్థించే మేకపిల్ల గొంతులా వినపడిందామె గొంతు!

ఫక్కున నవ్వాడు సేట్. "ఒక్కరాత్రికి శివకు రెండు వేలిచ్చాను! ఏం చెయ్యకు



అని నువ్వంటున్నావు!" అన్నాడు గోముగా.

పరిగెత్తుకు వెళ్ళి సేట్ కాళ్ళమీద పడింది మాలతి. "నీ కూతురులాంటిదాన్ని. నన్నేం చెయ్యకు!" కన్నీటి ధారతో సేట్ పాదాలు తడిపింది.

"మాదర్చేద్! ఏం కూశావ్!" ఎడంకాలితో తన్నాడు సేట్. ఎగిరివెళ్ళి ఆవతల పడింది మాలతి. తలగోడకు కొట్టుకుని బొప్పికట్టింది.

"అన్నా నీ చెల్లెల్ని! నన్నేం చెయ్యకు!" కుప్పించి దూకబోయేముందు దుమ్ములగొండి నవ్వినట్లు పరమ భయంకరంగా నవ్వాడు సేట్.

విస్కీ గ్లాసు విసిరికొట్టి ముందుకు నడిచాడు. ద్రౌపది వలువలూడ్చే ముందు దుశ్శాసనుడి కళ్ళల్లో మెరిసే నవ్వులాంటి నవ్వు అతని కళ్ళల్లో కనపడింది.

"వద్దు! వద్దు" అంటూ గింజాకుంటున్న మాలతి మీద పడి వలువలూడ్చివేశాడు.

నేలమీద గొంతుకు కూర్చుని రెండు చేతులూ మోకాళ్ళ చుట్టూ పోనిచ్చింది మాలతి. భయంతో సిగ్గుతో అవమానంతో ఆమె తల కుంచించుకుపోయింది.

లాల్చీ జేబులోంచి కొరడా తీసాడు సేట్. అనేకమంది అబలల రక్తంతో తడిసి ఎర్రబారిన కొరడా విదిలించి బలంకొద్దీబాదాడు మాలతిని.

సన్నని కత్తితో చర్మంకోసినట్లు బాధ కల్గింది ముందు. ఆ తర్వాత వంట్లోకి కరెంటు వెళ్ళినట్లు విపరీతమైన మంటపుట్టింది.

కెవ్వున అరచి తల ఎత్తింది మాలతి! ఆమె ముఖంలో కనపడుతున్న భయవిహ్వలతను చూచిన సేట్‌కు పరమానందం కలిగింది.

కొరడా "ఛెళ్! ఛెళ్"మని నాట్యంచేస్తూ మాలతి శరీరాన్ని రక్తం ముద్దలా చేసివేసింది!

బాధతో గిలగిల కొట్టుకుని సొమ్మసిల్లింది మాలతి. స్పృహ తప్పి పడిపోయిన మాలతిని ఎత్తుకొని వచ్చి మంచంమీద పడుకోబెట్టాడు సేట్. స్పృహతప్పి — ఒళ్ళంతా కందిపోయి — నలిగిన పువ్వులావున్న మాలతి నగ్నదేహ వీక్షణం అతనికి విపరీతమైన ఆనందాన్నిచ్చింది! మోహాతిశయం పెచ్చుమీరి మాలతి శరీరంలోని వివిధ భాగాలను అలవోకగా స్పృశించసాగాడు!

వంటిమీద బల్లి పాకినట్లు పాకుతుంటే మెలకువ వచ్చింది మాలతికి! సేట్ చేస్తున్న పని చూసి విపరీతమైన అసహ్యం కల్గి భొళ్ళున వాంతి చేసుకుంది! వమనం వెళ్ళి సేట్ వంటిమీద పడింది.

విపరీతమైన కోపంతో వూగిపోతూ "సూవర్ కే బచ్చే" అంటూ మాలతిని ఒక్క తన్ను తన్నాడు సేట్. మంచంమీద నుండి దూరంగా వెళ్ళి పడింది మాలతి! తల

గోడకు కొట్టుకుని దిమ్మెరపోయింది.

పిల్లిపిల్లను గది మూలకు తరిమికొట్టబోతే ఏం చేస్తుంది? ఎదురుతిరుగుతుంది! తల దిమ్మెక్కి తేరుకున్న మాలతిలో విపరీతమైన కోపం ప్రజ్వరిల్లింది: కిందమున్న కొరడా అందుకుంది.

వంట్లో వున్న శక్తినంతా కూడదీసుకుని కొరడాతో బలంకొద్దీ సేట్‌ను బాదింది.

విస్కీ సీసాలోంచి నీటుగా విస్కీ తాగుతున్న సేట్ వంటిమీద పిడుగుపాటులా పడింది కొరడాదెబ్బ.

"బాప్‌రే!" కెవ్వున అరిచాడు సేట్. అతని చేతిలో విస్కీసీసా వెళ్ళి అవతల పడింది.

మహిషాసురుడిపై విరుచుకుపడ్డ కాళికలా విజృంభించింది మాలతి! సేట్ వంటిమీద వున్న లాల్చీ పంచె చివిగి పీలికలైనాయి! రక్తం వోడుతున్న శరీరంపై అవిరళంగా వచ్చి పడుతున్న కొరడా దెబ్బలకు గోడుగోడున విలపించసాగాడు.

జేబులోని డబ్బుల కట్ట మాలతివైపు విసిరాడు. రెండు చేతులూ జోడించి నమస్కరించాడు! మాలతికోపం చల్లారలేదు! ఆమె బడుగు దేహంలో అంతులేని శక్తి పెంపొందసాగింది.

దూది గోతాంలాంటి సేట్ శరీరం చింతపండు ముద్దలా మారిపోయింది. సేట్ వచ్చి మాలతి పాదాలు పట్టుకోబోయాడు. వెనక్కు జరిగింది మాలతి. తూలి బోర్లబొక్కలా పడిలేచి గది తలుపువైపుగా పరిగెత్తాడు.

విస్కీ సీసాతో సేట్ నడినెత్తిన బాదింది మాలతి! కుప్పకూలిపోయాడు సేట్!

కిందపడివున్న చీరె లంగా జాకెట్ తీసుకుంది. క్షణంలో అవి ధరించి సేట్ తన మీదకు విసిరిన నోట్లు కొన్ని తీసుకుంది. గది తలుపుతీసింది! బయట ఎవరూ లేరు! సాధారణంగా సేట్ తెల్లవారాక గానీ ఇంటికి వెళ్ళడు! అందుకని బయట ఎవరూ కాపలా లేరు!

బయట ఎవరూ కనపడలేదన్న సంతోషంతో పరుగెత్తుకు వెళ్ళింది మాలతి. తెల్లవారిందాక దిక్కు తెలియకుండా పరిగెడుతూనే వుంది! కాని ఏం లాభం? సాంబ చేతికి చిక్కింది.

తోడేలు బారినుండి తప్పించుకు పారిపోయివచ్చి పెద్దపులి చేత చిక్కింది!

సేట్ జ్ఞాపకాలు గుర్తొచ్చి తలతిరిగి పడిపోయింది మాలతి!

సాంబ వేలమాలిగలో లైటు ఫాన్ వేశాడు. విస్కీ సోడా కలిపి కొద్దికొద్దిగా మాలతి నోటిలో పోయసాగాడు! అరగంట ఉన్నాక తేరుకుంది మాలతి!



మాలతి సాంబ చేతిలో వారం రోజులపాటు చిత్రహింసలు పడింది! ఆ వారంరోజులలోను కొన్ని జన్మలకు సరిపడా బాధలు భరించింది. గాట్లు పడిన శరీరం రాటుతేలిన మనసుతో మళ్ళీ కాగజ్‌మహల్ గదులలోకి జేరిపోయింది. ఆ తర్వాత ఆమె గదికి వెళ్ళిన ఏ పాసింజరూ కంప్లైయింట్ ఇవ్వలేదు శివకు.

శివ అండలోవున్న సాంబ ముఠాకు ఏ లోటు రాకుండా జరిగిపోయింది కొన్నాళ్ళు! శివకు దాదాహరికి తగాదా వచ్చింది! దాదాహరి శివను నడిబజారులో నరికివేశాడు. సాంబ ముఠా దిక్కులేని వాళ్ళయి వీధి పాలయ్యారు. వికృత చేష్టలతో వికార ప్రవర్తనతో నలుగురికీ వినోదం కల్పించి పొట్టపోసుకోవడాని కలవాటు పడి వూరూరూ వీధివీధీ తిరుగుతూ గుంటూరు వచ్చారు.

గత స్మృతుల జ్ఞాపకాలనుండి బయటపడ్డాడు సాంబ! గుంటూరు అరండల్‌పేట మారుమూలన వున్న లాడ్జి వెనుక గదిలో కాంప్ కాట్ మీద పడుకుని కళ్ళవెంట నీళ్ళు కారుస్తున్న సాంబను చూచి ముఖాముఖాలు చూసుకున్నారు అతని గ్రూపు వాళ్ళు. అందరికంటే చిన్నవాడు రాంజీ ముందుకు వచ్చాడు.

"ఎందుకన్నా ఏడుస్తున్నావు?" అని అడిగాడు సాంబను.

"ఏం లేదురా! పాత విషయాలు యాదొచ్చాయి" అని బదులు చెప్పాడు సాంబ.

"అన్నా!" అని ఏడుస్తూ సాంబను కావిలించుకుని విలపించసాగాడు రాంజీ!

క్షణాలలో రత్నం, వెంకులు, సుందూ, శంకరి, సుబ్బు, దాసు, రాంజీ సాంబ చుట్టూ చేరారు.

అందరి కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. "అన్నా" అంటూ రోదించసాగారు వాళ్ళంతా.

మామూలుగా వుల్లాసంతో కేరింతలు కొట్టేవాళ్ళందరూ అప్పుడప్పుడూ విపరీతమైన మనోవేదనకు గురవుతుంటారు! భూతకాలం జ్ఞాపకాలు – సభ్య మానవ ప్రపంచ సభ్యులుగా తాము వున్నప్పటి సంగతులు గుర్తొచ్చి విపరీతమైన వ్యధకు లోనవుతుంటారు వాళ్ళు!

వెక్కుతూనే వెంకులు "ఏడవకన్నా!" అంటూ సాంబ కాళ్ళు వత్తసాగాడు.

"ఓరన్నా! దిష్టి తగిలిందిరా!" అంటూ మెటికలు విరిచాడు రత్నం!

"సుక్కేసుకోరన్నా!" అంటూ బిస్కెట్ బ్రాందీ సీసాలోని ద్రవాన్ని గ్లాసులో పోసి నీళ్ళు కలిపి తెచ్చాడు సుందూ!

"వీధీ వీధీ తిరిగి మెడపట్టే వుంటుంది" అంటూ మెడమీద మసాజ్ మొదలెట్టాడు శంకరి.

"ఏడవకన్నా!" గడ్డం పుచ్చుకు బతిమిలాడాడు సుబ్బు.

"ఈ వూరునుండి మకాం మార్చుదాం! ఎండమాడ్చుతుంది, తిండి కారంతో మండుతుంది— అన్న ఏడ్పుచూస్తే కడుపులో మండుతోంది!

ఎల్లిపోదాం! ఈడ వుండనే వొద్దు! మనబోటి చింబోతులకు ఏ ఊరైతేనేం?" అన్నాడు దాసు.

దాసును కావిలించుకుని బావురుమన్నాడు సాంబ! ఒక్కసారిగా అందరూ గోడుగోడున విలపించసాగారు. వీళ్ళ ఏడ్పులు విని పరిగెత్తుకువచ్చాడు లాడ్జి ఓనరు.

"ఏంది మీ ఏడ్పు! పక్కగదుల్లో పాసింజర్లు వుండాలా వద్దా?" అని గదిమాడు.

ముక్కుతూ మూల్గుతూ మూటలు సర్దుకున్నారందరూ! మూడు నిమిషాల్లో లాడ్జి ఖాళీచేసి రైలు స్టేషన్ వైపుగా నడిచివెళ్ళసాగారు వాళ్ళు! ఈ ప్రపంచంలో వాళ్ళకు ఎన్నోరకాల సుఖాలు అందుబాటులో లేకున్నా మిగిలివున్నది అతిగాఢమైన స్నేహ బంధం ఒక్కటే! ఒకరికి బాధ కల్గితే అంతా ఏడుస్తారు. ఒకరికి సంతోషం కల్గితే అందరూ ఆనందిస్తారు! అదే వారి ప్రత్యేకత!

* * *

చినికి పీలికలైన చొక్కాతో ముఖం మాడ్చుకు ఇంటికి తిరిగి వచ్చిన సుమంత్‌ను వాకిట్లోనే నిలవేసింది రాణి. "ఏమిటా వేషం! ఏ పిల్ల వెంటయినా బడితే వళ్ళు సాపు చేశారా ఏం?" అంది ఈసడింపుగా.

"లేదు రాణీ! బజారునుండి వస్తుంటే రిక్షావాడు డాష్ ఇచ్చాడు!" బెదురుబెదురుగా అన్నాడు సుమంత్

"నీ బుద్ధి నాకు తెలవదా ఏం? పద లోపలకు! ఇక్కడ నిలబడితే వీధిలో వాళ్ళందరకూ నీ విషయం తెలుస్తుంది" రాణి మాటలు వింటూంటే పిడుగులు మీద పడ్డట్లనిపించింది సుమంత్‌కు.

తలవంచుకుని లోపలకు వెళ్ళి బట్టలు మార్చుకుని కుర్చీలో కూర్చుని పుస్తకం తెరిచాడు సుమంత్. "సుందరితో ప్రేమ వ్యవహారం బయటపడిన దగ్గర్నుండీ రాణి మామ సుబ్బయ్య వచ్చి గుంటూరులో తిష్ఠవేశారు"

తల్లీతండ్రీ వద్దన్నా వినకుండా కోటేశ్వరుడు సుబ్బయ్య కూతురు రాణిని వివాహం చేసుకున్నాడు సుమంత్. చింతపండు బస్తామీద చిన్నరాగి కాగు బోర్లించినట్లుండే రాణి, ఆస్తిని ఇష్టపడినట్లు రాణి రూపాన్ని ఇష్టపడలేకపోయాడతను. మొదటిరాత్రి



మోహావేశంతో దగ్గరకొచ్చిన రాణిని చూసి వాంతి చేసుకున్నంత పనయిందతనికి!

"ఏమిటి అలా వున్నారు?" అని అడిగింది రాణి.

"ఏంలేదు! తలనొప్పిగా వుంది!"

"అట్లాగా! వుండండి అమృతాంజనం రాస్తా!"

అమృతాంజనం నుదురుమీద రాస్తూ మీదకు వంగింది రాణి! రాణి దేహం తన శరీరాన్ని తాకగానే వంటిన సాలీళ్ళు పాకినట్లు వికారంగా అనిపించింది సుమంత్‌కు.

అమృతాంజనం రాస్తూ తన వంక ఆత్రంగా చూస్తున్న రాణిని చూస్తే పంచదార ఛిలుకను తినబోతూ ఆత్రంగా చూస్తున్న ఆడపిల్ల గుర్తొచ్చింది సుమంత్‌కు. పెచ్చుమీరుతున్న వికారాన్నణుచు కోవటానికై కనులు మూసుకున్నాడు సుమంత్.

"సుమన్!" సుత్తితో బలంగా రాతిపై మోదినట్లు వినపడిందామె కంఠధ్వని. కళ్ళు మరింత గట్టిగా మూసుకున్నాడు.

సన్నగా పెన్సిల్‌తో తీర్చిదిద్దినట్లున్న అతని మీసాన్ని బారుగాపెంచుకున్న చిటికిన వేలి గోరుతో సవరిస్తూ "సుమన్!" అంది రాణి.

కర్ణకఠోరంగా వినపడుతున్న కంఠధ్వనికి తోడు పరమ జుగుప్సాకరంగా వున్న ఆమె స్పర్శకు సుమంత్ బొళ్ళున వాంతి చేసుకున్నాడు.

భర్త వాంతి చేసుకోవడం చూసి భయపడిపోయింది రాణి!

"నాన్నా!" అంటూ ఎలుగెత్తి ఏడవసాగింది.

"ఏమ్మా ఏమయింది?" తలుపుదగ్గరకొచ్చి అడిగాడు సుబ్బయ్య.

పరుగున వెళ్ళి తలుపు తెరిచి "సుమన్‌కు జబ్బు చేసింది!' అంటూ తండ్రిని కావిలించుకుని బావురుమంది.

నిమిషాలమీద డాక్టరు వచ్చాడు. సంగతి విని మనసులో నవ్వుకుని ఏవో మందులిచ్చి వెళ్ళిపోయాడు!

రాణి ఎప్పుడు సుమన్‌కు దగ్గరయినా మొదటిరాత్రి జరిగిన విషయాలే పునరావృతం అయేవి. కాకపోతే ఒకసారి కడుపునొప్పి, మరోసారి కాళ్ళుతీత! ఇంకోసారి నడుంపోటు ఇలా రకరకాల బాధలు పట్టుకునేవతనిని. పట్టువదలని విక్రమార్కుని సోదరిలా గోముగా, ఆత్రంగా, ఆబగా, ఆశగా దగ్గర జేరే భార్యను దూరంగా వుంచటానికి సుమంత్ సర్వశక్తియుక్తులూ చాలేవి కావు!

సుమంత్ ఏదో నెపంతో రాణిని దూరంగా అట్టిపెట్టిన కొద్దీ మరింత దగ్గరకు వచ్చేదామె!

అమ్మాయి బాగుండదు! డబ్బు కోసం చూసుకుంటే తర్వాత బాధ పడతావు!

అయినా ఇప్పుడు మనకేం తక్కువ?" అని తల్లి చెప్పినమాటలుగుర్తొచ్చాయి సుమంత్‌కు. అప్పుడామె మాటలు లక్ష్యపెట్టలేదు.

"డబ్బుతో అందం, ఆనందం కొనుక్కోవచ్చు. రాణి మూలవిరాట్టులా ఇంట్లో పడివుంటుంది, సమయం కొద్దీ సరదా కొద్దీ ఉత్సవ విగ్రహాలను ఎన్నిటినయినా జేరదీసి ఊరేగవచ్చు." అనుకున్నాడప్పుడు!

కాని రాణిని వదిలించుకునేదెలా? అందుకోసం అది వరలో ఎప్పుడూ చదువుమీద శ్రద్ధలేని సుమన్ బి.ఎ చదువుతానని బెజవాడ కాలేజిలో జేరి కంటికి నచ్చిన అందాన్ని కొరుక్కుతింటూ కాలక్షేపం చేశాడు. ఎలా పసికట్టిందో రేచు కుక్కలా వచ్చి పడింది రాణి! ఊరూనాడు ఏకం చేసి పారేసింది.

బి.ఎ అయిపోయింది. ఎం.ఎలో జేరే నెపంతో గుంటూరు వచ్చాడు సుమన్. బంగారు తీగెలాంటి సుందరిని ఆకర్షించి కావల్సిన ఆనందాన్ని పొందాడు! ఇంతలో పిడుగుపాటులా వచ్చి పడింది రాణి! రసకందాయప్పట్టులో వున్న దాన్ని రసాభాసం చేసేసింది. సుందరి ధుమ్మన చచ్చింది. సుందరి తండ్రి దయ్యంలా బజారులో పట్టుకున్నాడు! అతని చేతుల్లోంచి తప్పకుని వస్తుంటే "తమ్ముడూ" అంటూ ఎదురుగా వచ్చి నిల్చున్నాడు వింత ఆకారం!

చిన్నప్పుడు అన్న తిరుపతిలో తప్పించుకు పోయాడని చెప్పేది అమ్మ! అతనేమైనా భ్రష్టుపట్టి ఇలా తయారయ్యాడా?

రాణి ఆస్తిని చూసి ఆమెను పెండ్లాడాడు! కాని ఆమె డబ్బు దగ్గర మహా జాగ్రత్తగా వుంటున్నది! అన్ని విషయాలు నేను చెప్పినట్లు చేయాలి అన్నట్లు ప్రవర్తిస్తున్నది! శరీరకంగా దూరంగా వుంచిన కొద్దీ మనసులో కక్ష పెంచుకుని జీవితం నరకం చేస్తున్నది. ఆమె ఆస్తి నేను అనుభవించే అవకాశం లేదు!

బజార్లో కనపడ్డ కొజ్జా "నేను నీ అన్నను!" అంటూ ఇంటికి వస్తే తల్లీ తండ్రీ ఆదరిస్తే సగం ఆస్తికి అతను వారసుడవుతాడు!"

సుమన్ మనసు సుడిగుండంలో చిక్కుకున్న నావలా గిరగిర తిరిగిపోసాగింది! ఊపిరి ఆడనట్లు అనిపించిందతనికి. ఉక్కగా వుందని గది కిటికీ తలుపులు తెరిచాడు సుమంత్! వెనక మేడమీద పదహారేళ్ళ పడుచుపిల్ల మందారం మొగ్గలా నిలబడి వుంది!

"ఇంటి వెనుక ఇంత అందాన్ని అట్టిపెట్టుకుని మనసులో దిగులుపడటం ఎందుకు?" కారుమబ్బులు మధ్య మెరపు మెరసినట్లు సుంమత్ మనసులో కొత్త ఆశ చిగురించింది.

"ఇదిగో కాఫీ! ఇంకా ఆ పేలికరిక్కడెందుకు?" అంటూ కాఫీగ్లాసు బల్లమీదుంచి



చివిగి పీలికలైన సుమంత్ చొక్కా తీసుకుని వెళ్ళబోతూ "ఏంది! కిటికీలోంచి అదేపనిగా చూస్తున్నావు?" అంటూ కిటికీ దగ్గరకు వెళ్ళి మేడమీద అమ్మాయిని చూసి దడాలున కిటీ తలుపులు మూసి—

"ఇదా నువ్వు చేస్తున్న పని? లక్షణంగా పెళ్ళిచేసుకున్నావు. ఇంట్లో చెట్టంత పెళ్ళాన్ని ఉన్నాను! నాకేం కన్ను వంకరా కాలు వంకరా? పై తిరుగుళ్ళు మొదలెట్టావు—తన్నులు తిన్నావు? ఇకనైనా బుద్ధిగా వుండు" అంటూ గున్న ఏనుగులాగున నడుస్తూ కిందకు వెళ్ళిపోయింది.

అరగంటయిన్నాక తిరిగివచ్చి "ఇదుగో! నేను కూరలు తేవటానికి మార్కెటుకు వెళ్తున్నా?" అని చెప్పి వెళ్ళిపోయింది. రాణి వెళ్ళగానే చప్పున కిందకు దిగి వెళ్ళాడు సుమంత్!

వీధి తలుపు బయట తాళం వేసి వెళ్లింది రాణి. కోపంతో పళ్ళ నూరాడు. కాసేపు కిందహాల్లో అటూ ఇటూ తిరిగి మళ్లీ మేడమీదికి వెళ్లాడు. వెనుక కిటికీ తలుపు తెరిచి మేడమీద అమ్మాయి కనపడుతుందేమోనని చూచాడు. కిటికీ తలుపు తెరచిన చప్పుడు విని బయటకు వచ్చిందా అమ్మాయి. సుమంత్ వంక పరిశీలనగా చూడసాగింది.

అందమైన ఆడపిల్లను చూడగానే సుమంత్ మనసులో గూడుకట్టుకుపోయిన నిరాశ, దిగులు, అసహనం పటాపంచలయిపోయాయి. సంతోషంతో పొంగిపొరలుతున్న సముద్రాన్ని చూచి పూర్ణిమాశర్వరుంమ వెదజల్లుతున్న చంద్రునిలా అతని ముఖం వెలిగిపోసాగింది.

కోడె వయసు కుర్రవాడు నవ్వుతూ చూస్తుంటే పడుచుపిల్ల మనసులో పూలజల్లు కురిసింది.

ఒకరినొకరు చూసుకుంటూ అలాగే నిలబడిపోయారు.

కింద తాళం కప్ప తెరిచినట్లు అలికిడి అయింది సుమంత్ చేయి గాలిలో పూపాడు, అమ్మాయి ముఖంలో ఆనందరేఖలు వెల్లివిరిసాయి. గాలిలో ముద్దుపెట్టి వెనుదిరిగాడు సుమంత్. కిటికీ తలుపులు దగ్గరకు వేశాడు.

నెమ్మదిగా నడిచివెళ్ళి కుర్చీలో కూర్చుని ముఖం ముందు పుస్తకం పెట్టుకున్నాడు. అతనూహించినట్లే రెండు నిమిషాలలో రాణి వచ్చింది పైకి.

వెనకవైపు కిటికీ తలుపులు వేసి వుండటం చూసి ఆమె మనసు కుదుటపడింది. "అమ్మయ్య" అనుకుని కిందకు వెళ్ళిపోయింది.

సుమంత్ రెండంగల్లో కిటికీ వద్దకు జేరాడు, అరక్షణంలో కిటికీ రెక్కలు తీసాడు. ఆ అమ్మాయి నిలబడి ఇటుకేసి చూస్తూనే ఉంది. విప్పారిన పద్మాల్లాంటి ఆమె

నేత్రాల్లో కనపడ్డ భావాలు సుమంత్‌కు సంతృప్తినిచ్చాయి!

అప్పటివరకు కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిల కొట్టుకున్న సుమంత్ మనసులో ఆశాకిరణం తళుక్‌మంది. మనసులో అనుకున్నది కార్యరూపం ధరించాలంటే ఒకసారి బజారుకు వెళ్ళి మందుబిళ్లలు తేవాలి! రాణి ప్రస్తుతం ఉన్న మూడ్‌లో తనను బయటకు వెళ్లనిస్తుందా? చూద్దాం! అనుకుంటూ కిందకు దిగాడు సుమంత్. వీధి గదిలోకి వెళ్లగానే.

"ఎక్కడికీ బయల్దేరావ్?" వంటింట్లోంచి అరుచుకుంటూ వచ్చింది రాణి.

"ఏం లేదు రాణీ! కొంచెం తలనొప్పిగా ఉంది! బయటకి వెళ్లి కాఫీ తాగి వద్దామని!"

"కాఫీ కావాలంటే బయటకెళ్లాలా? కూర్చో! నిముషంలో చేసి తెస్తా!" గుర్రుముతున్న రాణి మాటలు పిడుగుల్లా వినపడ్డాయి. కుర్చీలో కూలబడిపోయాడు సుమంత్.

ఇది సీరియల్
నవలా పథకం
మొగలి పువ్వంటీ మూడవ భాగం

* *

# ఆంధ్రభూమి
## సచిత్రవారపత్రిక
### సీరియల్ నవలా పుస్తక పథకం—6

## 4

# మొగలీ పువ్వంటీ
## డాక్టర్ కొత్త రవీంద్రబాబు

### జరిగిన కథ

అమరావతి పిక్నిక్‌కని వస్తారు
ఎమ్.ఏ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు.
శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ
ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు.
షాలిని మేడమ్ అంటే
విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి
కృష్ణ ఆవలి వడ్డుకు వెళ్ళివస్తూన్న నీలను
పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్.
షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ
స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది.
సుందరి గొడవ తెలిసి సుమంత్‌ను తనతో
తీసికెళ్ళి పోతుంది అతని భార్య రాణి.



# 4

"అరే సుమంత్!" తలుపు తడుతున్న రాజేష్ పిలుపు విని ప్రాణం లేచి వచ్చింది సుమంత్‌కు.

"ఎవరు? అంటూ వచ్చి తలుపు తెరిచి "నువ్వా రాజన్నయ్యా! రా కూర్చో! కాఫీ తెస్తా" అంటూ లోపలకు వెళ్లింది రాణి.

"అరే! పది డైజిఫాం బిళ్లలు తెచ్చివ్వరా! నీకు పుణ్యముంటుంది?" నెమ్మదిగా అడిగాడు సుమన్.

"ఎందుకురా?"

"తలనొప్పిగా వుండి నిద్ర పట్టడంలేదురా!"

"దానికంత రహస్యమేంటిరా?"

"మీ చెల్లెమ్మ ప్రతిదానికీ ఆంక్షలు పెడుతున్నది. నేను బజారుకు పోయే వీలు కూడా లేదురా!"

రాణి ఇచ్చిన కాఫీ తాగి ఐదు నిమిషాలలో వెళ్లిపోయాడు రాజేష్. వెళ్లేముందు "అరేయ్ కళా పూర్ణోదయం నోట్సు తెచ్చివ్వరా!" అని అన్నాడు సుమంత్ కన్ను గిలుకుతూ!

"అలాగే రా" అంటూ వెళ్లి పది నిమిషాలలో తిరిగివచ్చి నోటుబుక్కు మధ్య డైజీ ఫాం బిళ్లలుంచి ఇచ్చివెళ్లాడు రాజేష్. మేడమీదకు వెళ్లి నాలుగు బిళ్లలు పొడిచేసి చిన్న కాగితంలో పొట్లాం కట్టుకువచ్చాడు. వంటగదిలోకి తొంగి చూశాడు. వంట పూర్తయి స్నానానికి వెళ్లింది రాణి. పొట్లాంలో పొడి చారుగిన్నెలో వేసి వెళ్లిపోయాడు సుమంత్.

గంట ఉన్నాక భోజనానికి పిలిచింది రాణి.

"కడుపులో మంటగా వుంది! ఈ పూట చారు వేసుకోను" అన్నాడు సుమంత్.

"అయ్యో! ఏమిటి ఆ తిండి! సరే ఈపాలు త్రాగండి" అంటూ పాలగ్లాసు ఇచ్చింది రాణి. పాలుతాగి పైకెళ్లిన సుమంత్ గంటలో తిరిగి వచ్చాడు.

రాణి సోఫామీద పడుకుని నిద్ర పోతున్నది. బోనియం రికార్డు మ్యూజిక్‌కు



అనుగుణంగా ఈలవేస్తూ ఇంటి వెనక్కు వెళ్లాడు సుమంత్. డాబా పిట్టగోడ కలిపి దాదాపు పదమూడు అడుగుల ఎత్తుగా ఉన్నట్టుగా కనపడింది. అంత ఎత్తు ఎక్కడం ఎలా? నాలుగడుగుల ఎత్తున కిటికీపైన జల్లు కొట్టకుండా సిమెంట్ స్లాబ్ పోసి వుంది. పుల్‌అప్స్ తీసినట్లు స్లాబ్ అంచును పట్టుకుని పైకెగిరాడు సుమంత్. కిటికీపైనస్లాబ్‌మీదకు ఎక్కి నిటారుగా నిలబడ్డాడు. రెండు చేతులూ నెత్తిమీదుగా చాచాడు. పిట్టగోడ అంచు తగల్లేదు. సరిగా అడుగున్నర రెండడుగులు వుంటే పిట్టగోడ అంచు అందుతుంది. స్లాబ్‌మీదనుండి ఎగిరితే పిట్టగోడ అంచు అందుకోవచ్చేమో అనిపించింది. రిస్క్ అయినా అలా చేద్దామనుకున్నాడు. జాగ్రత్తగా పైకెగిరాడు సుమంత్. పిట్టగోడ అంచు అందక మళ్లీ కిందకు జారాడు. గోడ అంచునే జారడంతో వళ్లు గీరుకు పోయినట్లయింది. కిటికీపై స్లాబ్‌మీద నిలబడి దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు! కళ్లు తిరిగినట్లనిపిస్తే కళ్లు మూసుకున్నాడు. వంటిమీదుగా ఏదో పాకుతున్నట్లనిపించింది. ఉలికిపడి కళ్లు తెరిచాడు. పిట్టగోడ మీదనుంచి నైలాన్ తాడు కిందకు జారుతున్నది. సున్నం కొట్టిన పిట్టగోడ అంచునుండి తెలి మబ్బు చాటునుండి దర్శనమిస్తున్న చంద్రబింబంలా అమ్మాయి ముఖం కనబడింది. పైకెగబాకటానికి వదలిన నైలాన్‌తాడు అమ్మాయి ఇచ్చిన గ్రీన్ సిగ్నల్‌లా భావించి తాడు సాయంతో పైకెగబాకాడు సుమంత్!

పిట్టగోడ మీదుగా డాబాపైకి దూకి రొప్పుతూ నిలబడ్డాడు. ఎదురుగా క్షీరసాగరంలో స్నానం చేసి వచ్చిన పాలరాతి విగ్రహంలా నిలబడి ఉంది అమ్మాయి. "ప్రపంచంలోని అందాన్నంతా సొంతం చేసుకున్నాను సుమా" అన్నట్లున్నాయి ఆమె చూపులు.

ఆమెను తదేకంగా చూడసాగాడు సుమంత్. అంత అందాన్ని మున్నెన్నడూ చూడలేదు అని మనసులో ఘోష బయల్దేరింది. క్షణంక్రితంపడ్డ శరీరశ్రమకు తోడు పెచ్చుమీరిన మోహావేశం అతన్ని ఉక్కిరిబిక్కిరి చేయసాగింది.

"అరే వళ్లు దోక్కుపోయింది!" అంటూ ముందుకు వచ్చి చెక్కుకుపోయిన అతని మిణుకులు నవరించ సాగిందా అమ్మాయి. ముగ్ధమనోహర మోహన రూప సందర్శన విభ్రమానంద డోలాయమాన మనస్కుడైన సుమంత్‌కు ఆ క్షణాన హిమాలయాల నెక్కినంత గర్వం కలిగింది.

"వుండు ఇప్పుడేవస్తా" లోపలకు పరుగెత్తింది. చెంగున ఎగిరే లేడిపిల్ల గుర్తొచ్చింది సుమంత్‌కు.

కోల్డ్ క్రీమ్ బాటిల్ తీసుకు వచ్చిన ఆ అమ్మాయి "అరే! ఏంటలా చలిజ్వరం

రోగిలా వణికిపోతున్నావ్'' అంటూ వరండాలో వున్న సోఫా ముందుకు లాగి సుమంత్‌ను అందులో కూర్చోబెట్టింది.

తనకు వచ్చింది చలి జ్వరం కాదని, తన శరీర ప్రకంపనకు కారణం అందాలనురాశిగా పోసిన సుందరరూపం అనీ చెప్పలేకపోయాడు సుమన్. అతి ప్రయత్నం మీద శరీరంలో బయల్దేరుతున్న వణుకును అదుపు చేసుకో గలిగాడతను.

కోల్డ్ క్రీమ్ చేతిలోకి తీసుకుని చెక్కుకుపోయిన అతని మోకాళ్ళు, ముంజేతులకు రాసింది.

"అరే లుంగీకి రక్తం అయింది. కాళ్ళు కూడా దోక్కుపోయినట్లున్నాయే!" అంటూ కాలివేళ్లమీద క్రీమ్ రాసింది. లుంగీ పైకెత్తి పాదాలు, మోకాళ్లు చెక్కుకుపోయిన చోట క్రీమ్ రాయసాగింది.

అప్పటివరకూ పెచ్చుమీరుతున్న మోహావేశం కట్టలు తెంచుకుని కిందకు దుమికే జలపాతంలా మారింది. ఆవేశం అనే కీకారణ్యంలో మనసొక మహాగజమైనట్లు విచ్చలవిడిగా విశృంఖల విహారంగా విలయతాండవం చెయ్యసాగింది.

రాణి అరుపులు, కేకలు, అనుమానాలు, అవమానాలు, అదిలింపులు, అదరగణ్ణాలూ మనసును వ్యగ్రపరిచి కోరికలను సమాధిచేసి న్యూనతాభావం పెంపొందించి నిర్వీర్యునిగా చేస్తే అందాలరాశి అపురూప సౌందర్య విలోకనం మనసును సేదదీర్చి అమృతపానం తర్వాత ప్రాణం తిరిగొచ్చినట్లు సుమంత్ శరీరం, మనసూ వుప్పొంగి పోసాగాయి!

డాబా ముంగిట్లో పడుతున్న చల్లని తెల్లని వెన్నెల నవవధువులాంటి మధువులాంటి వెన్నెల శిశిరానిలానికి చలించే పొరల పొరల వెన్నెల శరద్రధుని సౌధానికి కట్టిన తెరల తెరల వెన్నెల– నిద్రిత ధాత్రిమీద ఎవరో కలల పుప్పొడిని చల్లినట్లు వెన్నెల కురుస్తుంటే ఆ వెన్నెలకు శరీరంలోని రక్తం పొంగి పొరలినట్లు విపరీతావేశం కొత్త అనీ క్రితం పరిచయంలేదనీ గమనం లేకుండా అమాంతం ఆ అమ్మాయి నెత్తుకొని లోపలకు నడిచాడు సుమంత్. ఆ అమ్మాయి నోటినుండి వెలువడుతున్న అవ్యక్త మధురధ్వనులు కవ్విస్తుంటే మరింతగా విజృంభించిపోయాడు. "ఈ ఆనందం అనుభవించడం కోసమే సుమా భూలోకంలో పుట్టాను" అన్నట్లు శ్రమించి శ్రమించి శరీరంలోని ప్రతి అణువు ఆనందాతిశయంతో బద్దలైపోతుందా అన్నట్లు ఉద్విగ్నుడై పోసాగింది. మనసులో పుట్టి వెన్నులోపాకి నాభి మండలంలో ప్రజ్వరిల్లి శరీరాన్ని అతలాకుతలం చేసి సంధించి వదిలిన బాణంలా శరీరం లోతులనుండి స్ఖలించి–



తుఫాను తర్వాత ప్రశాంతిలా పడిపోయింది సుమన్ శరీరం మంచంమీద!

విపరీత శారీరక మానసిక శ్రమ అనంతరం కలిగే అపరిమిత మానసికానందం గ్లానిరూపంలో మత్తెక్కించి కనులు మూసుకుపొయ్యాయి.

కాని ఎంతోసేపు అలా వుండలేదతను!

"కమాన్ డియర్!" మంచంమీద వెల్లికిలా పడుకుని ఆహ్వానిస్తున్న అమ్మాయిని చూసి రీచార్జ్ అయిన బాడీలా సుమన్ శరీరంలో శక్తి కూడుకుని కోర్కెలు పొంగసాగాయి. నాగస్వరం విని పడగవిప్పి నాట్యమాడే త్రాచుపాములా కోర్కెలు కోరలు సాచసాగాయి.

సుదీర్ఘ కాలం శ్రమించి– అలసి– సొమ్మసిల్లి– కోర్కెలు చెలరేగి– నిస్త్రాణచెంది– తెలవారుతున్న సమయంలో మెమ్మదిగా పిట్టగోడ అంచు నందుకుని కిందకు జారి స్లాబ్ మీదనుండి దుమికి ఇంట్లోకి వెళ్లాడు సుమన్.

రాణి గుర్రుపెట్టి నిద్రపోతున్నది! మేడమీదకు వెళ్లి మంచం ఎక్కి నిద్రపోయాడు.

మధ్యాహ్నం మూడింటికి రాణి కాఫీ కప్పుతో వచ్చి బలవంతంగా లేపితేగాని లేవ లేదు సుమన్.

కాఫీతాగి "రాత్రి నాలుగు గంటల వరకూ చదివి పడుకున్నాను" అన్నాడు సంజాయిషీగా!

అందుకే కాబోలు మనిషి అలా డీలా పడిపోయి బుగ్గలు పీక్కుపోయాయి! వుండు వేన్నీళ్లు సిద్ధం చేస్తాను. స్నానం చేసి భోంచేయి! అంటూ కిందకు వెళ్లింది రాణి!!

శృంగార రసానందం చర్విత చర్విత చర్వణమై ప్రతిరాత్రీ వసంత రాత్రయి సుఖిస్తున్న సుమన్ నాలుగురోజులలోనే లంఖణాల మనిషిలా తయారయ్యాడు!

చూడటానికి వచ్చిన రాజేష్ "ఏమిట్రా! అలా వున్నావు?" అని అడిగితే అసలు విషయం చెప్పేసాడు!

"సుమన్! నింఫో మానియాక్స్ అని కొంతమంది అమ్మాయిలుంటారు. సతత హరితవనాల్లా నిత్యం కోర్కెలతో రగిలిపోతుంటారు! ఈ అమ్మాయి అలాటిదేమో?" అని క్షణమాగి

"ఆ! వెనక బజారులో రిటైర్డ్ తాసీల్దారుగారి అమ్మాయి మతి స్థిమితం లేకుండా వుందని బజారున పోయేవాళ్లను కేకవేసి పిలుస్తుందని మా ఇంటి పక్క ముసలాయన అన్నాడు"

"ఆ! అయితే ఆ అమ్మాయే నంటావా?" అన్నాడు జావకారిపోతూ!

"ఏమిటి? అమ్మాయిలంటున్నావ్!" నిప్పుమీద పడ్డ వుప్పులా చిటపటలాడుతూ వచ్చిన రాణిని చూసి నిశ్శబ్దంగా వుండిపోయాడు సుమన్!

రాజేష్ వెళ్లినాక అతను చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకొంటూ మనసులో కళవెళ పడిపోసాగాడు సుమన్. మేడమీద వెనకవైపు కిటికీ వేసేసాడు! పెరట్లోకి వెళ్లడం మానేసాడు. వేళకు భోంచేసి వెళ్లి పుస్తకం ముందేసుకు కూర్చున్నాడు! పదకొండు గంటలయ్యే సరికి నిద్రతో మంచంమీద వాలిపోయాడు!

తట్టిలేపుతున్నట్టయితే లేచాడు సుమన్! ఎదురుగా వెనక ఇంటి అమ్మాయి మీదకు వంగి "సుమన్" అని పిలుస్తున్నది.

"అమ్మోయ్! బాబోయ్! దయ్యం!" అంటూ అరుస్తున్న సుమన్‌ను గట్టిగా తన కౌగిలింతలో బంధించబోయిన ఆ అమ్మాయిని తప్పించుకోవాలని పెనుగులాడసాగాడు.

పైన జరుగుతున్న అలజడికి కిందపడుకున్న రాణి పరుగెత్తుకు వచ్చింది!

అప్పుడు మొదలైంది మహా సంగ్రామం! వీధి వీధంతా పరుగెత్తుకు వచ్చారు అరుపులకు.

అంతలావు సుందరినీ ఎత్తి కుదేసి వళ్ళంతా రక్కి, పీకి, కొరికి, తన్ని మెట్లమీద నుండి కిందకు దొర్లించిందా అమ్మాయి! వీధి జనం అంతా వచ్చి పట్టుకుని బలవత్తంగా తీసుకువెళ్తేగాని వెళ్లలేదా అమ్మాయి!

వళ్లంతా గాయాలయి మూలుగుతున్న రాణి మరుసటిరోజునే ఇల్లు ఖాళీ చేసి కాపురం వేరేచోటకి మార్పించింది!

* * *

పరీక్షలు వచ్చేసాయి! సీరియస్‌గా చదివిన వాళ్లలో ఆదుర్దా, ఆషామాషీగా చదివేవాళ్లల్లో నిర్లిప్తతనీ, రాంకు వస్తుందని ఆశపడేవాళ్లల్లో విపరీతమైన ఉత్కంఠనీ పెంపొందించాయి. పరీక్షలు దగ్గరయినకొద్దీ విద్యార్థుల మనస్తత్వాలు ఇలా రకరకాలుగా మారాయి.

నీల, ప్రియ, శ్యాం, మారి పరీక్షల ముందు వివిధ కారణాలవలన బాగా చదువలేక పోయినా యూనివర్సిటీలో చేరినదగ్గర్నుండీ విశేషంగా కృషిచేసివున్నారు గనుక పరీక్ష పత్రాలందుకున్న తర్వాత అన్నీ మర్చిపోయి వంచిన తల ఎత్తకుండా చకచక జవాబులు రాయసాగారు! అంత పరీక్షల టెన్షన్‌లోనూ దూరంగా తలవంచి పరీక్ష రాసుకుంటున్న నీలను చూసి శ్యాంకు, ప్రియను చూసి మారి కి ఏదో ఉత్సాహం ఆనందం



ఇనుమడించిన శక్తితో సమాధానాలు రాయసాగారు వాళ్లు!

పరీక్షలయిపోయాయి! నెత్తిమీద కత్తి వేలాడుతున్నట్లు ఫీలవుతున్న విద్యార్థినీ విద్యార్థులు హాయిగా వూపిరి పీల్చుకున్నారు!

ఆఖరి పరీక్ష రాసి ఇంటికి జేరుకున్నారు నీల, ప్రియ!

"ప్రియా! ఇంటికి వెళ్ళాలంటే ఎంతో వుత్సాహంగా వుండేది! ఈసారి మాత్రం....!"

"నీలా! నాకూ అలానే వుంది...!!"

"ఇన్నాళ్లు మేడం సొంత అక్కలా చూసుకున్నారు. ఆమెను వదిలి వెళ్లాలంటే బాధగా వుంది"

"పోనీ ఆమెను శలవులకు మా ఇంట్లో కొన్నాళ్లు వుండమంటే?"

"అలాగే చేద్దాం! ఆమెకు బంధువులెవరూ లేరు! వంటరిగా గుంటూరులో ఏం వుంటారు?"

"నీలా! నీ ఆరోగ్యం బాగాలేనప్పుడు ఎంతో ఆదుర్దాపడి ఆస్పత్రి దగ్గర పడిగాపులు గాసిన శ్యాం పత్తా లేకుండా పోయాడేమే!

"ప్రియా! శ్యాం నన్ను మారి నిన్ను ప్రేమిస్తున్నారనడంలో సందేహంలేదు! వాళ్ల మనసు పొరలలో దాగివున్న బడబాగ్ని నివురుగప్పివున్నది!

"ఉ! మహమ్మదు కొండ దగ్గరకు వెళ్లక పోతే కొండ మహమ్మదు వద్దకు వెళ్తుంది! మనమే చొరవ తీసుకుంటే?"

"ఎలా?"

నీల ప్రియతో అరగంటసేపు తన ప్లాను వివరాలు చెప్పింది. షాలిని మేడం వచ్చారు— వుస్సురంటూ.

"మేడం!"

"ఏమిటి నీలా?"

"మేడం! సెలవలలో మీరు ఒక్కరూ ఇక్కడ ఏం వుంటారు? కొన్ని రోజులు మా ఇంట్లో వుండమని ఆహ్వానించాలనుకున్నాం మేడం!"

"థాంక్స్ నీలా! కాని నేను ఇక్కడే వుండాలి!"

"మేడం!"

"అవును! సి.పి.బ్రౌన్ తెలుగు సాహితీ సముద్దరణ గూర్చి రిసెర్చి చెయ్యాలనుకున్నాను! ప్రాజెక్టు శాంక్షన్ అయింది!"

"మేడం! ఇన్నాళ్లు సొంత అక్కలా మమ్మల్ని ఆదరించారు! మిమ్మల్ని వంటరిగా

వదిలి వెళ్లాలంటే మనసొప్పడంలేదు.!"

"నీలా! జీవితం రైలు ప్రయాణం లాంటిది! ఎక్కేవాళ్లు ఎక్కుతుంటారు! వాళ్ల గమ్యస్థానం వచ్చేవరకూ మనతో కలిసి ప్రయాణం చేస్తుంటారు! సొంత వూరు వచ్చాక దిగి వెళ్లిపోతారు!"

"నీలా! మరిచానో మాట అడగడం! శ్యాం ఏమంటున్నాడు?"

"దూరాన కనపడగానే తప్పించుకు వెళ్లిపోతున్నాడు మేడం!" అంది ప్రియ నీలకు బదులు తను సమాధానం చెబుతూ!

"ప్రియా! మాలి సంగతి ఏమిటి?"

"శ్యాం నీల కనపడగానే తప్పుకుంటున్నాడు! మాలి నా కసలు కనపడడమే లేదు మేడం!"

"దొందూ దొందే! తమాషా ఏమంటే ఇద్దరూ జాతివజ్రాలే! ప్రేమించిన యువతులను అలక్ష్యం చేస్తున్నారన్న నేరం తప్ప వాళ్లలో ఏ లోపం లేదు!"

* * *

వజ్రాలు పొడిచేసి భూమి మీద దిమ్మరించినట్లుగా మధ్యందిన మార్తాండుని కిరణాలు కళ్లు చెదరగొడుతున్నాయి. ఎకరం ఆవరణ మధ్య కట్టిన మూడంతస్తుల మేడ 'రాజగృహం' వరండాలో నిలబడి చెయ్యి నుదిటి కడ్డంగా వుంచుకొని వీధిలోకి పరికించి చూడసాగింది అహల్య. కొడుకు శ్యాం క్రితం రాత్రే వచ్చాడని అతనికిష్టమైన పిండివంటలు చేయించి అప్పుడే వరండాలో కొచ్చిందామె.

అయిదోతనం తప్ప అన్నీ వున్న అహల్య పంచప్రాణాలూ శ్యాంమీదే కేంద్రీకృతమై వుంటున్నాయి. శ్యాం పుట్టిన దగ్గర్నుండి నేటి వరకు ఏ పని చేస్తున్నా ఏం ఆలోచిస్తున్నా ఆమె కళ్లన్నీ శ్యాంమీదే వుండేవి! గుండెమీద తల ఆనించి నిద్రపోయే శ్యాం జుట్టు నిమురుతూన్నట్లు అనుభూతి కలిగి ఏ అర్ధరాత్రికో మాగన్నుగా అర్ధనిద్రపోయే అహల్య కలల్లో శ్యాం కనపడేవాడు ఆడుతూ పాడుతూ!

కాలేజీ చదువుకోసం ఆ తర్వాత ఎంఏ చదువుతూ గుంటూరులో వుంటున్న శ్యాం గురించే ఆలోచిస్తూ పరధ్యానంగా కాలం గడిపింది ఆరేడు సంవత్సరాలుగా! "ఎంఏ చదువు అయిపోయి శ్యాం 'రాజగృహం' చేరాడు!" అన్న ఆలోచన అహల్య మనసును ఆనందంతో నింపింది. కాని అదే సమయంలో ఆమె మనసును పురుగులా తొలుస్తున్న ఒక అనుమానం కలత పెడుతున్నది. వంశచరిత్ర 'రాజగృహం' చరిత్ర గుర్తొస్తే మనసులో భయం పెరిగిపోయేది.

"రోడ్డుమీద ఎవరిదో కారు ఆగి వున్నది! పది నిముషాల నుంచి ఎవరో వొ



అమ్మాయి ఎండలో వంగుని కారు ఇంజను పరీక్ష చేస్తూ ఉన్నది!" అనుకుంటూ.

"ఒరేయ్! రాముడూ! ఎవరిదో కారు ఇంటిముందు ఆగిపోయి వుంది! ఏమిటో చూసిరారా? అంది రాముడితో.

పరిగెత్తుకు వెళ్లిన రాముడు రెండునిముషాల్లో తిరిగొచ్చి "అమ్మాయిగా రొక్కరే కారు నడుపుతున్నారట! ఏం ట్రబులొచ్చిందో! కారాగిపోయింది!" అన్నాడు రాముడు.

"అలాగా! పాపం ఎండలో అలాగే నిలబడి వుంది! లోపలకు రమ్మను!"

కారు బానెట్ వేసి నిలబడ్డ అమ్మాయి దగ్గరకువెళ్లి రాముడు

"అమ్మాయిగారూ! అమ్మగారు మిమ్మల్ని మేడలోపలికి రమ్మంటున్నారు!" అన్నాడు.

అటూ ఇటూ చూసిందా అమ్మాయి! రోడ్డు నిర్మానుష్యంగా వుంది. చుట్టూ ఎక్కడా కనుచూపు మేర దూరంలో పచ్చని చెట్టు కనపడలేదు— నిల్చోటానికి అన్నిటికి మించి మిట్ట మధ్యాహ్నం ప్రయాణం వలన వళ్లంతా చెమటలు కారుతూంది! విపరీతమైన దాహం వేస్తున్నది. ప్రహరీ లోపల దూరంగా కనపడుతున్న మేడ వరండాలో నిలబడి తనవంకే చూస్తున్న నడివయసు స్త్రీ తనను లోపలకు రమ్మని ఆహ్వానిస్తుందని తెలియగానే లోపలకు నడిచింది—

"రామ్మా! రా లోపలకు!" సాదరంగా ఆహ్వానించిందా అమ్మాయిని అహల్య. లోపల గదిలో సోఫాలో కూర్చోగానే "ఏమ్మా! కారు ట్రబుల్ ఇచ్చిందా?" అని అడిగింది చల్లని మజ్జిగ గ్లాసు చేతికిస్తూ.

"అవునండీ! కార్బురేటర్ ప్లగ్ ఏదో వూడినట్లుంది" అందా అమ్మాయి.

"అలాగా! పక్కవూరిలో ట్రాక్టరు డ్రైవరున్నాడు అతనికి కబురుచేస్తాలే! ఎండలో బయల్దేరావు! భోంచేసి కాసేపు విశ్రాంతి తీసుకో!"

"అబ్బే! మీకెందుకండీ శ్రమ! కారు లాక్‌చేసి బస్‌లో గుంటూరు వెళతాము! తెలిసిన మెకానిక్‌ని పంపుతాము!"

"అదేందమ్మా! అలా మొఖమాటపడతా వెందుకు! ఇంకా రెండు గంటల దాకా గుంటూరు వెళ్లే బస్సులేదు! అధవా వచ్చినా దాంట్లో జనం కిక్కిరిసి వుంటారు! ఎక్కించుకోరు! మగవాళ్లయితే చువ్వలు పట్టుకుని వేలాడుతూ ఎలాగోలా వెళతారు! నువ్వా బస్సులో అడుగుపెట్టే చోటుండదు!"

"అయ్యో! ఎలాగ! డాడీ నాకోసం వెయిట్ చేస్తుంటారు! మీ ఇంట్లో ఫోనుందా?"

"వుందమ్మా!"

"మీరేమనుకోకపోతే ఒకసారి డాడీకి ఫోన్ చేస్తాను! ఫోన్ చార్జీలు ఇస్తాలెండి!"

"ఇదిగో అమ్మాయి! నువ్విలా మాట్లాడ్డం బాగాలేదు! మా ఇల్లేం పబ్లిక్ కాల్ ఆఫీసనుకున్నావా? అవసరా లెవరికైనా వస్తాయి! సమయం వచ్చినప్పుడు సహాయం చెయ్యకపోతే మనుష్యులం కామమ్మా!

రా! ఇలా లోపల గదిలోకొచ్చి ఫోన్ చెయ్యి. బెదురు చూపులు చూస్తూ ఇబ్బందిగా మొఖంపెట్టి లోపల గదిలో ఫోన్ దగ్గర చేరి కాల్‌బుక్ చేసిందా అమ్మాయి.

"చూడు ఎలా చెమటలు పట్టాయో! చల్లటి నీళ్లతో ముఖం కడుక్కొని రామ్మా!" అంది స్నానాలగది చూపుతూ అహల్య!

క్షణం తటపటాయించి స్నానాలగదిలోకి వెళ్లిందా అమ్మాయి!

"ముత్యం లావుంది పిల్ల! నేవళంగా పెరిగిందేమో ఎండకు కంది తోటకూర కాడలాగయింది! అయినింటి పిల్లలాగుంది! అన్నిటికీ అభిమానపడుతుంది!" అని అహల్య అనుకునే లోపల మొఖం కడుక్కొని వచ్చిందా అమ్మాయి.

"అదుగో! ఆ గదిలో డ్రెస్సింగ్ టేబిల్ వుంది! వెళ్లమ్మా" అంది అహల్య.

క్షణం మాట్లాడకుండా నిల్చుండిపోయిందా అమ్మాయి. ఏమనుకుందో ఏమో నెమ్మదిగా పక్క గదిలోకి నడుచుకుంటూ వెళ్లింది టవల్‌తో ముఖం తుడుచుకుంటూ.

చెదిరిన జుట్టును దువ్వెనతో సరిచేసుకుంటూన్న ఆ అమ్మాయి చూపులు ఫోటో ఫ్రేమ్‌లోని అందమైన యువకుని బస్ట్ ఫోటోపై నిలిచిపోయాయి!

పూర్ణిమా శర్వరులను వెదజల్లుతున్న చంద్రుని పరిహసింపగల ముఖం— కాని ఆ చూపులలో కనపడే నిర్వేదం చంద్రునిలో మచ్చలా— ఇతను.... ఇతను

"శ్యాం!" అహల్య మేడమీద వున్న కొడుకుని పిలిచింది! అహల్య నోట పలికిన ఆ పిలుపు మాతృత్వ మమతానురాగాల్ని నింపుకుని ప్రత్యూష సమయాన నదిమీద నుండి వచ్చే పిల్ల తెమ్మెరలా అనిపించింది!

"ఏంటమ్మా!" శ్యాం మెట్లమీదుగా పరుగెత్తుకు వచ్చాడు! శ్యాంకు ఈ ప్రపంచంలో అత్యంత ఆప్త బంధువూ, స్నేహితురాలు, గురువూ అమ్మ! వచ్చీరాని నడకతో అమ్మను గుర్తించి పడుతూ లేస్తూ పరుగెత్తుకు వచ్చిననాటినుండి నేటివరకూ అమ్మ పిలుపు విని వుప్పొంగిపోయే హృదయంతో పరిగెత్తుకు వస్తూనే వున్నాడు శ్యాం!

"శ్యాం! ఎవరో అమ్మాయి! బాగా చదువుకున్నదిలా వుంది! పాపం కారు చెడిపోయి వీధిలో వుంటే నేను లోపలకు రమ్మన్నాను! అమ్మాయి ఒకటే



మొహమాటపడుతున్నది! కారు బాగు చేయించిన దాకా మనింట్లో వుండమని చెప్పరా!"

శ్యాం సమాధానం చెప్పేలోపలే బయటకు వచ్చిన అమ్మాయి శ్యాంను చూసి

"అరే శ్యాం! నువ్విక్కడ వున్నావేంటి! ఇది... ఇది మీ ఇల్లా? వాట్ ఏ స్ట్రేంజ్ థింగ్!"

"నీలా నువ్వా! సారీ! మీరా!" శ్యాం ముఖంలో అవధులు లేని ఆనందం నాట్యమాడింది. కాని అంతలోనే అలవాటు ప్రకారం చంద్రునిలోని మచ్చలా అతని చూపులలో నిర్వేద భావం నిండుకుని తల దించుకున్నాడు!

"శ్యాం! ఎవరీ అమ్మాయి?"

"అమ్మా! ఈ అమ్మాయి నీలోత్పల అని మా క్లాస్‌మేట్!" నీలోత్పలను పరిచయం చేస్తూన్న శ్యాం కంఠంలో చోటు చేసుకున్న కించిత్ గర్వాన్ని గమనించిన అహల్య మనసులో సంతృప్తి భావం పెరిగింది!

"నీలోత్పల! ఎంత అందమైన పేరు! మన్మధుని పంచ బాణాలలో ఒక బాణం నీలోత్పల! కావ్య నాయకికి వుండవలసిన పేరు! మరి ఇందాకట్నుంచీ శ్యాం క్లాస్‌మేట్ అని చెప్పలేదేమమ్మా!?"

"అయ్యో! నా తెలివి తెల్లారినట్లే వుంది! నేను శ్యాం తల్లినని నీ కేం తెలుస్తుంది! రామ్మా! రా కూర్చో! ఇకనువ్వు ఇంటికి వెళ్లాలంటే వూరుకోను!

శ్యాం! రాముడ్ని కేకేసి దొడ్లో చెట్టుని లేత కొబ్బరికాయలు కొట్టి తీసుకురమ్మను! అలాగే పాలాన తాడి చెట్టుని లేతముంజలు తెమ్మను! అమ్మాయి ఎండన పడివచ్చింది"

చివాలున వెళ్తున్న శ్యాంను వారిస్తూ "వద్దండీ శ్యామలేందుగారూ!" అంటూ పక్కనుండి వెళ్తున్న శ్యాం చేతిని అందుకుంది నీల.

లేత తమలపాకు స్పర్శలా వున్న నీల స్పర్శకు తనువు పులకించి మేను కంపించి క్షణం నిలబడిపోయి నీల కళ్లలోకి సూటిగా చూసాడు శ్యాం!

మన్మధుడు జోడు బాణాలను సంధించి వదుల్తున్నట్లు వున్న ఆమె చూపులు పరవశత్వంతో పులకించి చూస్తున్న శ్యాం చూపులలో కలిసిపోయాయి పూలుతావిలా!

శ్యాం నీల సరసన నిలబడటం చూసిన అహల్య మనసులో అనురాగం ఆప్యాయం, ఆనందం, ఆసక్తి పెరిగిపోసాగింది.

"ఎంత చక్కని జోడీ! నా వరాల తండ్రికి సరిజోడీ నీల! నీడుగాని ఈ అమ్మాయిని పెళ్లాడి నీల ఈ ఇంటి కోడలిగా 'రాజగృహం'లో తిరుగుతుంటే చూసి ఆనందించే కంటే ఇక నాకీ ప్రపంచంలో కోరుకో దగిందేముంది? అంత అదృష్టానికి

నోచుకున్నానో లేదో?''

''వద్దు శ్యాం! ప్లీజ్!'' అంది నీల శ్యాం చేతిని వదిలివేస్తూ.

''అదేంటమ్మా నీలా! ఇంటికి వచ్చిన అతిథులను మర్యాద చేసిపంపటం 'రాజగృహం'లో అలవాటు— ఆనవాయితీ! అయినా నువ్వేం ముక్కూ మొఖం తెలియని పరాయి పిల్లవు కాదు! మా శ్యాం స్నేహితురాలివి!

అహల్య మాటలు వింటూనే శ్యాం మనసును సిగ్గు దొంతరలూ— ఆనంద తరంగాలూ కళవెళ పెట్టసాగాయి!

'శ్యాం స్నేహితురాలివి!' అని అమ్మ అన్నమాటలు అతనికెంతో సంతోషాన్నిచ్చాయి!

''రాముడూ! రాముడూ!'' అని కేకవేస్తూ బయటకు వెళ్లిపోయాడు శ్యాం!

''రామ్మా! రా!'' అంటూ నీల చేయి పుచ్చుకుని, మేడ వెనుకవున్న పెంకుటి వసారాలోకి తీసుకువెళ్లింది అహల్య!

అక్కడ ఒకామె అరిసెలు వండుతున్నది! పక్కన ఒక బుట్టలో పూర్ణాలు వున్నాయి. మరో గిన్నెనిండా గారెలూ, చిన్న పాత్ర నిండుకూ పొగలు సెగలు కక్కుతున్న పాయసం వుంది.

''ఎవరౌదినా ఈ అమ్మాయి?'' వంట వండుతున్న ఆమె అహల్యను అడిగింది.

''కావమ్మా! ఈ అమ్మాయి నీల అని— మన శ్యాం స్నేహితురాలు!'' అంది అహల్య.

పత్తి కాయలంత కళ్లు చేసుకొని చూడసాగింది కామమ్మ నీల వైపు!

''కావమ్మా! అరిశెలు మాడిపోతున్నట్లున్నాయ్'' అహల్య హెచ్చరించడంతో తెప్పరిల్లుకుంది కావమ్మ.

''మావన్నీ మోటువంటలు— మోటు మనుషులం! అరిసెల్లో తీపి సరిపోయిందో లేదో చూసి చెప్పమ్మా నీలమ్మా!'' అంది కామమ్మ.

అహల్య గిన్నెలోంచి తీసి ఇచ్చిన అరిసెను తుంచి నోట్లో వేసుకుంది నీల. నువ్వులు చల్లిన అరిశె కరకర లాడుతూ రుచిగా వుంది.

''బాగుంది! అరిశెలు తిని ఎన్నాళ్లయిందో?'' అంది నీల.

''శ్యాంకిష్టమని వొదిన ఇవ్వాళ అరిశెలు చేయిస్తున్నది'' అంది కామమ్మ.

యాభై మందికి సరిపడా వండి రాసులు పెట్టివున్న గారెలు, పూర్ణాలు, అరిశెలు, పాయసం వంక చూసింది నీల, అప్రయత్నంగా చిరునవ్వు వచ్చిందా అమ్మాయికి.

నీలను గమనిస్తున్న అహల్య ''ఇంట్లో ఏ కాస్త వండినా పనివాళ్లందరకూ పెట్టడం



అలవాటమ్మాయి!'' అంది అహల్య.

''మీరంతా బస్తీలో పెరిగిన పిల్లలు! మా మోటు వంటలు నచ్చుతయ్యో లేదో అనుకున్నా!'' అంది కామమ్మ మెచ్చుకోలుగా.

''నాకు పల్లెటూళ్ళన్నా, పల్లెటూరి పిండివంటలన్నా ఎంతో ఇష్టం! అందుకే పరీక్షలవగానే తాతగారి పల్లెటూరికి బయల్దేరాను. 'డ్రైవర్‌ను తీసుకెళ్ళు నీలా!' అన్నారు డాడీ! కాని నాకు ఒంటరిగా కారు నడుపు కుంటూ దారిలో పల్లెపట్టులు వచ్చినప్పుడు ఆగి చూడడం సరదా! ఇవ్వాళ అలాగే ఇంటి దగ్గర్నుండి బయల్దేరాను! ఇంజన్ ట్రబుల్ ఇచ్చి కారాగిపోయింది'' అంది నీల ఎపాలజిటిక్‌గా. అక్కడే వుంటే నీలను కామమ్మ ప్రశ్నల వర్షంతో ముంచెత్తుతుందని అనుమానం వేసింది అహల్యకు. ఇంతలోనే హాలునుండి శ్యాం 'అమ్మా!' అని పిలవడంతో

''రామ్మా వెళదాం!'' అంటూ నీల చెయ్యి పుచ్చుకొని లోపలకు వెళ్ళింది అహల్య. వాళ్లు వెళ్లిన వైపే చూస్తూ అరిశెలు మాడబెట్టింది కామమ్మ.

''అమ్మా! రాముడు కొబ్బరికాయలు కొట్టుకొచ్చాడు!''

''అదేమిట్రా! అలా చూస్తూ నిలబడ్డావు! ఇంటికి వచ్చిన స్నేహితురాలికి మర్యాద చెయ్యడం తెలీదూ! కొబ్బరికాయను కొట్టి నీలకు ఇవ్వు!''

శ్యాం కొడవలితో చెచ్చుతీసి లేత కొబ్బరి బొండాం నీల చేతిలో వుంచాడు.

''నీలకు కొబ్బరి బొండాలోంచి నీళ్లుతాగడం వచ్చో రాదో తెలియదు! ఉండు గ్లాసు తెస్తా!'' అంటూ అహల్య లోపలకు వెళ్ళింది.

ఈలోపల శ్యాంవంకే చూస్తూ కొబ్బరి నీళ్ల తాగబోయిన నీల నీళ్ళన్నీ చీరమీద వంపుకుంది.

''అరే నీళ్ల మీద పోసుకున్నారే!'' అంటూ టవల్ తెచ్చి ఇచ్చాడు శ్యాం.

లోపలనుండి వచ్చిన అహల్య ''అయ్యో! చీరంతా తడుపుకున్నావమ్మా!'' అంది,

''ఫరవాలేదులెండి!''

''నీలా! వంటపూర్తవుతున్నది! నువ్వు స్నానం చేసిరా!''

''వద్దండీ!''

''అదేమిటమ్మా! అన్నిటికీ మొహమాటమేనా? ఊహూ స్నానం చేసిరా! నా చీర కట్టుకుందువుగాని!'' అంటూ నీలను బలవంతం చేసింది. లోపలకు వెళ్ళి బీరువాలో నుండి కొత్త కంచిపట్టుచీర తీసి అంచులకు పసుపురాసి తీసుకు వెళ్ళి స్నానాల గదిలో పెట్టి వచ్చింది! పెద్ద గంగాళం నిండా వేన్నీళ్ళు పెట్టించింది.

సందేహిస్తూ నిలబడ్డ నీలను చేయిపట్టుకుని స్నానాల గదిలోకి తీసుకువెళ్ళింది. ఇంకా సేపువుంటే ఆమె తనకు స్నానం చేయిస్తుందేమోనని భయపడిన నీల.

"సరేలెండి! స్నానం చేస్తాను!" అంటూ అహల్యను పంపి గది తలుపు లోపల గడియవేసింది. నిజానికి చెమట దుమ్ముతో నిండిన వళ్ళు అసహ్యంగా వుందామెకు. కొబ్బరి నీళ్ళు షీర మీాదకు వంపుకున్నందువలన చికాకు ఎదురైందికూడా.

స్నానం చేసి జరీ పూలున్న నీలం పట్టు చీరకట్టుకుని బయటకు వచ్చిన నీలను "స్టూలు మీాద కూర్చోమ్మా! తల దువ్వుతాను!" అంటూ తలదువ్వి జడవేసి జడలో మల్లెల మాల తురిమింది!

సిగ్గుపడుతూ తలవంచుకు కూర్చున్న నీలతో "రామ్మా! భోజనం రెడీగా వుంది!" అందామె.

వంటవసారాకు మధ్య హాలుకీ మధ్య వున్న రెండు వాకిళ్ళ గదిలో డైనింగ్ టేబిల్ మీాద వడ్డించి వుంచిన పదార్థాలను చూచి కళ్ళు తిరిగినంత పనయింది నీలకు!

అరిశెలు, గారెలు, పూర్ణాలు, పాయసం, చక్రపొంగలి, నాలుగు కూరలు, పులుసు, పప్పు, ఉలవచారు, మీాగడపెరుగు, వూరగాయ పచ్చళ్ళు, అప్పడాలు, వడియాలు ఏమిటండీ దెయ్యానికి పెట్టినట్లు ఈ వంటలు?" అని చప్పున నాలుక కరచుకుంది.

"పరీక్షలకు చదవి చదివి జివ్వ చవిచచ్చిపోయి అలా అంటున్నావు నీలా! వయసులోవున్న పిల్లలు ఆ మాత్రం తినకపోతే ఎలా?" అంటూ "శ్యాం భోజనం వడ్డించాను! రా?" అంటూ కేకలు వేసింది.

తల్లి పిలుపు విని వచ్చి నీల పక్కన వున్న కుర్చీలో కూర్చుని ఒకసారి టేబిల్ మీాదవున్న పిండివంటల వంక పరకాయించి చూశాడు శ్యాం.

మామూలుగా అయితే తనకు యిష్టమైన ఆ వంటకాలన్నిటినీ అవురావురంటూ వో పట్టుపట్టి వుండేవాడు. కాని నీల వచ్చిన క్షణం నుండి అతని శరీరమూ మనసూ స్వక్రమంగా పని చేయడం మానివేశాయి. పంచేంద్రియాలూ పట్టుతప్పి ప్రవర్తిస్తున్నాయి. నీల శ్యాం ముందు వున్న అర్థ గజం పొడవు అంతే వెడల్పు వున్న వెండిరావి ఆకులలోఒక్కో పదార్థం వడ్డించసాగింది అహల్య.

"వద్దండీ!" "వద్దమ్మా!" అంటూన్న శ్యాం నీలల చేతులు తప్పిస్తూ వండిన ప్రతిపదార్థమూ కొసరి కొసరి వడ్డించసాగిందామె!

ముందు మొహమాటపడ్డ నీల నెమ్మదిగా ఒకో పదార్థమూ తినేసింది! ఉల్లిపాయలు తేలుతున్న పులవచారు మారువడ్డించుకున్నది కూడా!



అన్నీ తన కిష్టమైన పదార్థాలే అయినా ఏదీ సరిగా తినలేక పోయాడు శ్యాం! వాటికంటే యిష్టమైన వ్యక్తి తన పక్కన కూర్చుని వున్నదన్న సంగతి తనలో ఆకలిని నశింపజేసింది.

"వొదినా? ఒకసారి ఇలావస్తావా!" వసారాలోంచి కామమ్మ కేక విన్న అహల్య 'శ్యాం! నీలకేం కావాలో చూడు! నేను ఇప్పుడే వస్తా!" అంటూ వెళ్ళిపోయింది. నిజానికి శ్యాం నీల పక్కపక్కన కూర్చుని భోంచేస్తుంటే చూడటానికి ముచ్చటవేసిందామెకు. తను అవతలకు వెళ్ళిపోతే వాళ్ళిద్దరూ ఇంకా సన్నిహితంగా మాట్లాడుకుంటారేమోనని అనిపించింది కూడాను! ఏం వంక పెట్టుకు వెళ్ళదామా అని ఆలోచిస్తున్న తరుణంలో కామమ్మ పిలిచిందామెను!

కామమ్మకు కావలసిన వస్తువులు ఇచ్చి చప్పున లోపలకు వెళ్ళకుండా అక్కడే ఏదో పని కల్పించుకుని వుండి పోయిందామె.

నీలకు వులవచారులోని వుల్లిపాయలు వడ్డించసాగాడు శ్యాం!

"శ్యాం! ఏమిటిలా వడ్డించేస్తున్నావ్?" అంటూ చెయ్యి అడ్డంగా పెట్టబోయింది నీల.

"ఉలవచారులో వుల్లిపాయలు మహా రుచిగా వుంటాయి?" అన్నాడు శ్యాం బదులుగా!

"రియల్లీ!" అంటూ పళ్ళెంలోని వుల్లిపాయలు తిని వేసింది నీల.

"నువ్వులు చల్లిన అప్పడం అమ్మ ప్రత్యేకంగా తయారుచేస్తుంది." అంటూ నీల పళ్ళెంలో వడ్డించాడు!

"అలాగా!" అంటూ అప్పడాన్ని కరకర నమిలి మింగేసింది నీల.

జీడిపప్పు, కిస్‌మిస్, యాలకులు పచ్చకర్పూరం దిమ్మరించి తయారుచేసిన చక్రపొంగలి వడ్డించాడు శ్యాం. అపురూపమైన రుచితో చవులూరిస్తున్న చక్రపొంగలి తిన్నది నీల.

ఆఖరుకు మీాగడ పెరుగు వడ్డించాడు ఆవకాయ ముక్కతో! సుష్టుగా భోంచేసి "శ్యాం! పొట్టపగిలి పోయేలా వుంది! ఇంకనాలుగు రోజులపాటు భోంచేయక పోయినా ఫరవాలేదు!" అంది నీల.

శ్యాం సమాధానం చెప్పేలోపలే "అరే! ఏమిటే అన్యాయం!" అని పెద్దగా అరిచింది నీల.

దూరాన నిలబడి కిటికీ లోంచి నీల శ్యాంలను చూస్తున్న అహల్య కుతూహలంగా చూడసాగింది.

''ఏమయింది?'' అని అడిగాడు శ్యాం.

''శ్యాం నువ్వొక పదార్థమూ తినలేదు! నా చేత బల్లమీద వున్న వస్తువులన్నీ తినిపించావు?''

''అంతేగదా! సోవాట్! యు ఆర్ మైగెస్ట్!''

''ఇప్పుడు నా కేదైనా సుస్తీ చేస్తే బాగుచెయ్యాల్సిన బాధ్యత నీదే సుమా!''

''నెవర్ నీలా! అమ్మ చేతివంట తిని సుస్తీ చెయ్యడమా! ఇంపాసిబిల్''

మరి నువ్వేమీ తినలేదేం?''

''నేను! నేనా! నాకాకలిగా లేదు''

నీల శ్యాం సంభాషణ వింటూన్న అహల్య మొఖం మీద చిరుదరహాసం విలసిల్లింది!

ఆ క్షణాన ''క్రింగ్! క్రింగ్!'' అని ఫోన్ మోగింది.

''ఇందాక నేను ఇంటికి బుక్ చేసిన కాల్ వచ్చి వుంటుంది!'' అంటూ పరుగెత్తుకు వెళ్ళింది నీల.

'' లైన్స్ అవుటాఫ్ ఆర్డర్! ఎప్పటికి బాగవుతాయంటారు?''

''....''

''చెప్పలేమంటారా! సరే కాల్ పెండింగ్‌లో వుంచెయ్యండి.

ఫోన్ రిసీవర్ పెట్టేసి ''శ్యాం! నీ ఇన్‌ఫ్ల్యూయన్స్ వుపయోగించి నన్ను గుంటూరు వెళ్లే బస్ ఎక్కించి పంపించలేవా? గుంటూరు వెళ్ళి తెలిసిన మెకానిక్‌ని కారుకోసం పంపించి నేను మా తాతగారి ఇంటికి వెళ్ళిపోతాను!'' అంది నీల.

''నీలా! నువ్వేం చెప్పినా చేస్తాముగాని ఆర్‌టిసి బస్‌లో మాత్రం ఎక్కించము! ఇక్కడనుండి గుంటూరు వెళ్ళే లోపల వళ్ల దస్సిపోయి కీళ్లు తొలగి పడకవేస్తావు!''

''మరి తాతగారి ఇంటికి వెళ్ళేదెలా?''

''పక్కవూళ్ళో ట్రాక్టరు డ్రైవర్‌కు మెకానిజం కొద్దిగా తెల్సు! అతనికి కబురు చేస్తా!''

''అలాగే చెయ్యి శ్యాం! ఇక్కడే వుండి మిమ్మల్ని ఇంకా ఇబ్బంది పెట్టడం నా కిష్టంలేదు!''

''నీలా! ఎంత మాటన్నావు! నీ వలన మాకిబ్బంది కలిగిందా? నందనోద్యానవనంలో నవ వసంత శోభ వచ్చినట్లు నీ రాకతో 'రాజగృహం' కళ కళలాడుతున్నది!''

''అపండిసార్ మీ కవిత్వం! ఎవరీ అమ్మాయి? పిలవని పేరంటాలులా ఇంట్లో తిష్టవేసిందని మీ అమ్మ అనుకోదుగదా?''

''నో నెవర్! అమ్మ అలా ఎప్పటికీ అనుకోదు!''



''ఏమిట్రా శ్యాం!'' అంటూ దగ్గర కొచ్చింది అహల్య.

''అమ్మా! నీలచూడు! ఆర్‌టిసి బస్‌లో వెళ్లిపోతానంటున్నది!'' రాధ మీద యశోదకు ఫిర్యాదు చేస్తున్న కృష్ణుడు జ్ఞాపకం వచ్చాడు అహల్యకు.

''అమ్మాయి నీలా! నువ్వు ఆర్‌టిసి బస్‌లో వెళ్లొద్దు! కాసేపు విశ్రాంతి తీసుకో! సాయంత్రం శ్యాం నువ్వూ వూరి బయట వున్న మామిడితోట దగ్గరకు షికారు వెళ్ళరుగాని!

పక్కవూరులో వున్న ట్రాక్టరు డ్రైవరుకోసం ఇప్పుడే మనిషిని పంపాను!'' అంది అహల్య! ఆప్యాయతతో కూడిన అధికారంతో అహల్య అలా మాట్లాడే సరికి నీల నిరుత్తర అయింది.

''ఎండన పడి వచ్చావు! కాసేపు విశ్రాంతి తీసుకోమ్మా!'' అంటూ ''శ్యాం! నీలను మేడమీద గది దగ్గరకు తీసుకొని వెళ్ళు!'' అంది.

మౌనంగా శ్యాం వెంట మెట్లెక్కి రెండో అంతస్తులోకి వెళ్లింది నీల.

'రాజగృహం'లో అన్ని గదులుంటాయనుకోలేదు నీల. అంత చిన్నపల్లెలో అంత పెద్ద మేడ వుంటుందని మేడలో అన్ని గదులుంటాయనీ వూహించుకోలేక పోయిందామె!

ఒకో అంతస్తులోనూ పాతిక గదులకు తక్కువున్నట్లు లేదు! మేడ కట్టించి రెండు వందల సంవత్సరాలు దాటినా చెక్కు చెదరకుండా నిన్న మొన్న నిర్మించినట్లు వుండి పద్మ వ్యూహాన్ని గుర్తుకు తెచ్చింది నీలకు— శ్యాం ఒక గదిలోంచి హాలులోకి దాంట్లోంచి మరో గదిలోకి అలా తీసుకు వెళ్తూ టే!

చివరకు దక్షిణపు వేపున విశాలంగా వున్న ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు.

గది మధ్య పెద్ద మంచం పైన బూరుగ దూది పరుపు, దిళ్ళూ, గోడల పక్కన వెనుకటి కాలం సోఫాలు అమర్చివున్నాయి. కిటికీలకు అడ్డంగా వున్న ముఖమల్ కర్టెన్లు పక్కకు లాగుతూ—

''నీలా! కాసేపు విశ్రాంతి తీసుకో!'' అంటూ వెళ్లిపోబోయాడు శ్యాం!

''శ్యాం!'' ఆర్తితో నిండిన నీల పిలుపు శ్యాంను నిలబెట్టి వేసింది! ఏమిటి అన్నట్లు చూసాడు శ్యాం.

''థ్యాంక్స్!''

''దేనికి?''

''ఫర్ ఎవిరిథింగ్! ఫర్ సేవింగ్ మై లైఫ్! ఫర్ బుకింగ్ ఆఫ్టర్‌మి! ఫర్‌ద హాస్పిటాలిటీ! ఫర్‌ద లవ్ అండ్ ఎఫెక్షన్!''

నీల చివరి మాటలు శ్యాం విన్నట్లు లేదు! అతను మెల్లమీదుగా కిందకు వెళ్ళిపోయాడు అంతకుముందే!

అయిదు నిముషాలున్నాక పనిమనిషిని వెంటబెట్టుకుని వచ్చాడు. మంచినీళ్ళ కూజా గ్లాసు గదిలో ఓ మూల స్టూలుమీద పెట్టించాడు. మంచంమీద అదమరచి నిద్రపోతున్న నీలను చూసి పనిమనిషి రామాంజమ్మతో "అమ్మాయిగారు నిద్రలేచే లోపల వరండా గదులూ అన్నీ శుభ్రం చెయ్యి!" అని చెప్పి వెళ్లిపోయాడు.

సుష్టుగా భోంచేసిన మీదట మంచంమీద పడుకోగానే నిద్రముంచుకొచ్చింది నీలకు! అందుకే శ్యాం తన మాటలు పూర్తిగా వినకుండా వెళ్లిపోయాడని తెలియగానే మంచంమీద పడుకోవాలని పించిందామెకు. బూరుగ దూదితో కుట్టిన శాటిన్ పరుపుమీద పడుకోగానే కళ్ళు మూతలు పడిపోయాయి.

అనుకున్నది అనుకున్నట్లు జరుగుతున్నదన్న సంతృప్తి అతిగా తిన్నమీద భుక్తాయాసంతో కనులు మూరుకుపోయి మగత నిద్రలోకి వెళ్ళిందామె!

శ్యాం మూడో అంతస్తులో వున్న తనగదిలోకి వెళ్ళిపోయాడు. విశాలమైన ఆ గది నాలుగు గోడలకు నిలువెత్తు బెల్జియం అద్దాలు బిగించి వున్నాయి! గోడల కానుకుని వున్న నల్ల చెక్క బీరువాల నిండా పుస్తకాలున్నాయి శ్యాం కిష్టమైన శ్యాం చదివిన తెలుగు ఇంగ్లీషు నవలలు, గ్రంథాలు, వెనుకటి కాలంనాటి తాళపత్ర గ్రంథాలు వున్నాయి.

నాన్న పోయిందగ్గర్నుండీ అమ్మ మేడమీదకు రాకపోయినా మనుష్యులను పంపి రెండో అంతస్తులోనూ మూడో అంతస్తులోనూ వున్న గదులను శుభ్రం చేయిస్తుండేది. ఏ గదిలో ఏ మూల

ఏ ముందీ ఆమెకు తెలుసు. మనుష్యులను పంపి మేడ మీద రెండో అంతస్తులోనూ. మూడో అంతస్తులోనూ వున్న గదులు వరండాలు హోళ్ళూ బూజు దుమ్ము దులిపించి క్లీన్ చేయించి అట్టే పెడుతుంటుందామె!

శ్యాం మేజా బల్ల మీద వున్న సోఫాలో కూర్చుని కళా పూర్ణోదయం పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. పుస్తకం లోని అక్షరాలు అలికినట్లయి ఏమీ కనపడడం లేదతనికి! కాని అతని మనోనేత్రం మాత్రం విస్పష్టంగా చూస్తూనే వున్నది.

కేవలం కొన్ని గంటల క్రితం రాజగృహం మూడో అంతస్తులోని తన గది కిటికీ ముందు నిలబడి వీధిలోకి చూస్తు ఉన్నాడు శ్యాం. రాజహంసలా మెమ్మదిగా రోడ్డు మీద వెళుతున్న తెల్ల ఎంబాసిడర్ 'రాజగృహం' గేటు ముందు ఆగిపోయింది. కారు నుండి దిగిన నీల బానెట్ఎత్తి పది నిమిషాలు ఇంజన్‌ను పరిశీలించి చూచింది.



"నీలా రండి మా ఇంటికి రండి కిందకు దిగి వెళ్ళిపిలుద్దామని మనసు లో ఒకవిధమైన ఆకాంక్ష పెంపొందసాగింది.

కాని కాళ్ళకు తుమ్మ జిగురు రాసినట్లు కదలకుండా వుండిపోయాడు శిలా విగ్రహంలా! హనుమంతుడిలా పరుగెడుతూ వెళ్ళి నీలతో ఏదో మాట్లాడాడు రాముడు.

నీల నిముషం సేపు తటపటాయించింది. ఏమనుకుందో ఏమో కారుబానెట్ వేసి కారు లాక్ చేసి రాజగృహం ఆవరణ లోకి అడుగెట్టింది.

శ్యాం మనసు లో ఆనందం పెల్లుబికింది. నా నీల నా కలల రాణి నా హృదయాధి దేవత సౌందర్య రాశి పుప్పొడి బొమ్మ నా ఇంటికి వస్తున్నది. విపరీతమైన మానసోల్లాసం శరీరాన్ని కరెంటు షాక్ కుదిపినట్లు కుదిపింది.

శ్యాం శిరరంలో అసంకల్పితంగా మరో మార్పు వచ్చింది. ఏ ఫలితాన్నాశించిఅతను మకరధ్వజ్ దగ్గరకు తర్వాత రతిరాజా దగ్గరకువెళ్ళి డబ్బు తగలేసుకుని విపరీతమైన నిరాశతో తిరిగి వచ్చాడో— ఏది లేదని అతను ఇప్పటి వరకు విపరీతమైన ఆత్మన్యూనతతో కుంగి పోతున్నాడో ఏ లోపం అతని శరీరాన్ని మనసునూ జాడ తెలియని రుగ్మతలా ఇవ్వాల్టి వరకు పట్టి పల్లార్చిందో— ఆ లోపం ఆ క్షణాన అతన్ని వదలిపోయింది. మన్మథ శాప వినిర్ముక్తుడైన శ్యాం మనసు అగ్నిపునీతమైన స్వర్గంలా మెరిసిపోయింది. విపరీతమైన లైంగికావేశం హృదయంలో చిరుజల్లులా మొదలై జల్లు పెను వర్షమై కుంభవృష్టితో ధరాపాతంగా కురిసే వానగా మారి అతని శరీరం సర్వస్వాన్ని మదన తాపంతోముంచి వేసింది.

"నేను—.. నేను"

"నేనిప్పుడు మామూలు మనిషిని!"

"నాలో ఏం లోపం లేదు."

"నేను నీలను ప్రేమించటానికి అర్హుడను'

ఈ ప్రపంచంలో నీలను నాలా ప్రేమించగల యువకుడు మరొకడు లేదు

"నీలను పువ్వులలో పెట్టి పూజిస్తాను"

"లేదు లేదు పూల పాన్పుపై పవళింపచేసి ఆమెకు స్వర్లోకానందాలను రుచి చూపిస్తాను.

నీలను అగ్నిసాక్షిగా వివాహమాడి ఆమెను రాజగృహం రాణిని చేస్తాను.

"ప్రపంచంలో ఏ యువకుడూ ఏ యువతినీ ప్రేమించి వుండలేదు అన్నంత గాఢంగా నీలను ప్రేమిస్తాను.

మన్మథుడు రతీదేవితో క్రీడించినట్లు నీలను ఆనందసాగరంలో వోలలాడిస్తాను.

అపూర్వమూ అపురూపమూ అపరిమితానంద దాయకమూ అయిన శృంగార కేళిలో పుక్కిరిబిక్కిరి చేస్తాను.

సృష్టిమొదలు ఈ క్షణం వరకూ ప్రపంచంలోఏ యువకుడూ యువతికీ అందించని సుఖాలను నీలకు అందించేస్తాను

'నీలా! నీలా డియర్'

''రాజగృహం''లో అడుగిడి ఆక్షణంలోనే నన్ను పరిపూర్ణ మానవుని చేసిన నీ పాదాలను చిగురాకులలాటినీ పాదాలనునా హృదయం మీద నిలుపుకుంటాను.

మనసులో పువ్వెత్తున ఎగిరిపడుతున్న భావ తరంగ ప్రకంపనలకు ఉబ్బి తబ్బిబ్బవుతూన్న శ్యాంకు గతంలో జరిగిన సంఘటనలు గుర్తుకు రాసాగాయి.

అమరావతిలో స్పృహ తప్పి నీళ్ళల్లోపడి వున్న నీలను ఎత్తుకుని వస్తున్నప్పుడు డాక్టరు రవి హాస్పటల్‌లో ఆమెను చేర్పినపుడు యూనివర్సిటీలో ఆమెను నిత్యం చూస్తున్నప్పుడు ఇన్ని సంవత్సరాలుగా తన మనసులో సుప్రతిష్ఠితమైన రూపం.

తడిచి వంటికతుక్కుపోయిన దుస్తులలో నుండి స్పష్టాస్పష్టంగా కన్పిస్తున్న శరీరం వొంపులు గుర్తొచ్చి ''నీలా యు ఆర్ మైన్'' అని అరిచాడు శ్యాం ఆర్తిగా.

''నీలా! నువ్వు నాదానవు! ప్రపంచంలో ఏ శక్తీ నిన్ను నా నుండి వేరుచేయలేదు!

నేను జీవించి వున్నంతకాలం సర్వకాల సర్వావస్థల యందు నిన్ను నేను స్వర్గసుఖాలలో వోలలాడిస్తాను.

నీ అడుగుల చప్పుడుతో, నీ నడకల కులుకుతో, నీ పిలుపుల ప్రతిధ్వనితో, నీ దివ్య రూప సందర్శనంతో, మృదుపల్లవ సదృశమైన నీ కర స్పర్శతో, కాంతులు వెదజల్లే నీ చూపులతో, కమనీయమూ దర్శనీయమూ అగు నీ చిరుదరహాసంతో నన్ను ఆనందింపజేస్తూ చిరకాలం 'రాజగృహం'లో వుండిపోదువు గాని!

మన శృంగార క్రీడలతో 'రాజగృహం' పరవశించిపోవాలి!

మన దివ్య ప్రేమ సరాగాలను చూసి అమ్మ ఆనందించాలి.

మన అనుకూల దాంపత్యాన్ని చూసి ఈ పల్లె ప్రజలు అసూయపడాలి!

అపూర్వమైన మన ప్రేమకథ— ఒక దివ్యకావ్యంలా చరిత్ర పుటలకెక్కాలి!

కేవలం మరో ప్రేమకథలా కాకుండా మరపురాని మరువలేని మరో చరిత్రలా నీలా శ్యాంల జీవిత కథ నిలిచిపోవాలి!

నన్ను మనిషిని చేసి నాకు పునర్జన్మను ప్రసాదించిన ఓ నీలా— నీకు నా ప్రేమను—



కృతజ్ఞతను ఆనందాన్ని— ఆవేశాన్ని— ఎలా తెలుపుకోను?!

అహల్య డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంది! కామమ్మ వండిన పిండి వంటలన్నీ ఒకోటిగా తెచ్చి పళ్లెంలో వడ్డించసాగింది! చూస్తుండగానే విస్తరి నిండిపోయింది!

రెండు నిముషాలున్నాక మళ్లీ వచ్చిన కామమ్మ ''ఏమిటొొదినా అలానే కూర్చున్నావ్?'' అంది బుగ్గలు నొక్కుకుంటూ.

''ఆ! ఏమిటే ఇది కామమ్మా! పోలేరమ్మకు పెట్టినట్లు ఇలా పెట్టావు?''

''వొదినా! నేను వొక్కొక్కటిగానే వడ్డించా! నువ్వు పరధ్యానంగా వుండిపోయావు!''

అహల్య దగ్గర్నుండీ సమాధానం రాకపోయే సరికి ''చక్కని పిల్ల! చిదిమి దీపం పెట్టుకోవచ్చు!'' అంది

''ఎవరు?''

''ఇందాక వచ్చిన అమ్మాయి! అదే మన శ్యాం స్నేహితురాలు— నీలమ్మ!''

''స్నేహితురాలు కాదు! ఇద్దరూ కలిసి చదువుకున్నారు!''

''అద్దంముందు సబ్బుని దాచుకోవాలంటే ఎలా వీలవుతుందొదినా? శ్యాం ఆ అమ్మాయి అప్ పీస్ మని మాట్లాడుకోవడం వినలేదనుకున్నావా? అబ్బాయి ఆ అమ్మాయికి ఒకో పిండి వంటా కొసరి కొసరి వడ్డించడం నేను చూడలేదనుకున్నావా?

వారెడేసి కళ్లతో ఆ అమ్మాయి మన శ్యాం వంక చూస్తుంటే ''ఈ పిల్ల మన శ్యాంను చూపుల్తోనే తినేట్లు వుందని అనిపించింది సుమా!''

''ఆ! ఏమిటి కామమ్మా నువ్వన్నది?'' కామమ్మ మాటలు వినపడకకాదు అహల్య అలా అన్నది— ఆమె మాటలు కల్గించిన ఆనందంతో మళ్లీ అవే వినాలని అన్నది!

''ఆ అమ్మాయి నీలమ్మ మనవాడికి మత్తుమందు చల్లినట్లుందొదినా!''

''నీ కన్నీ పరాచికాలే! వాళ్లిద్దరూ కలిసి చదువుకున్నారు! అందుకని కాస్త చనువుగా మాట్లాడు కుంటున్నారు! పద! సాయంత్రం టిఫిన్ చేద్దాగాని! బొబ్బట్లు అంటే శ్యాంకిష్టం!''

కామమ్మ మాటలు ఆనందాన్ని కల్గించినా ఆ సంభాషణ పొడిగించడం ఇష్టంలేకపోయింది అహల్యకు. ఇంతలో ''క్రింగ్ క్రింగ్'' మని ఫోన్ చప్పుడైతే లేచి వెళ్లి రిసీవరందుకుందామె.

టెలిఫోన్ ఎక్స్ఛేంజి నుండి ''ట్రంక్‌కాల్ ఇస్తున్నాం లైనులో వుండండి'' అన్నమాటలు విని టక్కు మని ఫోన్ పెట్టేసింది అహల్య.

నీల తండ్రికి విషయం తెలిసి మెకానిక్‌ను పంపితే— ఆ అమ్మాయి 'రాజగృహం'

నుండి వెళ్లిపోతుంది అన్న ఆలోచన ఆమెచేత ఫోన్ పెట్టేయించింది.

నిముషంలో మళ్లీ ఎక్స్ఛేంజ్ నుండి రింగ్ వచ్చింది! ఫోన్ రిసీవర్ తీసి పక్కన పెట్టేసి అవతలకు వెళ్లిపోయింది అహల్య.

హాలులోకి వెళ్లిందో లేదో రాముడు పరుగెత్తుకుంటూ వచ్చాడు?

"అమ్మా! మరే ట్రాక్టర్ డ్రైవర్ దశయ్య లేడు! మామగారి వూరెల్లాడండి!" అన్నాడు రొప్పుతూ!

అహల్య మాట్లాడకపోయే సరికి "అమ్మా! పోనీ పేటకు వెళ్లి మెకానిక్‌ను తీసుకొచ్చేదా?"

"ఆ! తీసుకురా!" అని వాడు బయటకు వెళ్ళబోతుంటే "—ఆగరా రాముడూ! శ్యాం తోట చూడాలంటున్నాడు! నువ్వు తోట దగ్గరకెళ్ళి కాపలా అతన్తో అబ్బాయిగా రొస్తున్నారని చెప్పు! పేటకు రేపు వెళ్దాగాని వెళ్లు!" అంది.

"అలాగేనమ్మా!" అంటూ బయటకు వెళ్ళిపోయాడు రాముడు.

* * *

వనమాలి తండ్రి నాగేశ్వరరావు మేడవున్న వీధి మొగదలలో కిళ్లీ కొట్టు వుంది.

కిళ్లీ కొట్టు ముందు నిలబడి సిగరెట్ ముట్టించుకుంటున్నాడు సుందర్. సైడెబర్న్స్, సింహం జూలులా మెడమీదకు వచ్చి పడుతున్న జుట్టు ఎర్రటి లుంగీ, పైన పసుపుపచ్చ రంగు స్పోర్ట్స్ బనియన్. మెళ్లో బంగారు చైను— ఎరుపెక్కిన కళ్ళు— సుందర్ చూపులు రోడ్‌మీద గస్తీ తిరుగుతున్నాయ్.

ముందు మజాలో రాత్రి మల్లిక ఇంట్లో పొందిన సుఖం తెల్లారాక కైపు దిగిపోయింది!

అందుకే రోడ్డుమీద పోయే 'కలర్స్'ను చూస్తూ కాలక్షేపం చెయ్యాలని వచ్చాడతడు. ఆదివారం కావడంతో ఒక్క 'కలర్' కనబడలేదు!

'ఇయ్యాల ఇస్కూళ్లూ కాలేజీలు సెలవు కాబోలు!'' అన్నాడతను కిళ్లీ కొట్టతనితో సాలోచనగా.

"ఆ!" అని సమాధానమిచ్చాడు కిళ్లీకొట్టతను పరధ్యానంగా!

"నాకు అంత పరధ్యానంగా సమాధానం చెబుతావా?" అన్నట్లు గుడ్లురిమి చూసాడు సుందర్. కిళ్ళీ కొట్టతను పళ్లంతా కళ్లు చేసుకొని వీధి వంక చూస్తూండడంతో సుందర్ గుర్రుగా తనవంక చూడ్డం కనపడలేదతనికి.

"వళ్ళు తిమ్మిరెక్కిందా?" అంటూ వాడిమీదకు వురుకుదామనుకున్న సుందర్ వీధిలోకి చూసాడు.

సుందర్‌కు దిగిపోయిన కైపు మళ్లీ ఎక్కింది! "వారెవా! ఏమందం! కళ్లతో



చూస్తేచాలు కైపులో వళ్లు జలదరించి పోతుంది" అనుకుంటూ వుషారుగా వేసాడు.

చిలకపచ్చ చీర కట్టుకున్న చిలక రోడ్డున నడచి వచ్చి తన ముందే ఆగింది!

సుందర్ శరీరానికి కిక్ వచ్చి సన్నగా వూగిపోసాగాడు!

"చూడండి! ఈ వీధిలో నాగేశ్వరరావుగారి ఇల్లు ఎక్కడో చెబుతారా?" అంది ఆ రంగుల రామచిలక.

ఆ! ఎవరూ? నాగేశ్వరావుగారా?

"అవునండీ?"

"ఈ వీధిగాదే! పక్క సందు చివర ఇల్లు! రా నా వెంట తీసికెళ్తా!" అన్నాడు కన్ను గీటుతూ సుందర్. జుగుప్సతో భయంతో తలవంచుకుని ముందుకు కదిలిందా అమ్మాయి.

"రాయే సిలకా! దారడిగి అలా బోతావేం?" మీసం దువ్వుతూ అరిచాడు సుందర్.

వెనుదిరిగి చూడకుండా ముందుకు పరుగెత్తిందా అమ్మాయి.

"ఆగాగు! అటుకాదు ఇటు! రా"

భయంతో పరుగెత్తి వీధివాకిలి గుండా మేడ లోపలకు పరుగెత్తిందా అమ్మాయి.

గలాటా విని వరండాలోకి వచ్చాడు వనమాలి.

"రాయే బయటికిరా!" అని అరుస్తున్న సుందర్‌వంక అసహ్యంగా చూస్తూ నిలబడ్డాడు.

"అరేయ్ మాలీ! దాన్ని బయటకు రమ్మనరా" అన్నాడు సుందర్! అతనూ మాలి ఎలిమెంటరీ స్కూల్లో కలసి చదువుకున్నారు! అప్పుడు వెనుదిరిగి చూసాడు మాలి.

భయంతో కంపించిపోతున్న ప్రియ కనపడింది. ప్రియ చూపులలో కనపడుతున్న నిస్సహాయత, దైన్యం, బేలతనం అతన్ని కదిలించివేసింది.

సుందర్ వంకకు తిరిగి "వెళ్ళరా! వెళ్లు!" అన్నాడు మాలి కోపంగా! మాలి కళ్లు అరుణతారల్లా ఎరుపెక్కిపోయాయి.

మాలి మాటలను లెక్క చెయ్యకుండా మెట్లెక్కి వరండాలోకి వస్తూ

"చేతికి చిక్కిన చిలకని సుందర్ వదలడు. అమ్మాయిని పంపించెయ్! అయినా నీకాడపిల్ల అవసరంలేదుగా!" ఏం జరిగిందో తెలుసుకొనే లోపల మాలికుడిచేయి పిడికిలి బిగించి వేగంగా సుందర్ దవడమీద పంచ్ ఇచ్చాడు.

విపరీతమైన వేగంతో మాలి ఇచ్చిన పంచ్‌కి అనుకోకుండా జరిగిన హఠాత్సంఘ

టనకు కుప్ప కూలిపోయాడు సుందర్. అతను లేచేలోపలే మీదపడి ముష్టి ఘాతాలతో అతన్ని కుళ్లబొడిచాడు మారి!

"ఏంకూసావురా రాస్కెల్!" అంటూ సుందర్‌ను మెట్లమీదుగా ఎత్తి వీధిలోకి గిరవాటెట్టాడు మారి.

రోడ్డుమీద పడి దొర్లుతూ విపరీతమైన నొప్పితో అరుస్తూ బెత్తెడు వెడల్పు వున్న తోలు బెల్టు విప్పి చేతిలో పట్టుకునిల్చున్నాడు సుందర్.

మేడ వరండానుండి ఒక్క ఉదుటున దూకుతూనే సుందర్ ఛాతీమీద తన్నాడు మారి.

"అబ్బా!" అంటూ కిందపడిన సుందర్ చేతిలోని బెల్ట్ గుంజుకుని చేతి సత్తువ కొద్దీ సుందర్ వంటిమీద బాదసాగాడు మారి.

"బాబోయ్! అవ్! చచ్చాన్రోయ్!" అంటూ హృదయ విదారకంగా అరుస్తూ రోడ్డున పడి దొర్లుతున్న సుందర్ అరుపులకు వీధిలోని జనం పరిగెత్తుకు వచ్చారు.

అంతలావు రౌడీ మారిచేతిలో పరాభవం పొంది బెల్ట్ దెబ్బలు తినడం చూసి ఆశ్చర్యపోయారు.

"సుందర్ వళ్లు వాతలు తేలుతున్నది!"

"వాడికంతే శాస్తికావాలి!"

"ఆడపిల్ల బజారులో పోతుంటే వెంటబడి వేధిస్తాడు!"

"కీచకుడే కలికాలంల్లో మన పేటలో సుందర్‌గా అవతారం ఎత్తాడు!"

"మారి చూడు! కొదమసింహంలా వున్నాడు!"

"అతని కంత కోపం ఎందుకొచ్చిందో?"

"ఇంకెందుకొస్తుందీ! ఇద్దరు కోడెప్రాయపు కుర్రవాళ్లకు తగాదా వచ్చిందంటే పడుచుపిల్ల గురించే అయుంటుంది!" చుట్టూ జేరిన వాళ్లంటున్న మాటలు విని మరీ బాధపడిపోసాగాడు సుందర్.

చర్మం చిట్లి రక్తం కారుతున్న దేహాన్ని చూసుకుని భయం పుట్టిందతనికి. గర్వం సర్వనాశనమై హీన స్వరంతో—

"గురూ! పొరపాటయింది గురూ! దణ్ణంపెడతా!"

"గురూ! చిన్నప్పుడు నీ క్లాస్‌మేట్‌ని గురూ!"

"తెలియక ఆ పిల్ల వెంటపడ్డాను గురూ!'

"నీక్కావాలంటే నువ్వు కోరుకున్న పిల్లను తెచ్చి పప్పజెబుతా! గురూ! గురూ! కొట్టకు గురూ!"



దొర్లుకుంటూ అవతలకు వెళ్లి కాలికి బుద్ధి చెప్పాడు సుందర్!

వీధిలో జనం అంతా మెచ్చికోలుగా తనవంక చూడటం గమనించాడు మారి!

మేడ వరండాలో నిలబడి ప్రేమగా, ఆర్తిగా, ఎపాలజిటిక్‌గా, కించిత్ బాధపడ్తున్నట్లు తన వంకే చూస్తున్న ప్రియ చూపులలో కలిసిపోయాయి మారి చూపులు.

నాలుగు కళ్ళు రెండైన మరుక్షణం తలదించుకున్నాడు మారి!

వీధిలో జనం అంతా ప్రియను పరీక్షగా చూసి చూసి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్లిపోయారు.

వరండా మెట్లెక్కుతూ హీనస్వరంతో "లోపలకు రండి! ప్రియగారూ!" అన్నాడు బిడియంగా మారి.

ప్రియ క్షణంసేపు తటపటాయించింది. అక్కడే నిలబడి వుంటే బజారున వచ్చే పొయ్యే వాళ్లు తన వంకే చూస్తారని గుర్తొచ్చింది.

తల వొంచుకుని లోపలకు వెళ్లింది ప్రియ.

"రండి ప్రియా! కూర్చోండి!" అన్నాడు మారి సోఫాలోవున్న పేపర్లు, పుస్తకాలు తీసి ఆమె కూర్చోడానికి వీలు కల్పిస్తూ. సోఫాలో కూర్చుంటూ హాలంతా పరీక్షగా చూడసాగింది ప్రియ.

గృహిణిలేని ఇల్లు ఎలా ఉంటుందో అలాగే ఉందా ఇల్లు. ఎక్కడ చూసినా దుమ్మూ, ధూళి, బూజు, విడిచిన బట్టలు — స్నానం చేసి ముద్దగా పడేసిన టవల్స్, పుస్తకాలు, పేపర్లు, ప్లేట్లు, కప్పులు, సాసర్లు — ఓ పక్క కిందపడి దొర్లుతున్న ఖాళీ విస్కీసీసాలు, పగిలిన విస్కీగ్లాసులు.

మారి లోపలకు వెళ్లి వంటమనిషి మాలయ్యతో కాఫీ తెమ్మని చెప్పి వచ్చిన ఐదు నిమిషాలలో కాఫీ కప్పులతో వచ్చాడతను. మురికి అట్టలు కట్టినట్లుగా వున్న లుంగీ పైకి మడిచి కట్టాడు బాలయ్య. అనాచ్ఛాదితంగా వున్న శరీరంపై భాగంమీద బొర్లి మచ్చల్ని కప్పిపెడుతూ మసిపాతలాటి తుండుగుడ్డ కప్పుకున్నాడు. అడ్డదిడ్డంగా పెరిగిన గడ్డం, తైల సంస్కారం లేని క్రాపు, గారపట్టిన పళ్లు — 'ఈ వళ్లు నాది కాదు' అన్నట్లు ఉన్నాడతను.

ప్రియను చూడగానే ఆశ్చర్యంతో సిగ్గుతో తబ్బిబ్బయి పోయాడతను. అతను వంటమనిషిగా కుదిరిన పదేళ్లలోనూ ఆ ఇంటికి ఆడవాళ్లెవరూ అతిథులుగా రాలేదు. మారి తండ్రి నాగేశ్వరరావు అడపాదడపా డబ్బుకు వళ్లమ్ముకునే ఆడవాళ్లను ఇంటికి పిలిపించుకునే వాడు. అలా తెచ్చిన స్త్రీలు చీకటిపడ్డాక వచ్చి తెల్లవారే లోపల

వెళ్లిపోయేవాళ్లు.

మాలికోసం ఎవరూ వచ్చేవాళ్లు కారు. అతనికోసం ఒక ఆడపిల్ల – ఇంత చక్కని అమ్మాయి రావడం ఇదే మొదటిసారి.

చాలాకాలంగా మాలి ఆడపిల్లల వంక కన్నెత్తి చూడడంలేదు. కొంతసేపటి క్రితం మాలి రౌద్రాకారంతో సుందర్‌ను మట్టి కరిపించిన విషయం అతను చూడలేదు. కూరగాయలు కోసే పనిలో వుండి ఆవిషయం పట్టించుకోలేదతను!

లేత గులాబీమొగ్గలా మెరిసిపోతున్న ప్రియను చూచి అందుకే సిగ్గుపడి పోయాడతను.!

కాఫీ కప్పులు బల్లమీదుంచి లోపలకు వెళ్లిపోయాడతను. రేకుపెట్టెలో వున్న మంచి లుంగీ తీసికట్టుకుని చొక్కా వేసుకుని దువ్వెనతో క్రాపును అడ్డదిడ్డంగా దువ్వుకుని రెండు నిమిషాల్లో తిరిగి వచ్చి వాకిలి అవతల నిలబడ్డాడతను.

కాఫీ కప్పు ప్రియ చేతికందిస్తూ "కాఫీ తీసుకోండి!" అన్నాడు మాలి.

"మీకు చాలా శ్రమ ఇస్తున్నాను" నెమ్మదిగా అంది ప్రియ.

"నోనో! ఇటీజ్ ఎ ప్లెజర్" వుషారుగా జవాబిచ్చాడు మాలి.

"ఈ పేటలో ఎక్కడో నా చిన్నప్పటి స్నేహితురాలు లత ఉంది. ఎన్నాళ్లనుండో తనను చూడడానికి రావడంలేదని నిష్ఠూరాలాడుతోంది. పరీక్షలయి పోయాయిగదా అని లతను చూద్దామని వచ్చాను. బస్ దిగి సూట్‌కేసుతో రిక్షా ఎక్కివచ్చాను. మూలమలుపులో రిక్షా ఆపి 'అతడి'ని లత ఎడ్రస్ చెప్పి ఎలా వెళ్లాలని అడిగాను.

అంతే! మకురుదున్నలా వెంటబడ్డాడు. ఎటు పరిగెడుతున్నదీ తెలియకుండా మీ ఇంటిలోకి వచ్చేశాను. రిక్షా ఏమయిందీ సూట్‌కేస్ వున్నదో పోయిందో తెలియలేదు" అంది ప్రియ తను అక్కడికి రావడానికి గల కారణాన్ని వివరిస్తూ.

"మంచి పని జరిగింది! మీరు మా ఇంట్లోకి రాకపోయినట్లయితే ఆ సుందర్‌గాడు..."

"అవును నేనూ అదే అనుకుంటున్నాను. మాలిగారు ఇక నేను వెళతాను. నాకు ఈ ఊళ్లో వుండాలని లత ఇల్లు వెతకాలని అనిపించడంలేదు!" అంటూ లేచి నిలబడింది ప్రియ.

"వుండండి! వుండండి! రౌడీ ఎవరో అల్లరి చేశారని వెళ్లిపోతారా? మళ్ళీ వాడు మీవంక కన్నెత్తి చూస్తే కీళ్లు విరిచేస్తాను"

"నా మనసు బాగాలేదు మాలీ. వస్తా! థాంక్స్ ఫర్ ఎవ్విరిథింగ్!" అంటూ రెండడుగులు వేసింది ప్రియ. చలిజ్వరం వచ్చినట్లు ఆమె శరీరం సర్వస్వం కంపించి



పోసాగింది. తలలో నెమ్మదిగా బయల్దేరిన వణుకు చేతులు కాళ్ళకూ పాకి గడగడ వణికి పోసాగింది ప్రియ.

"ప్రియా!" అంటూ మాలీ వెనక వాకిలిదగ్గర నుండి బాలయ్య ఆమె దగ్గరకు వచ్చి నిలబడ్డారుగానీ ఆమెను తాకడానికి సందేహించి అడుగు దూరంలో నిలబడి పోయ్యారు.

వణుకుతూనే వెళ్ళి సోఫాలో పడుకుంది ప్రియ.

"ఏమైంది?" మాలి కంఠంలో పొలుకుతున్న ఆదుర్దా గమనించే స్థితిలో లేదు ప్రియ.

బాలయ్య దుప్పట్లు తెచ్చి కప్పాడు. దుప్పట్లు కప్పినా ప్రియ వణికిపోవడం తగ్గలేదు.

"పక్కవీధిలో డాక్టరు రమణగార్ని పిలుచుకువస్తా!" అంటూ పరుగెత్తుకు వెళ్లాడు బాలయ్య.

డాక్టరు రమణ అని బోర్డు తగిలించివున్న ఇంటి ముందు నిలబడి చూశాడు బాలయ్య.

రమణ పేరుపక్కన ఎ నుండి జడ్‌దాకా వున్న అక్షరాలను చూచి బాలయ్యకు మనసులో తృప్తి కలిగింది. నెలరోజుల నాడు వూరి బయట గుడిశెలో ఉన్న గుంటపాప దగ్గర తగిలించుకున్న జబ్బు డాక్టరు రమణ నయం చేశాడని గుర్తొచ్చి ధయిర్యం పెరిగింది.

"రండి డాక్టరూ! అమ్మాయిగారికి జ్వరం వచ్చింది. దబ్బున రండి!" అంటూ హడావిడి చేసి డాక్టర్ రమణను ఇంటికి తీసుకువచ్చాడు బాలయ్య.

"డాక్టరుగారూ! ఈమెకు సడెన్‌గా సుస్తీ చేసింది చూడండి!" అన్నాడు మాలీ ఆదుర్దాగా.

నిజానికి డాక్టర్ రమణ ఏ మెడికల్ కాలేజీలోనూ వైద్యం చదువుకోలేదు. పొట్ట తిప్పల కోసం పేరుపక్కన కొన్ని అక్షరాలు తగిలించుకుని ఘరానాగా తంటాలు పడుతున్నాడు. డాక్టరు కాకమునుపు పూర్వాశ్రమంలో అతను ఒక ప్రముఖ డాక్టరు. ఆసుపత్రి ఎదురుగా ఉన్న మందుల షాపులో గుమాస్తాగా వుండి రకరకాల రోగులకు డాక్టర్ రాసే ప్రిస్క్రిప్షన్‌లు గమనిస్తూ ఉండేవాడు. ఒక శుభముహూర్తాన మకాంమార్చి వాకిలి ముందో బోర్డు కట్టి బాలయ్య లాటివాళ్లను ఆకర్షిస్తూ కాలం గడుపుతున్నాడు.

ప్రియను స్టెతస్కోపుతో పరీక్షించాలని ముందుకు వంగాడు రమణ. గడగడ వణికిపోతున్న ప్రియ ఛాతీపై క్షణంలో సగం స్టెతస్కోపు ఉంచి నిటారుగా నిలబడ్డాడతను.

"ఒక్కసారిగా టైఫాయిడ్, మలేరియా కలిసి వచ్చాయి. ఈ జ్వరాన్ని టైఫో మలేరియా అంటాము!" అన్నాడు డాక్టర్ రమణ.

"అమ్మో!" అన్నాడు బాలయ్య అప్రయత్నంగా. అంత పొడవాటి పేరుగల జ్వరాన్ని గురించి విని వుండలేదతను.

"ఈ జ్వరానికి ప్రత్యేకంగా కలకత్తా నుండి మందు తెప్పించాను! ఇదిగో ఈ గుళికలు గంటకు రెండు చొప్పున మూడు తఫాలుగా వేయండి!" అంటూ సన్న మాత్రలున్న చిన్న సీసా మాలి చేతిలోవుంచి బయటకు నడిచాడు.

చలిజ్వరం వచ్చిన రోగి వణికిపోతాడని తెలుసు రమణకు. ప్రియ ఎక్కువగా వణికిపోతున్నది గనుక "టైఫో మలేరియా" వచ్చిందని చెప్పాడు.

మెట్లు దిగుతున్న రమణ దగ్గరకు పరుగెడుతూ వెళ్ళి "డాక్టరుగారూ! అమ్మాయిగారి జ్వరం ఎన్నాళ్లకు తగ్గుతుందంటారు?" అన్నాడు బాలయ్య.

"వారం పదిరోజులు పడుతుంది. జ్వరం పైకి తగ్గినట్లే తగ్గి లోపల పాకిపోతుంది. శీతపైత్య జ్వరం చాలా ప్రమాదం! మీ అదృష్టం కొద్దీ కరెక్టు మందు నా దగ్గరవుంది!" అంటూ వెళ్లి రిక్షాలో కూర్చున్నాడు రమణ.

డాక్టరు రమణ మాటలు విన్న దగ్గర్నుండీ బాలయ్యకు ఆదుర్దా హెచ్చిపోయింది!

"మాలిబాబూ! అమ్మాయిగారికి ప్రమాదమైన జ్వరం వచ్చేసింది. ఆర్నీ కదిలించటానికి వీల్లేదు. జ్వరం తగ్గటానికి పదిపదేను రోజులుపడుతుందట!" అన్నాడతను మాలితో.

మాలి బాలయ్య మాటలు విన్నట్లే లేదు. అతను సోఫాలో గడగడ వణికిపోతున్న ప్రియను తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు. అతని కనుకొలకుల నుండి కన్నీరు రాసాగింది.

"అసామాన్య సౌందర్యవతి అయిన ఈ ప్రియ — నా మనసుకు ప్రియం గూర్చే ఈ ప్రియ — ఈ రోజు నా ఇంట్లో ప్రమాదమైన జ్వరం తగిలిపడి ఉంది" తల్లడిల్లిపోతూ నేలమీద చతికిలబడి పొయ్యాడు.

మాలి చేష్టలుడిగి దిక్కుతోచక పడిపోయి వుంటే అందుకు భిన్నంగా బాలయ్య హడావుడి చేయసాగాడు. దక్షిణపువేపున ఉన్న బెడ్‌రూం బూజుదులిపి శుభ్రంచేసి మంచంమీద ఇస్త్రీదుప్పటి వేశాడు. కిటికీ తలుపు ఓరగావేసి "మాలిబాబూ! అమ్మాయిగారిని ఈ గదిలో పడుకోమనండి!" అన్నాడు.

"ప్రియా! ప్రియా! కొంచెం లేచి ఈ పక్కగదిలోకి వస్తావా?" నెమ్మదిగా అడుగుతున్న మాలి మాటలకు కళ్లు తెరిచింది ప్రియ.



ఒంట్లో ఓపికనంతా కూడదీసుకుని లేచి నిలబడింది. రెండడుగులు వేసేసరికి వణుకు, తూలుడు ఎక్కువై పడిపోబోయింది.

"మాలిబాబూ" ప్రియకేదో ప్రమాదం జరిగిపోతుందని భయపడి కేకవేశాడు బాలయ్య.

మాలి చప్పున ముందుకు పరిగెత్తి కిందకు ఒరుగుతున్న ప్రియను పట్టుకున్నాడు.

చేతులలో జావలా జారిపోతున్న ప్రియను నడుంకింద చేతులువేసి ఎత్తిపట్టుకుని ముందుకు నడిచాడు.

ప్రియను పూలహారంలా భద్రంగా మంచంమీద పడుకోబెట్టాడు మాలి.

"ప్రియా!"

"అమ్మాయిగారూ!"

ఒకవైపు మాలి, మరోవైపు బాలయ్య మంచం పక్కన నిలబడి కేకలు వేస్తుంటే ప్రియ తలమీద ఎవరో సమ్మెటతో మోదినట్లయి కళ్లు మూతలు పడిపోయాయి. ఆ క్షణాన ఆమె శరీరంలో విపరీతమైన వణుకు బయల్దేరింది.

"అమ్మాయిగారూ!" ప్రియకు ఏదో ప్రమాదమైన జబ్బు చేసిందని డాక్టర్ రమణ చెప్పిన మాటలు గుర్తొచ్చి కళ్లు తుడుచుకుంటూ చతికిలపడి పోయాడు బాలయ్య.

ఈసారి పరిగెత్తడం మాలి వంతయింది. ఫోన్ దగ్గరకు పరుగెత్తి గుంటూరు డాక్టరు రవికి డైరెక్ట్ ట్రంక్‌కాల్ చేశాడు.

"సార్! డాక్టరు రవిగారేనా?"

"ఆ ఎవరు మాట్లాడేది?"

"నేను సార్! మాలిని!"

"ఏం మాలీ! బాగున్నావా?"

"బాగున్నాను సార్? లేదుసార్? ప్రియకు పెద్ద సుస్తీ చేసింది. టైఫో మలేరియా వచ్చింది. మీరు వెంటనే బయల్దేరి రావాలి!"

"ఏమిటీ? ఆ జబ్బు పేరు వినలేదే? ఎక్కడుందామె?"

"ఇక్కడే మా ఇంట్లోనే ఉంది. మీరు వెంటనే బయల్దేరి రండి! నాకు భయంగా ఉంది. ట్రంక్‌రోడ్‌నుండి మా వూరు రోడ్డు చీలే జంక్షన్ దగ్గర నిలబడి ఉంటాను. మీరు త్వరగా బయల్దేరి రండి!" అంటూ ఫోన్ పెట్టేశాడు మాలి.

మాలి ఫోన్‌కాల్ కలిగించిన ఆశ్చర్యం నుండి తేరుకుని కిట్‌బ్యాగ్, మందులు, బి.పి ఆపరేటస్, థర్మామీటర్ తీసుకుని రమ్మని నర్సుతో చెప్పి వెళ్లి కారెక్కాడు డాక్టరు రవి. మాలి, ప్రియల మధ్య ఉన్న విచిత్ర ప్రేమ గూర్చి తెలిసివున్నాడు గనుక

బయల్దేరాడుగానీ లేకపోతే బయటవూళ్లకు సాధారణంగా విజిట్స్‌కు వెళ్లడు డాక్టర్ రవి.

* * *

ట్రంక్‌రోడ్ నుండి కారు మలుపు తిరిగింది మాలిని ఎక్కించుకుని.

“మాలీ ఏమైంది?” అని అడిగాడు డాక్టర్ రవి. జరిగిన విషయాలన్నీ చెప్పాడు మాలి. ఇంతలో కారు మాలి ఇంటి ముందాగింది.

ప్రియను పరీక్షించి చూశాడు డాక్టర్ రవి. నాడి బలహీనంగాను, అతివేగంగానూ కొట్టుకుంటున్నది. హృదయస్పందన, రక్తపోటు బలహీనంగా వున్న పరిస్థితిని తెలియజేశాయి.

“ప్రియ చాలా నీరసంగా వుంది!” అన్నాడు డాక్టరు రవి.

“టైఫో మలేరియా కాదంటారా?” ఆదుర్దాగా అడిగాడు మాలి.

“ఉహూ! పరీక్షలకు విపరీతంగా చదివి చదివి శరీరం, మనసూ రెండూ డస్సిపోయుంటాయి. దానికితోడు పొద్దున ఆ రౌడీవెధవ అలా వెంటబడడంతో నెర్వస్ ఎగ్జాషన్ వచ్చుంటుంది. క్రమంగా ఆమె కోలుకుంటుంది!”

“అలాగే సార్! అమ్మాయిగారిని జాగ్రత్తగా చూసుకుంటామ్!” మాలికి బదులు బాలయ్య సమాధానం చెప్పాడు. ఇంజక్షన్ ఇచ్చాడు డాక్టర్ రవి. కొంచెం కదిలింది ప్రియ.

ఇది సీరియల్
నవలా పథకం
మొగలీ పువ్వంటే నాల్గవభాగం

ఆంధ్రభూమి
సచిత్రవారపత్రిక
సీరియల్ నవలా పుస్తక పథకం—6

5

# మొగలీ పువ్వంటే

## డాక్టర్ కొత్త రవీంద్రబాబు

### జరిగిన కథ

అమరావతి పిక్నిక్‌కని వస్తారు
ఎమ్.ఏ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు.
శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ
ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు.
షాలిని మేడమ్ అంటే
విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి
కృష్ణ ఆవలి వడ్డుకు వెళ్ళివస్తూన్న నీలను
పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్.
షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ
స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది.
కారు చెడిపోయి అనుకోకుండా శ్యాం ఇంటికి
చేరుతుంది నీల. మాలి ఇంటికెళ్ళిన ప్రియ జబ్బుపడుతుంది.

# 5

"ప్రియా!" డాక్టరు రవి కంఠం విని కనులు తెరిచింది ప్రియ.

"పరీక్షల ప్రిపరేషన్ కోసం డెక్సీడ్రిన్ బిళ్లలేమైనా వేసుకున్నావామ్మా?"

ఆశ్చర్యంగా చూసింది ప్రియ. మరుక్షణం తల అడ్డంగా తిప్పింది.

డెక్సీడ్రిన్ బిళ్లలు వేసుకున్నావా అన్న ప్రశ్నకు లేదన్నట్లు తల అడ్డంగా తిప్పిన సమాధానానికి మధ్య ప్రియ కళ్లలో కనపడ్డ బెదురుచూపు మనసులో నవ్వుకున్నాడు డాక్టర్ రవి.

కారు ఎక్కిన తర్వాత ఆదుర్దాగా దగ్గరకు వచ్చిన మారితో "ప్రియ బాగా డస్సిపోయి ఉంది. ఆమె శరీరానికి విశ్రాంతి, మనసుకు ఉల్లాసం కలిగించాలి! ఇచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడాలి!" అన్నాడు.

"భయం ఏం లేదంటారా?" అణుచుకుందామన్నా మారి మాటలలో ఆందోళన ఆగలేదు.

"డోంట్‌వర్రీ ఎబౌట్ హర్! నీ షెవర్లే ఎలా ఆమెను సుందర్ బారినుండి కాపాడిందో అలాగే నీ అనురాగ హృదయం ఆమె రుగ్మతను పోగొడుతుంది!" అంటూ మారి భుజం తట్టాడు డాక్టర్ రవి.

మరుక్షణం డాక్టర్ రవి మారుతీ కారు ముందుకు దూసుకు వెళ్లింది. తేలికపడ్డ మనసుతో లోపలకు వచ్చాడు మారి.

"అమ్మాయిగారూ! ఈ మాత్ర వేసుకోండి!" బాలయ్య మాత్ర ఒక చేతిలో మంచినీళ్ల గ్లాసు, ఒక చేతిలో పుచ్చుకుని అశోకవనంలో సీతమ్మవారి ముందు నిలబడ్డ హనుమంతునిలా కనపడ్డాడు మారికి.

ప్రియ శరీరం విపరీతంగా కంపించసాగింది. మారి మంచం అంచున కూర్చుని ప్రియను లేవదీసి కూర్చోబెట్టాడు. ప్రియ వీపును తన భుజంమీద ఆనించుకుని పొదివి పట్టుకున్నాడు.

"ప్రియా!" మారి పిలుపు సుదూరం ప్రయాణంచేసి వచ్చిన మలయ మారుతంలా ఆర్ద్రంగా ప్రియ వీనులకు సోకింది.

మారి శరీరస్పర్శ, ప్రియను గూర్చే అతని మృదు సంబోధనా, ప్రియ మనసును



సేదదీర్చి శరీరాన్ని కుదిపివేస్తున్న ప్రకంపనను తాత్కాలికంగా నిలిపివేసింది.

"ప్రియా! ఈ మాత్ర మింగు!" మాత్రను పెదవుల మధ్యనుండి నోటిలోపల కందించాడుమారి. బిళ్ల మింగి గ్లాసులో నీరు గుక్కెడు త్రాగిందో లేదో పొలమారి ఉక్కిరి బిక్కిరి అయిపోసాగింది ప్రియ.

"అమ్మాయిగారూ!" ప్రియకేదో ప్రమాదం జరిగి పోతుందనుకుని గాభరా పడిపోసాగాడు బాలయ్య.

గుండెల మీదనుండి మెడముందుభాగం వరకు చేతి మునివేళ్లతో నెమ్మదిగా స్పృశిస్తూ "తగ్గిపోతుంది ప్రియా!" అంటూన్న మారి మాటలు బీటలువారిన నేలపైపడుతున్న స్వాతివాన చినుకుల్లా సేదదీర్చాయి ప్రియను.

పొలమారడం తగ్గి నింపాదిగా ఊపిరి పీల్చుకుంటూ తలనుమారి భుజంపై వాల్చింది ప్రియ. ఎడంచేత్తో ప్రియ ఛాతీ మధ్యభాగంలో సవరిస్తూ కుడిచేతితో రేగిన ముంగురులు నెమ్మదిగా సరిచేయసాగాడు మారి.

అమ్మాయిగారికి ప్రమాదం జరుగుతుందని భయపడ్డ బాలయ్య 'అమ్మయ్య!' అని నిట్టూర్చి ఏదో పని ఉన్నట్లు అక్కడనుండి వెళ్లిపోయాడు.

సినిమాలో స్టిల్ ఫోటోలా ప్రియ మారి అక్కున చేరివుండడం అతనికి ఆనందాన్ని కల్గించినా పానకంలో పుడకలా అక్కడ వుండగూడదని వివేకం మనసును హెచ్చరించడంతో కదిలిపోయాడు బాలయ్య!

ప్రియ మారిల హృదయాలు ఎంతో కాలంగా సన్నిహితంగా వున్నాయి. స్పందన ప్రతిస్పందనలతో అవి కొన్ని సంవత్సరాలయినా మూగ సంకేతాలు పంపుకుంటూనే వున్నాయి. విచిత్ర పరిస్థితుల్లో దగ్గరైన ఇద్దరి శరీరాలు, ఎదురుగాలికి దరిచేరిన మబ్బుతునకల్లా, ఎగిసిపడి కలిసిపోయే సముద్ర తరంగాల్లా ఒకటైపోయాయి ఆ సమయాన.

"డెక్సీడ్రిన్ బిళ్లలు మింగి సుందర్‌ను కవ్వించి రిస్క్ తీసుకున్నందుకు ఫలితంగా నా మారికి దగ్గరయ్యాను! నివురుగప్పిన నిప్పులా ఇతని మనసులో అణగారిపోయిన ప్రేమను రగిలించాలి!"

"ప్రియా గమన క్షణం నుండి నా మనసు కట్లు తెంపుకున్న మదగజంలా పరుగెడుతున్నది! నా మనసు పరుగెత్తే వేగానికి నా శరీరం తట్టుకోగలదా? శక్తి ఉడిగి ఆత్మ న్యూనతా భావంతో మగ్గిపోతున్న నేను ఈమెకు సరిజోడీ కాగలనా? "నీ కమ్మాయి ఎందుకు?" అన్న క్షణం నుండి నాలో రేగిన వాంఛ పెరిగిపోతున్నది! నాలో కలిగిన ఈ మార్పు కలకాలం నిలిచి వుండేనా?"

* * *

శ్యాం మూడో అంతస్తులోని తన గదిలో కూర్చుని వుండిపోయాడు! గంట క్రితం నీల నిద్రపోతున్నదని పైకివచ్చేసాడతను. ఒకో తెలుగు కావ్యం తెరచి చూడసాగాడు. అతనికి ప్రయత్నంగా ఆముక్తమాల్యద పద్యం గుర్తొచ్చింది.

ఆయత భుజైక చక్రుం
డాయుదుపత్ని దొమ్మి గెలువ నడరు మరునికా
లా యున చక్రపరంపర
లోయున ముంగర పుగురులు యువతికి నమరున్!

మదనుని ఉక్కు చక్రాయుధముల వరవల్లా వున్న ముంగురులను వర్ణించాడా పద్యంలో రాయలు.

నిద్రపోతున్న నీల ఎంత ముగ్ధమోహనంగా కనపడింది. మూసుకుపోయిన ఆమె కాటుక కనులు వికసించని కలువ మొగ్గలలాను మదనుని జోడు విల్లులా అర్చీలు తిరిగినట్లున్న కనుబొమలు— ఆపైన రింగులు తిరిగిన నల్లని ముంగురులు మన్మథుని ఉక్కు చక్రాయుధాల్లా కనపడ్డాయి శ్యాంకు!

ఇంత కాలం తెలుగు కావ్యాలూ ప్రబంధాలూ చదువుతున్నప్పుడు శృంగార రసం చిప్పిలే వర్ణనలు వచ్చినప్పుడు ఆయా భాగాలను వదలి ముందుకు సాగిపోయేవాడు శ్యాం! కాని కొన్ని గంటలనుండి అతనికి తద్విరుద్ధంగా— ఇంతకాలం తనువద్దనుకుని వదిలేసిన శృంగార ఘట్టలను చదవాలని కుతూహలం ఎక్కువైంది!

"శ్యాం!"

వులిక్కిపడ్డాడు శ్యాం! ఎదురుగా నిలబడివుంది నీల— ప్రబంధనాయికిలా— మన్మథుడు సంధించి వదిలిన పూబాణంలా!

"నీలా! రా! కూర్చో!"

సోఫాలో కూర్చుంటూ "చాలా పుస్తకాలున్నాయే! రియల్లీ గుడ్ కలెక్షన్!" అంది మెచ్చికోలుగా!

"అందులో ఎక్కువ అమ్మ పుస్తకాలు!"

"రియల్లీ!"

"అవును! అమ్మకు తెలుగు సాహిత్యం అంటే అభిమానం ఎక్కువ! ఆమె చదవని కావ్యం లేదు! నేను తెలుగు ఎం.ఏ చదవటానికి అమ్మ ప్రోత్సాహమే కారణం!"

"అలాగా! రోజూ ఖాళీ సమయంలో పైకి వచ్చి చదువుకుంటారు కాబోలు!"



"లేదునీలా! నాన్న పోయాక అమ్మ మేడమెట్లు ఎక్కలేదు! పుస్తకం ముట్టలేదు!"

"వాట్ ఏ ట్రాజెడీ!"

"శ్యాంబాబూ! అమ్మగారు మిమ్మల్నీ నీలమ్మగార్నీ కిందకి దిగి రమ్మన్నారు. ఫలహారం చేద్దురుగాని రండి!

"రా నీలా! కిందకు వెళదాం!"

"శ్యాం! నా కడుపులో ఇక ఆవగింజంత ఖాళీ కూడా లేదు! ఇప్పుడు నేనేం తినలేను!" అని వెను తిరిగి చూసింది నీల. శ్యాం గదిలో లేడు! అతను కిందకు దిగి వెళ్ళిపోతూ కనబడ్డాడు. చేసేదిలేక అతన్ననుసరించింది నీల.

"రామ్మా నీలా రా! కూర్చో" ఆప్యాయంగా పలుకరించింది అహల్య.

బల్లమీద పెట్టివున్న గిన్నెలను చూస్తూ 'నేనేమన్నా బకాసురిడి చెల్లెల్ననుకున్నారా? కడుపు బెలూన్‌లా వుబ్బిపోయి వున్నది! నేనేం తినలేను!"

'అదేమిటే నీలా! నువ్వలా అంటే ఎలా? నువ్వు తినకుండా నన్నొక్కడినే ఈ బొబ్బట్లు తినమంటావా?" అన్నాడు శ్యాం విష్ణూరంగా!

"కూర్చోమ్మా! పోనీ కొంచెం కొబ్బరి నీళ్ళు తీసుకో!" అంది అహల్య.

తేనె నిమ్మరసం కలిపి తెచ్చిన చల్లటి కొబ్బరినీరు ఒకో గుక్కా చప్పరిస్తూ బొబ్బట్లు తింటూన్న శ్యాం వంక చూడసాగింది నీల. మధ్యాహ్నం సరిగా అన్నం తినకనో, లేక బొబ్బట్లుమీద యిష్టం వలనో ఆవురుమని తింటూ కనపడ్డాడు శ్యాం!

"శ్యాం! నీలను తోటదగ్గరకు తీసుకుని వెళ్లు!" అంది అహల్య.

* * *

రాజగృహం మెట్లు దిగుతూన్న శ్యాం మనసు దూది పింజకన్న తేలికగా గాలిలో ఎగిరిపోతున్నది. పక్కన నడుస్తున్న నీల అందుకు కారణం! మేడహాలులో నిలబడి అమ్మ తమ వంకే చూస్తున్నదని అతనికి తెలుసు! మూడు సంవత్సరాలుగా నీలను ప్రేమిస్తూ అంతులేని మనోవ్యధకు గురి అయ్యాడతను! కాని మనోవ్యధ బదాబదలయి శృంగార రసవాహినులు మనసును అభిషేకం చేస్తుంటే జోరుగా హుషారుగా నీలతో షికారుకు బయల్దేరాడతను.

పక్కన నడుస్తున్న నీల వద్దనుండి వస్తున్న ఈవెనింగ్ ఇన్ పారిస్ పరిమళం గుబాళింపు, గాలికి వచ్చి శరీరాన్ని తాకుతున్న నీల చీర కొంగు కొన అంచులు శ్యాం ఒరిజినల్ గ్రంధులను కొరడాతో కొట్టి ఎపినెఫ్రిన్, నార్ ఎడినెఫ్రిన్‌ను అతని రక్తంలోకి పంపేలా చేసాయి. నాడీచలనం హృదయ స్పందనా వేగవంతమై ముఖంలో

రక్షపసరణ పెరిగి వెలిగిపోతూ వున్నాడతను!

పల్లెటూర్లో పరువం మిడిసిపాటుతో పక్కపక్కన నడిచిపోయే జంటను చూస్తే అక్కడ పడతారు! నీల శ్యాం అలా నడచివెళ్తున్నప్పుడు చూసినవాళ్లు అలాగే శిలా విగ్రహాలలా నిలబడిపోయి బుగ్గలు నొక్కుకున్నారు!

"ఎవరే ఆ పోయేది?"

"ఇంకెవరు? అహల్య కొడుకు!"

"నేనడిగేదదికాదు! పక్కనున్న చక్కని చుక్క ఎవరూ అంటున్నా?"

"ఎవరో బస్తీపిల్ల! శ్యాంతో కలిసి చదువుకుందట!"

"ఇదేం విడ్డూరమే! ఆడపిల్ల ఆమడ దూరంలో కనపడితే ఫొడపామును చూసినట్లు పక్కకు తప్పుకునేవాడు చక్కటి చుక్కని వెంటేసుకుని పచ్చిగా నడిబజారున షికారుకు బయల్దేరాడు!"

"పట్నం చదువుల మహిమ! కలికాల మహిమ"

"అంతేనంటావా?"

"కాక! అందమైన ఆడపిల్లను చూస్తే బ్రహ్మకైనా పుడుతుంది రిమ్మ తెగులు!"

"ఏ పుట్టలో ఏ పాముందో? ఆ అమ్మాయి శ్యాంమీద వశీకరణ మంత్రం చల్లిందేమో?"

"ఆ పిల్ల కళ్ళల్లోనే వుందే ఆకర్షణ!"

"పత్తికాయలంత కళ్ళు! ఆ పిల్ల ఒకసారి తీరుగా చూస్తే ఎంత లావు మగాడూ బిళ్ళ బీడుగా పడిపోతాడే!"

"కానీ ఏం లాభం?"

"ఏం?"

"అన్నీ వున్నయ్! అల్లుడి నోట శనివున్నదని పక్కన బెట్టుకుని తిప్పగానేసరా!"

"ఏంటత్తా నువ్వనేది?"

"హయ్యో! హయ్యో! ఈ వూరికి కాపురానికొచ్చి ఆరునెలలయింది! నీకింకా తెలీదూ?"

"ఊహు!"

"రాజగృహంలో ఏడు తరాలుగా పెళ్ళాంతో కాపురం చేసిన మొగుడేలేడు!"

"ఆ! మరి పిల్లలెట్లా కలిగారు!"

"ఏం నంగనాచివే! అన్నీ నాచేత చెప్పించాలని చూస్తున్నావ్! పెద్దోళ్ళ వూసులు మనకెందుకు! పద పద!"



శ్యాం నీలలు వీధిన వెళ్తుంటే అప్రయత్నంగా అమ్మలక్కలు అనుకుంటున్న మాటలు వాళ్ళిద్దరకూ వినబడ్డాయి!

కాని తీయని వూహల చిరువెలుగులో విహరిస్తున్న వారికి బాహ్యచేతన నశించింది. యాంత్రికంగా తెలిసిన దారిన నడుస్తున్నాడు శ్యాం. అతని పక్కనే దాదాపు అతని శరీరాన్ని రాసుకుంటూ సూదంటు రాయికి అతుక్కున్న ఇనుపముక్కలా నడుస్తున్నది నీల!

ఆకాశంలో ఈశాన్య దిశనుండి పోరాడుతున్న కారెనుములలా ఉరుములు మెరుపులతో పరుగెడుతూ వస్తున్న కారు మేఘాలను చూడలేదిద్దరూ!

కాని వాతావరణంలో హఠాత్తుగా వచ్చిన మార్పును గుర్తించిన పక్షులు గోలగోలగా అరుస్తూ ఒక చెట్టుమీదనుండి మరో చెట్టుమీదకూ అక్కడనుండి ఎత్తుగా ఆకాశంలోకి ఎగిరి గగ్గోలుగా అరుస్తూ కిందకు దిగి మళ్ళీ పైకెగురుతూ గడబిడ చేయసాగాయి!

దారిలో పంటకాలువ దాటటానికి ఈత బొదె వేసివున్నది. చకచక నడుస్తూ ముందుకు వెళ్లిపోయాడు శ్యాం! కాలువ దాటి ముందున్న గట్టుమీద ఎక్కి వెనుదిరిగి చూసాడు. నీల అవతల గట్టున నిలబడి వున్నది!

హైహీల్డ్ షూస్‌తో ఈత బోదెమీద ఎలా నడవాలా అనే సందేహంతో నిలబడి వుండిపోయిందామె.

"సారీ నీలా! నిన్ను ఇబ్బంది పెడ్తున్నాను!"

"నోనో! ఇటీస్ ఏ ప్లెషర్!" అంటూ కాళ్ల చెప్పులు విడిచి చేతిలోకి తీసుకుంది.

ఈత బోదెమీద నిలువుగా కాకుండా అడ్డంగా అడుగులు వెయ్యి" అన్నాడు శ్యాం.

నీల నెమ్మదిగా అడుగు ముందుకు వేసింది.

"ఊ, అంతే! పదనీలా!" వెనుకనుండి శ్యాం ఉత్సాహపరచ సాగాడు.

మరకొడుగు ముందుకు వేసింది నీల! కాలు జారుతుంటే నిలదొక్కుకో జూచింది. కాని అలవాటులేక కాలు ఈత బొందమీద నిలవక జారి నీల తూలి పడబోయింది.

"నీలా!" అంటూ చప్పన నీల చేతిని పట్టుకున్నాడు శ్యాం. కాని అప్పటికే నీల బాలెన్సు తప్పింది! కాలువలోకి పడబోతున్న నీల నడుము పొదివి పట్టుకున్నాడు శ్యాం. ఫలితంగా బాలెన్సు తప్పి నీల శ్యాంలిద్దరూ కాలువలోకి జారిపోయారు! నీల నడుమును శ్యాం చేయిచుట్టు కున్నందువలన ఆమె శరీరం అతని శరీరానికి హత్తుకుపోయింది. శ్యాం కాగిలిలో బిగిసిన నీల అతనితోపాటు కాలువ కిందభాగంలో వున్న బురదలో

దిగబడిపోయింది!

మోకాలివరకు బురద— బొడ్డు వరకు నీళ్లలో మునిగిపోయారిద్దరూ!

భయంతో తన ఛాతీని పెనవేసుకున్న నీలను ఓదారుస్తూ "సారీ నీలా!" అన్నాడు శ్యాం, బురదలో కాలుజారి పడిపోబోతున్న నీలను పొదివి పట్టుకున్నందువలన ఆమె శరీరం అతని కౌగిలిలో ఒదిగిపోయింది.

అంతలోనే కాటుక విరజిమ్మిన చీకట్లు కమ్ముకున్నాయి! మిన్నూ మన్నూ ఏకం చేస్తూ సుడిగాలి వీచింది!

నేలమీదనుండి వలయాలుగా పైకెగొస్తున్న పండు ఆకులు దుమ్ము మెరుపు కాంతిలో బంగారు గాజుల్లా కనపడ్డది! దూరంగా మొదలైన పెనుశబ్దం ఫెళ ఫెళార్భటులు దగ్గరై ఆకాశం భూమిమీదకు అణ్వాస్త్రం పేల్చినట్లు పిడుగు పడింది ఎదురుగా వున్న తాడిచెట్టుపై!

అప్రయత్నంగా కనులు మూసుకున్నారు శ్యాం నీల. విపరీత శబ్ద ప్రకంపనకు భయకంపిత అయిన నీల 'శ్యాం' అని ఎలుగెత్తి అరచి గట్టిగా అతన్ని పెనవేసుకుని పోయింది. బెదురుతో పెనవేసుకుని గజగజ వణుకుతున్న నీల వీపుమీద చేతితో నిమురుతూ.

"భయపడకు నీలా!" అని ధైర్యం చెప్పసాగాడు. 'ఉఫ్' మని శబ్దం వినవచ్చి క్షణాలలో నిప్పురవ్వలు వెలుగు మంటూ కానవచ్చాయి!

పిడుగుపడ్డ తాటిచెట్టుకు వున్న ఎండాకులు, గిలకలు భగ్గుమని మండిపోసాగాయి!

అప్పుడు మొదలైంది వర్షం! పెద్ద పెద్ద చినుకులు ఉపరాలుతూ చెట్ల ఆకుమీద దుమ్ము ధూళిని కరిగించివేసింది.

ఆకసంలో ఎగురుతున్న పక్షులు గగ్గోలుగా అరచి తల్లడిల్లుతూ చెట్ల కొమ్మలమీద వున్న గూళ్లల్లో జేరిపోయాయి.

వేడి పెనం మీద నీళ్లు చిలకరించినట్లు శబ్దంతో నేలమీద కురుస్తున్న వాన చినుకుల జోరు హెచ్చింది. చూస్తుండగానే కడవలతో దిమ్మరించినట్లు వాన కురవ సాగింది.

జుట్టు తడిచి దుస్తులు తడిచి వంటికంటుకుని పోయిన శ్యాం నీల తెప్పరిల్లుకున్నారు. నీలను ఒక చేతితో పొదువుకుని మరో చేతితో ఈతబొందును ఆసరాగా చేసుకొని కాలువగట్టువైపుగా నడవసాగాడు శ్యాం! బురద పాకుదు వున్న కాలువగట్టు నెక్కి చెయ్యి ఆసరా ఇచ్చి నీలను పైకి లాగాడు.

నడుం వరకు బురదంటుకొని వానకు తడసిన నీల వంక క్షణం సేపుచూసాడు



శ్యాం!

"యు ఆర్ లుకింగ్ లైక్ ఎ మెర్‌మెయిడ్ (జలకన్య)!" అన్నాడు శ్యాం. ఇన్ని సంవత్సరాలుగా ఎరుగని లైంగికోద్రేకం అతన్ని కరెంటు షాక్‌లా కాల్చివేయసాగింది. క్రమశిక్షణలో కట్టుబాట్లలో పెరిగిన శ్యాం అతికష్టంమీద తనను తాను నిగ్రహించుకుని నీల మీదనుండి చూపులు మరల్చుకుని "నీలా! ఈ వానలో ఇంటికి తిరిగివెళ్లడం కష్టం! ఇదే మా తోట! ఆ మూలన ఇంజన్ షెడ్ వుంది! అక్కడ కాపలా అతను కాపు రం వుంటున్నాడు. అక్కడ వెళ్ళి వాన తగ్గాక ఇంటికి వెళ్దాం!" అన్నాడు.

'సరే' అన్నట్లు తలతిప్పింది నీల. కాలువ గట్టున ముందుకు సాగాడు శ్యాం!

నిమ్మ, నారింజ, దబ్బ, సపోటా, మామిడి, పంపరపనస, మాదీఫలం రకరకాల ఫలవృక్షాలతో నిండివున్నతోట పక్కన బాటమీద నడుస్తూ ముందుకు సాగాడు.

బురద నేలన జాగ్రత్తగా అడుగులు వేస్తూ అతన్ననుసరించ సాగింది నీల, కాళ్లల్లో గుచ్చుకుంటున్న రాళ్లను ముళ్లను చేతితో తీసివేయ సాగిందామె. హైహీల్డ్ షూస్ ఎప్పుడో కాల్వలో పడిపోయాయి మరి!

నాలుగడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు శ్యాం! నీల చాలా నెమ్మదిగా అడుగులు వేస్తూ కనబడింది. సన్నని బాటమీద నీల పక్కగా తను నడవటం కష్టం! అలవాటులేక ఆమె బురదతో జారుతున్న బాటమీద నడవలేక పోతున్నది! మాటి మాటికి జారిపోతున్న పాదాలను నిలదొక్కుకోటానికి విశ్వ ప్రయత్నమూ చేస్తున్నది.

"నీలా! జాగ్రత్త!" అంటూ పడబోతున్న నీలను రెండు చేతులతో పట్టుకుని నిలబెట్టాడు శ్యాం.

"ఇకనుండి నీ పక్కనే నడుస్తాను " అంటూ నీల నడుంచుట్టూ చెయ్యిపోనిచ్చి ఆసరా ఇస్తూ ఆమె పక్కనే నడవసాగాడతను.

బాట పక్కన నడుస్తున్నందువలన ముళ్లు రాళ్లు అతని అరికాళ్లలో గుచ్చుకోసాగాయి! అందువలన కలిగే బాధను గమనించకుండా ముందుకు నడిచిపోసాగాడు.

పిశాచగణం నృత్యం చేస్తున్నట్లు ఆకాశంలో ఫెళ ఫెళార్భటులు వినపడ్డాయి! మెరుపు మెరిసింది.

"అదుగో ఆ కనపడేదే ఇంజన్ షెడ్! అక్కడే కాపలా అతను నాగేసు వుంటాడు!" అంటూ నీలకు దూరాన కనపడుతున్న పెంకుటి పంచ చూపించాడు శ్యాం!

ఆకాశం చిల్లుబడి నీళ్లు దిమ్మరించినట్లు వాన కురుస్తున్నది!

తడిచిపోయి ముద్ద అయి వణకిపోవాల్సిన దేహాలలో పంచశరుడి వాడిబాణాలు గుచ్చుకుని వేడెక్కి ఆవిర్లు కమ్ముకుంటున్నాయి.

ఇంజన్ షెడ్ వాకిలి ముందు నిలబడ్డారు నీల శ్యాం ఒకర్నొకరు పొదవి పట్టుకుని! ముందుకు వెయ్యబోయిన అడుగు ఆగిపోయింది!

''ఏంది మావా!''

''తడిసిపోయిన కోక రైక తీసెయ్యే! చలికి వణికి సచ్చిపోతావ్!''

''అమ్మో నాకు సిగ్గేత్తంది!''

''సీకట్లో సిగ్గేందే?''

''ఊహు!''

''ఉండు! నీకు సిగ్గయితే నేనే....!''

''వదులు— వదులు— ఏందీ...''

''వాన గురత్తంది! సెట్టంత మొగుడ్ని ఎదురుగా వుంచుకుని వానికి పోతాయేందే?''

''ఏమో మామా! ఇందాక రాముదు అబ్బాయి గారొత్తారని సెప్పెల్లాడు!''

'అబ్బాయి గోరింత లోన ఎందుకొత్తారే?'' శిలా విగ్రహాలలా నిలబడిపోయి వినసాగారు నీల శ్యాం ఇద్దరి శరీరాలు కాక తగిలినట్లు వేడితో మండిపోసాగాయి.

''ఊ! అబ్బా! వదులూ! ఏటా మోటుపనులు!''

''ఇయ్యా లేందో తిక్కతిక్కగా కొత్తకొత్తగా వుందే!''

కుంభవృష్టి శబ్దం నేపథ్యంలో నాగేసు అతని భార్యల నోటినుండి వెలువడుతున్న అవ్యక్త మధుర ధ్వనులు శ్యాం నీలల చెవులకు వినపడసాగాయి.

ఊపిరి బిగబట్టినట్లు వుండిపోయారు శ్యాం నీల.

మెరుపు మెరిసింది! మెరుపు నీడలో నాగేసూ అతని పెళ్లాం నగ్నంగా కనపడ్డారు నులక మంచంమీద. వేపబోదెను కావలించుకున్న మాధవీలతలా నాగేసును చుట్టుకుపోయివుంది అతని భార్య.

రివ్వున వీస్తున్న చలిగాలి శబ్దంతో ధారాపాతంగా కురుస్తున్న వర్షం నులకమంచంమీద పెనవేసుకు పోయిన శరీరాలను మరింతగా అనంగ క్రీడోన్ముఖులను చేసాయి.

చిన్న పిల్లవాడు తన కిష్టమైన చాకొలేటును అరచేతిలో వుంచుకుని ఆబగా చూస్తూ కొంచెం కొంచెం చీకుతూ మరలా చూసుకుంటూ వున్నట్లు భార్య వంపు సొంపులను తనివి తీరా చూస్తూ ఉద్రేకం పెంచుకుంటూ పెరిగిన వుద్రేకం తీర్చుకోటానికి కొద్ది



కొద్ది శృంగార చేష్టలు చేస్తూ వున్న నాగేసు— మాటలలో అయిష్టం నిట్టూర్పులలో చేతలలో కదలికలో కవ్వింపుతో అతనిలో పుడుతున్న వేడిని చల్లారనివ్వకుండా రగిల్చి వేస్తున్న అతని భార్య—

సున్నిత కర స్పర్శతో మొదలైన నాగేసు కార్యక్రమం పీడన, మర్దన, చుంబనలతో మితిమీరిన రసానందం— శ్రుతిచేసిన వీణలా మిగులపండి చిలుక రాకకోసం ఎదురు చూస్తున్న జాంపండులా వర్షం చుక్కకుఎదురు చూస్తున్న ముత్యపు చిప్పలా— ఎండి బీటలువారి వరద నీటికి ఎదురు చూస్తున్న క్షేత్రంలా— వసంతాగమనం కోసం వేచి చూస్తున్న వనంలా నాగేసు భార్య ఆత్రంగా, ఆబగా, అపరిమితోత్సాహంతో నాగేసును దగ్గరకు లాక్కోసాగింది.

అంత వానలోనూ చలిలోనూ నాగేసుకు అతని భార్యకూ చెమట పట్టింది. తామరాకుమీద దొర్లే నీటి బిందువులలా మెరవసాగాయి చెమట బిందువులు.

సురత శ్రమతో బిగుసుకుపోతున్న వాళ్ళిద్దరి శరీరాలూ కమ్మరి కమ్మెచ్చున లాగిన ఇనుప తీగల్లా మెలితిరిగిపోతూ మెరుస్తున్నాయి.

సుందర సుమధుర సుమనోజ్ఞ సుమంజులమైన కలలాంటి సురత కేళిని దర్శిస్తూ వింత అనుభూతి పొందసాగాడు శ్యాం.

వసంతాగమనంతో పుప్పొడి నిండిన పూలతో తోటమొత్తం ముస్తాబై ప్రియుని రాకకు ఎదురు చూస్తున్న పడుచు పిల్లలా కనపడింది శ్యాంకు!

అందమైన పూదోటలో పొదరిల్లు, మల్లెపందిరి అల్లుకొన్న పొదరిల్లు— విరబూచిన మల్లెలు ఆకాశంలోని నక్షత్రాలను వెక్కిరిస్తున్నాయి.

మల్లెల సువాసనకు మేను మరచి మత్తెక్కుతున్నది! గమ్మత్తయిన ఆ మత్తుకైపులో శరీరంలో హుషారు పెరిగిపోతున్నది.

మల్లెల గుబాళింపును మింగివేస్తూ మరోపరిమళం— మరింత ఘాటైన పరిమళం శ్యాంను కుదిపి విడిచింది! పరిమళాన్ని తనివితీరా ఆఘ్రాణిస్తున్న శ్యాం పరవశంతో కనులు మూసుకుని ''నీలా!'' అన్నాడు అప్రయత్నంగా! కనులు మూసుకునే పరిమళం వెదజల్లుతున్న నీలవైపుగా కదిలాడు.

నీల సుకుమారదేహం ముందు ఆగాడతను. వేలికొనల స్పర్శతో ఆమె చిగురాకు శరీరాన్ని ఆపాదమస్తకం తడమసాగాడు. అణచుకోలేని ఆకాంక్షతో కనులు తెరిచాడు. ''ఓహ్!'' అనబోయింది నీల. శబ్దం రాకుండా ఆమె పెదవులను తన పెదవులతో 'సీల్' చేసాడు శ్యాం!

ఎదురుగా నులకమంచంమీద చిరువెలుగులో కనబడుతున్న దృశ్యాన్ని చూసి

అప్రయత్నంగా 'ఓహ్' అంది నీల! సుందర స్వప్నం మత్తులో ఆమె పెదవులను సీల్ చేసేసాడు శ్యాం!

లిప్తకాలం తర్వాత శ్యాం పెదాలు నీల పెదాలకు దూరమయ్యాయి. నీల మనసులో ఎగసిపడుతున్న ఆశ్చర్యాన్ని సిగ్గు మింగివేసింది! అవనత వదన అయింది నీల.

శ్యాం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది! అదుపు చేసుకోలేని వుద్రేకం అతన్ని కుదిపి వేయసాగింది! పెద్దగా మెరుపు మెరిసింది! పక్కకు జరిగి నీలను షెడ్ వాకిలి ముందునుండి లాగాడు. మెరుపు కాంతిలో వాగేసు దంపతులు తమను చూడకుండా వుండాలని అలా చేసాడతను.

వాన తగ్గిపోతున్నదన్న సూచనగా ఆకాశంలో నలుపు తగ్గింది! వర్షపు ధారల హోరు తగ్గింది!

"ఇంటికి వెళ్దాం!" అన్నాడు శ్యాం. నీల చెవిలో నెమ్మదిగా!

తలాడించింది నీల! వచ్చిన దారినే వెనుతిరిగి వెళ్లారు!

శ్యాం నీల రాజగృహం గేటు ముందుకు వెళ్లే సరికి వాన పూర్తిగా వెలిసిపోయింది! వరండాలో నిలబడివున్న అహల్య—

"అరే! అలా వానలో తడవకపోతే తోటలో షెడ్‌లో కాసేపుండి రాలేకపోయ్యారా?" అంది.

నీల శ్యాం ముఖ ముఖాలు చూసుకున్నారు. "అలవాటు లేక నీల కాళ్ళు జారిపడిపోతుంటే ముందుకు వెళ్లలేదు!" అన్నాడు శ్యాం.

"అయ్యో! అదేంటమ్మా వంటినిండా బురద! బట్టలు తల తడిచిపోయాయి! కామమ్మా! కామమ్మా! నీళ్ళు కాగబెట్టు! అమ్మాయి స్నానం చేస్తుంది!"

కామమ్మ అహల్య మాటలు విని గబగబా నడచి వరండాలో కొచ్చింది. "ఏంటొదినా పిలిచావు?" అంటూ. అహల్య మాటలు వినపడకకాదామె అలా అడిగింది. ఆ వంకతో నీల శ్యాంలను చూద్దామని వంటవసారాలోంచి వచ్చిందామె.

నీలను చూసి "బురద పూసుకు వచ్చావేమమ్మా షికారుకు వెళ్ళి?" అంటూ "వుండు! నీళ్లు కాగివున్నాయి! తలంటుకుందూగాని! " అని లోపలకు వెళ్లిపోయింది.

నిముషం తర్వాత "వేన్నీళ్లు సిద్ధం వొదినా!" అంటూ కేకేసింది కామమ్మ.

"రామ్మా నీలా! రా! స్నానం చెయ్యి!"

"ఎలాగా! చీర జాకెట్ లేవు!"

"నీ కెందుకవన్నీ! పద! స్నానం చెయ్యి! అవన్నీ నేను చూసుకుంటాగా!" అంటూ స్నానాల గదిలోకి చేయి పుచ్చుకుని తీసుకు వెళ్ళింది.



పెద్ద గంగాళం నిండా వున్న వేన్నీళ్ళతో తలారా స్నానం చేసింది నీల. తలుపుమీద టక టకమని శబ్దం వినవచ్చింది!

టవల్ వంటికి చుట్టుకుని వెళ్లి తలుపు వోరగా తీసింది.

చీర జాకెట్ అందించింది అహల్య. తలుపు వేసుకునిఅహల్య అందించిన దుస్తుల వంక చూసింది నీల. కొత్త కంచిపట్టు చీరె! జాకెట్ సరిగా తనకు సరిపోయేలా వుంది!

కొలత కొలిచి కుట్టినట్లు సరిపోయింది. జాకెట్! చీరె కట్టుకుని తలకు టవల్ చుట్టుకుంటూ బయటకు వచ్చింది నీల.

"జాకెట్ సరిపోయిందే! అది నీ వయసులో వుండగా నేను కుట్టించుకున్న జాకెట్! బీరువాలో మూలపడివుంది!" అంది అహల్య.

నీలను స్టూలుమీద కూర్చోబెట్టి తలవెంట్రుకలు తుడిచి చిక్కు తీస్తుండగా శ్యాం వచ్చాడు.

"అమ్మా!" అంటూ

తల ఎత్తి చూసింది నీల. శ్యాంకూడా తలంటుకున్నట్లున్నాడు. రింగులు తిరిగి దట్టంగా వుండే అతని క్రాపు కొంచెం అణగివుంధి— వెంట్రుకలనుండి కొద్దిగా నీళ్ళు కారుతున్నాయి అతని ముఖం మీదకు.

"ఏమిట్రా? అరే తల సరిగ్గా తుడుచుకొన్నట్లు లేవు! కూర్చో! తల నీళ్ళు కారుతుంటే న్యుమోనియా వస్తుంది!" శ్యాం చెయ్యి పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టి టవల్‌తో అతని జుట్టు శుభ్రంగా పొడిగా వుండేట్లు తుడిచింది. దువ్వెనతో క్రాపు తిన్నగా దువ్వబోయిందిగాని శ్యాం చిరుకోపంగా తనవంక చూస్తుండడంతో నీల పక్కన వున్నదని గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకుంది!

"అబ్బాయి శ్యాం!" కామమ్మ గదిలో కొస్తూ పిలిచింది.

"ఏమిటి కామమ్మత్తయ్యా?"

"దబ్బకాయ పులిహోర చెయ్యమంటావా?"

"ఆ!"

ఏం జరుగుతుందో చూద్దామని కుతూహలం అణచుకోలేక వచ్చిన కామమ్మ వెనుదిరిగి వెళ్ళింది!

"ఏమిట్రా శ్యాం! ఇందాక ఏదో చెప్పబోయావు!"

నిజానికి శ్యాం నీలను చూద్దామని ఆమెకు దగ్గరగా వుందామని ఆ గదిలోకి వచ్చాడు— తీరా తల్లి అక్కడ వుండడంతో "అమ్మా!" అన్నాడు ప్రయత్నంగా ఇప్పుడు తల్లి అలా ప్రశ్నించే సరికి క్షణం తికమక పడి తేరుకొని.

"పులిహోర చేయించమని చెబుదామని వచ్చాను" అన్నాడు.
శ్యాం మనసులో మెదులుతున్న వూహాలను మాటి మాటికి అతను నీల వంక
చూడటాన్ని గమనించిన అహల్య "సందేహం లేదు! శ్యాంలో మార్పు వస్తున్నది!
ఇన్నాళ్ళు ఆడపిల్లల వంక కన్నెత్తి చూడని వాడు నీలను వదలి వుండలేకుండా వున్నాడు!
ఏడు తరాలుగా రాజగృహాన్ని పట్టి పీడిస్తున్న శాపం అంతమై వీడైనా బిడ్డా పాపలతో
కలకల లాడుతూ వుంటే చూసి సంతోషించడం కన్నా కావలసిందేముంది" అని
మనసులో అనుకుని పైకి మాత్రం—
"శ్యాం! నువ్వు నీలతో మాట్లాడుతుండు. నేను వెళ్లి రెండు కప్పుల వేడి కాఫీ పట్టు
కు వస్తాను. వానలో తడిచి వచ్చి తలంటుకున్నారు! జలుబు చెయ్యకుండా వుంటుం
ది!" అని లోపలకు వెళ్లిపోయింది.
శ్యాంను క్రీగంట చూసింది నీల— నల్లకలువల మీద పడి కాంతివంతమైన
చంద్రకిరణంలా మనోహరంగా వుందామె చూపు! క్రీమ్ కలర్ సిల్క్ లుంగీ అదే
రంగు లాల్చీ ధరించిన శ్యాం వెన్నెల వెదజల్లుతూ ప్రకాశిస్తున్న పూర్ణచంద్రుడిలా
కనపడ్డాడు నీలకు.
"గాలివానకు కరెంటు పోయింది! ఇక ఈ రాత్రికి కరెంటు రాదు!" అన్నాడు
శ్యాం కిటికీ లోంచి వెలుపలకు చూస్తూ తగ్గిపోతున్న వెలుగు రేఖల నుద్దేశించి.
రాముడు హరికేన్ లాంతర్లు తీసుకుని వరండాలోకి వచ్చాడు. ముగ్గుతో లాంతరు
గ్లాసుల్ని తుడిచి కిరసనాయిలుపోసి కొన్ని లాంతర్లు పైకి తీసుకువచ్చాడు.
"శ్యాం! ఒకసారి మళ్లీ ఇంటికి ఫోన్ చేసి చూస్తా" అంటూ ఫోన్ దగ్గరకు వెళ్లింది
నీల.
ఫోన్ రిసీవర్ చేతిలోకి తీసుకుని అందులోంచి ఏ విధమైన రింగ్ రాపోవడంతో
తిరిగి పెట్టేసింది.
"గాలి వానకు ఎక్కడో ఇంటరప్షన్ జరిగి వుంటుంది" అన్నాడు శ్యాం.
"ఈ రాత్రికి మీ ఇంట్లోనే తిష్ట వెయ్యాలి!"
"మళ్ళీ ఆ మాట అంటే వూరుకోను! అనుకోకుండా వచ్చిన అతిథిని
అర్థాంతరంగా పంపించగల అమర్యాదపరులు ఈ ఇంట్లో లేరు!"
అంతలో కాఫీ కప్పులతో వచ్చింది అహల్య. చెరొక కప్పు ఇచ్చి ఇద్దరూ కాఫీ
తాగినద్దాక వుండి...
"అమ్మాయి నీలా! ఇలారా! తలకు సాంబ్రాణి ధూపం వేస్తాను— జలుబు
చెయ్యకుండా వుంటుంది!" అంది.



ఇబ్బందిగా ముఖం పెట్టింది నీల— కాని శ్యాం 'వెళ్ళు' అన్నట్లు తలూపడంతో
అహల్య వెంట లోపలకు వెళ్ళింది.
కణ కణలాడే నిప్పులు వున్న గరిట తెచ్చి సాంబ్రాణి పొడుం చల్లింది అహల్య. నీల
విడుపాటి కురులను పాయలుగా తీసి సాంబ్రాణి ధూపం అమరేట్లు చేసింది.
తడి ఆరిన వెంట్రుకలు చిక్కుతీసి జడవేసి జాకామల్లె చెండు తురిమింది.
"ఫోన్ లైన్ చెడిపోయింది. నేనింకా ఇక్కడ మీ ఇంట్లో ఎన్నిరోజులుండాలో?"
అంది నీల ఎపాలజిటిక్‌గా.
"అమ్మాయి! నువ్వు తెలుగు ఎం.ఏ చదువుకున్నావు! నీ మాటలు వింటుంటే
నాకు ఇదివరకెప్పుడో చదువుకున్న పద్యం గుర్తొస్తుంది.
అనిష్టె విధిగేహసీ మనదు రేయాలించినన్ ప్రోయునెం
తే నాగేంద్ర శయాను పుణ్య కథలుం దివ్య ప్రబంధాను సం
ధాన ధ్యానము, "నాస్తిశాక బహుతా నాస్తు ష్ణతో నాస్తపూ
పోవాస్త్యోదన సౌష్టంచ కృపయా భోక్తవ్య మన్పల్కులన్"
"ఆ పద్యం ఆముక్తమాల్యదలోది కదూ! మీరు తెలుగు కావ్యాలు
చదువుకున్నారా?"
"ఆ! ఏదో తోచీ తోచని నానాకాలం చదువు చదివాను!"
"తెలుగు ఎం.ఏ చదివిన మేమే తెలుగు కావ్యాలను చదవలేదు! ఈ కాలం చదువు
తీరది! ఇంట్లో వుంటూనే కావ్యాలన్నీ చదివిన మీ లాంటి వాళ్ళు ఈ కాలంలో
అరుదు!"
అహల్య నీలకు సమాధానం చెప్పేలోపల "వదినా పులిహోర తయారయింది! వ
డ్డించనా?" అంటూ కేకేసింది కామమ్మ.
"వస్తున్నా!" అంటూ లోపలకు వెళ్ళింది అహల్య.
లోపలనుండి అహల్య "శ్యాం! నువ్వు నీలా రండి! పులిహోర రెడీ!" అనిపిలిచింది.
నీల శ్యాం వెళ్లేసరికి వెండి పళ్లెల్లో పులిహోర వడ్డించి వున్నది! చుట్టూ గిన్నెలలో
పులవచారు, ఆవకాయ పచ్చడి, గోంగూర పులుసువున్నాయి.
పనివున్నట్లు అవతలకు వెళ్లిపోయింది అహల్య.
"నీలా! కొంచెం గోంగూర పులుసు కలుపుకు తిన్నావంటే బాగుంటుంది!"
అంటూ గరిటతో వడ్డించబోయాడు శ్యాం.
"ఆగండి శ్యాంగారూ! వడ్డించవలసింది స్త్రీలు! ఇదిగో పులవచారు వేస్తున్నా!
తినండి!"

ఫక్కున నవ్వాడు శ్యాం!

అతని నవ్వుతో జతకలిపింది నీల! పొయ్యి ముందు కూర్చున్న కామమ్మకి ఆ నవ్వులు వినిపించి ఆపు కోలేని కుతూహలంతో చివాలున లేచింది.

ఎదురుగా నిలబడి తనవంక చూస్తున్న అహల్యను చూసి గాలిపోయిన టైరులా కుతూహలం చప్పబడిపోగా "వొదినా— నెయ్యి వడ్డించి వస్తా!" అంది.

"అక్కర్లా! నేతి గిన్నె బల్లమీదే వుంది! వాళ్లే వడ్డించుకుంటారు! పాలు కాచి తోడంటుపెట్టు"

అహల్య మాటలు విని పొయ్యి ముందు కూర్చుంది వుస్సురంటూ!

* * *

పొద్దున శ్యాం వడ్డిస్తుంటే పరధ్యానంగా అన్నీ తినేసింది నీల. అందుకని ఈపూట అందుకు బదులుగా తను వడ్డించాలనుకుంది నీల.

"శ్యాం! తినవే!"

"లేడీస్ ఫస్ట్!"

"అబలలను ముందుకు తోస్తే ఎలా?"

"దబ్బకాయ పులిహోర రుచి చూడు! మరి వదలవు!"

"ముందు నువ్వు!"

"కాదు నువ్వు తిను!"

"నీ కిష్టంగదా! నువ్వే తిను!"

మాటలు ఎక్కువై తినటం తగ్గిపోయింది! మీగడపెరుగు గిన్నెతో లోపలకు వచ్చిన అహల్య.

"అయ్యో! ఏమీ తినకుండా అలావే కూర్చున్నారిద్దరూ!" అంది.

"అమ్మా నీల చూడు! పులిహోర బాలేదంటున్నది?"

"శ్యాంకు పులిహోర పడగిట్టదట!" అంది నీల బదులుగా!

ఒకరిమీద ఒకరు అలా పితూరీలు చెబుతుంటే ముచ్చటవేసింది అహల్యకు!

"పరాచికాలకేంగాని పొద్దునెప్పుడో రెండు మెతుకులు తిన్నారు! కాస్త పులిహోర తినండి!" అన్నది బతిమలాడుతున్నట్లు!

"శ్యాం పొద్దునేం తినలేదు! అతన్ని తినమనండి ముందు!"

"అబద్ధం! సాయంత్రం పది బొబ్బట్లు తిన్నాను నీలను తినమను!"

"ఇద్దరూ పంతాలకుపోయి పస్తువుంటారా ఏం?" నవ్వుతూ అంది అహల్య!

"ఇక నావల్లగాదు!" అంటూ లేచి వెళ్ళి చెయ్యి కడుగుకుని వచ్చింది నీల.



"కొంచెం సేపు విశ్రాంతి తీసుకోమ్మా! వంట తయారవుతున్నది!" అంది అహల్య

"ఇంకా భోజనం చేయాలా! బాప్‌రే!" అంది నీల ముసి ముసి నవ్వులు నవ్వుతూ వెళ్ళిపోయింది అహల్య గిన్నెలు తీసుకుని.

ముందు హాలులో ఎదురు బదురుగా వున్న సోఫాలలో కూర్చున్నారు నీల శ్యాం.

"శ్యాం! ఈ పల్లెటూర్లో ఇంతపెద్ద మేడ కట్టించారెందుకు?"

"నీలా! రాజగృహం కట్టి రెండువందల ఏళ్ళయింది! రంగూన్ కలపతో, కోడిగుడ్డు సొన కరక్కాయ బెల్లం తగుపాళ్లతో సున్నంతో కలిపి కట్టినందువలన చెక్కు చెదరకుండా వుంది!"

"రియల్లీ! అన్ని సంవత్సరాల క్రితం కట్టారా?"

"అవును! మా ముత్తాత ముత్తాత తండ్రి రాజయ్యగారు జమీందారు వెంకటాద్రి గారి దగ్గర సేనాపతిగా వుండేవాడు! అప్పట్లో పిండారీలు వూళ్లమీదపడి దోచుకుపోతుండేవాళ్లు. వాళ్ల ధాటికి తాళలేక జమీలోని గ్రామాలు వదలి పారిపోసాగారు జనం!

జమీందారుగారు ఆందోళన చెందసాగారు. జమీ ప్రజలకు పిండారీల బెడదలేకుండా చేసినవారికి మంచి బహుమానం ఇస్తామన్నారు.

ఆయన దగ్గర సేనాధిపతిగావున్న రాజయ్యగారు సైన్యం తీసుకుని పిండారీ దండు విడిచి వున్న చిట్టడవిని చుట్టుముట్టారు.

రాక్షసి మూకలా వున్న పిండారి దండు జమీందారుగారి సైన్యం రాక పసిగట్టి విల్లంబులు బల్లేలు తీసుకుని సిద్ధంగా వున్నారు అది వరకే!

పిండారీ గుంపును దండించటానికి వెళ్లిన సైనికులుమీద బాణాలు బల్లేలు వచ్చి పడుతుంటే భయభ్రాంతులై వెనుదిరిగి పారిపోసాగారు.

రాజయ్యగారు ఎంత కోప్పడినా వాళ్ళు ఆగలేదు! చింతచెట్టు కొమ్మనెక్కి గర్జించాడు రాజయ్య గారు.

"పిరికిపందల్లా పారిపోతారేంరా? ఆగండి!" ఊహు తోడేళ్లను చూసిన గొర్రెలమందలా పారిపోసాగారు సైనికులు.

"అడుగు ముందుకు వేసారా తుపాకీ తూటాలకు బలి అవుతారు!" సైనికుల ముందు భాగంలోవున్న నేలమీద తుపాకీ తూటాలు వచ్చి గుచ్చుకున్నాయి. సైనికులపని ముందు నుయ్యి వెనుకగొయ్యిలా మారింది.

"అరేయి! బాణం గుచ్చుకున్నవాడు అదృష్టం బాగుంటే బతికి బట్టకట్టవచ్చు!

తుపాకీ గుండు తగిలితే తక్షణ చస్తాం!

పిండారీ గుంపును ఎదిరించి పోరాడదాం! గెలిచామా జమీందారుగారు బహుమానం ఇస్తారు! చచ్చామా మన కుటుంబాలకు చీకు చింతా లేకుండా జరిగిపోయేలా ఏర్పాటు చేస్తారు! పారిపోయి వచ్చాం అన్న అవమానం కంటే చావడం మేలు'' అనుకుని సైనికులు ఆవేశంతోపిండారీదండుమీద తిరుగబడ్డారు!,

అనుకోని పరిణామానికి పిండారీలు విస్తుపోయారు! ఎన్నో సంవత్సరాలుగా వాళ్లను ఎదిరించినవాళ్లు లేరు! చిరుత పులుల్లా మీదబడుతున్న సైనికులతో కలబడ్డారు వాళ్లు!

తన సైన్యాన్ని ప్రోత్సహిస్తూ గురిచూసి పిండారీల మీద తుపాకీ పేల్చసాగాడు రాజయ్యగారు.

కొంతమంది పిండారీలు నేల కూలారు! అంతవరకూ వాళ్లమీద తుపాకీ పేల్చిన వాళ్లు లేరు! కొంతసేపటికి పిండారీ నాయకుడు నేల కూలాడు.

భయభ్రాంతులై నేలకూలిన నాయకుడుని మోసుకుని పారిపోసాగారు పిండారీలు!

పరమోత్సాహంతో వెంటబడి కత్తికొకకండగా నరికి పిండారీల గుంపును పీనుగుపోగుగా మార్చారు సైనికులు!

పిండారీ నాయకుని ఖండితమస్తిష్కాన్ని బల్లేనికి గుచ్చి కోటకు తెచ్చాడు రాజయ్యగారు.

అవక్ర పరాక్రమాన్ని చూపిన సేనాపతిని చూసి అంతులేని వుత్సాహంతో ఆనందంతో కౌగిలించుకున్నాడు జమీందారు!

''ఏం కావాలో కోరుకో!'' అన్నాడు.

''సైనికులందరికీ సంవత్సరం జీతం బహుమానంగా ఇవ్వండి!'' అన్నాడు రాజయ్యగారు. తనకోసం ఏమీ అడుగని సేనాధిపతి మీద గౌరవం పెరిగింది జమీందారు గారికి!

విశేష వ్యయప్రయాసల కోర్చి విశాలమైన భవంతిని కట్టించి ఇచ్చారాయన రాజయ్యగారికి.

జమీందారుగారి అభిమానానికి చిహ్నంగా రెండువందల ఏళ్లుగా చెక్కు చెదరకుండా వున్నది 'రాజగృహం!'. సేనాధిపతికి అనేక విలువైన భూములు కానుకగా ఇచ్చారు జమీందారుగారు.

కాలక్రమేణా భూములు చాలా భాగంపోయాయి! రాజగృహం మాత్రం చరిత్రాత్మక శేషంగా మిగిలివున్నది.

''వాట్ ఏ స్ట్రేంజ్ స్టోరీ! ఈ ఇంటి వెనుక ఇంత చరిత్ర వుందనుకోలేదు



సుమా!'' అంది నీల ఆశ్చర్యంగా.

అహల్య లోపలకు వస్తూ ''అమ్మాయి! భోంచేయనన్నావు! కాసిని ఆవుపాలు తీసుకో!'' అంటూ పెద్ద వెండిగ్లాసు నీల చేతిలో వుంచింది.

యాలకులు, కస్తూరి, కుంకంపువ్వు, తేలుతూ సువాసన కొడుతున్న పాలు తాగింది నీల.

''చీకటి పడిపోయింది! కరెంటు పోయింది పోయి పడుకోమ్మా!

శ్యాం! అమ్మాయిని పైకి తీసుకువెళ్లు ఇదిగో లాంతరు!'' అంది అహల్య.

''గుడ్‌నైట్ నీలా!'' అంటూ వెనుదిరిగాడు గది గుమ్మం దగ్గర శ్యాం.

''గుడ్‌నైట్ శ్యాం!'' అంటూ గదిలోపలకు వెళ్ళింది నీల. హరికేన్ లాంతరు గది మధ్యలో వుంది. లాంతరు వెలుగులో గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగింది నీల.

మూడో అంతస్తులో తన గదిలో జేరిన శ్యాంకు నిద్రపట్టలేదా రాత్రి!

కింద మొదటి అంతస్తులో వున్న అహల్య నిద్రపట్టక మంచంమీద కూర్చుని వుండిపోయింది.

ముగ్గురి మనసులలో మూడురకాల అంతర్మథనం. అహల్య మనసు ఆలోచనల సుడిగుండంలో చిక్కుకున్న నావలాగా గిరగిర తిరిగిపోసాగింది.

వినుకొండ దగ్గర కుగ్రామంలో పేదరైతు కుటుంబంలో పుట్టింది అహల్య! 'ముగ్గురు అన్నల తర్వాత ఆడపిల్ల— ఐశ్వర్యంలో మునిగితేలుతుంది'' అన్నారు అందరూ అహల్య పుట్టినప్పుడు. ఆ మాట అన్న కొద్దిరోజులకే అహల్య తల్లి బాలింత వాతంతో చనిపోయింది! అహల్య తండ్రి మళ్లీ పెళ్లి చేసుకోలేదు! వున్న రెండెకరాల మెట్టభూమి పండినప్పుడు తింటూ పండనప్పుడు ఎండుతూ కాలక్షేపం చేయసాగాడు.

నరసింహంకు ఆస్తిలేకపోయినా చక్కగా చదువుకున్నాడు. వీధి బళ్లో పంతులుగారు పంచకావ్యాలు చెబుతున్నప్పుడు శ్రద్ధగా విన్నాడు. వీధి బడి చదువైనా కాకుండా స్వయం కృషితో మరిన్ని కావ్యాలు చదువుకున్నాడు.

నరసింహం పిల్లల టైం వచ్చేసరికి వీధి బడులు పోయి సర్కారు బడులు వచ్చాయి! సర్కారు జీతాలు ఠంచనుగా పుచ్చుకునే టీచర్లు పాఠాలు చెప్పడం కంటే గంట ఎప్పుడు కొడ

తారా అన్న ఆలోచనే ఎక్కువగా వుండేది! నరసింహం కొడుకులకు తెలుగు కావ్యాలు కాదు గదా అక్షరం ముక్కలే తిన్నగా రాలేదు!

ఇంటి దగ్గరైనా పిల్లలకు చదువు నేర్పిద్దామని ఎంతగానో ప్రయత్నించాడు నరసింహం! పిల్లలకు శ్రద్ధలేక పిల్లల తల్లి సహకారం లేక ఆ ప్రయత్నాలు ఫలించలేదు!

"మనకెందుకీ చదువులు! కూడెడతయ్యా గుడ్డెడతయ్యా పదండ్రా! పోయి పశువులకు మేతదుక్కురండి!" అంటూ పొలాలకు తరిమేది పిల్లల్ని!

అహల్య పుట్టింది! తల్లి చనిపోయింది! కుందనపు బొమ్మలాటి కూతుర్ని చూసుకుని పొంగిపొయ్యాడు నరసింహం! "అమ్మాయి అచ్చు లక్ష్మీదేవిలా వుంది!" అన్నారు చూసిన వాళ్లందరూ!

"లక్ష్మీదేవి కాదు చదువుల తల్లిని చేస్తాను!" అనుకున్నాడు నరసింహం! అహల్యకు చదువు చెప్పసాగాడతను! చెప్పిన విషయం వెంటనే గ్రహించేది అహల్య! చెప్పని వాటిగూర్చి ఆలోచిస్తూ కుతూహలంగా ప్రశ్నలు వేస్తుండేది. నరసింహం వీధి బడిలో పంతులుగారి వద్ద నేర్చిన చదువు ఆ తర్వాత జీవితంలో కష్టపడి నేర్చుకున్న చదువూ అహల్యకు తొమ్మిది పదేళ్లు వచ్చేసరికీ నేర్చుకుంది! ఆ తర్వాత కేవలం స్వయంకృషితో మిగిలిన తెలుగు కావ్యాలను మథించసాగిందామె!

తండ్రి చెల్లెలికి చదువు చెప్పడం సుతరామూ ఇష్ట ముండేది కాదు అహల్య అన్నలకు! "అంట్లు కుండలు తోమటానికి చదువు కావాలా?" అంటూ ఎద్దేవా చేసేవాళ్లు! అహల్య యింటి పని వంట పని పూర్తిచేసుకుని చదువుకునేది. అహల్య పెద్దన్న పెళ్లి అయింది! అర ఎకరం పొలం చుట్టూ గట్టు వేసుకుని నిట్టాడి పాకలో నో ఘూల తడిక అడ్డంబెట్టుకుని వేరు పడిపొయ్యాడు!

నాలుగేళ్ల వ్యవధిలో మిగిలిన ఇద్దరన్నల పెళ్లిళ్లూ అయ్యాయి!

అహల్య నరసింహం నసారాలోకి మారారు! రాళ్లు తప్ప మట్టిలేని కుండ నేలను తండ్రి కూతుళ్ల కోసం వదిలివేశారు అహల్య అన్నలు!

చెల్లెల్ని అందలం ఎక్కిస్తారనుకున్న అన్నలు — అహల్య తిన్నదా లేదా అని గమనం లేకుండా ప్రవర్తించసాగారు!

దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ ప్రాచీన తెలుగు సాహితీ సంశోధనలో మునిగిపొయ్యారు తండ్రీకూతురూ! అన్నల నిర్లక్ష్యం వదినల ఆరళ్ల మధ్య పెరిగి పెద్దదయింది అహల్య.

"నా తల్లిని చదువుల తల్లిని చేసాను!" అనుకున్నాడు నరసింహం! మట్టిలో మాణిక్యం లా వెలిగిపోతున్న అహల్య అందం గురించి చుట్టుపక్కల వూళ్లలో చెప్పుకోసాగారు.

ఒకరోజు ముని మాపువేళ అహల్య పెద్దన్న తండ్రిని చెల్లెలు వివాహం విషయమై కదిపాడు.



"అమ్మాయి పెళ్లి చేద్దాం నాన్నా!"

"అలాగేరా! సంబంధం ఎక్కడైనా చూశావా"?

"రాజాలాంటి సంబంధం చూసాను! మమూరికి అరామడ దూరంలో ఒక సంబంధం ఉంది. పందెకరాల పొలం! పెద్ద మేడ! ఒక్కడే కొడుకు!"

"వాళ్లు మనకందుతారా? మన తాహతు ఎంత?"

"పిల్ల నచ్చితే చాలని కబురంపారు?"

* * *

"అమ్మాయి! అహల్యా!" పెద్దొదిన పిలుపు విని తలెత్తింది అహల్య.

"ఇవ్వాళ నిన్ను చూడటానికి రాణీగారు వస్తున్నారు! ఇంకా అలానే వున్నావేం?" అంది రెండో వదిన.

"ఇదిగో ఈ కొత్తచీర కట్టుకో!" అంది మూడో వదిన. అనుకోకుండా ముగ్గురు వొదినలు వొలికిస్తున్న ఆప్యాయతకు ఆశ్చర్యం వేసింది అహల్యకు.

అహల్యకు ముగ్గురు వొదినలూ ముస్తాబు చేయడం పూర్తయేసరికి ఇంటిముందు మేనా ఆగింది.

"రాణీగారొచ్చారు! రాణీగారొచ్చారు!"

"సిరిపల్లె దొరసాని ఆమె!"

"ఎన్ని నగలు పెట్టుకుందో చూడు!"

"పట్టు చీరె నిండా జరీయే?"

ఇంటిముందు కోలాహలం ఎక్కువైంది. గుమిగూడిన జనాన్ని అదిలిస్తూ హడావిడి పడిపోసాగారు అహల్య అన్నలు.

లోపలకు రాజఠీవితో నడిచివస్తున్న సిరిపల్లె దొరసానికి నమస్కరించి కూర్చోన టానికి నులకమంచం వేశారు అహల్య వదినలు!

చుట్టూచూసిందామె! సూర్యచంద్రులు దర్శనమిచ్చే పైకప్పు వంక చూసింది!

అహల్యను తెచ్చి చింకిచాప మీద కూర్చోబెట్టారు! సానబెట్టిన వజ్రంలా మెరిసిపోతున్న అహల్య అందం — కనులు మిరుమిట్లు కొలిపింది!

అయిదు నిముషాలు తదేకంగా చూసింది మారు మాట్లాడుకుండా లేచి వెళ్లిందామె!

"అయ్యో! ఒక్క మాటన్నా చెప్పకుండా వెళ్లిపోయిందేమక్కా?"

"పిల్ల నచ్చలేదేమో?"

"ఇంతోటి భాగ్యానికి నా కొత్తచీరె కాస్తా కట్టుకోవడానికిచ్చాను!"

వదినల మాటలువిని కట్టుకున్న కొత్త చీరె విప్పి మడతపెట్టి తీసుకువెళ్లింది అహల్య.

వదినల సూటిపోటి మాటలు విని మ్లానవదనంతో ఉన్న అహల్యను చూడలేక తలదించుకున్నాడు నరసింహం.

"నాన్నా!" పెద్దగా కేకలు పెడుతూ వచ్చాడు పెద్దన్న.

"ఏమిట్రా!"

"రాణీగారికి అమ్మాయి నచ్చింది!"

"ఆ!"

"నిజంగా!"

"అదృష్టం అంతా అహల్యదే!" పరిగెత్తుకు వచ్చారు వదినలు.

నరసింహం మనసు గర్వంతో సంతృప్తితో నిండిపోయింది.

అహల్య కనుగొలకుల నుండి కారుతున్న నీటిని తుడుస్తూ "బురదలో పుట్టిన పద్మం ఉన్నత స్థానాన్ని అలంకరిస్తుంది! నువ్వు పుట్టినప్పుడే అనుకున్నాను! నా తల్లి కంటే అదృష్టవంతురాలీ ప్రపంచంలో ఉండదని!" అన్నాడాయన కూతుర్ని అక్కున చేర్చుకుంటూ!

కొద్దిరోజులలోనే పెళ్లి ముహూర్తం పెట్టించి కబురంపింది సిరిపల్లె దొరసాని.

ఆమె పంపిన విలువైన దుస్తులు ధరించి బంగారు నగలు పెట్టుకొని సిరిపల్లె బయలుదేరి వెళ్లారు!

'రాజగృహం' గేటుముందు అప్రతిభులై నిలబడిపొయ్యారు అహల్య అన్నలు, వదినలు! మేడలో ఒక అంతస్తు మొత్తం వారి విడిదికి ఇచ్చేసింది రాణి!

దూరంగా నిలబడ్డ పెండ్లి కుమారుడు రాజాను చూశారు అహల్య, నరసింహం.

స్ఫురద్రూపి, ఆజానుబాహువు అయిన రాజా కమనీయ మనోజ్ఞ రూపం అహల్య మనసులో గిలిగింతలు రేపింది.

"పెళ్లివారికి ఏ లోపం జరుగకూడదు!" అని నౌకర్లకు మరీ మరీ చెప్పింది సిరిపల్లె దొరసాని పేరిందేవి.

ఆకాశమంత పందిరి భూదేవంత వేదిక వేయించి పెళ్లి జరపించింది పేరిందేవి.

పెళ్లి అయ్యాక ఏనుగు హౌదా మీద రాజాతో కలిసి కూర్చుని ఊరేగింది అహల్య.

రకరకాల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న 'రాజగృహం'లోకి భర్తతో పాటు అడుగెట్టింది అహల్య.

ఆ రాత్రి...



మనసులో కోటి కోరికలు మోసులెత్తగా సర్వాలంకార శోభితయై పడక గదిలో అడుగెట్టింది అహల్య.

మల్లెలు, విరజాజులు, లిల్లీ, గులాబీ, సంపెంగ రకరకాల పూలు మాలలుగా, తోరణాలుగా, పందిళ్లుగా, చిత్ర విచిత్రాకృతులతో గది అంతా అలంకరించబడివున్నది!

కాలాగరు ధూపం గది మూల గుబురుకుంటున్నది. బంగారు భరిణిలో సాంబ్రాణి కడ్డీలు సువాసనలు వెదజల్లుతూ మాడిమసి అవుతున్నాయి!

పచ్చకర్పూరం కస్తూరి చిదిమి చల్లిన పొడివలవ్వ పాన్పు పైనుండి వస్తున్న వాసన శరీరాన్ని చల్లబరుస్తూ మనసును రెచ్చగొడుతున్నది.

గదిలో ఒక ప్రక్కన నగిషీలు చెక్కిన బల్లలపై రకరకాల పండ్లు, స్వీట్సు, వెండి బంగారు పళ్లేలలో అమరివున్నాయి.

గోడల మీద రతీమన్మధుల చిత్ర పటాలు వివిధ భంగిమలలో చిత్రించిన తైల వర్ణాలు మెరిసిపోతూవున్నాయి!

వెండితో చేసిన రాధాకృష్ణుల విగ్రహం — జీవకళ వుట్టిపడుతూ గదిలో వొకమూల తళుక్‌మంటున్నది!

వివశత్వంతో పులకరింపుతో, ఉత్సుకతతో మంచంమీద కూర్చుని రాజా రాకకోసం ఎదురుచూడసాగింది అహల్య.

ఎదురు చూసి చూసి ఉత్కంఠ పెరిగిపోసాగింది అహల్యకు. రాజాకు ఏదైనా సుస్తీ చేసిందేమో! ఆ ఆలోచన రాగానే ఆమెకు మనసులో ఆందోళన కలిగింది!

నిన్నటి వరకూ రాజా ఎవరో తనెవరో! ఈ రోజు నుండి రాజా తన జీవిత భాగస్వామి! కష్టంలో సుఖంలో మంచికి చెడుకూ — హాలాహలాన్ని అమృతాన్ని కలిసి పంచుకోవాల్సిన వ్యక్తి.

కలవరపడుతూ కన్నెత్తి చూసింది అహల్య! వాకిట్లో నిలబడివున్నాడు రాజా! రాజాను చూసిన క్షణమే సిగ్గుతో మొగ్గలా ముడుచుకుపోయింది అహల్య.

చప్పుడైంది! క్రీగంట చూసింది! ఎవరో బయటినుండి తలుపులు మూసారు! అదీ చప్పుడు!

వాకిలిదాటి ముందుకడుగులు వేసాడు రాజా! అహల్య తల మరీ దించుకుపోయింది!

పూర్ణిమ చంద్రుని రాక చూసి మిలమిల మెరిసిపోయే తారలా అహల్య మనసు కోర్కెలతో మెరిసిపోసాగింది.

మధుర భావ సంప్రోక్షితమైన అహల్యకు నిలువెల్ల పులకింతలు కలిగాయి.

ఎదురుచూచిన క్షణం ఎదురవబోతుంది జీవితం సఫలం కాబోతున్నది — భావి జీవిత భాగ్యవిధాత చేతిలో వివశఅయి మున్నెన్నడూ ఎరుగని సుఖాలను రుచి చూడబోతున్నది.

అహల్య వంచిన తలఎత్తలేదు. ఎదురుచూపులో ఆనందం వున్నా మరో క్షణం ఒక యుగంలా అనిపించసాగింది.

గది గోడకున్న గడియారం ఠంగుమని గంటలు కొట్టింది. ప్రేమోత్కంఠిత అహల్య మనసులో ఏదో చిన్న అలజడి బయల్దేరింది.

పన్నెండు గంటలు!

తలఎత్తి చూసింది అహల్య! రాజా కనబడలేదు! ఏమైపోయాడు! గది తలుపులు వేసినవి వేసినట్లే ఉన్నాయి.

తను ఏమైనా పొరబాటు చెయ్యలేదు గదా? అందం, ఐశ్వర్యం, హంగు, హోదా, రూపం, యవ్వనం అన్నీవున్న రాజా తనకు జోడీ అని తెలిసిన క్షణాన్నుండీ పరవశంతో కట్టు తప్పిపోతున్నది మనసు!

తను చదివిన ప్రాచీన కావ్యాలలోని నాయికలు ఏ విధంగా ప్రవర్తించేవాళ్లో గుర్తుతెచ్చుకోసాగింది అహల్య! తను ధరించిన మాలలను ప్రియునకర్పించింది గోదాదేవి ఆముక్తమాల్యదలో.

అలిగి, పాన్పుపై నెక్కి, నాథుని ఎడమ కాలితో తన్నింది సత్యభామ! (పారిజాతాపహరణం)—

దమయంతి — హంస రాయబారం గుర్తొచ్చింది — (శృంగార నైషధం)

ప్రియ సమాగమనంకోసం కామరూపిణి అయిన కలభాషిణి గుర్తొచ్చింది (కళాపూర్ణోదయం).

వసురాజును ప్రేమించి తత్తరపాటుతో ఎదురుచూచే గిరిక గుర్తొచ్చింది — (వసుచరిత్ర)

కావ్య నాయికలపాట్లు గుర్తుకుతెచ్చుకుంటూ కాలం గడుపసాగింది అహల్య!

రాజా సుందర రూపం గుర్తొచ్చిందామెకు! సృష్టిలో అయిదుగురు మహా సౌందర్యవంతులున్నారని విన్నది. జయంతుడు, నలకూబరుడు, నలుడు, మన్మధుడు, సహదేవుడు. తన జీవితంలో యింతవరకు అంత సౌందర్యవంతుడైన యువకుని చూడలేదామె!

రాజా ఏమైపోయాడు? వేసిన తలుపు వేసినట్లుగానే వున్నది!

కిటికీలోంచి కాంతి హీనములగు కిరణములను ప్రసరిస్తూ తేజోహీనుడగుతున్న



చంద్రుడు కనబడ్డాడు.

తెల్లవారబోతున్నది! మంచంమీద నుండి లేచింది అహల్య. గది నాలుగు మూలలూ పరీక్షగా చూసింది! వాకిలికెదురుగా మరో వాకిలి వున్నది — ఆ విషయం మొదట్లో అహల్య గమనించలేదు! తలుపు నెట్టింది — తలుపు తెరుచుకుంది. గదిలోనుండి పక్కనున్న వరండాలోకి వెళ్లే వాకిలి అది! విశాలమైన వరండాలో ఒక మూల సోఫాపై పడుకుని నిద్రపోతున్నాడు రాజా!

ఆయనకు ఏదైనా జబ్బు చేసిందేమో? అందుకే అలా విడిగా వరండాలో పడుకున్నాడేమో! దగ్గరకు వెళ్లి వంటిమీద చెయ్యి వెయ్యబోయింది అహల్య! సిగ్గు ముంచుకువచ్చి వెనుకంజవేసింది. వెనుదిరిగి గదిలో మంచంమీద నుండి శాటిన్ దుప్పటి తెచ్చి రాజా మీద కప్పింది.

గదిలోకి వెళ్లింది.

అగరు ధూపం, సాంబ్రాణి కడ్డీలు ఎప్పుడో నుసిగా మారిపోయాయి. యువజంట ప్రేమ సరాగాలను చూడటానికై పొంచివున్న చంద్రుడు విసిగివేసారి వెళ్లిపోయాడు.

భళ్లున తెల్లవారింది! కిందకు దిగి వెళ్లింది అహల్య. పరాచికాలాడుతూ ఎదురయ్యారు వదినలు!

"చేసిన అలంకారం చేసినట్లే ఉన్నది!"

"సిగలో పూవులు వాడనే లేదు!"

"మరదలు శోభనం గదికి వెళ్తున్నట్లుంది గాని గది నుంచి వస్తున్నట్లు లేదు!"

"ఆ కళ్లు చూడు! రాత్రంతా నిద్రలేక ఎరుపు జీర ఎక్కిపోయాయి!"

"తమ్ముడుగారు బహు సరసులు! భార్యను పువ్వులా చూచుకుంటారు!"

"కాదు! పువ్వుల్లో పెట్టి పూజించుకుంటారు!" పేరిందేవి రాకతో వదినల పరాచికా లాగిపొయ్యాయి!

అహల్యను నఖశిఖ పర్యంతం పరిశీలనగా చూచింది పేరిందేవి. కుతూహలంతో విప్పారిన ఆమె నేత్రాలు అసంతృప్తితో ముడుచుకుపొయ్యాయి.

అంతకుముందు దాసీ పిల్ల వచ్చి ఆమె చెవిలో "బాబుగారు బయట వరండాలో సోఫామీద పడుకుని నిద్రపోతున్నారు!" అని చెప్పింది.

అనాఘ్రాత పుష్పంలా ఎదురైన అహల్యను చూసిన పేరిందేవి మనసులో ముల్లు గుచ్చుకుని కలుక్‌మన్నట్లయింది! హృదయం లోతుల్లో ఎక్కడో వున్నగాయం మళ్లీ కత్తితో పొడిచినట్లు బాధించసాగింది.

కాని మరుక్షణం తనను తాను నిగ్రహించుకున్నది పేరిందేవి! సుదీర్ఘ జీవితంలో

ఎన్నో వొడిదుడుకుల నెదుర్కొని తొట్రుపడకుండా నిలబడివున్నది. ఇలా బెంబేలుపడి బేలతనం చూపటానికి కాదు!

హాలాహలాన్ని మింగి పైకి చిరునవ్వు చిలకరిస్తూ వచ్చిందిన్నాళ్లూ! పేరిందేవి చరమ జీవితం సుఖసంతోషాలతో గడిచిపోతుందని ఆశపడింది! ఆశలు అడియాసలైనట్లేనా?

చిరకాలంగా పెంపొందించుకున్న నిగ్రహ శక్తి — సంయమనం పేరిందేవిని తొట్రుపడనీకుండా చేసాయి.

"రామ్మా! ముఖం కడుక్కో! కాఫీ తాగుదూగాని!" అంటూ కోడల్ని పలుకరించింది.

తనను చూడగానే అత్తముఖం వివర్ణమవటం — ఆంతలోనే తొట్రుపాటు — తర్వాత సంయమనం — అన్నీ చూసింది అహల్య!

మారు మాట్లాడకుండా పెరట్లోకి వెళ్లింది.

** ** **

ఆ సాయంత్రం మరింత వేళాకోళంగా ముస్తాబు చేసారు అహల్యకు వదినలు.

బుగ్గమీద చిన్న కాటుక చుక్కను దిద్దుతూ "రేపు ఉదయం ఈ కాటుక చుక్క ఇలానే వుండాలి మరదలా!" అంది పెద్దొదిన.

"అలానే అచ్చు అలానే తమ్ముడి గారి గుండెమీద గుర్తుగా వుంటుంది" అంది చిన్నొదిన.

పాపిట మధ్య కుంకంబొట్టులా పెట్టి పైన పాపిడ గొలుసు అలంకరిస్తూ "ఈ కుంకం బొట్టు చెరిగిపోగూడదు సుమా!" అంది చిన్నొదిన.

"తమ్ముడి గారి చేతిగోరు కొనలతో జేరిపోతుందీ కుంకుమ!" అన్నది పెద్దొదిన బదులుగా.

"అంత గట్టిగా జడ వేయకమ్మా! పట్టుకు గుంజుతున్నప్పుడు తమ్ముడిగారి చేతులు కందిపోతాయి!"

"ఈ నగలన్నీ ఇక్కడ అలంకరించటం గుచ్చుకుంటున్నాయని తమ్ముడుగారు గదిలో లోపల తీసివేయటం!" వదినల పరాచికాలయి గదిలో అడుగుపెట్టే సరికి ఎనిమిది గంటలైంది!

"రాత్రి నేను మంచం మీద కుర్చున్నానని రాజా బయటికు వెళ్లి పడుకున్నాడేమో!" అని ఫందేహం వచ్చింది అహల్యకు.

వరండాలో నిలబడి గది వాకిలి వంక చూస్తూ నిలబడింది.

అరగంటలో రాజా వచ్చాడు తలుపు తెరుచుకుని.



అహల్య మనసులో వలపు తలుపులు తెరుచుకున్నాయి! రాజా ద్రాక్ష పళ్ల గుత్తి అందుకుని ఒకో పండు తిన్నాడు!

వెళ్లి మంచం మీద పడుకున్నాడు. రాజా వరండాలోకి వస్తాడేమోనని ఎదురుచూచి చూసి నీరసడిపోయింది అహల్య. నిలబడి నిలబడి కాళ్లు పీక్కుపోయి కండెలు కట్టాయి!

ధయిర్యంచేసి గదిలోపలకు నడిచింది! మంచంవైపుగా తడబడే అడుగులతో ముందుకు సాగింది. అత్యంత సౌందర్య వంతుడైన భర్త రూపం ఆమెలో మోహావేశాన్ని కల్గించింది.

వివశురాలై మంచంమీద కూర్చుని భర్తచేయి అందుకోబోయింది.

కర్ణ కఠోరంగా వినవస్తున్న గురక చెవినబడి ముందుకు చాచిన చేతిని వెనక్కు తీసుకుంది.

పడుచుపిల్లకు జరిగిన పరభవానికి సాక్షిగావున్న చంద్రుడు ముఖంచెల్లక కనుమరుగైపోయాడు. పాండురోగి ముఖంలా ఆకాశం వెలతెలా పోసాగింది!

అహల్య మనసులో ఏదో గుబులు బయల్దేరింది! "నేనేమైనా పొరబాటు చేసేనా?"

"నా మీద రాజాకెందుకో కోపం వచ్చి ఉంటుంది!"

"కోరికలు వురకలువేసే కోడె వయసులో వరుసగా రెండురాత్రులు భార్యను దూరంగా వుంచాడంటే రాజాకు నాలో ఏదోలోపం కనబడివుండాలి!"

"పేదింటి పిల్లనని నా మీద విముఖత్వం ఏర్పడ్డదేమో?"

"పెళ్లిలోనూ, ఆ తర్వాత, కనీసం ఏనుగు అంబారీ మీద ఊరేగే టప్పుడూ రాజానాతో ఒక్క మాట మాట్లాడలేదు.

"రాజాకు నేనంటే ఇష్టం లేకపోతే ఆ అయిష్టత అతని ప్రవర్తనలోనో చూపులలోనో బహిర్గతం అయివుండేది! కాని రాజాకు నా మీద కోపంవున్నట్లు తెలుసుకోలేకపోయాను!"

ఆలోచనా భారంతో మ్లానవదన అయిన అహల్యకు ఏమీ పాలుపోలేదు!

"నాన్న దగ్గరకు వెళతాను! ఈ లోకంలో నాకాయన కంటే కావలసిన వాళ్వెరూలేరు!" అనుకుంటూ కిందకుదిగివెళ్లింది.

తూరుపు తెల్లవారబోతున్నది! రాజ గృహంలో ఇంకా సందడి మొదలవలేదు.

తండ్రి విడిదిచేసి వున్న గది వైపుగా నడిచింది అహల్య.

తలుపులు దగ్గరకు వేసి వున్న వాకిలి బయట నిలబడిపోయిందామె! లోపలినుండి వినపడుతున్న తండ్రి మాటలు — రుద్ధకంఠంతో తండ్రి గొంతు పెగల్చుకు వస్తున్న ఆక్రందన వింటూ మ్రాన్పడి పోయింది!

"అమ్మడి గొంతు కోశాంరా పెద్దాడా!"

"అదేమిటి నాన్నా! అమ్మడికేం తక్కువ? తిన్నంత తిని పారేసినంత పారేయవచ్చు! తరతరాలుగా తిన్నా తరగని ఆస్తి వుంది!"

"ఆస్తి వుంటే సరిపోయిందా? అల్లుడు గారిని గురించి సిరిపల్లెలో ఏదో ఒక వార్త విన్నాను! అప్పట్నుంచీ నా మనసు కళవెళ పడిపోతున్నది!"

"లోకులు కాకులని వూరికే అన్నారా? అమ్మడి అదృష్టం చూచి ఓర్వలేక ఏదో అనుంటారు!"

"నిప్పులేందే పొగరాదు! ఏ లోపం లేకపోతే అంతదూరం మన అమ్మడి కోసం వస్తారా?"

"అమ్మడి అందం అణకువ విని అంతదూరం వచ్చామని స్వయంగా రాణీగారే అన్నారు!"

"అల్లుడుగారికి ఇక్కడో ఈ వూర్లోగాని చుట్టుపక్కల ఊళ్ళోగాని ఎవరూ పిల్లనివ్వమంటారంట! అందుకనే రాణీగారు అంతదూరం వచ్చారు!"

"పిల్ల నివ్వనవడానికి రాజాకేం కన్నొంకరా, కాలొంకరా? అసూయతో ఏదో అంటారు!"

"అసలుకే లోపం అయినప్పుడు తీరుగా కన్నూ కాలూవుండి ఉపయోగం ఏమున్నది? అహల్య కంటే దురదృష్ట వంతురాలు ఈ లోకంలో మరొకటి వుండదు!"

"తెలివి తక్కువగా మాట్లాడొద్దు! ఎవరో ఏదో అన్నారని ఆ మాటనే నమ్ముతావా?"

"అమ్మడిని తీసుకొచ్చి బంగారు పంజరంలో బంధించారు! తలచుకుంటే కడుపు తరుక్కుపోతుంది! ఆస్తి లేకపోతే పోయింది! అమ్మడిని ఇంటికి తీసుకెళదాం. కనీసం హాయిగా వూపిరి పీల్చుకుంటుంది! ఖైదులో ఉన్నట్లు ఇక్కడ జీవితాంతం పడివుండటం ఎందుకు?"

"నాన్నా!" పెద్దగా అరిచాడు చిన్నన్న.

"అనవసరమైన భయాలు మనసులో పెట్టుకుని అమ్మడి జీవితం నాశనం చెయ్యకు! అదృష్టం అమ్మడిని అందలం ఎక్కించింది! మూర్ఖానికి పోయి చెల్లి జీవితం భ్రష్టుపట్టించకు!"

అన్నలు ముగ్గురు ఒకేసారి తండ్రిమీద అరవడంతో తండ్రి ఏం సమాధానం చెబుతున్నాడో వినబడలేదు!

తండ్రి అన్నలు తన గురించి తర్జన భర్జనలు పడుతున్నారని గ్రహించి అహల్య



అక్కడనుండి కదిలివెళ్ళింది!

రెండు వాకిళ్ల గదివద్ద కూర్చుని ఉన్న అత్త పేరిందేవి అహల్య నంక నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసింది. పాలిపోయివున్న అహల్య ముఖం చూడగానే ఆమె మనసులో చివుక్కుమంది కాబోలు తలదించుకుంది!

"ముఖం కడుక్కుని రామ్మా! కాఫీ తాగుదూగాని!" అంది పేరిందేవి హీనస్వరంతో.

అంతలో వచ్చిపడ్డారు వొదినలు! పరాచికాల్లు పలకరింపులు మొదలయ్యాయి. అహల్య వంచిన తల ఎత్తలేదు — కన్నెత్తి చూడలేదు, పన్నెత్తి మాట్లాడలేదు.

ఉస్సూరంటూ లేచి అవతలకు వెళ్ళిపోయింది పేరిందేవి. ఆమె మనసులో కొడిగట్టిన దీపం వెలుగులా మిణుకుమంటున్న ఆశారేఖలు పూర్తిగా అంతర్ధానమయ్యాయి!

ఎప్పుడో, ఆరు తరాల క్రితం ఒక పడుచుపిల్ల రాజయ్య వంశాన్ని శపించిన విషయం గుర్తొచ్చింది పేరిందేవికి!

పిండారీ దండును మట్టుబెట్టిన తర్వాత దండు నాయకుని కూతురు చెమ్కీని బంధించి తెచ్చుకున్నాడు రాజయ్య.

రంగుల రామచిలుకలా చూడ పసందుగాఉన్న చెమ్కీని చూచి మోజుపడ్డాడు రాజయ్య. శత్రువులను జయించిన విజయోత్సాహంలో అవధులు లేకుండా పెచ్చుమీరే కామోద్రేకం అతనిలో పెల్లుబికింది!

మధురాసవం సేవించి మునిమాపు వేళ చెమ్కీ వున్న గది తలుపు తెరుచుకుని లోపలకడుగు పెట్టాడు రాజయ్య.

భీతహరిణేక్షణలా బెదురుచూపులు చూస్తున్న చెమ్కీ పరిగెత్తుకు వచ్చి రాజయ్య పాదాలపై వాలింది.

"అన్నా! నీ చెల్లెలి లాటిదాన్ని! నన్ను వదిలెయ్!" అంటూ గోడుగోడున విలపించింది.

మదిరాపాన మత్తుడైన రాజయ్య మనసులో పెచ్చుపెరిగిన కామోద్రేకం విచక్షణను పారద్రోలింది.

"యుద్ధంలో జయించిన క్షణాన్నే నీకు భర్తనయ్యాను! నువ్వు ఇప్పుడు అనవసరంగా రట్టుచెయ్యక ఆనందంగా కౌగిలిలోకి రా!" అన్నాడు మీసం కొనలు మెలేస్తూ!

"అన్నా! నువ్వు యుద్ధంలో జయించింది నా తండ్రిని. నీ మీద మనసులేని కన్నె పిల్లను కోరుకోవడం నీకు తగదు!"

చెమ్కీ మాటలు రాజయ్య మీద ప్రభావం చూపలేదు! యుద్ధంలో గెలిచిన

[illegible]కుడు శత్రు స్త్రీని అనుభవించితే గాని ఆవేశం తీరదు—

మీదకు వస్తున్న రాజయ్యను వారించలేనని తెలుసుకున్న చమ్కీ లంగా పొరలనుండి తళతళ మెరిసే చురకత్తి బయటకు లాగింది.

చమ్కీ చేతిలో తళతళ మెరిసే కత్తిని చూసి క్షణం విచలితుడయ్యాడు రాజయ్య. ముందుకు వెయ్యబోయిన అడుగు వెనక్కి తీసుకున్నాడు.

కత్తిపై కెత్తి బలంగా గుండెల మీద గుచ్చుకుంది చమ్కీ! చివ్వున రక్తం ఎగచిమ్మింది!

శక్తినంతా కూడగట్టుకుని కత్తితో మళ్లీ మళ్లీ పొడుచుకుంది చమ్కీ!

"ఆగు!" అంటూ ముందుకు రాబోయాడు రాజయ్య!

"మనసులేని ఆడదాన్ని చెరచబోయిన నీ వంశం ఏడు తరాలవరకు మగతనం లేకుండా మధనపడి చస్తారు!" శపిస్తూ ప్రాణాలు విడిచింది చమ్కీ!

రాజయ్య వంటికెక్కిన కైపు దిగిపోయింది! అత్యంత సాహసవంతుడూ పరమధీరోదాత్తుడూ అయిన రాజయ్య మనసులో పశ్చాత్తాపం దావానలంలా కమ్ముకోసాగింది.

ఆ భయంకర సంఘటన తర్వాత ఆయనకు భార్యను చూసినా! తన, ఇలాకాలోని భోగం పడుచుల్ని చూసినా లైంగిక వాంఛ కలుగలేదు!

తరువాత కొద్ది కాలానికే మరణించాడాయన! వంశం అంతరించి పోకుండా పిల్లవాడ్ని దత్తు తీసుకుంది ఆయన భార్య!

కథ చర్విత చర్వణం అయింది!

ఇది సీరియల్

నవలా పథకం

మొగలీ పువ్వంటీ అయిదో భాగం

---

ఆంధ్రభూమి

సచిత్ర వారపత్రిక

సీరియల్ నవలా పుస్తక పథకం—6

# 6

# మొగలీ పువ్వంటీ

## డాక్టర్ కొత్త రవీంద్రబాబు

జరిగిన కథ

అమరావతి పిక్నిక్‌కని వస్తారు

ఎం.ఎ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు.

శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ

ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు.

షాలిని మేడమ్ అంటే

విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి

కృష్ణ ఆవలి వద్దకు వెళ్ళి వస్తూన్న నీలను

పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్.

షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ

స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది.

నీలను ఎంతో ఆప్యాయంగా ఆదరణగా చూస్తుంది

శ్యాం తల్లి అహల్య.

# 6

అంతవరకూ రాజయ్య వంశంలో వారెవ్వరూ చమ్కీ శాపం బారినుండి తప్పించుకోలేకపోయ్యారు!

రాజ గృహంలో గృహిణిగా అడుగెట్టిన మరునాటిరోజే భర్త "శక్తి" హీనుడని గ్రహించింది పేరిందేవి!

అత్త మరణశయ్య మీదకు వారిలుతూ ఆరు తరాల 'రాజగృహ' చరిత్ర చెప్పింది!

భయంకర బడబాగ్నిని దాచుకున్న నిశ్చల సముద్రంలా ఇన్నాళ్లూ ఓర్పుపట్టి ఈ దిగులును గుబులుగా మనసులో దాచుకుంది పేరిందేవి!

కనీసం తన కొడుకైనా 'శక్తి' వంతుడై శాప విముక్తుడై బిడ్డా పాపలతో కాపురం చేసుకుంటాడని ఆశించింది.

కన్ను చెదిరే అందం చూసిన క్షణం రాజాలోని జడత్వం వదిలిపోతుందని ఆశపడింది!

కాని అనుకున్నదొకటి — అయినదొకటి! చమ్కీ భయంకర శాపం — సంవత్సరాలు దాటి — తరాలు దాటి రాజాను శక్తి హీనుడను చేసివేసిందా? ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటో తెలుసుకోవాల్సిన విధివుంది పేరిందేవి పైన.

తండ్రి మాటలు — అత్తగారి ప్రవర్తన అహల్య మనసులో అనుమానాన్ని కలుగజేసాయి.

అహల్య ఆ రోజంతా మనసులో మథనపడిపోయింది. ఆ రాత్రి ముచ్చటగా మూడోసారి ముస్తాబుచేసి గదిలోకి పంపారు అహల్యను.

రెండు రాత్రులుగా అహల్యను ఆవరించివున్న సిగ్గుబిడియం ఆమె మనసును బాధించలేదా రాత్రి!

గదిలో కూర్చుని రాజా రాకకోసమై ఎదురుచూడసాగింది.

గంటసేపున్నాక తలుపుతోసుకు వచ్చాడు రాజా. నెత్తురోడుతున్నట్లు వున్న అతని కనులు క్షణంసేపు అహల్యను పరికించి చూసాయి.

ప్రపంచంలో పరమ అసహ్యకరమైన, జుగుప్సాకరమైన వస్తువునుచూచి జుగుప్సతో



కనులు తిప్పుకున్నట్లు చూపులు మరల్చుకున్నాడు రాజా.

తూలుతూ వరండావైపుగా వెళ్ళబోయాడు. అహల్య అడ్డంగావుందని గ్రహించి మంచంవైపుగా నడిచా డు. మంచందగ్గరదాకా నడిచి తూలుడెక్కువై పడిపోబోతున్న రాజాను పట్టుకుని మంచంమీద కూర్చుండబెట్టింది.

అహల్య చేతులను తీసి విసిరేశాడు రాజా. అతని ఉచ్ఛ్వాసనిశ్వాసాల నుండి వస్తున్న వింత వాసనను భరించటం కష్టంగా వున్నా — ఎలాగో వోర్చుకుని గోముగా అడిగింది అహల్య.

"నా మీద కోపం వచ్చిందా?"

"ఊహూ!" కనులు మూసుకుంటూ అన్నాడు రాజా.

రాజా తలను రెండు చేతులతో పట్టుకున్నాడు.

" ఏమిటి తలనొప్పిగా వుందా?" లాలనగా అడిగింది అహల్య — రాజా నుదురు చేతితో సవరిస్తూ.

అహల్య చేతిని విదిలించికొడ్తూ "వెళ్ళు! ఫో!" అన్నాడు. నిశ్చేష్ఠ అయి నిల్చింది అహల్య.

రాజా దగ్గర్నుండి ముద్దమాటలు రాసాగాయి.

"అమ్మా! నీ దగ్గర పడుకుంటానే!" అన్నా రోజాటిలాగానే 'వద్దు— పైకివెళ్ళి పడుకో' అంది అమ్మ.

ఎందుకు — నేనిక్కడే పడుకుంటా! అన్నా. రెండు రోజులుగా పైన పడుకుంటు న్నా.

తప్పు— వెళ్ళు — పెళ్ళి అయ్యాక అహల్య నువ్వు ఒక మంచంమీదే పడుకోవాలి అని కసురుకుంది.

నాక్కోపంవచ్చి అలిగి కూర్చున్నాను. అప్పుడు రాందాసు బ్రాందీ తెచ్చి ఇచ్చాడు. తాగి వచ్చేసాను.

ఇక నుండి మనిద్దరం ఒక మంచంమీదే పడుకోవాలట.

"యాక్! నా కిష్టంలేదు"

"మరి నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?"

"నిన్ను పెళ్ళి చేసుకోకపోతే 'రాజగృహం' మా ఆస్తి యావత్తూ దాయాదులకు వెళ్ళిపోతుందని చెప్పిందమ్మ!

అమ్మ చెప్పినట్లు విని నన్ను పెళ్ళిచేసుకుంటే అడిగినప్పుడల్లా బ్రాందీ యిప్పిస్తానంది.

ఏం కోరితే అది తెప్పించి యిస్తానంది!''

''సరే నన్ను పెళ్ళి చేసుకున్నారు గదా! మరి నామీద కోపం ఎందుకు?''

''నీతోపాటు ఒక మంచంమీద పడుకోవటం నాకు యిష్టంలేదు''

''ఏం? ఎందుకని?''

''ఏమో నాకసహ్యం! ఫో! నువ్వు నాదగ్గర వుండకు.''

అహల్యకు ఏం మాట్లాడాలో తోచలేదా తర్వాత! మెల్లగా నడచి వరండాలోకి వెళ్ళింది.

సోఫాలో కూర్చుని రెండు చేతులతో మొఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

తనివిదీరా, కరువుదీరా ఏడ్చింది అహల్య. పరిచితమైన శబ్దం వినపడి వులికి పడింది.

రాజా గురకపెడ్తున్న శబ్దం కర్ణకఠోరంగా వినవచ్చిందామెకు.

నిరాశ, నిస్పృహ నరనరాన్ని క్రుంగదీస్తుంటే నిర్వేదంతో సొమ్మసిల్లింది అహల్య.

కన్ను మూసుకుంటే చీకట్లు – కన్నుతెరిస్తే భవిష్యజ్జీవితం అంధకారతమాల వృక్షంలా ఎదురుగా కనపడసాగింది.

సిరిపల్లె దొరసాని పేరిందేవి బంగారు తాడుతో తన మెడకొక వురి తగిలించింది! ఇక్కడనుండి పారిపోవటానికి ఏ మాత్రం ప్రయత్నించినా బంగారు ఉరితాడు మెడకు బిగుసుకుంటుంది.

''నా జీవితం ఎలాగూ భ్రష్టు పట్టిపోయింది. ఈ విషయమై నాన్న ఎంతో అలజడి పడుతున్నాడు. నిజం తెలిస్తే ఆయన మనసు కష్టపెట్టుకుని దిగులుతో అలమటించిపోతాడు. నిజం నాన్నకు తెలియకుండా అంతా మామూలుగా వున్నట్లు ప్రవర్తించితే సంతృప్తిగా ఇంటికి తిరిగివెళ్తాడు''

మనసులోని వ్యథను మనసులోనే అణచి వేసుకుని పైకి మామూలుగా ప్రవర్తించాలని అనుకుంది అహల్య.

నిరాశావాదం జీర్ణించుకున్న వ్యక్తిలా చంద్రుడు ఆకాశం నుండి పరారయిపోయాడు.

కిందకు దిగి వెళ్ళింది అహల్య. అహల్యను దూరం నుండి చూచి తప్పుకుంది పేరిందేవి.



అహల్య తండ్రి విడిదిచేసి వున్న గదివైపుగా నడువబోయింది. నవ్వు ముఖంతో తండ్రికి కనపడి ఆయనలో ఎగసిపడే ఆందోళనకు అడ్డుకట్ట వేయాలనుకుందామె.

ఎదురుగా చిన్నొదిన నవ్వుతూ వచ్చింది.

''మామగారు ఇంటిమీద గాలి మళ్ళింది – వెళ్లాల్సిందేనని పట్టుపట్టారు – అందుకని అర్ధాంతరంగా అంతా రాత్రికి రాత్రే ఇంటికి బయల్దేరి వెళ్ళిపోయారు'' అంది.

'పోనీ యిదీ ఒకందుకు మంచిదే! నాన్నముందు నిలబడి అబద్ధాలాడే అవస్థ ప్రస్తుతానికి తప్పిపోయింది' అనుకుంటూ వెనుదిరిగింది.

అహల్యకు ఆ రోజంతా పేరిందేవి కనపల్లేదు — చీకటి పడింది.

రోజూ జరిగే తంతు ఆ రాత్రీ జరిగింది. అయితే మనసును రాయి చేసుకున్న అహల్య రాజా రాకకోసం వేచి చూడకుండా వరండాలోని సోఫాలో పడుకుంది.

కనులు మూసుకున్నదేగాని నిద్రాదేవి కరుణించలేదు.

రాజా తూలుతూ రావటం — కష్టపడి మంచంమీదకు చేరటం – కాసేపట్లో కర్ణకఠోరంగా గురకపెట్టే శబ్దాలు వద్దనుకున్నా వినబడుతూనే వున్నాయామెకు.

పదహారు రోజులు గడిచిపోయాయి.

పదిహేడోరోజు ఉదయం చెప్పింది చిన్నొదిన. ''మామగారికి వంట్లో బాగాలేదట! కబురొచ్చింది?'' అని.

''ఆ? ఏమయింది? ఏమిటి జబ్బు?'' కంగారుగా అడిగింది అహల్య.

''ఏమోనమ్మా! వివరాలు తెలీవు! పొద్దున మనూరి పక్కన పాలెంనుండి వీరయ్య గుంటూరెడుతూ ఆగి నరిసెమ్మయ్యగోరికి సానా జబ్బుచేసిందని చెప్పెల్లాడు''

''వదినా! వెంటనే బయల్దేరి వెళ్దాం!'' అంది అహల్య ఆదుర్దాగా.

''అలాగే! పేరిందేవి పిన్నిగారికి చెబితే ఆవిడ గుర్రంబండో మేనానో ఏర్పాటు చేస్తుంది!'' అంది. చిన్నొదిన చెప్పినట్లు పేరిందేవి గుర్రం సార్టు ఏర్పాటు చేసింది. ఆరుగంటల తర్వాత పుట్టింటి వాకిలి ముందు దిగింది అహల్య గుర్రపు సార్టు నుండి.

''నాన్నా!'' తడబడే అడుగులతో ఆదుర్దాగా లోపల కదుగెట్టింది అహల్య.

తండ్రి ఎక్కడా కనపడలేదు.

''నాన్న ఏడీ?'' పెద్దొదినను అడిగింది. బదులుగా పెద్దగా ఏడ్వసాగిందామె. క్షణాలలో ముగ్గురొదినలూ అహల్యను కావిలించుకొని వెక్కి వెక్కి ఏడవసాగారు.

"అంతా అయిపోయిందే తల్లీ!"

"కూతురు భోగభాగ్యాలు చూసుకునే గీత లేదే ఆయనకు!"

"కూర్చున్నవాడు కూర్చున్నట్లే ప్రాణాలు పొయ్యాయే తల్లీ!"

"అమ్మడి ముచ్చట్లు చూడకుండానే వెళ్ళిపోయాడే" నెత్తీ, నోరూ బాదుకుంటూ గగ్గోలు చేసారు వదినలు.

అప్పటివరకు వంగనాచిలావున్న చిన్నొదిన అందరికంటే ఎక్కువ యాగీ చేసింది.

"విషయం చెబితే ఎక్కడ బాధపడతావోనని వుగ్గబట్టుకున్నానే అమ్మడూ! ఇన్నిరోజులుగా అన్నం మెతుకు ముట్టలేకపోయానే అమ్మడూ!

పదహారు రోజులూ అత్తింట్లోనే వుండాలి లేకపోతే కీడు జరుగుతుందన్నారే అమ్మడూ!"

ప్రాణంలేని శిలావిగ్రహంలా కూర్చుని వుండిపోయింది అహల్య.

మరదలు ఏం విష్ఠారమాడుతుందోనని కళవెళపడిపోయిన వదినలు అహల్య మారాడకపోయేసరికి వోపిక వున్నంతసేపు ఏడ్చి అవతలకు వెళ్ళిపొయ్యారు.

మరదలుకు మర్యాదచేసే విషయమై మల్లగుల్లాలు పడుతూ పెరట్లో వుండిపోయారు వదినలు. అప్పుడు పక్కింటి పున్నమ్మ ద్వారా అసలువిషయం తెలుసుకుంది అహల్య.

రాజగృహంలో వుంటే తండ్రి వూరికే వుండడనీ అహల్యను ఇంటికి తీసుకుని వస్తాడని భయపడిన అహల్య అన్నలు పాలల్లో మత్తుమందు కలిపి తండ్రికిచ్చారు! మందు మోతాదు ఎక్కువై మరణించాడు నరసింహం. చచ్చిపోయాడన్న విషయం బయటకు పొక్కనీయకుండా తండ్రికి సుస్తీచేసిందని చెప్పి శవాన్ని గుర్రబ్బండిలో యింటికి తెచ్చేసారు.

తండ్రిపోయాడన్న విషయం తెలిస్తే అహల్య 'రాజగృహం'లో వుండదన్న భయంతో ఆ పనిచేశారు.

అన్నలు వదినలు పడుతున్న తాపత్రయానికి కారణమూ చెప్పింది పున్నమ్మ.

అహల్య అన్నలు ముగ్గురూ తలొక ఐదెకరాలు పొలం కొనుక్కోవటానికి సరిపడా డబ్బు తెచ్చుకున్నారు. కరణంగారి ద్వారా బేరసారాలు మాట్లాడుకుంటున్నారు!

రాజాతో అహల్య సంసార బంధమూ, రాజగృహంతో తమ చుట్టరికం తెగిపోవటం వాళ్ళకు యిష్టంలేదు.



విషయం తెలుసుకున్నాక అహల్యకు ఏం చేయాలో పాలుపోలేదు.

ఇటు పుట్టింటి వాళ్ళకు తను ఒక బంగారుగుడ్లు పెట్టే బాతు!

అటు అత్తింటివారి పరువు నిలబడటానికి ఒక సాధనంగా తను రాజగృహంలోనే వుండాలి!

తండ్రి మరణంతో పుట్టింటితోవున్న బంధం తెగిపోయింది! రాజగృహంలో వుండి పుట్టింటికి నజరానాలు పంపుతున్నంతకాలమే అన్నలు వొదినలు మర్యాదగా చూస్తారు.

అత్తిల్లువదలి పుట్టింటికి వస్తే తనను ఏ మాత్రం ఆదరించరు.

తనను చదరంగంలో ఒక పావుగాజేసి ఆడుతున్నారు. ఒకవైపు అన్నలు, వదినలు మరోవైపు పేరిందేవి.

అహల్య హృదయంలో అన్నలన్నా వదినలన్నా పరమ అసహ్యం కలిగింది. అత్త పేరిందేవిఅంటే కోపం పెల్లుబికింది.

అహల్య పుట్టింటి వారికెవరికీ చెప్పకుండా వెళ్ళి గుర్రం సారటులో కూర్చుంది. అన్నలు వదినలు వాకిట్లోకి వచ్చేలోగానే సారటు కదలి వెళ్ళిపోయింది.

రాజగృహానికి తిరిగి వచ్చిన కోడలిని దూరంగాచూచి మనసులో తృప్తిపడింది పేరిందేవి.

కోడలు తిరిగివస్తుందో రాదో అని భయపడిందామె. అంత త్వరలో తిరిగి వచ్చిన కోడల్ని చూసి సంతోషపడింది.

"నాన్నగారికెలా వుందమ్మా?" అంది పరామర్శగా.

"నాన్నగారు పోయి పధ్నాలుగు రోజులయింది. దినవారాలు అయిపోయాయి! అందుకే తిరిగొచ్చాను" అంది అహల్య ముక్తసరిగా, మనసులోని కోపాన్ని మనసులోనే అణచుకుంటూ.

రోజులు గడచిపోతున్నాయి! అహల్యకు పేరిందేవిమీద కోపం పెరిగిపోసాగింది.

ఏం చేస్తే అత్తను మెత్తని చెప్పుతో కొట్టినట్లు వుంటుంది? అని ఆలోచించసాగింది. ఆలోచిస్తూ కూర్చున్న అహల్యకు నారయ్య కనబడ్డాడు.

నారయ్య రాజగృహంలో పాలేరు! రాజా వంశంలోని వాడేగాని అతనికి పేదరికం వలన పాలేరు పని చేయక తప్పలేదు! అజానుబాహువు, కండలు తిరిగిన శరీరం! మొలపంచె తప్ప పైన ఏమీ ఆచ్ఛాదన లేకపోయినా పచ్చని పసిమి ఛాయతో మిసమిసలాడుతుంటాడు నారయ్య.

మనుధర్మశాస్త్రంలోని యోగప్రకరణంలో శ్లోకం గుర్తొచ్చింది అహల్యకు.

దేవరాద్వాస పిండాద్వా స్త్రియా సమ్యక్ నియుక్తయా
ప్రజేప్సితాధిగంత వ్యా సంతానస్య పరిక్షయే.

సంతానము లేని స్త్రీ భర్తయొక్క అనుమతితో మరిది వలనగాని భర్త వంశములోని వాని వలనగాని సంతతి పొందవచ్చును. ఈ పద్ధతిలో పురుషునకు కామేచ్ఛగాక పుత్రదానేచ్ఛ మాత్రం వుండాలి.

కాని ఈ శ్లోకం నాకు అన్వయించదు. నా భర్త రాజా పూర్తిగాశక్తిహీనుడు, నపుంసకుడు!' అనుకుంది అహల్య.

ఆపస్తంభ ధర్మశాస్త్రంలోని శ్లోకం తన విషయంలో అన్వయించుకోవచ్చునని తోచిందామెకు.

ఉన్మత్తం పతితం క్లీబం అబీజం పాపరోగిణం
పత్యాగోస్తి ద్విషన్తా య్శ్చనదా యాపవర్తనమ్.

ఉన్మత్తుడు నపుంసకుడు నీతిబాహ్యుడు పాపాత్ముడు దీర్ఘరోగి భర్తగాగల స్త్రీ అతనికి అనుకూలవతిగా నుండనక్కరలేదు. అయితే ఆమె ధనార్జనకోసం ప్రయత్నించరాదు.

రాజగృహంలో రాత్రనీ పగలనీ లేకుండా స్వేచ్ఛగాతిరిగే నారయ్యను ఆకర్షించటం అహల్యకు కష్టసాధ్యం కాలేదు.

'నారయ్య వయసులో వున్నాడు. ప్రాచీన హిందూ ధర్మశాస్త్రాలు తను తలపెట్టిన పనికి ఎన్నోవేల సంవత్సరాలనాడే అనుమతి యిచ్చాయి! ఇలాచేస్తే అత్తను మెత్తని చెప్పతో కొట్టినట్లు అవుతుంది' అనుకుంది అహల్య.

ఏకాంతంగా వున్న సమయంలో పని వున్నట్లు నారయ్యను తనున్న గదిలోకి పిలిపించేది అహల్య.

రాజా నపుంసకుడని నారయ్యకు తెలుసు. అహల్య అందం అపురూపమనీ అతనికి తెలుసు! వలచివచ్చిన వనితను కాదనేంత మూర్ఖుడు కాదతను! ఎదురొచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు నారయ్య.

తాను గర్భవతినని తెలుసుకున్న రోజు విజయగర్వంతో విర్రవీగింది అహల్య.

విషయం తెలుసుకుని అవమానభారంతో అత్త తలదించుకుపోతుందనుకుంది. కాని అందుకు విరుద్ధంగా.



"అమ్మా అహల్యా? నువ్విప్పుడు వట్టి మనిషివి కాదు! పనులేమీ చేయవద్దు! ఈ రోజే గుంటూరు వెళ్ళి డాక్టరుగారికి చూపించి వద్దాం! పద!" అంది.

ఆశ్చర్యపడటం అహల్య వంతయింది. తను గర్భవతినని తెలియగానే పేరిందేవి మొఖం వెలాతెలా బోతుందని — మనసులో ఎంతో బాధపడిపోతుందనీ అనుకుంది అహల్య. కాని అందుకు వ్యతిరేకంగా ఆమె ఎంతో సంబరపడిపోతూ యింట్లో ఎంతో హడావిడి చేసింది.

అప్పటికప్పుడు ప్రయాణమై అహల్యను గుంటూరు తీసుకొని వెళ్ళింది.

డాక్టర్‌కు చూపింది.

"డాక్టర్‌గారూ! అమ్మాయిని బాగా చూడండి! మంచి మందులు వ్రాయండి! మనుమడు పుట్టాలేగాని మీకు కోరిన కానుకలిస్తాను"

పేరిందేవి మాటలకు వులికిపడింది అహల్య. ఆమె అంత సంతోషపడటానికి కారణం అర్థం కాలేదు.

అత్తను అవమానపరచి అల్లరి చెయ్యటానికి తను చేసిన పని ఆమెకు పరమానందం కల్గించడం చూసి విస్తుపోయింది. కాని అత్త తెలివిగా పన్నిన ఉచ్చులో తాను యిరుక్కున్నానని గ్రహించలేకపోయింది.

గర్భిణితో వున్నన్నాళ్ళు అహల్యను నేలమీద నడవనీయలేదు పేరిందేవి! ఏడోనెలలోనే తీసుకు వెళ్ళి నర్సింగ్‌హోంలో జేర్పించింది.

నవమాసాలు నిండాక అత్తగారి కోరిక ప్రకారం పండంటి మగబిడ్డను కన్నది.

పదిహేనోరోజున పసిబిడ్డతో రాజగృహంలో అడుగెట్టింది అహల్య.

సంతోష వదనంతో ఎదురవుతాడనుకున్న నారయ్య కనపడలేదు. ఆ రోజంతా రాజగృహం వరండాలుచూస్తూ వుండిపోయింది. బాలింతరాలులేచి మేడంతా తిరుగుతుంటే బాగుండదని వూరుకుంది గానిలేకుంటే గదులన్నీ గాలించి నారయ్యను కలుసుకునేదే.

నారయ్య గూర్చి పనివాళ్ళను వాకబుచేసింది అహల్య.

"ఏమోనమ్మా! పట్నం ఎల్లాడన్నారు?"

"యాత్రలకెళతానంటే డబ్బిచ్చామన్నారు దొరసానిగారు!"

"రంగం ఎల్లాడని ఎవురో అన్నారు!"

"కమతం మానుకునెల్లిపోయిండు!"

"దవ్వాదిన సుట్టార్ని సూడ్డానికెళ్లాడండి!"

ఒకరు చెప్పిందానికి మరొకరు చెప్పిందానికి పొంతన కుదరలేదు. నారయ్య కొంతకాలంగా రాజగృహంలో వుండటంలేదని మాత్రం అర్థం చేసుకోగల్గింది అహల్య.

పేరిందేవి పసిబిడ్డను అల్లారుముద్దుగా ఎత్తుకోవటం చూశాక ఒక భయంకరమైన ఆలోచన వచ్చింది అహల్యకు.

అత్త ప్లాను ప్రకారం నారయ్య తనకు తారసపడి గ్రంథం నడుపలేదు గదా?

ఆ ఆలోచన నిజమైతే అవసరం తీరింది గనుక అత్త నారయ్యను పంపించేసి వుంటుం ది.

ఉహూ.

అత్త మనస్తత్వం అర్థం చేసుకున్నది గనుక పేరిందేవి నారయ్యను ప్రాణాలతో వదిలేసి వుండదని తట్టింది అహల్యకు.

బతికివుంటే అతను అహల్యమీద రాజగృహం మీద ఎంతో కొంత అధికారం చెలాయిస్తాడు.

పసిబిడ్డలో అతని పోలికలు కనపడితే చూచేవాళ్ళకు అలుసుగా వుంటుంది.

పేరిందేవి ఏ పనీ అర్ధాంతరంగా ముగించదని అహల్యకు తెలుసు.

దిగులుతో కునారిల్లడం మినహా మరేం చెయ్యలేకపోయిందహల్య.

బారసాల మహోఘనంగా చేయించటానికి ఏర్పాట్లు చేయసాగింది పేరిందేవి. అహల్య అన్నలు వదినలు అయిదు రోజుల ముందే వచ్చిచేరారు రాజగృహానికి.

వూరిజనాన్ని కాక పక్కవూరి వాళ్ళనూ పిలిపించింది పేరిందేవి.

ఇంటికి వచ్చిన వాళ్లందర్నీ పురిటి గది వద్దకు తీసుకువెళ్ళి ముద్దులు మూటగట్టే అహల్య కొడుకుని చూపి సంతోషపడసాగింది.

"మా వంశాకురం!"

"రాజగృహం వాడిదే?"

"ఆ ముఖవర్చస్సు చూడు!"

"చిన్ని కృష్ణుడు మళ్లీ పుట్టాడు!"

"మా వంశంలో రాజయ్యగారి పేరు నిలబెట్టేవాడు. ఏడుతరాల తర్వాత పుడతాడన్నారు! బాబును చూస్తే ఆ జోస్యం నిజమనిపిస్తుంది."

"వంశోద్ధారకుడు"



పసిబిడ్డను చూడవచ్చినవాళ్ళ ముందు పేరిందేవి యిలా రకరకాలుగా చెబుతుంటే విని కొంచెం అవతలకు వెళ్ళి

"సిగ్గు లేకుండా ఎలా వాగుతుందో చూడు".

"పిల్లాడి ముఖంలో నారయ్య పోలికలున్నాయి చూడు".

"సందేహం లేదు వాడు నారయ్య కొడుకే!"

"నారయ్యేడీ?"

"వాడితో పని అయిందిగా? పంపించేసుంటుంది?"

"అహో! నీకు పేరిందేవి సంగతి తెలియదు! నారయ్య పీక పిసికించి చంపించి వుంటుంది."

"ఆ! అంతపని చేసుంటుందా?"

"అవసరం తీరినాక వాడెందుకు?"

"వాడుంటే కోడలు తన మాట వింటుందా?"

"మనకెందుకా మాటలు! పదండి వెళ్దాం."

ఇంటికి వచ్చినవాళ్ళనుకునే మాటలు రాజా చెవినబడ్డాయి.

అతని మనసు సలసల కాగే నూనె బాండంలా మారిపోయింది. మనసులో మండుతున్న ఆవేశాన్ని ఎలా శాంతింపజేయాలో తెలియలేదతనికి!

అహల్యను పసిబిడ్డను నరికి చంపుదామన్న ఆవేశం కల్గింది! గోడనున్న పట్టా కత్తి తీసాడు రాజా.

అతన్ని పరిశీలనగా చూస్తూ వుండటానికి పేరిందేవి నియమించిన వ్యక్తి దడాలున గది తలుపు మూసి వేశాడు. బయట తాళంపెట్టి పేరిందేవి దగ్గరకు పరుగెత్తాడు సూరయ్య.

పేరిందేవి రాజా గది దగ్గరకు వచ్చేసరికి లోపల నుండి మూలుగు వినపడసాగింది.

"తలుపు తీయ్!" అరిచింది పేరిందేవి. సూరయ్య తలుపు తీసాడు.

రాజా రక్తపు మడుగులో పడి విలవిలలాడుతున్నాడు! దగ్గరకు వస్తున్న పేరిందేవి వంక కోపంగా — అసహ్యంగా చూస్తూ ప్రాణాలు వదిలాడు.

పేగు తెంచుకు పుట్టిన బిడ్డ — చెట్టంతగా ఎదిగిన బిడ్డ — ఏ బిడ్డకోసం తను వుచ్ఛంనీచం అని చూడకుండా చేయకూడని అకార్యాలు చేసిందో ఆ బిడ్డ తనకళ్ళెదురుగా పొడుచుకు చచ్చిపోతుంటే శిలావిగ్రహంలా నిలబడిపోయింది

పేరిందేవి.

బారసాల జరుగవలసిన ఇంట్లోంచి యజమాని శవం బయటకు వెళ్ళింది.

వేడుకలకు బదులు ఏడ్పులు.

విందులకు బదులు కన్నీళ్ళు.

మంగళవాద్యాలకు బదులు చావు తతంగం పుష్పఫల భరితనందనోద్యాన వనం క్షణంలో స్మశానంగా మారిపోయింది. కాలం ఎవరికోసం ఆగదు! విధి ఆడించే చదరంగంలో మనుషులు పావులు మాత్రమే.

శ్వేతవస్త్రాలు ధరించి నిరలంకారగా మిగిలిన అహల్యను చూచినప్పుడు పేరిందేవికి పొడుచుకు వచ్చిన రాజా గుర్తొచ్చేవాడు.

ఆ తర్వాత పేరిందేవి మళ్ళీ తలెత్తుకు తిరగలేదు. కుమిలి కుమిలి కృశించి కృశించి చచ్చిపోయింది.

రాజ గృహానికి వారసుడిని సంపాదించి పెట్టిందిగాని అందుకు ఫలితంగా నవ మాసాలు మోసి కష్టపడి పెంచి పెద్ద చేసిన బిడ్డతో సహా బలి అయింది.

కోడలు నిస్సంతుగా వుండిపోతే ఆస్తి పరాధీనమవుతుందన్న భయంతో వ్యూహంవేసి, తంత్రం పన్ని విజయం సాధించింది – నెత్తురు కూడులాటి విజయం– కన్నబిడ్డ నెత్తురుపోడ్చి – బిడ్డను బలియిచ్చి సాధించిన విజయం చూడలేక కృంగి, కృశించి మరణించింది.

పసిబిడ్డను – రాజగృహాన్ని – అంతులేని ఆస్తినీ చూడాల్సిన బాధ్యత అహల్య మీద పడింది.

శీఘ్రగతిన జరిగిన దుస్సంఘటనల వలన కలిగిన మనోక్లేశం నుండి తేరుకుని కర్తవ్యం కదిలించగా కఠినచిత్తంతో కదిలింది అహల్య.

కన్నబిడ్డను కట్టుదిట్టంగా పెంచాలనుకున్నదామె.

చమ్కీ శాపం రాజాతో తీరిపోయింది. కాని జనసామాన్యంలో రాజగృహంమీద వున్న అపవాదులు యిప్పట్లో తీరవు!

'నపుంసకుల వంశం' అన్నపేరు పోవాలంటే తన బిడ్డను అతిజాగ్రత్తగా పెంచి పెద్దచేయాలి!

అహల్య బిడ్డకు శ్యామలేందు అని పేరు పెట్టింది.

బిడ్డకు తల్లి తండ్రి అన్న తమ్ముడు అన్నీ తనే అన్నట్లు పెంచితే జరిగితే నష్టం



ఏమిటో రాజాను చూసి స్వయంగా తెలుసుకున్న అహల్య శ్యామలేందు విషయంలో తల్లిలాకాక తండ్రిలా మసలుకోవాలని నిర్ణయించుకున్నది!

కన్నబిడ్డపై మమకారాన్ని కర్తవ్యతా దీక్షలో కరగించుకుందామని నిరంతరం ప్రయత్నం చేయసాగింది.

సాలెగూళ్ళలా రాజగృహాన్ని పట్టుకుని వేలాడుతున్న అన్నలను వదినలను పంపించివేసింది అహల్య. ఏ పరిస్థితులలోనూ తన పుట్టింటివారు రాజగృహం గడప తొక్కవలసిన అవసరంలేదని కరాఖండిగా చెప్పివేసిందామె.

తిడుతూ, తుమ్ముతూ, చీదుతూ, శాపనార్థాలు పెడుతూ రాజగృహంనుండి నిష్క్రమించారు అహల్య బంధువులు.

భర్త తరఫు — అత్త తరఫు బంధువులనూ యింటినుండి పంపించివేసింది అహల్య.

తరతరాలుగా రాజగృహంలో పనివాళ్ళుగా దాసీలుగా వున్న వాళ్ళను పనిమాన్పించి పంపించి వేసిందామె.

కొద్దిగా అవసరమైనంత మందిని కొత్తవారిని మాత్రం పనివాళ్ళుగా నియమించుకున్నది.

పాత మనుష్యుల ఛాయలు – తనవైపు భర్తవైపు మనుష్యుల నీడలులేకుండా కొత్త వాతావరణంలో శ్యామలేందును పెంచి పెద్ద చెయ్యాలనుకుందామె.

తల్లి నీడన పెరిగిన మగబిడ్డ తీరు తప్పే విధానాలెక్కువని తెలుసుకుని శ్యాంను తనకు వీలైనంత దూరంగా వుంచాలని ప్రయత్నించింది అహల్య.

తల్లి ప్రభావం తనయునిపై ఎంత తక్కువగావుంటే అంత మంచిదనే నిర్ణయానికొచ్చిందామె! అందుకే శ్యాంకు మూడో అంతస్తులోని గది కేటాయించిందామె. భర్తపోయిన తర్వాత మరి మేడ మెట్లెక్కలేదామె. కాని ఎన్ని కట్టుదిట్టాలుచేసినా దూరంగా అట్టిపెట్టడం కష్టసాధ్యమైపోయిందామెకు.

రాత్రి నిద్ర మెలకువచ్చి "అమ్మా" అంటూ కిందకు దిగి వచ్చి తల్లి మంచంమీద పడి నిద్రపోయేవాడు శ్యాం! నిద్రలో చేతులూ కాళ్ళూ తల్లిమీద వేసి మరీ పడుకునేవాడు. పని మనుష్యులకిచ్చి పైకి – అతని గదిలోకి ఎత్తుకువెళ్ళి పడుకోబెట్టి రమ్మనేది.

కొన్నిసార్లు మధ్యలో మెలకువ వచ్చి గొడవచేసి కిందకు దిగి వచ్చేసేవాడు! కొన్నిసార్లు నిద్ర మగతలో తన గదిలోనే పడి నిద్రపోయేవాడు.

శ్యాంను పొలాలకు, తోటలకు పంపించాలన్న అహల్య ప్రయత్నమూ పూర్తిగా సఫలంకాలేదు.

ఎప్పుడూ తెలుగు కావ్యాలో, సంస్కృత గ్రంథాలో చదువుకుంటూ కాలంగడుపుతున్న అహల్య దగ్గరకు వచ్చి కూర్చుని –

"అమ్మా! నేను పొలం వెళ్ళనే! నేనూ నీలాగే చదువుకుంటానే " అంటూ ఏదో ఒక పుస్తకం తెచ్చి పక్కన కూర్చుంటున్న శ్యాంను కోప్పడి అవతలకు పంపాలంటే అహల్యకు మనసు వొప్పేదికాదు!

దాదాపు అరవై డెభై గదులున్న రాజగృహంలో ఎంతదూరంగా వుంచాలనుకుంటే తల్లికి అంత దగ్గర అయ్యేవాడు శ్యాం.

శ్యాంకు యుక్తవయసు వచ్చింది! వూరందరితో పాటే అహల్య కూడా అతని ప్రవర్తనను గమనించసాగింది.

మామూలుగా మీసాలమాత్ర యవ్వనంలోవున్న యువకులు అల్లంతదూరాన అందమైన ఆడపిల్ల కనపడగానే కుతూహలం నిండిన చూపుల్తో కళ్లార్పకుండా చూస్తూ వుంటారు! అందుకు విరుద్ధంగా ఆడపిల్ల ఎదురుగా వచ్చి నిలబడ్డా కన్నెత్తి చూడకుండా తలదించుకునేవాడు శ్యాం.

తల్లడిల్లిపోయింది అహల్య! చమ్కీ శాపం యింకా రాజగృహం మీద పనిచేస్తున్నదా? తరతరాల ఆనవాయితీ నుండి యింకా విముక్తి కలుగలేదా?

భయంకరమైన ఆ ప్రశ్నలకు సమాధానాలు ఏమిటో?

హైస్కూలు చదువు పూర్తయి కాలేజీలో చేరే సమయం వచ్చింది.

"అమ్మా! గుంటూరు ఏసి కాలేజీలో పియుసిలో జేరతాను" అని శ్యాం అనగానే సంతోషంగా వప్పుకుంది అహల్య.

"సిరిపల్లె వాతావరణానికి రాజగృహానికి దూరంగా వున్నందువలన శ్యాం ప్రవర్తనలో మార్పు వస్తుందేమో ?"

"కొత్త మనుష్యులు, కొత్త వాతావరణం, కొత్త ప్రదేశం చూసి శ్యాం జీవితం చిగురించి కొత్తపిందెలు వేస్తుందేమో!'

"రంగుల రామచిలకల్లాంటి, అందాల సీతాకోక చిలుకల్లాంటి ఆడపిల్లలు కాలేజీలో ఎదురవుతుంటారు? యువరక్తం పురకలువేస్తూ పొంగిపొరలుతుంటే మనసులోనూ శరీరంలోనూ రావలసిన మార్పులు వస్తాయి "



"శ్యాం కూడా అలాగే ఎవరినైనా ప్రేమించి 'అమ్మా! నేనీ అమ్మాయిని వివాహం చేసుకుంటాను? ఎలా వుంది నా సెలెక్షన్?' అంటాడేమో?!"

ఇలా వూహిస్తూ అహల్య శ్యాంను కాలేజీ చదువుకు పంపింది.

ప్రతిసారీ అతను సెలవలకని యింటికి వచ్చినప్పుడు అతని ప్రవర్తనలో ఏమైనా మార్పు వచ్చిందా అని పరిశీలించి చూస్తూండేది! ఏమీ మార్పు కనపడేది కాదు.

ఇన్నాళ్ళకు – ఇన్నేళ్ళకు – కేవలం యాదృచ్ఛికంగానయినా శ్యాం క్లాస్‌మేట్ నీల రాజగృహానికి వచ్చింది.

ఎంతోకాలంగా శ్యాంలో రావాలని కోరుకుంటున్న మార్పువచ్చింది.

"శ్యాం నీలల మధ్య ప్రణయాంకురం చిగురించి పెరిగి పెనులతగా మారి రాజగృహ ప్రాంగణమంతా అల్లుకునే శుభదినం కోసం వేయికళ్ళతో ఎదురుచూడటం మినహా నేను కోరుకునేదేమున్నది?' అనుకున్నది అహల్య.

అందుకు తన తెలివితేటలు, శక్తి, యుక్తులు ధారపోసి ప్రయత్నలోపం లేకుండా కృషి చేయాలని స్థిరసంకల్పంతో నిర్ణయించుకున్నదామె.

"శ్యామలేందులోని మచ్చపోవాలి! అతను అన్నివిధాల మామూలు యువకుడు కావాలి?" అనుకుంది అహల్య.

అదే సమయంలో అదే 'రాజగృహం'లో రెండో అంతస్తులో నిద్రపట్టక మంచంమీద అటూ యిటూపొర్లసాగింది నీల. కెలిడయాస్కోప్‌లో క్షణ క్షణం మారిపోయే దృశ్యాలలాగా నీల మనసులో రకరకాల జ్ఞాపకాలు సుడులు తిరుగసాగాయి.

"డాడీ! కారాపు!"

"ఎందుకమ్మా నీలా?" అంటూ కారాపాడు నీల తండ్రి సుదర్శన్.

డోర్ తెరచుకుని రోడ్డు వారన మూలుగుతున్న కుక్కపిల్ల వద్దకు పరుగెత్తింది నీల.

"కుయ్! కుయ్! కూ! కూ! – కూ?" చలికి వణుకుతూ, మూలుగుతూ నిరాదరణకు ఆకలి బాధకు ఓర్వలేక డస్సివున్న కుక్కపిల్ల దగ్గరకు వస్తున్న నీల కళ్ళలో కనపడుతున్న ప్రేమ, ఆదరణ, వాత్సల్యంచూసి తోకాడిస్తూ లేచి నిలబడింది లేని వోపిక తెచ్చుకుని.

కుక్కపిల్లను – బురద దుమ్ము పూసుకుని ఈగలు ముసురుకుంటున్నదని చూసుకోకుండా ఎత్తుకుని తీసుకుని వచ్చింది నీల. కారు సీటులో కూర్చోబెట్టి.

"డాడీ! మైడియర్ డాలీ! చూడు డాడీ! డాలీ చూడు! బొమ్మ కుక్కపిల్లలా ఎంత

నీల అమరావతి పిక్నిక్ ఫొటోలు తెచ్చింది.

"డాడీ! ఇతనే శ్యాం!"

"వాట్ ఎ ఛార్మింగ్ యంగ్ గై! కాని ఏదో దిగులుతో బాధపడ్తున్నట్లున్నాడు!"

"అతనెప్పుడూ అంతే డాడీ!"

"పాపం పేదరికంతో బాధలు పడుతున్నాడు కాబోలు!"

"లేదు డాడీ! వాళ్ళు చాలా ధనవంతులు!"

"ఆరోగ్యం బాగాలేదా అతనికి?"

"లేదు డాడీ! శ్యాం సంపూర్ణారోగ్యవంతుడు!"

"జీవితంలో ఎదురుదెబ్బలు తిని వుంటాడు! ఎవరైనా అమ్మాయిని ప్రేమించి ప్రేమ వ్యవహారంలో భంగపాటు చెంది వుంటాడు!"

"నో! నో! అలాంటిదేమీలేదు!"

"ఆర్ యూ ష్యూర్!"

"ఆ! అసలు అతను అమ్మాయిల వంక కన్నెత్తిచూడడు!"

"ఐసీ! ఇదేదో స్ట్రేంజ్ కేస్‌లా వున్నదే, మరి నీ వంక కూడా చూడడేమో!"

"లేదు! లేదు! ఏమో! నాకు తెలియదు!"

"ఆల్‌రైట్! ప్రొసీడాన్! విష్ యు ఆల్ ది బెస్ట్!"

"థాంక్యూ డాడీ! ఎంబాసిడర్ కారు వేసుకువెళ్తాను!"

"అలాగే! డ్రైవర్‌తో చెబుతానుండు?"

"వద్దు డాడీ! నేను డ్రైవ్ చేసుకువెళ్తా!"

"వొంటరిగానా? దారిలో ట్రబుల్ వస్తే!"

"రాదులే డాడీ! డాడీ వస్తా! బై" సుదర్శన్ మాట్లాడటానికి సందు యివ్వకుండా వచ్చేసింది నీల.

* * *

వ్యధితులూ, బాధాసర్పదష్టులూ, ఆవేదనా సంభరితులూ అయిన వారి ఎడల ప్రత్యేకంగా ఆకర్షింపబడే నీల శ్యాంఅంటే హృదయంలో క్రేజ్ పెంచుకుని కారు నడుపుకుంటూ సిరిపల్లె వచ్చేసింది.



శ్యాం తనకు దగ్గరయ్యే ప్రయత్నాలేవీ చెయ్యటంలేదు గనుక తనే అతనికి దగ్గరవుదామనుకున్నది నీల ప్లాన్.

తీరా యింతాచేసి రాజగృహంలో పాగావేసి శ్యాంకు దగ్గరవుతున్నాననుకుంటున్న సమయంలో తోటకు వెళ్తున్నప్పుడు భయంకరమైన వార్త విన్నది.

'రాజగృహంలో ఏడు తరాలుగా పెళ్ళాంతో కాపురం చేసిన మొగుడే లేడు!' అన్న వార్త విన్నప్పుడు షాక్ తిన్నది నీల!

పరస్పర వైరుధ్యంగల రెండు భయంకర వార్తలను యిముడ్చుకున్న ఆ వాక్యం విని తల్లడిల్లిపోయింది!

శ్యాం ఏదో తెలియని వ్యధతో కృంగిపోతున్నాడనీ అతన్ని ఎలాగయినా ఓదార్చి మామూలు మనుష్యులలో వేయాలనీ అనుకుందినాళ్ళా!

తను విన్నది నిజమై శ్యాం నపుంసకుడు అయితే తను చేయగలిగిందేమున్నది?

విపరీత మనో సంఘర్షణ వలన దాదాపు మతిలేని దానిలా నడచి వెళ్లింది నీల. దారిలో వాన, గాలి, కాలువలో పడడంతోటి షెడ్‌లో కస్పష్ట అనంగ రసపూరిత దృశ్యాలు శ్యాం ఆవేశంతో చుంబించడం అన్నీ చకచక జరిగిపోయాయి!

శ్యాం శక్తిహీనుడు నపుంసకుడు అయితే అంత ఆవేశంతో తనసలా ముద్దుపెట్టుకుని వుండేడు!

తను రాజగృహంలో అడుగెట్టినప్పటినుండి శ్యాంలో ఏదో మార్పువచ్చిందని గమనిస్తూనే వుంది. అదివరకటికంటే హుషారుగా, సరాకీగా, ఉల్లాసంగా ఆనందంగా కనపడుతున్నాడు.

ఎప్పుడూ లేనిది తనవంక చూస్తున్నపుడు అతని కళ్లలో కనపడే మిలమిలకు అర్థం ఏమిటి?

నపుంసకత్వం నూటికి తొంభై తొమ్మిది మందిలో కేవలం మానసిక కారణాలవ లననే ఉత్పన్నమవుతుందని నీలకు తెలుసు!

కళాపూర్ణోదయంలో సుగాత్రీ శాలీనుల కథ గుర్తొచ్చిందామెకు!

సంపన్నుల ఇంటి పిల్లను చేసుకుని మొదటిరాత్రి ఘోరంగా ఫెయిలయి కొన్నిరోజులు, నెలల తర్వాత దిగులుతో పాతబట్టలు వేసుకుని తోటలోపనిచేస్తున్న సుగాత్రి ఎడ ఆమె భర్త ఆకర్షింపబడి ఆ కథ సుఖాంతం అవడం గుర్తొచ్చింది!

శ్యాంలోనూ ఇష్టపడదే విధంగా ఏదో అనుకోనిమార్పు జరిగి పూర్ణ యవ్వనవంతుడైన యువకునిలా ప్రవర్తిస్తున్నాడేమో?

నిండా మునిగాక చలెందుకు? శ్యాంలో మార్పు వచ్చింది! నా రాకవలన అతనిలో మార్పు వచ్చిందన్న విషయం కన్నా ఆనందదాయకమైనదేముంటుంది?"

అలికిడి అయినట్లు అనిపించి లేచి కూర్చుంది నీల. హరికేన్ లాంతరు వెలుగులో శ్యాం కనపడ్డాడు. వాకిలివద్ద. తనవంకే తదేకంగా చూస్తూ బహునెమ్మదిగా నడచి వస్తున్నాడు.

విప్పారిన పద్మాల్లాంటి అతని నేత్రాలు మరింత విచ్చుకుని నిశిత దృక్కులతో తనవంకే చూస్తున్నాయి! ప్రపంచంలో అత్యంత అపురూపమైన వస్తువును చూస్తున్నట్లు వున్నాయి. అతని చూపులు! ఆపాద మస్తకం కంపించిపోతూ వున్నాడతను. విపరీతమైన ఆవేశం శరీరాన్నంతా కుదిపివేస్తున్నట్లున్నదా ప్రకంపన! మనసులో కలుగుతున్న మధురభావనలను ప్రతిబింబిస్తున్నట్లు అతని ముఖం వెలిగిపోతున్నది.

"నీలా!" ఎంతో ఆర్తిగా పిలిచాడు శ్యాం.

"శ్యాం!?" ఆశ్చర్యం ఆనందం తొట్రుపాటు నిండిన నీలగొంతు వినగానే అడుగులు ముందుకు వెయ్యసాగాడు శ్యాం!

లేచి నిలబడింది నీల. నెమ్మదిగా ట్రాన్స్‌లో వున్నవ్యక్తిలా ముందుకు అడుగులు వేయసాగింది!

"నీలా నీకోసం ఎన్నిరోజులుగా ఎదురుచూస్తున్నానో తెలుసా! నీ నామస్మరణతో నా హృదయం మార్మోగిపోతూ వున్నది ఇన్నేళ్లుగా!

నీలా! నా నీలా!"

"శ్యాం! నువ్వు! నువ్వు...."

"నేనే నీలా! నిన్ను ప్రేమిస్తూ, ఆరాధిస్తూ, పూజిస్తూ నీకు తగిన వాడిని కాననే న్యూనత కృంగదీస్తుంటే తలదించుకుపోయిన శ్యాంను!"

"శ్యాం!?" అణచుకోలేని ఆనందం నీల గొంతులో ప్రతిధ్వనించింది.

"నీలా! నా ప్రియాతి ప్రియమైన ఓ నీలా! ఎండి బీటలువారిన నా హృదయంపై పన్నీటిజల్లు వర్షించిన నీలా రా! చిత్తడి జల్లుతో తడచిన నా మనసులో మధురానందకరంగా నృత్యంచేద్దూగాని! నీకోసం ఉద్ఘోషించే నా గుండెలపై నీ చిగురాకు చేతులతో రంగవల్లులు తీర్చిదిద్దుదువుగాని— రా..."

అడుగు ముందుకు వేసింది నీల.

"కలలలో నా దరిచేరి వ్యథాసంకులిత మానసుడనైన నన్ను సేదదీర్చావిన్నాళ్లూ! బడబాగ్నిలా నా మనసును జ్వలించి దహించివేస్తున్నా ఆత్మన్యూనతాభావాన్ని



కేవలం నీ నీడలను ఆలంబనగా చేసుకుని సహించి, భరించి జీవించాను — జీవచ్ఛవంలా బతికాను!"

"కలల బందీనై నీ గురించి పగటికలలు కంటూ కన్ను తెరిస్తే ఎక్కడ కల చెదిరిపోతుందోనని కనులు మూసుకుని కాలం గడిపాను!"

"శ్యాం!"

"నిన్ను నా మనో మందిరంలో దేవతగా పూజించడానికి తప్ప వేరెందుకూ నేను అర్హుడను కాననుకుని బాధాతప్తహృదయంతో బదరి సొక్కిపోయాను!"

"నా హృదయాన్ని ఒక పుష్పంగా మార్చి నీ ముందు సమర్పిద్దామని ఆశిస్తూ వుండేవాడిని!

"పరిమళంలేని పుష్పంలా కనీసం నన్ను నేను నివేదించుకోవడానికి కూడా పనికిరానేమోనని భయపడ్డాను"

"కమనీయ రమణీయ సుందర రూపిణివి అయిన నీముందు మోకరిల్లడానికి కూడా తగననుకున్నాను"

"అల్లంత దూరాన కనపడే నీ అతిలోక లావణ్యాన్ని తిలకించి తృప్తిపడుతుండేవాడిని!"

"కాని ఓ నీలా! నీవు రాజగృహంలో అడుగిడిన క్షణంనుండి నన్ను ఆవరించుకుని వున్న చీకట్లను పటాపంచలు చేశావు. లోకంలో పరమ దురదృష్టవంతుడిని. అదృష్ట శిఖరాగ్రాన్నెక్కించావు. దుఃఖసముద్రంలో దారి తెలియక కొట్టుకులాడుతున్నవాడిని నీకేలందించి దివ్య విమానంలోకి ఎక్కించుకుని దివ్య లోకాలకు తీసుకుని వెళ్తున్నావు!"

"ఏ లోపంతో ఇన్నాళ్లూ కృంగి కృశించిపోతున్నానో ఆ లోపం పటాపంచలు చేసి నన్ను ఒక మనిషిని చేసావు.

కాగితం పువ్వును సువాసనాగంధాలను వెదజల్లే కమనీయ పుష్పంగా మార్చావు!

ఎదురుగా నిలబడి చేతులు చాచిన శ్యాం కౌగిలిలో ఒదిగిపోతున్న నీల మనసులో అప్పటివరకు వున్న అనుమానాలు నివృతమయ్యాయి. జవాబు లేదనుకున్న ప్రశ్నలు పరుగెత్తి పలాయనం చిత్తగించాయి. కళ్లాలువేసి బిగబట్టుకున్న మధుర భావనలు విశృంఖల విహారం చేయసాగాయి!

శ్యాంపై పెంచుకుంటున్న మరులు హృదయపేటికలో భద్రంగా నిక్షిప్తం చేసుకుంది ఇన్నాళ్లుగా, ఒక్కసారిగా తలుపులు తెరచుకుని వలపుల మాలికలు పైకెగసి మనసును పరిమళవంతం చేసాయి.

శ్యాంగురించి విన్న విషయం కలిగించిన అనుమానం పెనుభూతమైన మనసును

కరాళ దంష్ట్రల మధ్య నొక్కిపట్టి వుంచింది! మన్మధ బాణాల లాంటి శ్యాం ప్రియ వాక్కులు అనుమాన పిశాచాన్ని పారద్రోలాయి. మహో వ్యధ అనే అగ్నిలో ఇన్నాళ్లూ పెట్టి ఇపుడు మెరుగు బంగారంలా ధగధగ మెరసిపోతూ వున్న శ్యాంకౌగిలిలో వొదిగిపోతున్న నీలను అతి సుకుమారమైన దేవపారిజాతాన్ని కౌగలించుకున్నట్లు హత్తుకున్నాడు శ్యాం!

కలువబాలలాంటి నీల కౌగిలిలో వొదిగిన నీలను తనివితీరా చూడాలని చూపులు కిందకు సారించాడు!

నొక్కులు తిరిగిన నీల శిరోజాలపై నల్లత్రాచులా పిరుదుల క్రిందకు జారిన నీల వాల్జెడ నల్లకలువపై వాలటానికి బారులుతీర్చి వస్తున్న తుమ్మెదల సముదాయంలా కనపడింది!''

సుదీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసాలవలన ఎగసిపడుతున్న నీల వీపుమా, రెండు ఇసుక తిన్నెల మధ్య ప్రవహించే కృష్ణవేణిని గుర్తుతెస్తూ ఘననితంబముల మధ్య జరుగుతున్న వాల్జెడ కనపడింది.

''ఈ ప్రపంచంలో ఇక ఎవరూ ఏ శక్తీ నిన్ను నామండి వేరుచేయలేవు సుమా!'' అన్నట్లు అత్యంత గాఢంగా తనను హత్తుకుపోయిన నీల శరీరంలో క్షణక్షణానికి పులకలు బయల్దేరి ఆమె శరీరం చిరు ప్రకంపనలకు లోనవడి వణుకుతున్న ఆమె శరీరభాగాలు తనను స్పృశిస్తూ తన శరీరంలో కల్గుతున్న ప్రకంపనలు మధురధ్వని ప్రతిధ్వనులలా వేలి కొనగోర మీటుతూ అలౌకిక ధ్వనులనీనే వీణానాదంలా అనిపించాయి.

శ్యాంఛాతీలో హత్తుకొని పోయిన తన శిరసును కొద్దిగా పైకెత్తింది నీల! మబ్బుల చాటునుండి తొంగిచూస్తున్న చంద్రబింబంలా మనోహరంగా కనపడిందామె వదనం శ్యాంకు!

సువాసనలు వెదజల్లే శిరోజాలమధ్య కొండదారిలా తిన్నగా కనపడ్డ పాపిడి మీదుగా శ్యాం చూపులు విశాలమైన కొండ చరియలా మెరుస్తున్న నీల నుదిటిమీదకు మరలాయి. మన్మధుని జోడు విల్లులా వున్న నీల కనుబొమలు పైకి చూడడంతో శక్తికొద్దీ ఎక్కుపెట్టిన ధనుసులా అర్చీలు తిరిగినట్లుండిపోయాయి.

నల్లని నీల కనులనుండి పైకి వస్తున్న చూపులు నల్లకలువనుండి పుప్పొడి గ్రహించి వస్తున్న తుమ్మెదలబారుల్లా కనపడ్డాయి శ్యాంకు. కనుబొమల మధ్య తీరైన సంపెంగ మొగ్గలా కన్పడ్డ నాసిక — ముక్కుతిమ్మన పారిజాతాపహరణంలో తుమ్మెదలను నిరసించే నాసికను గుర్తుతెచ్చింది.

స్వల్పంగా వంగి నీల నుదుటిపైన నాసికాగ్రంపైన పదేపదే ముద్దెట్టుకోసాగాడు



శ్యాం! అతన్ని వారించడానికన్నట్లు తల కొంచెం వెనక్కు లాక్కుంది నీల.

దానిమ్మ పూవు రేకులలాటి నీల పెదాలు స్వల్పంగా విడివడి ముత్యాల సరాల్లాంటి పలువరుస కనపడింది. ఆపుకోలేని మోహావేశం ముప్పిరిగొనగా నీల పెదవులను ముద్దెట్టుకున్నాడు శ్యాం.

తుమ్మెద వ్రాలగానే విచ్చుకునే పూరేకుల్లా విచ్చుకున్నాయి నీల పెదాలు.

మకరందాన్ని పుప్పొడికోసం పూరేకులను విడదీసే తుమ్మెదలా శ్యాం నాలుక నీల పెదాలనుండి లోనికి చొచ్చుకుపోయింది.

మల్లె మొగ్గల్లాంటి పలువరుసను దాటి నీల నాలుకను స్పృశిస్తూ మరింత ముందుకు చొచ్చుకువెళ్లసాగింది శ్యాం నాలుక.

అప్రయత్నంగా నీలను మరింత గాఢంగా హత్తుకున్నాడు శ్యాం.

మనసును శరీరాన్ని కుదిపివేస్తున్న మదనావేశం తన శక్తినంతా నాలుకలోకి పంపినట్లు శ్యాం
నాలుక విపరీతమైన శక్తితో ఎగిరే భ్రమరంలా నీల నోటిలోని సర్వ భాగాలనూ స్పృశిస్తూ వుండిపోయింది.

అప్పటివరకు పురుష స్పర్శ ఎరుగని నీల తను గాఢంగా ప్రేమించి మనసులో ఆరాధిస్తున్న శ్యాం కౌగిలిలో వొరిగి కరగిపోసాగింది!

''వివాహం కాకముందు స్త్రీ పురుషునికి శరీరకంగా లొంగిపోరాదు! వివాహం కాకుండా లైంగిక క్రీడలో తనతో రమించే స్త్రీ అంటే పురుషునికి తప్పక చులకన భావం ఏర్పడుతుంది!'' అని షాలిని మేడం పదేపదే చెప్పిన మాటలు ఆక్షణాన నీల మనసుకు గుర్తురాలేదు.

తుమ్మెద వాలుతున్నకొద్దీ రేకులు మరింతగా విచ్చుకుని వికసించే పద్మంలా నీల మనసు అనంగరాగ రంజితమైపోసాగింది.

అంతర్ముఖుడై నిత్యం న్యూనతాభావంతో కువారిలిపోతూ వుండే శ్యాం శరీరం మనసూ అపూర్వమైన మదనావేశానికిలోనై కట్టుతెంచుకున్న జవనాశ్వంలా విజృంభించిపోతూ నీల శరీరాన్ని మహా మోహావేశంతో హత్తుకుని ఆపాద మస్తకం తనివితీరా స్పృశించి హద్దులుదాటి ప్రవర్తించబోతున్న తరుణంలో—

''అమ్మో! చచ్చానేవ్! బాబోయ్!'' అంటూ వాకిలిదగ్గర కేకలు వినపడ్డాయి!

పరమశివుడి కేకకు విడివడ్డ రతీ మన్మధులలా విడిపోయారు నీల శ్యాం!

హడావిడిగా వాకిలివైపుగా పరిగెత్తారిద్దరూ!

చలిజ్వరం రోగిలా వాకిలి వద్ద గజగజ వణుకుతూ కూలబడివున్నది కామమ్మ!

"చచ్చిపోయాన్రా! అయ్యయ్యయ్యో...య్!"

"ఏమిటి కామమ్మత్తయ్యా!"

"పాముగరిచింది బాబూ— ఏ దూలం మీదుందో ఏమో!"

"ఏదీ! ఎక్కడ?" హరికేన్‌లాంతరు తెస్తూ అన్నాడు.

"మెడమీద నుండి కిందకు పాకుతుంటే కుప్పగూలిపోయాను!"

"లే అత్తయ్యా! లేచి నిలబడు ఇక్కడెక్కడా పాములేదే?"

కామమ్మ భయపడుతూ వణుకుతూ లేచి నిలబడింది! అంతవరకూ ఆమె జాకెట్‌మీదపాకుతున్న బల్లి ఒక్క ఉదుటున ఎగిరి గోడమీదకు దూకింది.

"అది బల్లి అత్తా! నువ్వు పామునుకున్నావు!" అన్నాడు శ్యాం. అతని మనసులో కామమ్మమీద రగులుతున్న కోపాన్ని అతికష్టంమీద ఆపుకున్నాడు.

నీలమాత్రం కామమ్మను చూసి నవ్వాపుకోలేక విపరీతంగా నవ్వసాగింది!

అప్పటికి తన్నుతాను సంభాళించుకున్న కామమ్మ ముఖాన్ని గంటు పెట్టుకుని—

"రామాంజమ్మ మంచి నీళ్ళు పెట్టడం మర్చిపోయిందేమో కొత్తచోట నీలమ్మ యిబ్బంది పడి పోతుందని వచ్చా! చీకట్లోబల్లి మీదడితే పామనుకున్నా!" అంది. తనను చూసి నవ్వుతున్న నీలమీద మనసులో కోపం పెంచుకుంటూ కిందకు దిగి వెళ్లింది కామమ్మ.

కింద హాలులో నిలబడివున్న అహల్య—

"ఏమిటి కామమ్మా? ఏమయింది?"

"ఏమయిందా! నా శ్రార్ధం! నాబూడిదా! వొదినా! ఆ నీలమ్మను పంపించేయకపోతే శ్యాం మనకు దక్కడు!"

అహల్య మాట్లాడక పోయేసరికి మళ్లీ మొదలెట్టింది. "హవ్వ! ఆడపిల్ల వొంటరిగా మేడమీద పడుకుంటుంది అనేసరికే అనుమానం వచ్చింది నాకు. మంచినీళ్ళున్నయోలేదో చూద్దామనివెళ్ళా. ఏం జెప్పేదొదినా మన శ్యాం ఆనీలా ఒకర్నొకరు కావలించుకుని మొగుడూ పెళ్ళాలలా ఒహటే మాటలు ఒహటే ముద్దులు అయ్యో! అయ్యో"

తన మాటలు విని అహల్య తనను మెచ్చుకుంటుందనుకుంది కామమ్మ. అహల్య దగ్గర నుండి జవాబు రాకపోయేసరికి మూలుగుతూ లోపలకు వెళ్ళిపోయింది!

తన మాటలు అహల్యకు అంతులేని ఆనందాన్నిచ్చాయనీ ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోతున్నదనీ గమనించనేలేదు కామమ్మ!

* * *



విపరీతమైన లైంగికోద్రేకం తన్నావహించి విచక్షణను కోల్పోబోయే సమయంలో కామమ్మ కేకలు పెట్టిచేసిన హడావిడివలన మనసులోని ఆవేశం పాదరసం దిగిపోయినట్లు దిగిపోయింది అని గమనించిన శ్యాం ఒకందుకు సంతోషించాడు!

తనలో ఏ లోపంలేదు. నీల తను ప్రేమించే నీలకు తను అంటే యిష్టం నీలను ప్రేమించి వివాహం చేసుకోవటానికి ఏ అడ్డంకీలేదు!

"నీలా!" ఎపాలజిటిక్‌గా పిలిచాడు శ్యాం.

"శ్యాం! కామమ్మ రావటం మంచిదయింది! లేకపోతే!?"

"లేకపోతే?!"

"లేకపోతే!?...."' సిగ్గుతో తలదించుకుంది నీల. తలవంచుకుని నిలబడిపోయిన నీలను కొద్దిసేపు చూసి—

"సరే! వస్తాను నీలా! గుడ్‌నైట్!" అంటూ వెళ్లిపోయాడు శ్యాం.

"గుడ్‌నైట్!" అంటూ గది తలుపులు గడివేసింది నీల.

* * *

నిద్రపట్టక మంచంమీద అటూ యిటూ పొర్లుతూ వుండిపోయారు శ్యాం, నీల.

తెల్లవారుతుండగా నిద్రాదేవి కరుణించింది యిద్దరనూ!

"అరే! పదకొండయిందే?" అనుకుంటూలేచి కిందకు వచ్చాడు శ్యాం. మెట్లమీద తారసపడింది నీల.

రాజగృహం బయట రోడ్డుమీద కారు స్టార్టయిన శబ్దం వినపడింది! కిందకు దిగగానే అహల్య ఎదురయి.

"డ్రాక్టరు డ్రైవరు వచ్చాడు! అతనికి చిన్నకారు నడపటం కొద్దిపాటి మెకానిజం వచ్చన్నాడు! నీల కారు విషయం చూడమన్నాను! ఏదో ప్లగ్‌వూడి వున్నది కాస్త సరిచేసానన్నాడు!" అంది.

"కారు బాగయింది! ఇక నేను వెళ్తాను!" అంది నీల.

"కాఫీ టిఫిన్ రెడీగా వుంది! రండి అంది అహల్య" ఫలహారం కాగానే "ఇక వెళ్ళొస్తానండీ!" అంది నీల.

వెలా తెలాపోయిన ముఖంతో నిలబడ్డ శ్యాం వంక చూస్తూ" శ్యాం! ఈ కారు మళ్ళీ ఎక్కడాగిపోతుందో ఏమో ! నీలకు తోడుగా నువ్వు వెళ్ళు!" అన్నదాకా అతని ముఖంలో వెలుగురాలేదు!

అరగంటలోనే ప్రయాణమై వెళ్ళిపోయారు నీలా శ్యాంలు! రాత్రి తమ అంత చెప్పినా అహల్య శ్యాంను నీలకు తోడుగా ఎందుకు పంపిందీ బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు కామమ్మకు.

* * *

బాలయ్య వంటపని పూర్తి చేసి పదార్థాలన్నీ టేబిల్ మీద సర్ది ప్రియను భోజనానికి రమ్మని పిలవటానికి గదిలోకి వెళ్ళేసరికి ఆ అమ్మాయి తల దువ్వుకుని రెడీగా వుంది.

"భోజనానికి రండి!" అని పిలిచిన బాలయ్యతో "నేనిక మాయింటికి వెళతాను!"అంది.

"అప్పుడేనా? అయినా ముందు భోంచేదుర్దురుగాని రండి!" అంటూ "మారి బాబూ! మారి బాబూ!" అని కేకలువేసి పిలిచాడు బాలయ్య.

"ఏమిటి? ఏమయింది?" అంటూ వచ్చాడు మారి.

"అమ్మాయిగారెళ్ళిపోతారండి!"

నిజమేనా అన్నట్లు ప్రియవంక చూసాడు మారి. అవునన్నట్లు తలూపింది ప్రియ!

"ప్రియా! మీకింకా నీరసంగా వుంది! అప్పుడే వెళ్ళకపోతేనేం?" ఆతురతగా అడిగాడు మారి.

"నాకేం? బాగానే ఉన్నాను! ఇక వెళ్ళాలి! పనివుంది!"

"ఎళ్తే ఎల్దురుగాని ముందు భోంచేయండి!" అంటూ తొందరచేసాడు బాలయ్య.

భోంచేసి బయల్దేరిన ప్రియతో "ఉండండి నేనూ వస్తాను మీవెంట!" అంటూ బయల్దేరాడు మారి.

ఇద్దరూ బస్టాండు దగ్గరకు వెళ్ళేసరికి బస్సు వెళ్ళిపోయింది!

"బస్‌లేదు! వెళ్దాంరండి!" అని మారి అంటూండగానే ప్రియ చేయెత్తి రోడ్డున వెళ్తున్న ఎంబాసిడర్ కారును ఆగమని సైగజేసింది.

క్రీక్‌మని శబ్దం చేస్తూ కారాగింది.

"నీలా!?"

"ప్రియా?!

"శ్యాం!"

"మారీ!"

కారు దిగిన నీల శ్యాంలు ప్రియ మారీలను పరస్పరం పరామర్శించుకున్నారు! నీల శ్యాం ముందు సీట్లోను మారి ప్రియలు వెనక సీట్లోను కూర్చున్నారు!

"మా యింటికి పోనీయ్ నీలా!"

"బాబోయ్! మా యింటికి వెళ్దాం! దాడి నాకోసం ఎదురు చూస్తూ వుంటారు.!"



"అట్లయితే నేను కారు దిగిపోయేదా?" సందేహంగా అడిగాడు మారి.

"ఒరేయ్! నువ్వుండాలి! మధ్యలో కారాగితే తొయ్యటానికి నాకుతోడుగా!" అన్నాడు శ్యాం కొంటెగా.

"ఏం ఎగతాళిచెయ్యక్కర్లా!" అంది బుంగమూతి పెడుతూ నీల.

"అట్లయితే దిగిపోతా! కారాపు!" అన్నాడు శ్యాం.

"అలాగే దిగు! కారాపినప్పుడు!" అంటూ స్పీడ్ హెచ్చించింది నీల.

"మీ యిద్దరి తగువులో కారు స్పీడే పెరిగిపోతుంది! స్లో చెయ్యవే తల్లీ!" అంది ప్రియ.

నీల శ్యాంలు అలా ఒకరితో ఒకరు సన్నిహితంగా జోక్స్ వేసుకుంటూ ఉండటం ప్రియకు చూడముచ్చటగా వుంది!

టర్నింగ్ గిర్రున తిరిగినప్పుడు ప్రియ వెళ్లి మారిమీద పడింది.

"సారీ! అయామ్ సోసారీ!" అంది ప్రియ ఎపాలజిటిక్‌గా.

"ద ప్లెషర్ ఇజ్ మైన్!" అన్నాడు మారి కొంటెగా! వాళ్ళమాటలు వింటున్న శ్యాం నవ్వుకున్నాడు తనలోతనే!

కారు స్లోచేస్తూ "భూమి గుండ్రంగా వుంటుందని ఇన్నేళ్ళు వున్న గుంటూరులో నుంచే మళ్ళీ వెళ్తున్నాము!" అంది నీల.

"ఎక్కడకు తీసుకువెళ్తున్నావే తల్లీ?! అంది ప్రియ.

"తాతయ్యగారింటికి!"

"బలే! బలే! ఎంచక్కా రోజూ బూరెలు తినొచ్చు!" అంది ప్రియ. ఫక్కున నవ్వారందరూ!

"ఇక్కడకు ఎనిమిదిమైళ్ళ దూరంలో తాతయ్యగారి వూరు చేబ్రోలు వున్నది! పరీక్షలవగానే రాకపోతే తాతయ్య కోపడతాడు!" అంది నీల.

"అవునవును! పోయిన శెలవలప్పుడు వాళ్ళింటికి ఆలస్యంగా వెళ్ళామని మొట్టికాయలేసాడు!" అంది ప్రియ తల తడుముకుంటూ కాసేపాగి.

"నీలకు జబ్బు చేసినప్పుడు వాళ్ళకు కబురు చేయలేదని తాతయ్య తాతమ్మ తర్వాత వచ్చినప్పుడు ఎంతో బాధపడ్డారు! పెద్ద వయసులో వాళ్ళను బాధపెట్టడం ఎందుకని నీల కబురు చెయ్యవద్దందప్పుడు! వాళ్ళనాన్నగారు ఏదో బిజినెస్ టూర్‌మీద యూరప్ వెళ్లారా సమయంలో! ఎవ్వరూ లేరని భయపడ్డాంగాని శ్యాం, షాలిని మేడం అన్ని విషయాలూ చక్కగా చూసుకున్నారు.

"తాత తాతమ్మ వుంటే వాళ్ళకు కబురు చెయ్యకపోతే వూరుకుంటారా మరి?"

అన్నాడు మారి.

"ఆయన నీల తాతకాదు!"

"మరి?"

"నీల డాడీ తాత!"

"బాప్‌రే!" అన్నాడు శ్యాం.

కారును తెరిచి వున్న గేటునుండి పెద్ద ఆవరణలోనికి పోనిచ్చింది నీల! పెద్ద మండువా లోగిలి ముందు ఆగింది కారు!

"అదుగో తాతయ్య! తాతయ్యా!" చిన్నపిల్లలా సంతోషంతో అరుస్తూ పరుగెత్తింది నీల. వెంబడే తనూ పరుగెత్తింది ప్రియ.

"నీలా!" అంటూ లేచి నిలబడి నీలను అక్కునజేర్చుకుంటూ "ఏమేవ్! ఒసేవ్! —ఎక్కడే! రా! అమ్మాయొచ్చింది!" అంటూ కేకలెట్టాడు నీల తాత!

"తాతయ్యా"!! అంటూ దగ్గరకు వెళ్లిన ప్రియ తలను ప్రేమగా నిమురు" ఎన్నాళ్లికొచ్చావమ్మా!" అన్నాడు.

"ఎవరూ వచ్చింది?" అంటూ నుదిటిమీద చెయ్యి అడ్డంగా పెట్టుకుని చూస్తూ వచ్చింది లోపలనుండి నీల తాతమ్మ.

వరండాలో శ్యాం, మారిలను చూచి తలుపువాటుకు వెళుతూ "రామ్మా నీలా! రా! రామ్మా ప్రియా!" అంది!

"ఏమిటే ఎవరన్నా వచ్చారా మీ వెంట? ఎందుకు మీ తాతమ్మ లోపలకు వెళ్లింది మళ్లీ?" అన్నాడు తాతయ్య.

అప్పుడు నీల "తాతయ్యా! ఇదుగో ఈయన శ్యాం అని మా క్లాస్‌మేట్! ఈయన మారి ఈయనా మా క్లాస్‌మేటే!" అంటూ శ్యాం, మారిలను వచ్చి తాతముందు నిల్చోమన్నట్లు సైగాచేసింది.

"నమస్కారమండీ," తాతముందు నిలబడ్డాడు శ్యాం.

"దీర్ఘాయుష్మాన్‌భవా! నువ్వేనా బాబూ మా నీలను ప్రమాదంనుండి కాపాడింది!" అన్నాడు తాతయ్య.

శ్యాం తటపటాయిస్తుంటే "అవును తాతయ్యా!"అంటూ బదులు చెప్పింది ప్రియ.

"ఈయన మారి నా స్నేహితుడు! మేమంతా క్లాస్‌మేట్సు!" అంటూ మారిని పరిచయం చేసాడు శ్యాం.

"నాకు చూపులేదు! మా యింటిదానికి వినపడదు!" అన్నాడు తాతయ్య, శ్యాం



మారిల మనసుల్లోని అనుమానాన్ని నివృత్తిచేస్తూ.

"మీరంతా మాయింటికి వచ్చినందుకు సంతోషం బాబూ!" అన్నాడు తాతయ్య.

నీల, ప్రియ తాతమ్మవెంట లోపలకు వెళ్లిపోయారు.

"కూర్చోండి బాబూ! అక్కడ మంచం వుంటుంది. వాల్చుకుని కూర్చోండి" అన్నాడాయన.

మంచం వాల్చుకుని కూర్చున్నారు!

"మా వంశంలో పోయినవాళ్ళుపోగా మిగిలింది మునిమనుమరాలు నీల! ఎప్పుడో ఏడాదికోసారి గాని రాదామె! రాకరాక వచ్చింది! మీరిద్దరూ ఆమెతోపాటు చదువుకున్నారు. కాటికి కాళ్ళు చాచుకున్న మాకు వృద్ధాప్యంలో మనుమరాలిరాక కంటే ఆనందం కల్గించే విషయాలేముంటాయి?"

మారి శ్యాం ముఖముఖాలు చూచుకుని నవ్వుకున్నారు.

"నవ్వుతున్నారా బాబూ! అమ్మాయి మీరూ అంతా పదిరోజులుపాటన్నా మా యింట్లో వుండాలి." అన్నాడు తాతయ్య

వెండిగ్లాసుల్లో కాఫీ పట్టుకు వచ్చింది నీల.

"చూడు నీలా! మీ తాతగార్లు మిమ్మల్ని యిక్కడే పదిరోజులు వుండమంటున్నారు!" అన్నాడు శ్యాం.

"వుండండి! చక్కగా సరదాగా కాలంగడపవచ్చు"

"బాబోయ్! నీల వాళ్లింటి దగ్గరకు వెళ్ళిందాకా తోడుగా వుందామని కారెక్కాను! కట్టుబట్టలతో కారెక్కిన వాడిని యిక్కడెలా వుండేది?"

"అదేంటయ్యా శ్యాం? నావి వయసులో వున్నప్పటివి పట్టుపంచలు, లాల్చీలు పెట్టెలనిండి వున్నాయి! నువ్వు నీ స్నేహితుడూ ఎన్నాళ్ళున్నా ఆ విషయమై దిగులు లేదు!" అంటూ ఆ శతవృద్ధు వరండాలో నుండి నెమ్మదిగా లోపలకు వెళ్లి

లోపల ఒక వరుసగా వున్న అనేక చిన్నగదులలో ఒక గదిలోకి వెళ్ళి ఒక కావిడిపెట్టె తాళం బొడ్లో వున్న తాళం చెవితో తీసి కలరా వుండల వాసన కొడుతున్న పట్టుపంచెల మడతలు చలువ చేసిన లాల్చీలు తీసి నీలకు ఇస్తూ.

"అమ్మాయి నీలా! నీ స్నేహితులు ఇక్కడ ఎన్నిరోజులున్నా సరిపోయేన్ని పట్టు పంచెలు లాల్చీలు వున్నాయి!" అన్నాడు.

శతవృద్ధు, చూపులేదు అయినా ఆలోటువుందని ఇతరులు తెలుసుకోలేనంతగా ప్రవర్తిస్తున్న తాతయ్యను ఆశ్చర్యంగా చూస్తూ నీల ఇచ్చిన పంచెలు లాల్చీలు తీసుకున్నాడు శ్యాం!

మట్టూతా గదులుగదులుగా వున్న ఆ మండువా లోగిలి లోపల భాగం పరీక్షగా చూస్తున్న శ్యాంతో నీల.

"ఈ ఇల్లు తాతయ్య పూర్వీకులది! అనేకమంది సంతానంతో కళకళలాడుతుండేదట! తాతయ్య హయాం వచ్చేసరికి ఆయన ఒక్కడైపోయాడు అప్పట్నుంచీ ఒక్కొక్క సంతానమే. పైగా మా నాన్న వ్యాపారం కోసం విజయవాడ వెళ్ళిపోవడంతో తాతయ్య తాతమ్మ ఇక్కడే ఒంటరిగా మిగిలిపోయారు!"

"వృద్ధాప్యంలో చూపులేకుండా ఆయన వినికిడి శక్తి తగ్గి ఆమె ఎలా వుంటు న్నారో?"

"తాతయ్యకు ఇంట్లో ఏ మూల ఏముందీ అంతా తెలుసు! తాతమ్మకు వినపడని విషయాలుతాతయ్య సైగచేసి తెలియచేస్తుంటాడు! తాతయ్య చూడలేని విషయాల గూర్చి తాతమ్మ ఆయనకు చెబుతుంటుంది!"

"వాట్ ఎ స్ట్రేంజ్ కాంబినేషన్! తాతయ్య కెన్నేళ్ళుంటాయి?"

"తొంభైపైనే ఉంటాయి! తాతమ్మ నడిగితే మాటఇరవై అంటుంది!"

"డెభ్భై ఏళ్ళుదాటిన వాళ్ళు వయసు ఎక్కువ చెబుతారంటారు.

"నీలా!" తాతమ్మ పిలవడంతో లోపలకు వెళ్ళిపోయింది నీల.

శ్యాం మాలి హాలులో పెద్దబల్ల మీద కూర్చుని వుండిపోయారు! తాతయ్య వాళ్ళకెదురుగా మంచం మీద కూర్చుని వెనుకటివి ఇప్పటివీ అనేక విషయాలు చెప్పటం మొదలెట్టాడు.

రెండు ప్లేట్లనిండా బూరెలు కజ్జికాయలూ వుంచుకుని తెచ్చింది నీల. శ్యాం మాలిల మధ్య ప్లేట్లుంచి వెళ్లిపోయింది!

"ఇవన్నీ అప్పుడే వండారా?" ఆశ్చర్యంగా అన్నాడు శ్యాం. లేదు! నేను వస్తున్నానని ముందుగానే వండి అట్టిపెట్టింది తాతమ్మ! అంటూ లోపలకు వెళ్లింది నీల మంచినీళ్ళు తేటానికి.

బూరెలు కజ్జికాయలు తినటం పూర్తయ్యేలోపల స్నానం చేయటానికి నీళ్ళుసిద్ధంగా వున్నాయంటూ వచ్చింది నీల!

ఇది సీరియల్
నవలా పథకం
మొగలీ పువ్వంటే ఆరవ భాగం

ఆంధ్రభూమి
సచిత్రవారపత్రిక
సీరియల్ నవలా పుస్తక పథకం—6

7

# మొగలీ పువ్వంటే

డాక్టర్ కొత్త రవీంద్రబాబు

జరిగిన కథ
అమరావతి పిక్నిక్‌కని వస్తారు
ఎం.ఎ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు.
శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ
ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు.
షాలిని మేడమ్ అంటే
విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి
కృష్ణ ఆవలి వడ్డుకు వెళ్ళి వస్తూన్న నీలను
పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్.
షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ
స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది.
నీలను ఎంతో ఆప్యాయంగా ఆదరణగా చూస్తుంది
శ్యాం తల్లి అహల్య
నీల కౌగిట్లో శ్యాం ఉద్రేక పూరితుడవుతాడు

# 7

ఆవిర్లు గక్కే వేడి నీటితో స్నానం చేసి పట్టుపంచలూ లాల్చీలు వేసుకుని వచ్చేసరికి భోజనం రెడీగా వుందని పిలిచింది. వడమటింటిలో వరుసగా పీటలు వాల్చి తాతయ్యకు శ్యాంకు మాలికి అన్నం వడ్డించారు!

తాతయ్య ఛలోక్తుల మధ్య భోజనం ముగించారు! ఒక గదిలో శ్యాం మాలిలు, మరోగదిలో నీల ప్రియలు పడుకున్నారు. తాతయ్య తాతమ్మ హాలులో— తాతయ్య మంచం మీద తాతమ్మ చాపమీద పడుకున్నారు. గదుల గోడలు పై వరకు వుండకపోవడంతో తాతయ్యతో తాతమ్మ చెప్పే మాటలు శ్యాం మాలిలకు నీల ప్రియలకు వినపడసాగాయి.

"అబ్బాయికేం? చక్కగా వున్నాడు? ఈడూజోడూ బాగావుంది!"

ఆ మాటలు తనను గురించి అంటున్నవేనని శ్యాంకు అర్థం అయింది— తాతయ్య ఏం బదులు చెబుతాడోనని చెవులు రిక్కించి వినసాగాడు. మళ్ళీ తాతమ్మ మాటలే వినపడ్డాయి.

"సుదర్శనాన్ని పిలిపించి త్వరగా పిల్లకు పెళ్ళిచెయ్యమని చెబుదాం!"

కంగ్రాట్యులేషన్స్ అన్నట్లు శ్యాం చేయినొక్కాడు మాలి. తాతయ్య తాతమ్మకు కనపడేలా సైగలుచేస్తున్నాడని అర్థం చేసుకున్నాడు శ్యాం.

"ఒప్పుకోక ఏం చేస్తాడు? కాటికి కాళ్ళుచాచుకుని వున్నాం ఇద్దరం! మాకు నీలపెళ్ళి చూపిస్తావా లేదా అందాం!"

కొంచెం సేపాగి మళ్ళీ తాతమ్మ మాటలు వినపడ్డాయి.

"పనిలో పని— నీల స్నేహితురాలు ప్రియ పెళ్ళి కూడా చెయ్యమని సుదర్శన్‌తో చెబుదాం! ఆ అమ్మాయి అన్న ఎక్కడో దూరదేశంలో వున్నాడు.

ప్రియనీల అక్కచెల్లెళ్ళలా వుంటున్నారు! ఆ అమ్మాయి పెళ్ళి కూడా చేయమని చెబుదాం!"

"సంబంధం చూడటమా—! ఆ రెండో అబ్బాయి లేడూ— ఆ అబ్బాయికిచ్చి చేస్తే సరి!"



ఈసారి శ్యాం మాలి చెయ్యినొక్కాడు 'కంగ్రాట్స్' అని నెమ్మదిగా చెబుతూ!

చెముడు అవడంవలన తాతమ్మ పెద్దగా మాట్లాడుతున్నది! ఆ మాటలు సందువా ఇంటిలో మారుమూలకు కూడా వినపడుతున్నాయి!

"అయ్యగారూ! అయ్యగారూ!" కేకలు వినపడ్డాయి. రెండు నిముషాలున్నాక తాతమ్మ "సుబ్బి దాని మొగుడు వచ్చారు!" అంది.

"ఇంకా వీళ్ళ తగూతీరలా?" అంటూ తాతయ్య బయటకు వెళ్ళటం వినపడింది. బయట వసారాలో కూర్చుంటూ.

"ఏమిటే సుబ్బులూ?" అన్నాడు తాతయ్య.

"తాతయ్యా! సచ్చినాడు తాగివచ్చి కొడతన్నాడు!"

"ఏరా! ఎందుకు మళ్ళీ దాంజోలికెళ్ళావు?"

"ఇంటికి రావే అని అడుగుదామని వెళ్ళా!"

"అరేయ్! దాని దగ్గరకు వెళ్ళొద్దని చెప్పలా నీకు!"

"తాళిగట్టిన పెళ్లాం! నా దగ్గర లేకపోతే మావాళ్ళు తలోకమాట అంటున్నారండీ!"

"తాళిగడితే మాత్రం ఎల్లకాలం అది నీ దగ్గర ఎలా పడివుంటుందిరా? మగతనం లేనాడ్ని వదిలి మారుమనువాడడం మీలో ఆనవాయితీగా వస్తుంది!

దాని తండ్రి నాల్రోజుల్లో దానికి మారుమనువు చూస్తున్నాడు కూడా!"

"అధేం లేదండీ! ఈసారి రమ్మనండి! దాన్ని ఏలుకుంటాను!"

"వట్టిదేనండీ! తాగొచ్చి తంతాడు కొడతాడు అంతే! అంతకంటే ఆడికి చేతయిందేమీలేదు.

ఆడింటికి నేనెల్లనండి!"

"అరేయ్! మీ పెళ్ళయి రెండేళ్ళయింది! ఇంతమట్టుకు నువ్వు సుబ్బులుకు మొగుడుగా ఒక్కరాత్రీ వుండలేకపోయ్యావు! నీ జీవితం వ్యర్థమైంది! దాన్నయినా మారుమనువాడి పిల్లాపాపలతో సుఖంగా వుండనీయ్!"

"అదట్టా అర్ధాంతరంగా ఎల్లిపోతే నాకు పిల్లనెవరిత్తారండీ!"

"అరేయ్! ఈ వూళ్ళో నీ సంగతి తెలియనివాళ్ళెవరున్నారా! నీకింకా మళ్ళీ పెళ్ళి చేసుకోవాలన్న కోరిక తీరలేదన్నమాట!"

"అట్టా ఆడినోట గడ్డిబెట్టు తాతయ్యా!" సుబ్బులు దాని భర్తా ఒకర్నొకరు కాసేపు తిట్టుకున్నారు తర్వాత తాతయ్యగొంతు వినపడింది.

"అరేయ్! చెబుతున్నా విను! నువ్వింక దాని దగ్గరకు వెళ్ళటానికి వీల్లేదు!"

ఆ తర్వాత ఇక మాటలు వినపడలేదు! శ్యాం మాలి ఎవరి మంచాలమీద వాళ్ళు పడుకుండిపోయారు! సుబ్బులు విషయంలో తాతయ్య తీర్పు విన్నాక వాళ్ళిద్దరికీ నిద్ర పట్టలేదోపట్టాన!

తెల్లవారుజామున కోళ్ళుకూస్తున్నప్పుడు మగత నిద్రలోకి పోయారు వాళ్ళిద్దరూ

* * *

రాజగృహం దేదీప్యమానంగా వెలిగిపోతున్నది! శ్యాం మనసు ఆనందడోలికలలో వూగులాడుతున్నది. నీలకొత్త పెళ్ళికూతురై రాజగృహం వచ్చిందీరోజే! రెండో అంతస్తులోని పడకగదిని అలంకరించారు!

మనసులో ఎగసిపడుతున్న కోర్కెలను బలవంతాన అదమిపట్టుకుని ఎలాగో పూలపాన్పుపై కూర్చుని నీల రాక కోసం ఎదురుచూస్తున్నాడు శ్యాం!

ఆ ఎదురుచూపులో వుండే ఆనందం సంగతి ఏమోగాని అతనికి ఒకోక్షణం ఒక యుగంకన్నా ఎక్కువగా అనిపించసాగింది!

వివాహం అయ్యాక చక్కగా హనీమూన్‌కు ఏ కాశ్మీరో, బృందావన్ గార్డెన్స్‌కో వెళ్ళక ఈ పాత పద్ధతి ఏమిటి అని విసుగొచ్చింది. అమ్మ నీల తాతమ్మకలిసి ఈ ఏర్పాటు చేసారు!

తలుపు దగ్గర చప్పుడైంది! నీల! సర్వాలంకార భూషితయై ధవళ వస్త్రధారిణియై లోన కడుగెట్టింది!

తలఎత్తి చూడసాగాడు శ్యాం.

అదేమిటి? అమ్మ నగలు – అమ్మ పెళ్ళి ఫోటోలో పెట్టుకున్న నగలు. అమ్మకట్టుకునే తెల్లచీరె?!

నీల ఎదురుగా వచ్చి నిలబడి "శ్యాం" అంది ప్రేమగా! నీల తల ఎత్తింది.

అమ్మ! ఎదురుగా వుంది అమ్మ!

"నో! నో!" బిగ్గరగా అరచి గదిలోనుండి పారిపోయాడు శ్యాం!

అతని మనసులో కాగడావేసి వెదికినా లైంగికావేశం ఛాయలు కనపడవు ఆ క్షణాన!

* * *



మాలి మనసు వెలిగే చిచ్చుబుడ్డిలా జిగేలుమంటున్నది. శ్యాం నీలల వివాహంతోపాటు ప్రియతో తన వివాహం అయింది. సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్‌క్లాస్ కూపే రిజర్వ్ చేయించుకుని హనీమూన్ యాత్రకు బయలుదేరాడు మాలి ప్రియతో.

ఎన్నో సంవత్సరాల క్రితం జరిగిన భయంకరానుభవం తర్వాత యిప్పుడు ప్రియను గూర్చే ప్రియ సమాగమనం అతని మనుసును ఉత్కంఠతో నింపివేసింది!

రైలు కదిలింది! కూపే తలుపు వేసి వచ్చాడు మాలి. కిటికీ తలుపులు మూసి సిగ్గుతో కొద్దిగా తలదించుకున్న ప్రియ వద్దకు రాబోతూ లైట్లు ఆఫ్ చేయటానికి స్విచ్ వైపుగా నడువబోయాడు!

స్విచ్ ఆఫ్ చేయటానికి పైకెత్తిన తన చేయిపై మచ్చలు తెల్లగా రాగివర్ణంగా

మచ్చలు ఎన్నో ఏళ్ళుగా పీడకలగా తన్ను వెంటాడి వేధిస్తున్న లెప్రసీ అమ్మాయి ఒంటిమీద మచ్చలు లాటివి తన వంటి మీద కనపడగానే షాక్ తగిలినట్లు ఆగిపోయాడు మాలి!

"నో! నో! నా ప్రియకు లెప్రసీ రాకూడదు!" రెండు చేతులలోనూ తలదాచుకుని కుమిలిపోసాగాడు మాలి!

* * *

"శ్యాం!?"

"మాలీ?"

"లాభంలేదురా? కథ మొదటికి వచ్చింది!"

"సేమ్ కేస్ విత్ మి! తాతయ్య తాతమ్మ పెళ్లిముహూర్తాలు పెట్టిస్తామనగానే సంతోషపడ్డాం! ఇంతలో మళ్లీవెనుకటి బలహీనతలూ అనుమానాలూ దండెత్తటానికి కారణం తెలియటం లేదురా!"

"నేనూ అంతేరా! ఎంతో కష్టంమీద ప్రియను శారీరకంగా దూరంగా అట్టిపెట్టగలిగానేగాని మానసికంగా ప్రతిక్షణం ఎంతో మధురంగా వూహించుకుంటూ వుండేవాడిని అర్ధరాత్రి వరకూ! అర్ధ రాత్రి తర్వాత వచ్చిన ఆ భయంకరమైన కల తర్వాత సుబ్బులు భర్తలా నేనూ కాగితం పువ్వునై పోయాను!"

"నీలముఖం చూడలేనురా! ఆమెను పెండ్లాడి జీవితాంతం ఆమెను

దుఃఖపెట్టలేను!''

*　　*　　*

''ప్రియా!''

''ఏమిటే?''

''శ్యాం మాలి ఎక్కడ? తాతయ్యా వీళ్ళిద్దరూ ఏమయ్యారు?''

''గదిలో లేరా?''

''లేరు! ఇల్లంతా గాలించాం! ఎక్కడా కనపళ్లేదు?!''

ఆరోజే డాక్టర్ రవి కన్సల్టింగ్ రూంలో

''శ్యాం! 'ఏమిటిలా వచ్చావు?'' అని అడిగాడు డాక్టరు రవి జీవితంలో అత్యంత అమూల్యమైన వస్తువును పోగొట్టుకున్నవాడిలా దిగులుగా స్తబ్దంగా తనకెదురుగా కూర్చున్న శ్యాంను చూస్తూ.

''సార్! నేను నీలను ప్రేమిస్తున్నాను!'' తల వంచుకుని అన్నాడు శ్యాం!

''యు ఆర్ ఎ లక్కీ ఫెలో!''

''నో సర్! అయామ్ ద అన్ లక్కీఎస్ట్ ఫెలో ఇన్ ది వరల్డ్! నీల కారు చెడిపోయి మా ఇంటి దగ్గర వున్నప్పట్నించి నాలో ఎగసిపడుతూ వచ్చిన లైంగికావేశం రాత్రి వచ్చిన కలతో చప్పగా దిగజారిపోయింది!

నీలను వివాహం చేసుకోవడానికి అర్హుడను కాను అనే భావం మళ్లీ నన్ను కబళించి వేస్తున్నది!''

''కల అంటున్నావ్! నీలలో మీ అమ్మ కనపడలేదుగదా?''

''ఎగ్జాక్ట్లీ సర్!''

''శ్యాం ఇడిపస్ కాంప్లెక్స్ అని భార్యలోలేదా ప్రేయసిలో తల్లి కనపడి ఆ వ్యక్తి శక్తి వుడిగిన నపుంసకుడిగా మారిపోవడం అనేది చరిత్ర ప్రసిద్ధికెక్కిన విషయం— అయితే ఈ మధ్య సైకియాట్రిస్ట్లు కొంతమంది ఆ విషయం ఒప్పుకోవడంలేదు!

ఈ విషయం గురించి నీకు సలహా ఇవ్వాలంటే నాకు మీ కుటుంబ విషయాలు నీ బాల్యం అన్నీ వివరంగా చెప్పాలి!''

శ్యాం రాజగృహ చరిత్ర, చమ్కీ శాపం తమ వంశంగురించి వూరిలోవాళ్లు అనుకునే విషయాలు అన్నీ చెప్పాడు.

''అమ్మ నన్ను తనకు దూరంగా వుంచాలని ఎంత ప్రయత్నంచేసేదో నేనామెకు



అంత దగ్గరయ్యేవాడిని. మూడో అంతస్తు గదిలో నేనుకింద అంతస్తులో ఆమె వున్నా ఏదో ఒక వంకన ఆమెకు దగ్గరయ్యేవాడిని!''

''ఉ! ఇడిపస్ కాంప్లెక్స్‌కు తోడు చమ్కీ శాపం అనే ఫిక్సేషన్‌కూడా నీమీద నీ పూర్వీకులమీద పనిచేసి వుంటుంది! శ్యాం! రాజగృహంలో ఇప్పుడు రాజయ్యగారి వంశంలో ఎన్నో తరం వ్యక్తులు నివశిస్తున్నారు?''

''అమ్మ ఏడో తరానికి ప్రతినిధి! నేను ఎనిమిదోతరం!'' శ్యాం మనసులో ఆ జవాబిస్తున్నపుడు ఏదో ఆశ మెరసింది.

''సర్! చమ్కీ శాపం నామీద పనిచేయదు!'' ఉత్సాహంగా అన్నాడతను.

''శాపం అనేది ఎప్పుడూ పనిచేయదు! శాపం అనే ఫిక్సేషన్‌తో రాజగృహంలో ఏడు తరాల వ్యక్తులు బాధపడ్డారు! అదే రకం ఫిక్సేషన్‌తో నువ్వూ బాధపడుతున్నావు!''

''అంతేనంటారా?!''

''అవును శ్యాం! నీ మనసును బాధించే విషయం ఏమిటో నువ్వు గుర్తించగలిగినప్పుడు సమస్య సగం పరిష్కారం అవుతుంది!

శ్యాం! నువ్వు కొన్ని రోజులు గుంటూరులో వుండి ప్రతిరోజూ సాయంత్రం వచ్చి నన్ను కలుసుకుంటూ వుండు!''

''అలాగేసార్! మాలికూడా మీతో మాట్లాడాలంటున్నాడు!''

''పంపించు!''

మహా విపత్తు రాబోతుంటే భయంతో వణికిపోతున్న వ్యక్తిలా కూర్చున్నాడు మాలి.

''ఏమయ్యా మాలి! మొన్న అంత వుషారుగా వున్నావు! నేను మీ వూరినుండి వస్తూ ఏమనుకున్నానో తెలుసా! 'మాలి ముఖంలో ప్రపంచాన్ని జయించాను' అనుకునే విజేత ముఖంలో కనపడే గర్వం కనబడింది' అనుకున్నాను!

ఇవాళ ఏమిటిలా వున్నావు! సామ్రాజ్యాన్ని కోల్పోయిన చక్రవర్తిలా డీలా పడిపోయావు!''

నిన్నరాత్రి నాకొక కల వచ్చింది! యువ్వనోద్రేకపు పొంగులో లెప్రసీ పేషంట్‌తో రమించిన ఫలితంగా నాకు ఆ భయంకర వ్యాధి సోకినట్లు కలవచ్చింది!

నేను అత్యంత గాఢంగా ప్రేమించే ప్రియకు లెప్రసీ రోగం రావడం నాకు ఇష్టంలేదు!''

''అంతేనా? లేక కథ మొదటికి వచ్చి నీలో లైంగికవాంఛ నశించిందా?''

''ఎగ్జాక్ట్లీ! రాత్రి కల వచ్చిన దగ్గర్నుండి నాలో మార్పు వచ్చింది!''

"మారీ! నువ్వొక భయంకరమైన వూహకు బానిసవయిపోయావు!

లెప్రసీ అనేది అంటువ్యాధి అని అందరకూ తెలుసు! కాని అనేక దశాబ్దాల సన్నిహితత్వం వలన మాత్రమే అది ఒకరినుండి మరొకరికి వస్తుంది!

కేవలం ఒక రాత్రి కొద్దిగంటలు జబ్బువున్న వ్యక్తితో సన్నిహితంగా గడిపినందువలన ఆ జబ్బు ఒకరినుంచి మరొకరికి రాదు!"

"నిజంగానా సర్!"

"హండ్రెడ్ పర్సెంట్!మారీ! నువ్వు శ్యాం కొన్నాళ్లపాటు ఇక్కడే వుండండి! ప్రతి సాయంత్రం నేను ఖాళీగా వుండే సమయంలో మా ఇంటికి వస్తుండండి! మీ మనసులలో వుండే ఫిక్సేషన్స్ ఎంత అర్ధరహితమైనవో మీకు తెలిసి వచ్చేలా చేస్తాను!"

"అలాగేసార్!"

* * *

"శ్యాం! నీ మనసులో పెరిగిపోయిన న్యూనతాభావానికి గల కారణాలను విశ్లేషిద్దాం!

మొదటిది రాజగృహంలో పఠిస్తున్నది నపుంసకుల వంశం అనే న్యూనత! చమ్కీ శాపంతో మీ వంశంలోని ఏడు తరాల వ్యక్తులు నపుంసకులగా మారిపోయారన్నది నీవు ఇతరుల ద్వారా విన్న విషయం!

నపుంసకుడికి సంతానం కలుగదు! మరి మీ వంశం ఎలా నిలిచింది! వరుసగా అన్ని తరాలుగా 'వంశంలోని వాళ్లంతా నపుంసకులుగా ఎలా మారారు? ఇలాంటి సమస్యలు ఎదురైనపుడు కృతయుగంలో మనువు కొన్ని సూత్రాలుచెప్పాడు. అవి మను ధర్మశాస్త్రంలోని నియోగ ప్రకరణంలో వున్నాయి.

"దేవరాద్వాసపిండాద్వాస్త్రి యాసమ్యక్ నియుక్త యా
ప్రజేప్సితాధిగంతవ్యాసంతానస్య పరిక్షయే!"

సంతానంలేని స్త్రీ భర్త అనుమతితో మరిదివలనగాని భర్త వంశములోనివానివలనగాని సంతానము పొందవచ్చును! ఈ పద్ధతిలో పురుషునకు కామేచ్ఛగాక పుత్ర సంతానేచ్ఛ వుండాలి అన్నాడు.

అలా నియోగం వలన సంతానం పొందిన తర్వాత ఆ స్త్రీ పురుషులిద్దరూ ఎలా మెలగాలో మనువు సూచించాడు కూడాను!

విధవా యానియోగార్ధేవ్ర్తేతుయధావిధి
గురువచ్చస్నుషావచ్చ వర్తైయాతం పరస్పరం



ఈ శ్లోకంలో విధవ అంటే సంతానోత్పాదకశక్తిలేని భర్తగల స్త్రీ అనే అర్థంలో వాడాడు మనువు! నియోగం యధావిధి ఫలవంతమైన పిమ్మట స్త్రీ పురుషులు పరస్పర కామేచ్ఛను విడనాడి గౌరవ దృష్టితో చూచుకుంటూ వుండాలి! బావగారివలన మరదలు సంతానవతి యైనపుడు బావగారు మరదలిని కోడలిలాగాను మరదలు బావగారిని తండ్రి లేక మామగారిలాగాను చూచుకోవాలి అన్నాడు.

మను ధర్మశాస్త్రంలోని యోగ ప్రకరణం ప్రకారం రాజగృహం వంశం అంతరించకుండా కాపాడబడుతూ వచ్చింది!

రాజయ్య వంశీకులు ప్రజలలో నామర్దాలేకుండా వుండడానికై యుక్తవయసు వచ్చాక వివాహమాడినా భార్యను సంతానవంతులను చేసే శక్తిలోపించిన వారవడంతో తల్లీ ఒకోసారి కట్టుకున్న భార్య స్వతంత్రించి చొరవ తీసుకొని ఏర్పాటు చేసిన చేసుకున్న యోగ ప్రకరణంవలన సంతానం పొందేవారు!

అలా నియోగం వలన మీ వంశంలో వరుసగా ఏడుగురూ మగబిడ్డలు జన్మించడం కేవలం యాదృచ్ఛికం!

అయితే మానుషంగల వ్యక్తులుకనుక భార్యకు గర్భం వచ్చిందన్న విషయం తెలిసిన దగ్గర్నుండీ నరకయాతన అనుభవించి మనోవ్యాధితో తీసుకునో ఆత్మహత్య చేసుకునో మరణించేవారు రాజగృహం యజమానులు.

"సార్! చెప్పకండి! భయంకరమైన విషయాలు వింటుంటే తల తిరుగుతున్నది!"

"శ్యాం! వాస్తవాలు కల్పనకంటే చిత్రమైనవి! భారతంలో తరతరాల చరిత్ర పరిశీలిస్తే నియోగ ప్రకరణం ఆచరణలో వుండేదన్న విషయం అర్థం అవుతుంది."

"సార్! నాదొక అనుమానం! ఛమ్కీ శాపం విషయం వదిలేస్తే రాజగృహంలో ప్రతి ఒక్కరు నపుంసకులు ఎందుకయ్యారు?"

"నియోగం ద్వారా సంతానం పొంది ఆ తర్వాత భర్తను సంతానం కలిగించిన వాడిని కోల్పోయి ప్రాణాలన్నీ బిడ్డమీద కేంద్రీకరించి అపురూపంగా బిడ్డను పెంచుకునే వాళ్ల రాజగృహం గృహిణులు!

విధవలకు ఆస్తి హక్కులేకపోవడంతో పుట్టిన మగ నలుసును బయటకు కదలనీయకుండా అపు రూపంగా పెంచి పెద్దచేసేవారు!

తల్లి నీడను పెరిగిన తనయులు యుక్త వయసు వచ్చి కూడా కాగితం పూవులా వాసనలేకుండా వుండిపోయేవారు!

పెళ్లాడిన భార్యలో కూడా తల్లి కనపడేది వారికి!

అలా రాజగృహం చరిత్ర చర్విత చర్వణం అవుతుండేది!"

శ్యాం? ఏమయిందది?"

కళ్ళు తిరిగి పడిపోయిన శ్యాంను సోఫామీద పడుకోబెట్టి నీళ్ళు చిలకరించాడు డాక్టర్ రవి!

క్షణాలలో తేరుకుని లేచి

కూర్చున్నాడు.

కడుహీనస్వరంతో "సర్! చమ్కీ శాపం నిజమయింది!" అన్నాడు శ్యాం.

"లేదు" అని చెప్పబోయిన డాక్టర్ రవి మాటలు ఆయన గొంతులోనే వుండిపోయాయి!

చదువుకున్నవాడు, సదసద్వివేకం కలవాడు, సంస్కారవంతుడు అయిన శ్యాం అమాయకుడు, మూఢుడూ అయిన వాడిలా శాపం ఫలించింది అని చెపుతుంటే కాదని చెప్పడానికి నోరు రాలేదాయనకు!

"శ్యాం చమ్కీ శాపం నిజమైందని నమ్ముతున్నాడు! అతని మనసుమీద పనిచేస్తున్న ఫిక్సేషన్ ప్రభావం వలన అతను ఇంపొటెంట్‌గా వుండిపోయాడిన్నాళ్లా! ఆ శాపం నిజం కాదని ఏ శాపమూ నిజం అయే అవకాశాలు లేవని హేతు దృష్టితో వాదించి అతన్ని ఒప్పించేకంటే అతని ఫిక్సేషన్ నిజమని అనుకోనిస్తే బలీయమైన ఆ ఫిక్సేషన్ ప్రభావం వలన అతనిలోని న్యూనతాభావం తొలగిపోయే అవకాశం వుంది!" అనుకుంటూ తలూపాడు డాక్టరు రవి.

ఆకాశంలో మారుమూల చిన్న వెలుగు రేఖలా మొదలయిన తళుక్కుమని భూమిని కాంతివంతం చేసే మెరుపు లా శ్యాం ముఖాన వెలసిన చిరునవ్వుతో అతని నయనాలు కాంతివంతములైనాయి. మెరుపు తర్వాత వినపడే వురుములా వుచ్చ స్వరంతో.

"సార్! చమ్కీ శాపం నాకు వర్తించదు!" అన్నాడు శ్యాం.

అవునన్నట్లు తలూపాడు డాక్టర్ రవి.

"థాంక్యూ సర్! థాంక్యూ!" అంటూ పరుగెత్తుకు వెళ్ళిపోయాడు శ్యాం!

చీకటి పడిపోయింది! శ్యాం మనసు సంతోషంతో తబ్బిబ్బయి దిక్కుతెలియకుండా నడిచి వెళ్లిపోసాగాడు!

నిర్వేద ఛాయలుపోయిన అతని చూపులు కాంతి పుంజాలలా వున్నాయి!

మూల మలుపులో నిలబడ్డ నడివయసతను శ్యాం దగ్గరగా వచ్చి "బాబుగారూ! దారి అటుకాదు ఇటు!" అన్నాడు!

శ్యాం మనసు సంతోషంతో నిండి వుండడంతో విచక్షణా వివేకం కోల్పోయి ఆటోమేటిక్‌గా ఎవరు ఏం చెప్పినా విని అలాగే చేసేట్లు వున్నాడు.



నడి వయసు అతను ముందు దారి చూపుతుంటే వెనుక నడువసాగాడు శ్యాం!

కోడెకారు వరువంలో వున్న ధనిక యువకుడు ఆ ప్రాంతాలలో కనపడితే అలవాటు ప్రకారం 'దారి ఇటు' అన్నాడు బ్రోకర్ బాబు! మాట్లాడకుండా తన వెంట వచ్చేస్తున్న శ్యాంను చూసి "హైక్లాసు బేరం! ఇవ్వాళ నాకు మంచి కమిషన్ వస్తుంది బేరం మాట్లాడకుండా వస్తున్నాడు! డబ్బుకు కొదవలేని బంగారు పిచ్చుక కాబోలు!" అనుకున్నాడు బాబు.

మూల మలుపులోని సందులోకి తీసుకువెళ్లి పెద్ద మేడ ముందు నిలబడి "రండిసార్! రండి!" అన్నాడు. లోపలకు వెళ్లాడు శ్యాం!

పెద్ద హాలులో గోడవారగా సోఫాలు వేసి వున్నాయి! "అక్కాయ్!" గావుకేక పెట్టాడు బాబు.

లోపల్నుండి వచ్చిన సంపంగి శ్యాంను ఎగాదిగా చూసి సంతోషంతో తలూపి

"కూర్చోండి బాబుగారూ!" అంటూ సోఫా చూపించింది.

సోఫాలో కూర్చున్న శ్యాంను వేలితో సంపెంగికి చూపుతూ

"బాబుగారిని సంతోషపెట్టాలేగాని డబ్బు విషయం వెనుకా ముందూ ఆడరు!" అన్నాడు.

"ఆ విషయం నువ్వు చెప్పాలా? రాకరాక వచ్చిన బాబుగారిని చూడగానే నా జన్మ ధన్యం అయింది! రండిబాబుగారూ!" అంటూ లోపల గదిలోకి తీసుకువెళ్లింది!

"కూర్చోండి బాబూ!" అంటూ సోఫా చూపింది! శ్యాం సోఫాలో కూర్చోగానే "రోజా! రోజా బాబుగారు కూల్‌డ్రింగ్ తాగుతారేమో చూడు!" అంటూ బయటకు వెళ్లిపోయింది.

ఇరవై ఏళ్ల పడుచుపిల్ల భుజంమీదను వుండనుపో అంటూ కిందకు తొలగిపోతున్న పైట చెరగును సరిచేసుకోకుండా లోపలకు వచ్చింది.

శ్యాంసుందర రూపం క్షణం చూసి విచలిత అయింది రోజా! డబ్బు ఎరచూపి కావలసిన ఆనందాన్ని కక్కుర్తిగా అనుభవించి వెళ్లిపోయే మొరటు మనుష్యులు, అనాకారులు, వ్యసనపరులను చూడడానికి అలవాటుపడిన ఆమె కళ్లకు శ్యాప్ం మోహనాకారం బహు సుందరంగా కనపడి మనసులో వాంఛ ఎగసిపడింది.

రోజా పొట్టతిప్పలకోసం కష్టమర్ని కవ్వించి వాంఛలు రేకెత్తించి ఆనందపడిపోయినట్లు నటించే రోజా తద్విరుద్ధంగా విపరీతమైన మోహావేశం ముప్పిరిగొనగా వచ్చి శ్యాం ప్రక్కన కూర్చుని నుదుటిమీద పడుతున్న అతని ముంగురులను కొనగోరుతో సవరిస్తూ—

"ఉండింకుతేవా?" అంది.

వద్దన్నట్లు తలూపాడు శ్యాం. మగత వచ్చినట్లు అతని కనులు మూసుకుపోసాగాయి.

రోజా ఫారిన్ సెంట్ స్ప్రే చేసింది శ్యాం ముఖంపై!

పారశీక గులాబి అత్తరుపరిమళం గుబాళించి వివశుడైనాడు శ్యాం!

కోర్కెలు కళ్లేలు తెంచుకుని ఎగసి పడుతున్న రోజా ముందుకు వంగి పరిమళాలీనుతున్న శ్యామ్ పెదవులనుముద్దెట్టుకోవడానికి వుద్యుక్తురాలయింది! పాసింజర్ ను రోజా తనకు తానుగా ముద్దెట్టుకోవాలనుకోవడం అదే ప్రథమం!

శ్యాం పెదాలను ముద్దెట్టుకున్నాయి రోజా పెదాలు! రాజా నాలుక పాము నాలుకలా ముందుకు సాగి శ్యాం నోటిలోపలి భాగాలను నాజూకుగా స్పృశించసాగింది.

శ్యాం మనసులో సిరిపల్లెతోటలోను రాజగృహంలోను జరిగిన మధురమైన సంఘటనల జ్ఞాపకాలు మెదలి ఉద్రిక్తుడయి మీదకు వరిగిన రోజాను గట్టిగా హత్తుకున్నాడు!

పల్చటి జాకెట్‌నుండి పొడుచుకువస్తున్న కోర్కెలలా ఎగిసి పడుతున్న రోజా వక్షస్థలం శ్యాం గుండెలను హత్తుకుని అతనిలో కోర్కెల సెగదును ఎగదోసింది.

గతంలో నీలతో గడిపిన అందమైన అనుభవాల తీపి గుర్తుల నెమరువేతతో శ్యాం రోజాను మరింత గట్టిగా హత్తుకుపోయాడు.

అతని చేతులు రోజా ముంగురులను, మెడను, చెవులను, శిరోజాలను వీపును పదేపదే సవరించసాగాయి! శ్యాం స్పర్శతో రోజా జాకెట్ వెనుక పెట్టుకున్న ఒకటి రెండు గుండీలు హుక్స్ వూడి జాకెట్ వూడిపోయింది!

మరొకరితో మరో రోజున అయితే రోజా బెట్టుచేసి వుండేదేమోకాని ఆ రోజు ఆ నిమిషాన శ్యాంకంటే ఎక్కువ లైంగికావేశంతో వూగిపోతున్న అతనికి మరింత చేరువై అతని శరీరంలోని ఒక్కోభాగాన్ని వేలి కొనగోరులతో స్పృశిస్తూ విపరీతంగా వుద్రేకపడిపోసాగింది!

కనులుమూసుకున్న శ్యాం శరీరం విపరీతమైన లైంగికోద్రేకంతోనిండిపోయిందని గమనించిన రోజా తనలో పెచ్చుమీరుతున్న ఉద్రేకాన్ని బలవంతంగా అణచుకోసాగింది. అనుభవశాలిని అయిన రోజా చేతివేళ్లు శ్యాం వేసుకున్న శ్లాక్ గుండీలు తీశాయి. శ్లాక్ నెమ్మదిగా విడిపించి అవతల గిరవాటేసింది! అనాచ్ఛాదితంగా వున్న శ్యాం ఛాతీ రోమాలపై తల ఆనించుకుని అతని నడుముచుట్టూ బిగుసుకుని వున్న బెల్ట్‌ను వూడదీసివేసింది.

శ్యాం ఛాతీని పదేపదే ముద్దెడుతూ అదే సమయంలో అతని పాంటు హుక్స్, జిప్ తీసింది.



"నీలా! నా నీలా!"

రోజా మనసు క్షణం విచలితమైంది! పాల పొంగులా వుబుకుతున్న ఆవేశం వెనకడుగువేసింది!

కనులు తెరచి చూచిందామె! శ్యాం మోహనరూపం కనులు మూసుకుని వున్న అతని మోము కన్పడింది!

"కనులు మూసుకుని రోజా అడ్డమైన ప్రతి పుల్లయ్యకూ ఆనందాన్నిచ్చాను! ఇవాళ ఈ అందగాడు తన ప్రియురాలిపేరు జపిస్తూ కనులు మూసుకుని నన్ను అనుభవించబోతున్నాడు!" అనుకుంది. మరుక్షణం రోజా చెయ్యి పక్కన వున్న స్విచ్ నొక్కింది!

గది అంధకారంలో నిండిపోయింది. మదనుని బాణాలు గుచ్చుకుని మోహావేశంతో పిచ్చటెల్లినట్లు ప్రవర్తించసాగింది రోజా!

శ్యాంను హత్తుకుపోయి గాఢంగా చుంబిస్తూనే తనవంటిమీద వలువలను వూడ్చివేసుకుంది! శ్యాంను నెమ్మదిగా నెల్చొబెట్టి అలవాటుచొప్పున అతని పాంటు జార్చివేసింది.

డబుల్‌కాట్‌వైపుగా అడుగులు వేస్తూ శ్యాం వంటిమీద మిగిలిన కొద్దిపాటి ఆచ్ఛాదనను తడిమి చూడసాగింది!

మంచంమీద కూర్చుంటూ! రా! ఇంకా ఆలస్యం చేస్తే వోర్చుకోగల శక్తిలేదు నాలో!" అంది.

మంచంమీద కూర్చుని ఆమెను గాఢంగా హత్తుకుంటూ "నీలా! నా నీలా!" అంటున్న శ్యాం నగ్నశరీరాన్నిచూడాలనే కాంక్ష పెరిగి మంచం పక్కన వున్న స్విచ్ నొక్కింది. బెడ్‌లైట్ వెల్తురు పాల వెన్నెలలా గదివంతా పరుచుకుంటున్న క్షణంలోనే శ్యాం కనులకు కమ్మిన పొరలు కరగిపోయాయి.

"ఎవరుమీరు! అయామ్‌సారీ!" అంటూ చప్పున లేచి ఫాంటు షర్టు వేసుకున్నాడు శ్యాం!

జరిగిన విషయాలప్పుడు గుర్తొచ్చాయి తనకి ఒక్కొక్కటిగా! తనెక్కడున్నదీ అర్థం అయిన క్షణాన అతని ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది. మరుక్షణాన ఒకవిధమైన సంతృప్తితో మనసునిండిపోగా షర్ట్ జేబులో వున్న వందరూపాయల నోట్ల పొత్తిని తీసి రోజా ప్రక్కన మంచంపై వుంచుతూ—

"థాంక్యూ! థాంక్యూ సోమచ్!" అంటూ తలవంచుకుని వడివడిగా అడుగులు వేసుకుంటూ తలుపులు తెరచుకుని వెళ్లిపోయాడు శ్యాం!

జీవితంలో ఎన్నడూ లేనంత కసితో వందరూపాయల నోట్లను చించి పోగులు పెట్టింది రోజా.

తను గడుపుతున్న జీవితంమీద విపరీతమైన అసహ్యం కలిగిందామెకాక్షణాన!?

మరుసటి రోజు ఉదయం డాక్టరు రవి ఇంట్లోని డ్రాయింగ్‌రూంలోకి అడుగెడుతున్న శ్యాంను పరీక్షగా చూస్తూ "వాట్ మైడియర్ యంగ్‌మాన్ నీ వుషారు చూస్తే నీ ప్రాబ్లం కాస్తా సాల్వ్ అయిపోయినట్లుంది!"

"సార్ నేనిపుడు మామూలు మనిషిని సార్! నాలో ఏ లోపంలేదు!'

"గుడ్!"

అనుకోకుండా రాత్రి సంపంగి కంపెనీకి వెళ్లాను! అక్కడ వొక అమ్మాయితో దాదాపుగా..."

"గుడ్ ప్రోగ్రెస్! ప్రొసీడ్!"

"కాని సార్! నీలను చూడగానే అమ్మ గుర్తొచ్చి..."

"ఆ సంగతి చూస్తాను! బి చీర్‌ఫుల్ అండ్ కాన్‌ఫిడెంట్"

"థాంక్యూసర్!"

* * *

"మారీ వచ్చావా! రా? నా ఫ్రెండ్ స్కిన్ స్పెషలిస్ట్ సుధీర్‌తో పని వుంది! నా వెంటరా వెళ్దాం!"

"అలాగేసార్!" అంటూ డాక్టర్ రవి వెంట ఆయన మారుతీకారులో సుధీర్ కన్సల్టింగ్ రూంకు వెళ్లాడు.

"రా రా రవీ! కూర్చో!" అంటూ తన కన్సల్టింగ్ చైర్ ప్రక్కన చైర్స్ చూపాడు సుధీర్!

రవి, మారి కుర్చీలలో కూర్చున్నారు!

"నీతో పర్సనల్‌గా కొంచెంసేపు మాట్లాడాలి సుధీర్!"

"అలాగే అరగంటలో కన్సల్టేషన్‌కు వచ్చిన వాళ్లంతా చూపించుకువెళ్తారు! వెయిట్ చెయ్యగలవా?"

"ఓ నీకు ఇబ్బంది లేకపోతే అలాగే వెయిట్ చేస్తాను సుధీర్!"

"బయటనుండి ఒకోరోగి వచ్చి డాక్టర్ సుధీర్‌కు చూపించుకువెళ్లసాగారు.

శరీరంలోని వివిధ భాగాలపై రకరకాల మచ్చలతో బాధపడే రోగులను చూశాడారోజు మారి!

అరగంటలో దాదాపు పదిమంది రోగులను చూశాడు సుధీర్. ఆఖరి పేషంట్‌ను



చూసి బేసిన్‌లో చేతులు కడుక్కుంటున్న డాక్టర్ సుధీర్‌ను "సార్ ఇందాక మీరు చూసిన రోగులు ఏ వ్యాధితో బాధపడుతున్నారో తెలుసుకోవచ్చా?" అని అడిగాడు మారి.

"ఈరోజు లెప్రసీ పేషంట్లను చూసేరోజు!"

"సార్ నాదొక సందేహం! లెప్రసీ అంటురోగమని అంటారుగదా! మీరు అంతమంది లెప్రసీ రోగులను ముట్టుకుచూశారు! అందువలన మీకు జబ్బురాదుగదా?"

సమాధానంగా పకాలున నవ్వాడు సుధీర్!

"లెప్రసీ రోగిని అంటుకున్నంతమాత్రాన ఆ రోగం వస్తే ఈ ప్రపంచంలోని జనాభా మొత్తం లెప్రసీ రోగులై వుండాలి!" అన్నాడాయన!

డాక్టరు రవివంక తిరిగి "ఏమిటోయ్! నువ్వు వచ్చిన పని చెప్పనేలేదు!" అని అడిగాడు సుధీర్.

"వచ్చిన పని అయిపోయింది!" అంటూ మారివంక చూపాడు రవి. అతని మనసులోని ఫిక్సేషన్ గూర్చి వివరంగా రవి సుధీర్‌తో చెప్పాడప్పుడు.

"మిస్టర్ మారి! యు కెన్ బి రెస్ట్ ఎస్యూర్డ్ ఎబౌట్ ఇట్!" అంటూ మారి శరీరాన్ని క్షుణంగా పరిశీలించి "నీ వంట్లో ఎక్కడా లెప్రసీ ఛాయలులేవు!" అన్నాడు సుధీర్.

"సార్ కంటికి కనపడకుండా శరీరంలో ఏ మూలో ఆ వ్యాధి లక్షణాలువుండిపోవుగదా?"

"ఉహూ ఇన్ని సంవత్సరాలు జబ్బు బయటపడకుండా వుండే అవకాశాలు లేవు!"

మారి వీపుమీద చరుస్తూ "లేవయ్యా మారీ! ఇక వెళ్దాం పద! వచ్చిన పని అయింది!" అన్నాడు డాక్టర్ రవి.

* * *

రూముకు వచ్చిన మారి సంతోషంగా పచార్లు చేయసాగాడు. అతని మనసును కమ్ముకున్న అనుమాన పిశాచం చాలా వరకు తొలగిపోయింది!

అప్పటివరకు అణగారివున్న లైంగికావేశం క్రమంగా పెరిగి పెచ్చుమీరి శరీరాన్ని కుదిపివేయసాగింది!

"నేను ఇప్పుడు మామూలు మనిషిని! ప్రియను వివాహం చేసుకోవడానికి అనర్హుడను కాను!

కాని!?

డాక్టర్ సుధీర్ చెప్పినట్లు కాక నా శరీరం ఏ మూలనో ఏ నరాన్నో పట్టుకుని కుష్టువ్యాధి వున్నట్లయితే వివాహం అయిన తర్వాత ఆ వ్యాధి నా ద్వారా ప్రియకు వస్తుందేమో?''

చిన్న తుంపరగా మొదలైన అనుమానం పెద్దగాలివాన గా మారిపోయింది.

డాక్టర్లు మాత్రం పొరపడరా? అంటూ పదేపదే తనను తాను ప్రశ్నించుకోసాగాడు మాలి!

మాలి ఆ సాయంత్రం మళ్లీ డాక్టరు రవి ఇంటి దగ్గరకు వెళ్లాడు. మాలి ముఖంచూచి అతని మనసులోని సంఘర్షణ గురించి వూహించుకోగలిగాడు రవి.

''రావయ్యా మాలీ!'' అంటూ బయల్దేరాడు. రవి మాలి వున్న మారుతీకారు 'ఆశాకిరణం' గేటుగుండా లోపలకు దూసుకువెళ్లింది.

విశాలమైన ఆశాకిరణం ఆవరణలో కన్పిస్తున్న వ్యక్తులను చూచి మాలికళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి!?

* * *

డాక్టరు రవి, మాలి కారుదిగారు! మల్లెపువ్వుకన్న తెల్లని వస్త్రాలు ధరించిన యువకుడు వాళ్ల దగ్గరకు వచ్చా డు.

''ప్రేమ గారిని చూద్దామని వచ్చాము'' అన్నాడు డాక్టరు రవి.

''ఇలా రండి!'' అంటూ ముందుకు దారితీశాడాయువకుడు.

ఆవరణ నిండా రకరకాల పూలమొక్కలు కూరగాయల మొక్కలు బారులు తీర్చి వున్నాయి. మొక్కల మధ్య సన్నని దారులున్నాయి.

అనేకమంది లెప్రసీ పేషెంట్లు ఆ మొక్కలకు పాదులు తీస్తూ, నీళ్లుపోస్తూ కనపడ్డారు!

చిన్నచిన్న ఇళ్లు బంగాళా పెంకుటిళ్లు లైనులుగా కట్టి వున్నాయి.

''సార్! వీళ్లంతా జబ్బు తీవ్రంగా లేనటువంటి వాళ్లు లేదా కొంతవరకు నయమైనటువంటివాళ్లు!'' అన్నాడా యువకుడు.

''ఈ ఇళ్లు...?'' అని అడిగాడు డాక్టరు రవి.

''కొన్ని కుటుంబాలు వైద్యం కోసం వచ్చి వుండిపోతారు! వాళ్లు వీటిలో వుంటారు!''

''వైద్యం కోసం వచ్చేవారంతా ఈ ప్రాంతం వారేనా? వైద్యం చేయించుకోవాలంటే ఏ అలోపతీ డాక్టరయినా మందులిస్తాడు ! మరి ఇళ్లు వదిలి



వీరంతా రావలసిన అవసరం ఏమిటి?''

''మందులకంటే ముఖ్యమైన ప్రేమ ఆదరణ కోసం అలమటించి కుమిలిపోయేవారికి ఆశలు రగిలింపజేయడానికి 'ఆశాకిరణం' నెలకొల్పారు ప్రేమక్క గారు!''

పొడుగాటి బంగళా పెంకుటి షెడ్ ముందు నడువసాగారు. ''మంచాల మీద నుండి లేవలేని వారు ఈ షెడ్‌లో వుంటారు'' అన్నాడు ఆ యువకుడు.

మల్లె, నైట్‌క్వీన్ చెట్లనుండి పరిమళాన్ని నింపుకుని వస్తున్న గాలి హాలులో అక్కడక్కడా వెలుగుతున్న అగరు వత్తుల పరిమళంతో కలిసి ఆహ్లాదకరమైన సువాసన నివ్వసాగింది.

''ఆహా! ఇక్కడ ఎంత హాయిగా వుంది!'' అనుకుంటూ లోనికి అడుగెట్టాడు మాలి.

హాలులో కనపడుతున్న దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడై నిలబడి పోయాడతను!

లెప్రసీ జబ్బు మూలికల వరకు తినివేసిన రోగులు, కాలివేళ్ళు చేతివేళ్ళు పోయి మొదలు నరికిన నాగజెముడు చెట్లలా మంచాలమీద పడివున్నారు.

కళ్ళు లేనివాళ్ళు — ముక్కు వుండాల్సిన చోట గుర్తుగా కొండగుహలా చిల్లు — పెదవులు వుబ్బి భయంకరంగా కనపడేవాళ్ళు, చెవితమ్మలు చెదలు తిన్నట్లు జబ్బు తినివేయగా, వికృతంగా కనపడేవాళ్ళు, శరీరం అంతా పురుగులు తొలచివేసినట్లు కురుపులు, వ్రణాలు వున్నవాళ్ళు రకరకాల మచ్చలతో చూడటానికి అసహ్యంగా కనపడేవాళ్ళు రకరకాల వ్యక్తులు, అనేక వయసుల వాళ్ళు స్త్రీలు, పురుషులు మంచాల మీద పడి వున్నారు.

ప్రపంచంలో ఉన్న బాధ, వ్యధ, కష్టం, నిష్ఠూరం, అసహ్యం, జుగుప్స, నిరాశ, నిస్పృహ, నిర్వేదం అంతా పోగుజేసుకుని తెచ్చి హాలులో మంచాలపై వుంచారా అన్నట్లున్నది ఆ దృశ్యం!

''అదుగో! అక్కడున్నారు ప్రేమక్క''! అప్పుడు చూసారురవి మాలి ప్రేమను.

తెల్లటి ముతక ఖద్దరు చీరెను కట్టుకుని వుంది ప్రేమక్క.

వంటినిండా వ్రణాలతో వేళ్ళు వూడి. కళ్ళు వుండవలసిన చోట తొండనోర్ల లారెంజ గుంటలతో భయంకరంగా వున్న రోగికి కొసరి కొసరి అన్నం తినిపిస్తుంది ప్రేమక్క.

''అక్కా! వీరు మితో మాట్లాడాలని వచ్చారు!'' రవిని మాలిని ప్రేమక్కకు పరిచయం చేస్తూ అన్నాడా యువకుడు.

అప్రయత్నంగా చేతులెత్తి నమస్కరించారు మాలి రవి. అప్పుడు తలతిప్పి వారి వంక చూచింది ప్రేమక్క.

పరమ దయాపూరితములై, కరుణాన్వితములై మమతానురాగాలను వర్షించే ఆమె చూపులు తమమీద పడగానే ధన్యులమైనామన్నట్లు అలౌకికానందానుభూతికి లోనయ్యారు రవి మాలి.

కొంచెం సమయం ఇస్తే తమ్ముళ్ళకు చెల్లెళ్ళకు కావాల్సిన వేమిటో కనుక్కొని వస్తాను!" అంది ప్రేమక్క.

"అలాగే నక్కా!" అప్రయత్నంగా అన్నాడు రవి. పేరు పేరునా ఒకోరోగిని ఆప్యాయంగా పలకరిస్తూ శాంతగంభీరకంఠంతో స్వాంతన వచనాలు పలుకుతున్న ప్రేమక్కను "అక్కా!" "అక్కా!" అంటూ హాలులో వున్న రోగులందరూ ఎంతో ప్రేమగా అభిమానంగా సంబోధించడం చూసి.

"ఈ అభాగ్యులకు ఆశాకిరణం ప్రేమక్క!" అన్నాడు డాక్టరు రవి!

తలూపాడు మాలి. షుమారు గంటసేపున్నాక ఆఫీసు రూంలో ప్రేమకెదురుగా కూర్చున్నారు రవి, మాలి.

"డాక్టరుగారూ! బిజీగా వున్నారా! ఈమధ్య కనపడలేదు!" అంది ప్రేమ.

"ప్రతిరోజూ వద్దామనుకుని ఎప్పటికప్పుడు ఏదో హడావిడితో ఆగిపోతున్నా నక్కా! ఇవాళ నా స్నేహితుడు మాలికి మీ ఆశ్రమం చూపుదామని వచ్చాను!" అన్నాడు రవి బదులుగా.

తనవంక ఆత్రంగా — తదేకంగా చూస్తున్న మాలితో "ఏదో ప్రశ్న అడగాలనుకుంటూన్నారు గదూ?" అంది ప్రేమ.

"లెప్రసీ అంటురోగం కదా! మీరు యిందాక హాల్లో భయంకర వ్యాధిగ్రస్తులైన రోగులకు సపర్యలు చేసారు" అన్నాడు మాలి.

"ఈ ఆశ్రమం స్థాపించి నలభై సంవత్సరాలయింది! అప్పటినుండి బాధపడే అభాగ్యులకు నాచేతనైన సేవ చేస్తున్నాను!

మందులకంటే ఈ ప్రపంచంలో నన్ను నాకోసం ఆరాటపడే వ్యక్తులు వున్నారు అనుకున్నప్పుడు రోగికి వూరట కల్గుతుంది!

చీకటిలో మగ్గుతున్న తమ్ముళ్ళకు చెల్లెళ్ళకు ఆశాకిరణంలా చిరువెలుగు చూపాలన్నదే నా జీవిత ధ్యేయం!" అంది ప్రేమక్క.

ఇంతలో కొంతమంది యువతీ యువకులు వచ్చి ఆశ్రమం విషయాలు అక్కతో చర్చించసాగారు.



"అక్కా! వెళ్ళొస్తాం!" అంటూ చేతులు జోడించాడు రవి.

"మంచిది! అప్పుడప్పుడూ వస్తూండండి!" అంది ప్రేమక్క! డాక్టరు రవి ఎన్నో రోజులు నచ్చచెప్పి మాలి మనకు ధైర్యం కల్గించలేకపోయాడు. కాని 'ఆశాకిరణం' నుండి తిరిగి వస్తున్న మాలి మనసులోని అనుమానాలు చాలావరకు విచ్ఛిన్నమైపోయాయి.

** ** **

మాచర్లలో రైలు స్టేషన్ పక్కన వున్న లాడ్జిలో బసచేసారు సాంబమూర్తి!

గుంటూరులో సుమంత్ కనపడ్డ దగ్గర్నుండీ సాంబమనసులో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొచ్చి దిగులుగా వుంటున్నాడు.

జిహ్వాకింపైన ఆహార పదార్థాలను — రకరకాల మత్తుపదార్థాలను, బ్రాందీ విస్కీ సీసాలను తెచ్చి అతని మనోక్లేశాన్ని పోగొట్టాలని శత విధాలా ప్రయత్నించారు ముఠావాళ్ళు. ముఖ్యంగా అందరికంటే చిన్నవాడైన రాంజీ పదేపదే అతన్ని బతిమిలాడి ఏదో తినిపించాలనీ తాగించాలనీ చూసేవాడు.

"ఓరన్నా! నువ్వట్టుంటే నాకే జబ్బొత్తుందిరా!" అంటున్న రాంజీని కావలించుకుని బావురుమని ఏడ్చాడు సాంబ.

గుంటూరులో తనపోలికలున్న సుమన్‌ను చూచిన దగ్గర్నుండీ సాంబమనసు వికలమైపోయింది! ఆటపాట తగ్గి స్తబ్దుగా వుండి పోవడం ఎక్కువైంది.

"అన్న ఏందో గుబులుగున్నడు!"

"ఏందో జబ్బు చేసింది!"

"దవాఖానాకు తీస్కెళితే?"

"ఏడు కొండలాడికి మొక్కుంటే?" రత్నం, వెంకులు, సుందూ, శంకరి, సుబ్బు, దాసు, రాంజీ అందరూ తమలో తాము మల్లగుల్లాలు పడ్డారు.

"ఆ! యాదొచ్చె! బాణామతి పేసింద్రు!" అన్నాడు సుందూలేచినుల్చుని.

"వోరు జేసింద్రంతవని?" అంటూ చుట్టూ గుమిగూడారు మిగిలినవాళ్ళు.

"గింకెవరు? సలీంముఠాలో "శేషు" "గంతపనిజేసిండా?" ఆశ్చర్యపోయారు మిగిలినవాళ్ళు.

"ఓరయ్యా! గిప్పుడేం సేయ్యాల!"

"జపం సేయాల! పూజ సేయాల! మంత్రం ఎయ్యాల! మందు కక్కాల!"

"వూరుగాని వూరు! యాడ అయ్యన్నీ కుదుర్తయ్యా?"

"సైవలుంటే అన్నీ కుదుర్తయ్!"

"గట్టయితే జల్దీ పని మొదలెట్టు!" అంటూ తన బొడ్లో ఉన్న వోట్లపొత్తి తీసి మందుకిచ్చాడు రాంజీ. క్షణాలలో మిగిలిన వాళ్ల వోట్లుపొత్తులు తీసి సుందూకిచ్చారు.

వూరి బయట చంద్రవంక వొడ్డున రాతిముక్కకు పసుపు కుంకుమ పూసి నిమ్మకాలు దండగా కట్టివేశాడు సుందూ.

వేపమండతో విసురుతూ కళ్లు మూసుకుని వూగిపోసాగాడు.

"అంకాళమ్మ తల్లి పూనింద్రా!" అన్నాడు వెంకులు టప టప కొబ్బరికాయలు కొట్టారు.

"అరేయ్! మీర్నన్ను లెక్క సేయట్లేదురా! అందుకే మీలో వొకడిని నంజుకు తిందామనుకున్నా!"

"వద్దు వొద్దు తల్లీ! నీకేం గావాలో గోరుకో! మా వాడ్నొదిలెయ్!"

"ఆడు తప్పు జేశాడ్రా! గుంటూరులో చాతబడి తిన్నాడ్రా! ఏనుగులాటి మనిషి పీనుగయ్యాడ్రా!"

ముఖ ముఖాలు చూచుకున్నారందరూ!

"అమ్మా! అమ్మోరా! ఏం సెయ్యమంటావు సెప్పు?"

"సూత్తారేట్రా! సెంపలేసుకుని సాగోరండి!" అందరూ సందూకి మొక్కారు.

"అల్లల్లల్ల అద్దద్దద్ద!" భయంకరంగా అరుస్తూ గంతులేశాడు సుందూ.

"లేవండ్రా!"

లేచి నిలబడ్డారు అందరూ!

"రేయ్! యిరుగుడు మందిదిగో! తిన్నది కక్కించండ్రా! మామూలు మనిషవుతాడు!" మూసుకున్న సుందూ పిడికిలి తెరిచుకుంది! అరచేతిలో నల్లటి వుండ ఉన్నది.

రెండు చేతులూ దోసిలి పట్టిన వెంకులు చేతిలో విరుగుడు మందు పడవేశాడు సుందు.

వెంకులు ముందు కళ్ల కద్దుకున్నాడు.మంది అందరూ సుందూ కాళ్ల ముందు పడ్డారు.

"అల్లల్లల్లల్ల! ద్దద్దద్ద!" విరుచుకు పడిపోయాడు సుందూ.

*   *   *

పిల్లి మెడలో గంట కట్టేదెవరు? సాంబ చేతి విరుగుడు మందు తినిపించేదెలా! అసలు విషయం సాంబతో చెప్పే ధయిర్యం లేక పోయిందెవరికీ!

"బిస్కెట్ బ్రాందీ సీసాలూ, సోడాలు పట్రారా రాంజీ!" అన్నాడు సుబ్బి.



అంతా లాడ్జిలోని గదిలో చేరారు. సాంబ తలెత్తి చూశాడు.

"ఓరన్నా! ఇయ్యాల రాంజీ పుట్టిన్రోజు (జట్టులో చేరిన రోజు) అందుకని ఇందు సేత్తన్నాడాడు!" అన్నాడు రత్నం.

మంచంచుట్టూ కూర్చున్న మిగతా వాళ్లను తేరిపార చూశాడు సాంబ.

రాంజీ అంటే సాంబకు ప్రత్యేకమైన అభిమానం! బ్రాందీ గ్లాసులు అందరికీ అందించాడు రాంజీ! సాంబకు ఒక గ్లాసు ఇచ్చి తనో గ్లాసు తీసుకున్నాడు రాంజీ.

గ్లాసులన్నీ ఒకచోటుకు చేర్చి ఒకదానికొకటి అనించారు. మంచంమీద తలోమూలా కూర్చుని బ్రాందీ గ్లాసులు చేతబుచ్చుకున్నారందరూ!

సాంబ గ్లాసు కిందబెట్టి బీడీ నోట్లో వుంచుకుని అగ్గిపెట్టె కోసం తడుముకోసాగాడు.

పక్కనేవున్న రాంజీ తన గ్లాసు కిందుంచి అగ్గిపుల్ల వెలిగించి సాంబ నోట్లోని బీడీ వెలిగించాడు. బీడీ దమ్ము లాగుతూ గ్లాసు అందుకున్నాడు సాంబ.

అశ్లీలమైన పాడి చరణం అందుకున్నాడు సుందూ హుషారుగా.

మిగిలిన వాళ్లు తాళం వేయసాగారు! పాట పూర్తయ్యే లోపల బ్రాందీ తాగడం పూర్తయింది.

అంతా సాంబ వంక చూశారు. కళ్లు మూసుకుని నీరసంగా మంచంమీద పడుకున్నాడు.

సంతోషంగా తలూపాడు సుందూ! అప్పటికిగానీ విరుగుడు మందు పని ప్రారంభించలేదు.

గిలగిల తన్నుకుంటూ కింద పడ్డాడు రాంజీ.

"బాబో! అన్నాయ్! కడుపులో అగ్గిమంట. ప్రేగులు తూట్లు పడిపోతున్నది" నేలమీద దొర్లిపోసాగాడు.

"రాంజీ! ఏందిరా?" అంటూ దగ్గరకు వెళ్ళాడు సాంబ. సాంబకు రాంజీ అంటే పంచప్రాణాలు. అందరూ గుమిగూడే లోపల గుడ్లు తేలేశాడు రాంజీ.

"రాంజీ!" పెద్దగా అరిచి భోరున ఏడ్వసాగాడు సాంబ.

"రాంజీ!" అంటూ గుండెలు బాదుకుంటూ చుట్టూ గుమిగూడి పెద్దపెట్టున ఏడ్చారు మిగిలిన వాళ్లు.

లాడ్జివోనరు వచ్చి ఎంత కోప్పడినా ఏడ్పులాపలేదు వాళ్లు!

అందరికంటే చిన్నవాడు రాంజీ ఆకస్మికంగా మరణించడంతో గుండెలవిసేలా విలపించ సాగారు!

సుందూ మాత్రం షాక్‌నుంచి చప్పున తేరుకుని బయటకు పరుగెత్తాడు. అతని మనసు పాదరసం కంటే వేగంగా పయనించ సాగింది.

'ఎక్కడో పొరపాటు జరిగింది. సాంబ అడ్డు తొలగిపోతే గ్రూపులీడరు కావచ్చునన్న ఆశతో విషప్రయోగం చేశాను. ఆ! సాంబకు రాంజీ బీడీ వెలిగించినప్పుడు బ్రాందీ గ్లాసులు మారివుంటాయి!'

'ఊ!' అయిపోయిందేదో అయిపోయింది. అపాయంలో వుపాయం ఆలోచించడంలోనే తెలివి వుంది!'

తెలివి ఉన్నవాడే గ్రూప్‌లీడర్ అవుతాడు అనుకుంటూ కొత్త ప్లాన్ ఆలోచించసాగాడు సుందూ.

* * *

లాడ్జి యజమాని అదలింపులు లెక్కచెయ్యకుండా ఆ పగలంతా గగ్గోలుగా ఏడ్చారు సాంబ ముఠావాళ్లు. చీకటిపడ్డాక శవదహనానికి చురుకుగా ఏర్పాట్లు చేయసాగారువాళ్లు.

ముందుగా స్మశానానికి వెళ్లి అక్కడ ఎవరూ లేనట్లు నిర్ధారించుకు వచ్చాడు వెంకులు.

కొజ్జాల మనస్తత్వం లాగానే వాళ్ల దహన క్రియ ఎవరికీ అర్థం కాకూడదనే ఆనవాయితీవల్ల రహస్యంగా జరుపుతారు అంత్యక్రియలు.

లాడ్జిలో గోల ఒక్కసారిగా ఆగిపోయింది. రాంజీ అంతిమయాత్ర ఆరంభమైంది. గుట్టుచప్పుడు కాకుండా బయల్దేరారు స్మశానం దిశగా!

కుతూహలంతో వెంటబడ్డ కుర్రాళ్లను రాళ్ల వేస్తానని భయపెట్టి ఆపాడు సుబ్బా!

స్మశానంలో రాంజీని కట్టెలమీద పడుకోబెట్టాకగానీ కట్టలు తెంచుకున్న శోకం బహిర్గతం కాలేదు!

సాంబ పెద్దపెట్టున విలపిస్తూ నిప్పంటించాడు. రాంజీ భౌతిక శరీరం పంచభూతాలతో కలిసిపోయే దృశ్యాన్ని చూచి బోరున విలపించారు.

రాంజీ బుగ్గ బూడిదగా మారినదాకా ఆగి తెల్లవారుతుండగా ఊర్లోకి తిరిగివచ్చారు.

లాడ్జి సందులో రిక్షావాడు వాళ్లను ఆపి "మీ లీడర్ని కూనీ కేసుమీద అరెస్టు సెయ్యడానికి పోలీసోళ్లొత్తన్నారు!" అని రహస్యం చెప్పాడు.

నివ్వెరపోయిన మనుషులు తేరుకునేలోపల బజారులో దూరాన పోలీసు జీపు కనపడింది.

"పారిపోరన్నా పారిపో!!" ముఠా సభ్యులందరూ ముక్తకంఠంతో సాంబకు చెప్పారు.

మారు పలకకుండా నిలబడ్డ సాంబను బలవంతంగా ఈడ్చుకుంటూ పక్క



సందులోకి పరుగెత్తారు.

పోలీసు విజిల్స్ విన్న క్షణం ఎటువాళ్లటు కకావికలై పారిపోయారు. అప్పటికి సాంబలో స్తబ్దత వదిలింది.

ప్రహరీ గోడ దూకి తాలూకా ఆఫీసు ఆవరణ వెనుకగాపరుగెత్తి అవతల రోడ్డెక్కాడు సాంబ.

పిక్కలు నొప్పిపుట్టేలా పరుగెత్తి కదలడానికి సిద్ధంగా ఉన్న బస్సు ఎక్కాడు సాంబ.

ఐదు నిమిషాలలో బస్సు బయలుదేరింది.నాలుగుమైళ్ల అవతల బస్సు టిక్కెట్‌కు డబ్బులివ్వలేదని సాంబను దింపేశాడు కండక్టరు.

మాటిమాటికి వెనుదిరిగి చూస్తూ చేలకడ్డంపడి పరుగెత్త సాగాడు సాంబ!

సూర్యుడు నడినెత్తికి వచ్చే వరకు అలా పరుగెడుతూనే వున్నాడు సాంబ.

వళ్లంతా చెమటలు గారి, నీరసంతో కళ్లు తిరిగి పడిపోయాడు చివరకు!

"అరేయ్ ఎవరో పొలంగట్టుమీద పడిపోయారు. చూడండ్రా!" ఇంజన్ షెడ్ ముందు నిలబడివున్న దశరథరామయ్య కూలీలను కేకేశాడు.

గట్టుమీద పడిపోయిన సాంబ చుట్టూ చేరారు కూలీలు! ముఖంమీద నీళ్లు చల్లుతూ "వీడెవడో కొజ్జానాకొ..." అంటూ మధ్యలో మాటలు ఆపేశాడు మేస్త్రీ.

కిందపడి ఉన్నతనిలో దశరథరామయ్య గారి కొడుకు సుమంత్ పోలికలు కొట్టొచ్చినట్టు కనపడగానే నోట్లో మాటలు నోటిలోనే ఆగిపోయాయతనికి.

"ఎవ్రా అతనూ?" అంటూ దగ్గరకు వచ్చిన దశరథరామయ్య సాంబను చూసి...

"అరే సుమన్. అబ్బాయి ఇలా పడిపోయాడేమిటి?" అంటూ దగ్గరకు వచ్చాడు.

ఆయన సాంబ ముఖం పరిశీలనగా చూస్తుండగా "అచ్చం చినబాబు లాగున్నాడండీ!" అన్నాడు మేస్త్రీ.

ఇరవై రెండేళ్ల క్రితం తప్పిపోయిన కొడుకు గుర్తొచ్చాడు దశరథరామయ్యకు. 'కొడుకు లిద్దరిదీ ఒకటే పోలిక' అని బంధువులు అంటుండేవారని గుర్తొచ్చిందాయనకు.

"తప్పిపోయిన పెద్దబ్బాయి కాదుగదా?" మనసులో మెదుల్తున్న అనుమానం రేపిన ఆశను సాంబ రూపం కొంతవరకు మింగేసింది.

"అమ్మో! వొళ్లు మాడిపోతుంది!" అన్నాడు మేస్త్రీ. "బండిలో ఎక్కించండి. ఇంటికి తీసుకుని వెళ్దాం!" అన్నాడు దశరథరామయ్య.

సాంబను బండి ఎక్కించి ఇంటిముఖంగా బయలుదేరిన పది నిమిషాలకు పోలీసులు

వచ్చారు. సాంబ కనబడక పోవడంతో వాళ్ళ ముందుకు సాగిపొయ్యారు.

బండి ఇంటిముందు ఆగింది. కూలీలు సాంబను ఎక్కడకు తీసుకెళ్లాలో తెలియక ఆగిపోయారు.

"తీసుకు వెళ్లి హాల్లో మంచంమీద పడుకోబెట్టండి!" అని దశరథరామయ్య అనడంతో సాంబను చేతులమీద మోసుకుని వెళ్లి మంచంమీద పరుండబెట్టారు.

వంటింట్లోంచి దశరథరామయ్య భార్య సీతమ్మ వచ్చింది.దూరం నుండి సాంబను చూసి "నాయనా సుమన్! ఏమైందిరా?" అంటూ వచ్చింది.

కూలీలు ముఖాముఖాలు చూచుకూంటూ అవతలకు వెళ్లారు.

"బాబు కేమయిందండీ?" అని భర్తను అడిగింది సీతమ్మ.

"సరిగ్గా చూడు!" అన్నాడు తల దించుకుని దశరథరామయ్య. మంచంమీద పడుకున్న ఆకారాన్ని ఆపాద్ద మస్తకం పరిశీలనగా చూడసాగింది సీతమ్మ.

పాదాలమీద ఎదురుదెబ్బల వలన రక్తం చిమ్ముతున్న గాయాలు — కాళ్లమీద కాల్చి వాతలు పెట్టిన మచ్చలు, బిగుతుగా శరీరానికి అతుక్కున్న చొక్కా చిరుగుల నుండి వం టిమీద గాయాలు మానిన మచ్చలు — వాతలు — మూడు నాలుగు రోజులుగా గడ్డం చేసుకోనందు వలన బాగా మాసి చెమటలు కారుతున్న గడ్డం.

"మన బాబు ఇలా వున్నాడేమిటే!" దిగులుగా అడిగింది సీతమ్మ.

"ఎడమ చెవి వెనక పుట్టుమచ్చ చూడవే!"

"బాబూ! పెద్దబాబూ! దివాకర్!!" ఇరవై రెండు సంవత్సరాలుగా గర్భంలో దాచుకున్న శోకం, కన్నబిడ్డ కోసం ఆక్రోశించి ఆవిరైపోయిన ఆక్రందన, జీవితంలో ఇక చూడలేనేమోనన్న నిరాశ కల్గించిన నిర్వేదం, ఇన్నేళ్లుగా అణచిపెట్టిన ఆవిర్లయి పొంగిన కడుపుకోత అనుభవించి అనుభవించి మోడుబారిపోయిన సీతమ్మ జీవితంలో ఎరుగని ఆనందం ఒక్కసారి మనసును వుక్కిరిబిక్కిరి చేసింది.

ఆపుకోలేని ఆనందోద్రేకం ఉన్మాదించి శోకం ఆనంద భాష్పాలుగా రాలసాగింది.

చెమట వాసనతో కంపు కొడుతున్న సాంబ (దివాకర్) శరీరాన్ని కౌగలించుకుని ఉండిపోయింది! విపరీతమైన ఆనందం — అవధులులేని శోకం హృదయాన్ని అల్లకల్లోలం చేస్తుంటే తట్టుకోలేనట్లు పిచ్చిదానిలా ప్రవర్తిస్తున్న భార్యను చూచి కన్నులనీరు తుడుచుకుంటూ వుండిపోయాడు దశరథరామయ్య.

దివాకర్ వళ్లంతా శుభ్రంగా తుడిచి వంటిమీద పీలికలైవున్న లుంగీ షర్ట్ తీసివేసి సుమన్ షర్ట్ వేసి లుంగీ కట్టారు.



సుమన్ లుంగీ, షర్ట్ వేశాక దివాకర్‌కు కొజ్జా ఆకారం పోయి అచ్చం సుమన్‌లాగానే కనపడ్డాడు అతని తల్లిదండ్రులకు.

"దివాకర్!"

"పెదబాబూ!"

"నా వరాల తండ్రీ!"

"బాబూ!"

"దివా!"

సీతమ్మ, దశరథరామయ్య ఎన్ని రకాలుగ పిలిచినా పలకలేదతను.

కనులు మూసుకుని మగతగా పడివున్న పెద్ద కొడుకును ఏంచేయాలో పాలుపోలేదు వాళ్లిద్దరికీ.

సీతమ్మ కాఫీ తీసుకువచ్చి స్పూన్‌తో నోట్లో పోసింది. దివాకర్ గుటక వేస్తున్నాడని తెలిశాక నెమ్మదిగా కాఫీగ్లాసు ఖాళీ అయేవరకు అలానే పోసింది.

"సీతమ్మా! మీ పెద్దబ్బాయి కనపడ్డాడటగా?"

"దశయ్యా! పెద్దోడింటి కొచ్చాడంటనే!"

వూరి నలుమూలల నుండి వచ్చి పడుతున్న జనం అడుగుతున్న ప్రశ్నలకు ఏమని సమాధానం చెప్పాలో తెలియక ముఖముఖాలు చూచుకున్నారు సీతమ్మ, దశరథరామయ్యలు.

ఆ రాత్రి...

"అబ్బాయిని చూస్తే నాకేమిటో భయంగా ఉంది. ఇన్నేళ్లకు కొడుకు దొరికాడు అన్న సంతోషం లేకుండా పోయింది. కన్నెత్తి చూడడు. వళ్లు మాడిపోతూ ఉన్నది. ఈ వూళ్లో వైద్యుడిని నమ్ముకుని వుండేకంటే గుంటూరు తీసుకెళ్లి పెద్ద డాక్టరుగారి ఆసుపత్రిలో చేర్పిద్దాం!" అంది సీతమ్మ భర్తతో.

ఏమని సమాధానం చెబుతాడో అని భర్తవంక చూచింది కానీ ఆయన కనపడలేదామెకు.

ఐదు నిమిషాల్లో సవారీ బండి తెచ్చి వాకిట్లో పెట్టించాడు దశరథరామయ్య.

అర్ధరాత్రికి టాక్సీలో తీసుకెళ్లి దివాకర్‌ను డాక్టర్ రవి సుశ్రుత నర్సింగ్‌హోంలో చేర్పించారు.

"సెరిబ్రల్ మలేరియా ఉంది. రక్తంలో మలేరియల్ పారసైట్ కనబడింది" అంటూ ఇంజక్షన్లు చేయించాడు డాక్టర్ రవి.

తెల్లవారే సరికి జ్వరం తగ్గి స్నానం చేసినట్లు వళ్లంతా చెమటలు కారిపోయింది

దివాకర్‌కు.

నర్స్ జ్వరం చూసి "సబ్‌నార్మల్‌కు వుంది!" అన్నది.

"గుడ్! బట్టలుమార్పించండి. స్పృహవస్తే కాఫీ తాగించండి!" అని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు రవి.

ఉదయం రౌండ్స్‌కి వచ్చినప్పుడు అతనికి ఇంకా స్పృహ రాలేదని నర్స్ చెప్పడంతో ...

"ఈపాటికి కాన్షస్‌నెస్ రావలసిందే? ఏమయిందో?" అనుకుంటూ వెళ్లిపోయాడు.

కన్సల్టింగ్ రూమ్‌కు వచ్చిన శ్యాం మాలిలతో "మీ క్లాస్‌మేట్ సుమన్ అన్నయ్య దివాకర్‌కు జ్వరం తగిలితే రాత్రి నర్సింగ్‌హోంలో చేర్చారు" అని చెప్పాడు డాక్టర్ రవి.

"సార్! ఒకసారి అతన్ని చూడొచ్చా!" అని శ్యాం అడగ్గానే "రండి!" అంటూ వాళ్లను వెంట బెట్టుకుని దివాకర్ రూం దగ్గరకు తీసుకొని వెళ్లాడు డాక్టర్ రవి.

"రండి బాబూ రండి!" అంటూ శ్యాం మాలిలను లోపలకు ఆహ్వానించాడు దశరథరామయ్య.

కుర్చీలో కూర్చుంటూ "అరే! ఇతను మన రూంకు వచ్చిన కొజ్జా!" అన్నాడు మాలి ఆశ్చర్యంగా.

అతన్ని మాట్లాడవద్దంటూ వారించాడు డాక్టర్ రవి. కానీ అప్పటికే సీతమ్మ వెక్కి వెక్కి ఏడ్వసాగింది!

"అవును బాబూ శరవై రెండేళ్లకు కొడుకు దొరికాడని ఆనందించాలో, దొరకక దొరికిన కొడుకిట్లా అయిపోయాడని విచారించాలో తెలియడంలేదు!" అన్నాడు దశరథరామయ్య.

"అరబ్ షేక్ల గునావాలకు కాపలా కాయడానికై చిన్న చిన్న మగపిల్లలను ఎత్తుకొని వెళ్లి క్యాస్ట్రేట్ చేసి కొజ్జాలుగా మారుస్తున్నారని విన్నాను. అదృష్టవశాత్తూ మీ వాడిని విదేశాలకు పంపలేదు. అందుకే మీ బిడ్డ మీకు దక్కాడు!" అన్నాడు డాక్టర్ రవి. బదులుగా తలడ్డంగా వూపాడు దశరథరామయ్య. 'ఇదీ ఒక అదృష్టమేనా?' అన్నట్లు.

దివాకర్‌కు స్పృహవచ్చి తమ మాటలువింటున్నాడని గదిలోవున్న వాళ్లు డాక్టర్ రవితో సహా గమనించలేదు. మనసులో ములికిలా గుచ్చుకుంటున్న వ్యథతో కనులు మూసుకున్నాడు దివాకర్.

"డాక్టరుగారూ!" ఆదుర్దాగా డాక్టరు రవి కన్సల్టింగ్ రూంలో అడుగుతున్న నీలకు ఎదురుగా వెళ్ళి "ఏమయింది నీలా?" అని అడిగాడు శ్యాం!

"ఓ మీరిక్కడున్నారా? డాక్టరుగారు లేరా?"



"వున్నారు! లోపల రూముల్లో ఉన్న పేషంట్లని చూడడానికి వెళ్లారు. ఇంతకీ ఏమైంది?"

"నిన్న తాతయ్య కాలుజారి పడ్డారు. అప్పటినుండి లేవలేక పోతున్నారు. అందుకని కారులో తీసుకుని వచ్చాము."

"పదరా మాలీ! తాతయ్యను తీసుకువద్దాం!" అంటూ శ్యాంవెళ్లి కారు బాక్‌సీట్లో ఉన్న నీల తాతయ్యను ఎత్తుకుని వచ్చాడు మాలి సాయంతో.

"బాబూ! మీ ఇద్దరూ చెప్పకుండా వచ్చేశారు.నాకూ మా ఇంటిదానికీ మనసు మనసులోలేదు. పరధ్యానంగా నడుస్తూ కాలుజారి పడ్డాను. అప్పట్నుంచీ లేచి నిలబడలేక పోతున్నాను!" అన్నాడు తాతయ్య.

"శ్యాంకు సడెన్‌గా అర్ధరాత్రి కడుపునొప్పి వచ్చింది. అప్పుడు నిద్రలేపి మిమ్మల్ని హడావిడి చేయడం ఇష్టం లేక సెంటరుకు వచ్చి ఖాళీ టాక్సీ వస్తుంటే గుంటూరు వచ్చాం! డాక్టరు రవి వైద్యం చేస్తుంటే ఇప్పుడిప్పుడే గుణం కనబడుతున్నది!" అన్నాడు మాలి.

"అలాగా బాబూ! ఆ విషయం తెలియక కంగారు పడిపోయాం!" అన్నాడు తాతయ్య.

డాక్టర్ రవి కన్సల్టింగ్ రూంలోకి రాగానే తాతయ్య విషయం చెప్పింది నీల.

డాక్టర్ రవి తాతయ్యను పరీక్ష చేసి "ఎక్స్‌రే తీయాలి తాతయ్యా!" అంటూ ట్రాలీమీద ఎక్స్‌రే యూనిట్ దగ్గరకు పంపాడు.

ఎక్స్‌రే చూచి "నీలా! తాతయ్యకు కుడివైపు ఎసెటాబ్యులర్ ఫ్రాక్చర్ అయింది. మూడు వారాలు హాస్పటలులో వుండాలి. ట్రాక్షన్ పెట్టినందువలన ఫ్రాక్చర్ సెట్ అయి క్రమేపీ నడిచే వీలున్నది!" అన్నాడు డాక్టరు రవి.

"నాన్న మళ్లీ బిజినెస్ పనిమీద ఫారిన్‌టూర్ వెళ్లారు!" అంది నీల అప్రయత్నంగా.

"నీలా నేనూ మాలి నీకు తోడుగావుండి తాతయ్యకు ఏ లోటూ రాకుండా చూచుకుంటాము. మీ నాన్నగారులేరని దిగులు పడవద్దు!"

శ్యాం అలా చొరవగా మాట్లాడుతుండడం చూసి 'సరే' అన్నట్లు తలూపింది నీల.

తాతయ్యను రూంలో చేర్పించి కుడికాలుకు ట్రాక్షన్ పెట్టాడు డాక్టర్ రవి.

"హాస్పటల్‌లో చేర్పితే కోస్తారో, కాలు తీసేస్తారో అని భయపడ్డా! హాయిగా మెత్తటి పరుపుమీద పడుకోమంటారని అనుకోలేదు!" అన్నాడు తాతయ్య ఫక్కున నవ్వుతూ.

తాతయ్య నవ్వుతో శ్యాం, మాలి, నీల ప్రియ శృతి కలిపారు.

"మా యింటావిడ చెవిటి మాలోకం! ఇంటికెవరైనా వచ్చి పిలిచినా వినపడదామెకు! వంటరిగా ఏం దిగులు పడుతుందో ఏమో!"

తాతయ్య తన భార్యను గురించి అలా ఆరాట పడిపోతుంటే శ్యాం, మాలి కొంటెగా నీల ప్రియల వంక చూచారు.

"తాతమ్మను తీసుకురావడానికి మనిషిని పంపారు" అంది నీల. అప్పటికి తాతయ్య ప్రాణం కుదుటపడింది.

"శ్యాం! నువ్వు తాతయ్య దగ్గర తోడుగా వుంటే నేను, ప్రియ వెళ్ళి షాలిని మేడంగారిని కలుసుకుని వస్తాం!" అంది నీల.

"అలాగే!" అన్నట్లు తలూపాడు శ్యాం.

* * *

షాలిని మేడం కోసం కారు డ్రైవ్ చేసుకువెళ్తూ ప్రియతో అంది నీల "ప్రియా! వీళ్ళిద్దరూ తాతయ్యగారి ఇంటివద్ద నుండి చెప్పకుండా చెయ్యకుండా వచ్చిన కారణమేమిటో?"

"శ్యాంకు అర్థాంతరంగా కడుపునొప్పి వస్తే వచ్చామని చెప్పాడు మాలి!"

"నిజమేనంటావా?"

"నిజానిజాలు డాక్టర్ రవిగారు చెప్పాలి!"

"కానీ ప్రియా! వాళ్ళిద్దరూ మున్నెన్నడూ లేనంత చొరవగా వున్నారివ్వాళ!"

"అవును నీలా!"

కారు షాలిని మేడం ఇంటి ముందాగింది. కారుదిగి "ఇదేమిటి ఇంటిముందు వూడ్చిలేదు. చెత్తా చెదారాలు పేరుకొని ఉంది. మేడం వూళ్ళోలేరా ఏం?" అంటూ మూసివున్న తలుపుల దగ్గరకు వెళ్లింది ప్రియ.

"బయట తాళం వేసిలేదు. మేడం మేడం" తలుపు తడుతూ బిగ్గరగా పిలిచింది ప్రియ.

కారు దిగివచ్చిన నీలతో ఎదురింటి ప్లీడరుగారి భార్య "మూడు రోజుల్నుంచీ కనపడడం లేదమ్మా. ఏదైనా పనివుండి యూనివర్శిటీలోనే ఉండిపోయారేమో ననుకున్నాం!" అంది.

"తలుపు తాళం వెయ్యకుండా ఎందుకు వెళ్లారో మేడం" అంటూ తలుపుమీద బాదింది నీల.

ఓరగా వేసిన తలుపులు తెరుచుకున్నాయి. వరండాలో పడివున్న పాలపాకెట్లు



చూసి.

"అరే! మేడం పాలపాకెట్లు వెయ్యొద్దని కూడా చెప్పి వెళ్లలేదులాగుంది!" అనుకుంటూ ముందుకు నడిచింది నీల.

హాలు తలుపు నెట్టగానే తెరుచుకుంది. నీల ప్రియ ముఖముఖాలు చూసుకున్నారు.

ప్లీడరుగారి భార్య "అదేంటమ్మా! తలుపులు దగ్గరికివేసి వున్నాయి. లెక్చరరుగారు లోపలే వున్నారన్న మాట. మరి మూడు రోజులుగా ఇంట్లో మనిషి వున్న అలికిడి లేదు. ఏమైనా సుస్తీ చేసిందేమో?" అంటుండగానే భయంతో బిగ్గరగా "మేడం" అని అరుస్తూ నీల, ప్రియ లోపలకు పరుగెత్తారు.

హాలుదాటి పక్కనున్న బెడ్‌రూం వైపుగా పరుగెత్తిన నారీద్వయం వాకిట్లోనే ఆగిపోయి గుండెలవిసేలా ఒక్కసారి "మేడం!" అని అరిచారు.

గదిలో మంచంమీద నిశ్చలంగా పడివున్నది షాలిని. పైన సీలింగ్‌ఫాన్ తిరుగుతున్నా షాలిని వంటిమీద ఈగలు దోమలు జుమ్మంటూ మూగుతున్నాయి.

మూసుకునివున్న కనులమీద ముక్కు రంధ్రాలమీద కొద్దిగా తెరుచుకున్న నోటిమీద ఈగలు దోమలూ వాలివున్నాయి.

"మేడం!" అంటూ బావురుమని ఏడ్చింది ప్రియ. నీల తెప్పరిల్లుకుని ప్లీడరు గారింటికి పరిగెత్తి డాక్టర్ రవికి ఫోన్ చేసింది.

అయిదు నిమిషాలలో డాక్టరు రవి మారుతీకారు వచ్చి వాకిటిముందు ఆగింది.

డాక్టర్ రవి, శ్యాం కారుదిగి లోపలకువచ్చారు.

"డాక్టరుగారూ! మేడంకు జబ్బు చేసింది. ఆసుపత్రికి తీసుకువస్తాం" అంది ప్రియ.

షాలిని మంచం దగ్గరకు నడిచిన రవి మంచానికి అడుగు దూరంలోనే ఆగిపోయాడు.

"మేడం కేమయింది డాక్టరుగారూ!"

"ప్రమాదమేమీ లేదు గదా?" కంగారుగా ప్రశ్నిస్తున్న నీల, ప్రియల వంక జాలిగా చూస్తూ ముందుకు నడిచాడు రవి.

మంచం ప్రక్కన బల్లమీద ఖాళీ డైజపామ్ బిళ్లల రేపర్‌ల మధ్యవున్న ఉత్తరం తీసుకుని చదువుతూ బయటకునడిచాడు రవి.

"సార్! మేడంను ఆసుపత్రికి తీసుకువెళ్దాం!" అంటున్న శ్యాంతో.

"శ్యాం మేడంను ఇప్పుడు తీసుకు వెళ్లవలసినది ఆసుపత్రికి కాదు. పోస్టుమార్టం రూంకు. నువ్విక్కడే వుండి నీలకు, ప్రియకు ధయిర్యం చెబుతూ ఉండు. నేను వెళ్లి

ఎస్.ఐ రాజాకు ఫోన్ చేస్తాను" అని బయటకు వెళ్ళిపోయాడు.

"డాక్టరుగారూ! శ్యాం! డాక్టరు రవి ఎక్కడకు వెళ్ళారు. మేడంను పరీక్షించి చూడలేదేం?" ఆత్రుతగా అడుగుతున్న నీలకు సమాధానంగా తల అడ్డంగా వూపాడు శ్యాం.

"మేడం!" అంటూ పెద్దగా అరిచి కళ్ళుతిరిగి పడిపోతున్న నీలను పొదవి పట్టుకుని పక్కనున్న సోఫాలో కూచోబెట్టాడు శ్యాం.

"శ్యాం! మేడంను సుశ్రుత నర్సింగ్‌హోంకు తీసుకుని వెళ్దాం! అరే నీలకేమైంది. నీలా?" అంటూ నీల దగ్గరకు పరుగెత్తుకు వస్తున్న ప్రియతో ప్లీడరుగారి కోడలు.

"మేడం స్లీపింగ్ పిల్స్ మింగి ఆత్మహత్య చేసుకున్నారట. డాక్టర్ రవిగారు ఇప్పుడే పోలీసు స్టేషన్‌కు ఫోన్‌చేసి చెప్పారు!" అంది.

"మేడం!" బిగ్గరగా అరుస్తూనే నేలమీద పడిపోయింది ప్రియ.

అక్కలా, ప్రియబాంధవిలా, నెచ్చెలిలా, అవసరమైతే అమ్మలా ఇంకా అవసరమైతే నాన్నలా ప్రేమతో లాలించే అన్నలా, తమను చూచుకున్న గురువు, దైవం చనిపోయిందన్న విషయం ప్రియను, నీలను దుఃఖాంబుధిలో ముంచివేసింది.

నీలను, ప్రియను స్వాంత వచనాలతో సేద దీర్చుతూ తన లెక్చరరు షాలిని మరణానికి మనసులో కళవెళ పడిపోతున్న శ్యాం వాకిట్లో ఆగిన పోలీసు జీపు చూచి బయటకు నడిచాడు.

ఇది సీరియల్
నవలా పథకం
మొగలీ పువ్వంటీ ఏడో భాగం

# ఆంధ్రభూమి

సచిత్రవారపత్రిక

సీరియల్ నవలా పుస్తక పథకం—6

8

# మొగలీ పువ్వంటీ

## డాక్టర్ కొత్త రవీంద్రబాబు

జరిగిన కథ

అమరావతి పిక్నిక్‌కని వస్తారు
ఎం.ఎ తెలుగు విద్యార్థినీ విద్యార్థులు.
శ్యామ్‌ని నీల, వనమాలిని, ప్రియ
ఆకర్షించడానికి తాపత్రయపడుతూంటారు.
షాలిని మేడమ్ అంటే
విద్యార్థులందరికీ భయమూ భక్తీను. టీ పొడి తేవడానికి
కృష్ణ ఆవలి వడ్డుకు వెళ్ళి వస్తూన్న నీలను
పిచ్చివాడి బారినుండి రక్షిస్తాడు శ్యామ్.
షాలిని ఇంట్లో వంట మనిషి తవిడమ్మ
స్త్రీ కాదనీ, పాత కేడీ అని తెలుస్తుంది.
నీలను ఎంతో ఆప్యాయంగా ఆదరణగా చూస్తుంది
శ్యాం తల్లి అహల్య.
షాలిని మేడం ఆత్మహత్య చేసుకుంటుంది

# 8

“శ్యాం! కష్టమైనా నిష్ఠూరమైనా నీల, ప్రియలను ఇక్కడినుండి నువ్వు తీసుకుని వెళ్లాలి. ఆచారం ప్రకారం పోలీసు డిపార్టుమెంట్ తన కర్తవ్యం తను చేసుకు వెళ్తుంది.” అన్నాడు డాక్టర్ రవి.

“అవును శ్యాం! వాళ్లిద్దర్నీ ఇక్కడినుండి తీసుకుని వెళ్లు! ఏ పరిస్థితుల్లోనూ వాళ్లను పిఎం రూము దగ్గరకు గానీ అంత్యక్రియలు జరిగే చోటుకు గానీ రానీవద్దు” అన్నాడు ఎస్.ఐ. రాజా!

“అలాగే సర్!” అంటూ లోపలకు వెళ్లాడు శ్యాం.

“నీలా!ఇలా రా! ప్రియా నువ్వుకూడా!” శ్యాం పిలుపు విని బయటకు వెళ్లారు నీల, ప్రియ.

“మేడంకు బంధువులెవరైనా ఉన్నారా?”

“మాకు తెలిసినంతవరకు ఎవరూ లేరు. ప్లీడరు శివలింగంగారు ఆమెకు దూరపు బంధువులు. అన్నీ ఆయనే. తల్లిదండ్రి వుండగా తమ ఆస్తి వ్యవహారాలు చూసేవారని ఒకసారి చెప్పారు మేడమ్!”

“అయితే ఆయన దగ్గరకు వెళ్దాం! మేడం మరణవార్త ఎవరికి తెలియజేయాలో చెప్తాడాయన”

కళ్లు తుడుచుకుంటూ కారు స్టార్టు చేసింది నీల. శివలింగం గారి ఇంటి ముందాపింది కారు నీల.

ఆఫీసురూంలో కూర్చునివున్న శివలింగంగారికి నమస్కరించి కుర్చీలో కూర్చున్నారు నీల, ప్రియ, శ్యాం.

“సార్! మేం నాగార్జున యూనివర్శిటీలో తెలుగు ఎంఏ చదివాము. శ్రీమతి షాలిని మేడం మాకు లెక్చరరు. ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. ఈరోజే ఆమె శవం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీరు వారి దూరపు బంధువులని తెలుసుకుని ఆ వార్త చెప్పడానికొచ్చాము” అన్నాడు శ్యాం.

“షాలిని ఆత్మహత్య చేసుకుందా?” ఆశ్చర్యంగా అడిగాడు శివలింగం.

“అవున్సార్! ఆమెకు బంధువులెవరైనా ఉన్నారా?”



“నాకు తెలిసినంత వరకు ఎవరూ లేరు!”

షాలిని తండ్రి అశోక్ ఢిల్లీలో విదేశాంగ శాఖలో పనిచేసేవాడు. అతను నాకు చాలా దూరపు బంధువు. ఢిల్లీలోనే పనిచేస్తున్న తెలుగు అమ్మాయి శకుంతలను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. శకుంతలకు షాలిని మనోజ్ అనే కవల పిల్లలు పుట్టారు. చాలాకాలం క్రితమే అంటే పదిపదిహేను సంవత్సరాల క్రితం మా వూరిలో తనకున్న పొలం, ఇల్లు అమ్మమని అశోక్ అడిగితే అమ్మి ఆ డబ్బు అతనికి ఇచ్చాను. ఆస్తి అమ్మివేశాక అతను ఈ ప్రాంతాలకే రాలేదు. ఎప్పుడైనా ఉత్తరాలు రాసేవాడు.

షాలిని ఇక్కడ ఉద్యోగంలో చేరాక ఒకసారి కనబడింది నాకు — అదీ కొన్ని సంవత్సరాల క్రితం! అంతకు మించి నాకేమీ తెలియదు!”

శివలింగం దగ్గర సెలవు తీసుకుని హాస్పటల్‌కు తిరిగివెళ్లారు శ్యాం, నీల, ప్రియ.

“శ్యాం! ఒకసారి పోస్టుమార్టం రూం దగ్గరకు వెళ్లివస్తాం!” అంది నీల.

“వద్దు నీలా! నువ్వు ప్రియా ఇక్కడ వుండండి. నేను మాలి వెళ్లి రాజాగారిని కలుసుకుని ఫార్మాలిటీస్ పూర్తి చేయిస్తాం. మేము ఫోను చేసినప్పుడు నువ్వూ, ప్రియా వద్దురుగానీ!”

నీలకు మళ్లీ మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మాలికి సైగచేసి బయటకు నడిచాడు శ్యాం.

* * *

ఆ రాత్రి పదకొండింటికి తాతయ్య రూంలో తాతమ్మను, నర్సును ఉంచి డాక్టర్ రవి ఇంటికి వెళ్లారు నీల, ప్రియలు.

డాక్టర్ రవి ఇంటి డ్రాయింగ్ రూంలో అప్పటికే వచ్చి కూర్చునివున్నారు శ్యాం, మాలీ! డస్సిపోయి పాలిపోయిన ముఖాలతో కూర్చున్న శ్యాం, మాలి, నీల, ప్రియలను చూసి అప్రయత్నంగా తలదించుకున్నారు.

మౌనంగా నీల చేతికి ఉత్తరం అందించాడు రవి.

వణికే చేతులతో వుత్తరం చదువసాగింది నీల.

చిన్నారి చెల్లెళ్లు నీల, ప్రియలకు,

మీకీ ఉత్తరం అందేసరికి నేనీ ప్రపంచంలో గుప్పెడు బూడిదగా మిగిలి వుండాలని నా కోరిక!

ఈసరికి మా కుటుంబం గురించిన వివరాలు మీరు శివలింగం గారివద్ద తెలుసుకుని వుంటారు.

మనోజ్, షాలిని కవల పిల్లలని చెప్పి వుంటాడాయన. అన్నా చెల్లెళ్ళు కాదు వీళ్ళిద్దరూ. అక్కాచెల్లెళ్ళలా వున్నారు అనేవాళ్ళు మమ్మల్ని చూసి చిన్నప్పుడు. అందుకు తగినట్లే అమ్మకు ఆడపిల్లమీద ఎక్కువ మోజు వుండడంతో మనోజ్‌కు కూడా గౌన్లు తొడుగుతూండేది.

మాకు కాన్వెంటుకు పంపించే వయసు వచ్చింది. యూనిఫాం వేసుకుని కాన్వెంటుకు వెళ్లి వచ్చినాక ఇంటి దగ్గర మనోజ్‌కు గౌనువేసేది అమ్మ.

"పెద్దవాడవుతున్నాడు? ఇంకా గౌన్లు వేస్తావేమిటి?" అని కోప్పడేవాడు నాన్న.

ఆంధ్రదేశానికి దూరంగా పుట్టి పెరిగినా తెలుగు భాషమీద అభిమానం పోలేదు నాన్నకు. అందుకే పిల్లలిద్దరినీ బనారస్ హిందూ యూనివర్శిటీలో తెలుగు ఎం.ఏలో చేర్పించాడు. ఒక చిన్న ఎపార్ట్‌మెంట్లో వుండి ఎం.ఏ చదివాము.

ఎం.ఏలో చేరిన కొద్దిరోజులకే నాన్న, అమ్మ యాక్సిడెంట్‌లో మరణించారు.

తల్లీ తండ్రీ మరణంతో అన్నా చెల్లెళ్ల అనుబంధం గాఢతరమైంది.

ఎం.ఏ పూర్తి అయింది. అన్నా చెల్లెలు ఇద్దరూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాము.

ఇప్పుడు మనోజ్ విచిత్ర మనస్తత్వం గూర్చి మీకు చెప్పాల్సి ఉంటుంది.

తండ్రి వద్దంటున్నా కోప్పడుతున్నా వినకుండా మనోజ్ అప్పుడప్పుడు గౌన్లు పెద్దయ్యాక పరికిణీలు వేసుకునేవాడు. ఎం.ఏ చదువుతున్నప్పుడు చెల్లి షాలిని ఎపార్ట్‌మెంట్‌లో లేనప్పుడు ఆమె చీర జాకెట్ ధరించేవాడు. అలా జాకట్ చీర ధరించినప్పుడు విపరీతమైన ఆనందం పొందేవాడు తను.

స్త్రీ వేషం ధరించడానికి ఆసక్తి చూపే మగవారిని ట్రాన్స్‌వెస్టైట్స్ అంటారని మీకు తెలుసు అనుకుంటాను. ఎప్పుడో కొద్ది సమయం అలా దుస్తులు ధరించి ఆనందం పొందుతారు ఆ బలహీనత ఉన్నవాళ్లు.

కాని మనోజ్‌లో ట్రాన్స్ వెస్టైటిజమ్ పరాకాష్టకు చేరుకుంది! అందుకు మరోకారణం వుంది!

ఆవిషయం చెప్పాలిప్పుడు! ఎం.ఏ పరీక్షలయ్యాక ఢిల్లీ వెళ్ళారు మనోజ్, షాలిని. చిన్ననాటి స్నేహితులను చూద్దామని వెళ్ళారు వారు! బసవుండ డానికి హోటల్లో దిగారు!

ఇరవై అంతస్తుల హోటల్లో పై అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. మనోజ్ షాలిని బసచేసి వున్నదా అంతస్తులోనే!

మనోజ్ షాపింగ్ చేస్తున్నప్పుడే ఏక్సిడెంట్ విషయం తెలిసి పరుగెత్తుకు వచ్చాడు హోటల్‌కు.



కాని అప్పటికే ఘోరం జరిగిపోయింది! గుర్తుపట్టటానికి వీలులేకుండా కాలిపోయింది షాలిని.

ప్రపంచంలో తనకు మిగిలిన ఒక్క బంధువూ మరణించడంతో షాక్ తగిలి మతి చలించినట్లయింది మనోజ్‌కు!

ఓదార్చేవారు లేక దాదాపు పిచ్చివాడయి పోయాడు మనోజ్.

"చనిపోయింది మనోజ్! జీవించే వుండేది షాలిని! నేను మనోజ్‌గా మరణించి షాలినిగా జీవిస్తాను" అని నిర్ణయించుకున్నాడు మనోజ్!

విగ్ పెట్టుకుని యువతిలా చీర జాకెట్ వేసుకుని కళ్లకు కాటుక పెట్టుకుని

షాలిని సంతకం ఫోర్జరీ చేసి కాన్వొకేషన్‌కు వెళ్లకుండా డిగ్రీ పోస్టులో తెప్పించుకున్నాడు.

షాలిని, ఎం.ఏ అనే డిగ్రీ పట్టా చేతపట్టుకుని నాగార్జునసాగర్‌లో లెక్చరర్‌గా చేరాడు మనోజ్.

మనోజ్ షాలినిగా మారి లెక్చరర్‌గా చేరిన తర్వాత చరిత్ర కొంత మీకు తెలుసు. కొంత విని వుంటారు.

నా చెల్లెలు మరణించింది అన్న వాస్తవాన్ని భరించలేక వున్మాదస్థితిలో చెల్లెలి రూపంలోకి మారి ఎనిమిది సంవత్సరాలు షాలినిగా జీవించాను.

షాలినిగా రూపాంతరం పొందిన నేను నా పొజిషన్‌ను ఎప్పుడూ దుర్వినియోగం చేసుకోలేదు.

మీకు గుర్తు వుండే ఉంటుంది. మీరు స్నానం చేసే సమయంలో స్నానాల గదిలోకి గాని, బట్టలు మార్చుకునే గదిలోకి గానీ ఎప్పుడూ వచ్చేదాన్ని (వాడిని) కాదు.

మీలోనే షాలినిచూసుకుంటూ సంతోషంగా కాలం గడిపాను!

కొంతకాలంగా భయంకరమైన డిప్రెషన్ వ్యాధితో బాధపడుతున్నానని అర్థంచేసుకున్నాను!

డాక్టరును కనీసం డాక్టరు రవినైనా కన్సల్టుచేసి వైద్యం చేయించుకోవటానికి సాహసించలేకపోయాను నా నిజరూపం బయటపడుతుందనే భయం వలన!

పుట్టింది పెరిగింది ఢిల్లీలో. ఎం.ఎ చదివింది కాశీలో అయినందువలన — షాలిని నేను కవలలమై ముఖ కవళికలు శరీరాకృతి దాదాపుగా ఒకటి అయినందువలన గుంటూరులో ఈ రహస్యం రహస్యంగానే వుండిపోయింది!

అనేకమార్లు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. మీ ఇద్దరూ నాకు చెల్లెళ్లలా

అభిమానంగా ఉండిపోవడంతో మీ మీద నేను పెంచుకున్న మమకారం నన్నా పని చేయనీయలేదు.

పెళ్ళలకు మీరు ఇళ్ళకు వెళ్ళినదగ్గర్నుంచీ చనిపోవాలనే కోర్కె నన్ను కబళించి వేస్తున్నది.

జీవితేచ్ఛ సన్నగిల్లింది. చనిపోయే ముందు ఈ నా జీవిత రహస్యం గురించి మీకు తెలియజేసి మీకు మనస్తాపం కలిగిస్తున్నందుకు క్షమాపణలు వేడుకుంటూ...

వుంటాను,
మీ
(మనోజ్ కాదు) షాలిని.

పిఎస్: అచిరకాలంలో మీరిద్దరూ శ్యాం మాలిలను వివాహం చేసుకుని సంతోషంగా వుండగలరని ఆశిస్తున్నాను.

ఇన్నేళ్ళూ తాము షాలిని మేడం అనుకొన్నది ఆమె అన్న మనోజ్‌ను అన్న భయంకర రహస్యం తెలియగానే నీల, ప్రియ నిశ్చేష్టులై కూర్చుండిపోయారు.

* * *

"డాక్టరుబాబూ! అబ్బాయికి జ్వరం తగ్గి నాలుగురోజులైంది. కానీ వులకడు పలకడు. నోట్లో ఏమైనా ద్రవపదార్థం పోస్తే ఎప్పుడైనా ఒకసారి గుటక వేస్తాడు. మీరు రోజూ పెడ్తున్న సెలైన్ సీసాలే వాడి బతుక్కి ఆధారంగా వున్నాయి" అంది సీతమ్మ దిగులుగా కళ్ళు తుడుచుకుంటూ డాక్టర్ రవితో.

"అవునమ్మా ఈపాటికి బాగా కోలుకోవాల్సింది" అంటూ అవతలకు వెళ్ళిపోయాడు రవి.

శరీరారోగ్యం మెరుగుపడి స్తబ్దంగా పడివున్న దివాకర్‌ను సైకియాట్రిస్టుకు చూపాలనుకున్నాడాయన. తల్లిని, తండ్రిని అవతలకు పంపి చాలాసేపు అతనితో మాట్లాడాడు రవి.

సైకియాట్రిస్ట్ వాయునందన్ దివాకర్‌ను పరీక్షించి డాక్టర్ రవి కన్సల్టింగ్ రూంకు వచ్చి కూర్చున్నాడు.

"మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను డాక్టర్ రవీ. దివాకర్ ఈజ్ సఫరింగ్ ఫ్రం డిప్రెషన్!"

కొజ్జాల మధ్య పెరిగి పెద్దవాడయి గ్రూపు లీడరై బావిలో కప్పలా జీవితం



గడుపుతూ చివరకు తమ్ముడిని చూచిన క్షణం నుంచీ చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తొచ్చి మనోవ్యధ పడిపోసాగాడు.

పురుషత్వం పోగొట్టుకొని సమాజానికి దూరమైన నికృష్ట జీవితంపై రోత, అసహ్యం కలిగాయతనికి.

"డాక్టర్ వాయునందన్! మీరు ఈ కేసు టేకప్ చేసి అతనికి స్వస్థత కలిగించండి"

"డాక్టర్ రవీ! అది అంత సులభమైన విషయం కాదు! అతని వ్యధకు కారణం తానుపురుషత్వం పోగొట్టుకున్నానన్న న్యూనతా భావం. బైదిబై వాటీస్ హిస్ పొజిషన్ ఇన్ దిస్ యాస్పెక్ట్! సర్జరీ చేసి మామూలు యువకుని చేయగలరా?"

"ఎనిమిది సంవత్సరాల వయసులో తనకు విపరీతంగా తాగబోయించి కాళికా అమ్మవారి ముందు పూజ చేయించి పురుషాంగం, బీజాల చుట్టూ తీగెతో బలవంతంగా కట్టివేశారని చెప్పాడు దివాకర్! విపరీతంగా రక్తం కారి వుండుపడి నెలరోజులు బాధపడ్డానని చెప్పాడు.

కానీ యుక్తవయసు రాకముందు బీజాలు తొలగిస్తే వయసువచ్చాక గడ్డాలు, మీసాలు పెరిగే అవకాశం లేదు.

దివాకర్‌కు గడ్డం మీసం వంటిమీద రోమాలు అతని వయసు పురుషులకు వుండతగినట్టే ఉన్నాయి."

అంటే అతని శరీరంలో పురుష హార్మోన్లు (టెస్టోస్టిరాన్) ఉత్పత్తి అవుతున్నదన్నమాట!

'అదెలా సాధ్యం?"

"పుట్టుకతోనే కొంత మందిలో బీజాలు పొట్టలోగాని పొత్తి కడుపులోగాని వుండిపోతాయి. దివాకర్ అదృష్టం కొద్దీ అతని రెండుబీజాలూ ఇంగ్వైనల్ కెనాల్స్‌లో వుండిపోయాయి. ఎనిమిదో సంవత్సరంలో అతనిని క్యాస్ట్రేట్ చేసినప్పుడు బీజాలు పైన వుండిపోవడంతో వట్టి చర్మం తెగిపడిపోయివుంటుంది.

కాని ఏం లాభం డాక్టర్ రవీ! పురుషాంగం లేనప్పుడు శరీరంలోని బీజాలు వుండి టెస్టోస్టిరాన్ వు త్పత్తి అయినా అతను రతి క్రీడలో పాల్గొనలేదు గదా?

"పురుషాంగం వుండవలసిన చోట స్కార్‌టిస్యు వున్నది. దివాకర్ చిన్నతనంలో మూత్రం పోసేప్పుడు అంగం చివర బెలూన్ లా వుబ్బిపోయేది అని చెప్పింది వాళ్ళమ్మ.

ఫైమోసిస్‌తో బాధపడుతున్న దివాకర్ పురుషాంగం చివర చర్మాన్ని బలవంతంగా లాగి చుట్టూ తీగ చుట్టినందువలన పురుషాంగంలో కనీసం కొంత భాగమైనా

దిగబడిపోయి స్కార్ టిష్యూ కింద వుండి వుంటుందని నా నమ్మకం.

'దిసీస్ రియల్లీ ఫెంటాస్టిక్! దెన్ యుకెన్ మేకెట్ మాన్ అవుటాఫ్ దిస్ యూనక్!''

''గట్టిగా ప్రామిస్ చేసి చెప్పలేను కాని చాలా వరకు విజయం సాధించగలననే అనుకుంటున్నాను. కాని శారీరకంగా అతన్ని పాతిక సంవత్సరాల యువకునిగా మార్చగలనేమో గాని మానసికంగా అతను మామూలు మనిషి కాగలడా? లేకుంటే సర్వ ప్రయత్నం వ్యర్థం అవుతుంది!''

* * *

''అమ్మా రాణీ! అల్లుడుగారింకా లేవలేదా?'' సెలవలకు ఇంటికి వచ్చేసిన అల్లుడి సుమంత్‌పై అజమాయిషీ చేద్దామనే పట్టుదల హెచ్చిన సుబ్బయ్య కూతుర్ని ఉదయం ఎనిమిదింటికి అడిగాడు.

''గారేమిటి? గారు! రాత్రంతా ఏ మాజీ ప్రియురాలితోనో గడిపినట్లు కలలు కంటూ వున్నాడు లా వుంది. ఇంకా నిద్ర లేవలేదు!''

'అతను మన ఆస్తి చూసి నిన్ను చేసుకుని కుక్కలా మనింటి దగ్గర పడి వున్నా అల్లుడుగాబట్టి మర్యాద ఇవ్వాలి!

ఇంటబడితినే కుక్కకయినా విశ్వాసం వుంటుంది గాని వీడికి మాత్రం...''

''రాణీ!'' గర్జిస్తూ గది నుండి వచ్చాడు సుమన్!

''ఏం? ఎందుకలా గొంతు చించుకుంటావ్?''

''రాణీ ఏమిటి అన్నావు? నేను కుక్కనా?''

''అహహ! అలా ఎందుకన్నాను! ఎంగిలి మెతుకులు ఆశించే కుక్కకయినా విశ్వాసం వుంటుంది కాని మా నాన్న సొమ్ము తేర తిండి తింటూ అడ్డంగా బలిసిపోతున్న అల్లుడుగారికి మాత్రం బుద్ధి లేదని అంటున్నా!''

''రాణీ! మితిమీరి మాట్లాడుతున్నావు!''

''నేను మితిమీరి మాట్లాడుతున్నానా? ఇన్నాళ్ళు నాకు తిరిగి సమాధానం చెప్పకుండా వున్న నువ్వు ఈ రోజు ఇలా పెద్దగా ఎదురు తిరిగి మాట్లాడుతున్నావు!''

''రాణీ మీ ఇంటికి వచ్చానని ఇంత చులకన చేస్తావా? నాకూ ఇల్లు వుంది! అమ్మా నాన్న వున్నారు! తిన్నా తరగనంత ఆస్తి వుంది?''

''ఏం ఆస్తి చిన్నప్పుడు తప్పిపోయిన పెద్ద కొడుకు దొరికాడని అతని కోసం వేలు



ఖర్చు పెడుతున్నారు మీ అమ్మా నాన్న! ఖర్చులన్నీ అయ్యాక మిగిలిన చిప్పా జోలె ఏమైనా వుంటే అందులో సగం నీ వాటా కింద ఇస్తారు!''

అంతవరకూ ఓర్మి పట్టిన సుమంత్ కోపం పెట్టలేక పోయాడు. రాణీ చెంప మీద బలం కొద్దీ ఈడ్చి లెంపకాయ కొట్టాడు.

''అమ్మో! అమ్మో! నా సొమ్ము తిని నన్నే కొడతావురా రాస్కెల్!''

''కొడతావా! చంపుతావా! డబ్బుందని వచ్చినట్లు మాట్లాడితే వూరుకుంటానా?''

అప్పటి దాకా వూరుకున్న సుబ్బయ్య అప్పుడు కలుగజేసుకున్నాడు.

''ఇదిగో అల్లుడూ! మర్యాదగా చెబుతున్నా! ఇనుకో! నాబిడ్డ వంటిమీద సెయ్యేత్తే వూరుకోను!''

''కూతురికి చెప్పకోలేక నామీద అరుస్తావా? మొగుడు పెళ్లాలన్నాక కొట్టకుండా వుంటారా?''

'' నా బిడ్డను ఇన్నేళ్ళ పెంపకంలో ఒక్కసారి కొట్టలేదు నేను! నా ఆస్తి చూసి మెళ్లో తాళి కట్టినోడివి వుత్తి పున్నేనికి అంత దెబ్బ కొడతావా? ఇదేం బాగా లేదు!''

''నా ఆస్తిని ఎరగా చూపి శూర్పణఖ లాంటి నీ కూతురు మెడలో తాళి కట్టించావు! పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చే రాణితో అయిదేళ్ళు కాపురం చేసాను.

ఇక ఈ బంగారు పంజరంలో కుక్కకన్నా హీనంగా పడి వుండలేను! మా ఇంటికి వెళ్ళిపోతా!''

''పో!పో! వెళ్ళే ముందు కాయితాల మీద సంతకం పెట్టి వెళ్ళు!'' అంది రాణి కోపంగా!

''ఏం కాయితాలు?''

''నీకు నాకు శారీరకంగా సంబంధంలేదు గనుక విడాకులు మంజూరుచేయమని కోర్టుకు అప్పీలు చేసే కాయితాలు!''

''అన్నీముందే ఆలోచించుకుని వుంచావన్నమాట! సరే కాగితాలు తే సంతకం పెట్టి ఇస్తాను.'' కాగితాల మీద సంతకం పెట్టి గదిలోపలకు వెళ్ళి సూట్ కేస్ తీసుకుని వెళ్ళబోయాడు సుమంత్.

''ఆగు'' గర్జించింది రాణి. ఆమె గొంతులో అధికారం, అసహ్యం సమపాళ్ళల్లో మిళితమై వున్నాయి.

''ఆ సూట్ కేసూ, అందులో బట్టలూ మావి! మా సొమ్ము తీసుకువెళ్ళే హక్కు నీకిక లేదు!''

"ఆ! రాణీ!"

'ఆ మళ్ళీమాట్లాడితే నీ వంటి మీద బట్టలుకూడా నావే! మాజీ భర్తవు గనుక వంటి మీద బట్టలు లేకుండా బజారులోకి పంపడం ఇష్టం లేక దయతలచి వూరుకుంటున్నాను.

ఇంకా అక్కడే నిలబడి వుంటే ఏం మాటలు వినాల్సి వస్తుందోనని సూట్ కేస్ కింద పడేసి బయటకు నడిచాడు సుమంత్.

బజారులో నడుస్తున్న సుమంత్ మనసు భగ భగ మండిపోతున్నది! అమ్మా నాన్న వద్దన్నా రాణి ఆస్తి చూసి పెళ్ళి చేసుకున్నాడు! పూతన, శూర్పణక, తాటకి లను మరపించే సుందరాంగి రాణిని భార్యగా ఆదరించలేక పై తిరుగుళ్ళు మరిగాడు! అంత మాత్రాన కుక్క కంటే హీనంగా విదిలించి కొడ్తే పడి వుండటానికి అంత గతిలేని వాడా!"

సుమన్‌కు సుందరి గొర్తొచ్చింది! సుందరి ఎంత అందమైనది! నేనంటే పడి చచ్చేది! ఆ సుందరిని వివాహం చేసుకున్నట్లయితే కుక్కకన్నా విశ్వాసంగా జీవితాంతం సేవ చేస్తూ పడి వుండేది!

ఒక సుందరేనా! ఎందరు అందమైన ఆడపిల్లలు నా కోసం తమ పరువు ప్రతిష్ట సర్వం వదులుకుని వచ్చేవాళ్ళు!

ఎందరో సుందరాంగుల ను అలోవకగా మురిపించిన దక్షిణ నాయకుడు సుమంత్ నిజ భార్య ముందు పెంపుడు కుక్కకన్నా హీనంగా చూడబట్టాడంటే ఎంత నామర్దా!

కోపంతో అలకతో దెబ్బతిన్న మనసుతో ఇంటికి జేరాడు సుమంత్!

అమ్మ ఆప్యాయంగా ఆదరించి అన్నం పెడుతుందని ఆకలితో ఆతురతగా వెళ్ళిన సుమంత్ అక్కడా అసంతృప్తే మిగిలింది. ఇంటికి తాళం వేసి వుంది.

పక్కింటాయన వచ్చి చిన్నప్పుడు తప్పిపోయిన మీ అన్నయ్య కనపడ్డాడు! అతన్ని తీసుకుని మీ అమ్మానాన్న గుంటూరు వెళ్ళారు.!

మీ అన్నయ్యకు ఏదో పెద్ద జబ్బు చేసిందట. అవసరం అయితే ఆస్తి అంతా తెగనమ్మి అయినా సరే పెద్ద కొడుకు వైద్యం చేయిస్తానంటున్నాడు మీ నాన్న! అని చెప్పాడు. బిక్క మొహం వేసుకుని గుంటూరు ప్రయాణం అయ్యాడు సుమన్. రాణి ఆస్తి దక్కకుండా పోయింది! ఇటు వున్న ఆస్తిలో వాటా పంచుకోటానికి చిన్నప్పుడెప్పుడో తప్పిపోయిన అన్న తిరిగి వచ్చాడు. పులి మీద పుట్రలా అన్నకు వైద్యం చేయించటానికి అవసరం అయితే ఆస్తి అమ్మటానికి సిద్ధంగా వున్నాడు నాన్న!

జీవితంలో ఎన్నడూ ఎరుగని నిర్వేదం ఒక్క సారిగా సుమన్‌ను కబళించి



వేయసాగింది!

గంపెడాశతో ఇంటికి వచ్చి ఆశ నిరాశగా మారి గుంటూరు బస్సెక్కాడు!

బస్సు పట్నుమని పది మైళ్ళు పోయిందో లేదో పోలీసు ఇన్‌స్పెక్టర్ చేయి వూపగా ఆగింది. ఆగిన బస్‌లో ఎక్కి ప్రయాణీకులందరి ముఖాలూ పరీక్షగా చూసాడు ఇన్‌స్పెక్టర్. సుమంత్ ముఖం చూసి ఏదో అనుమానం వచ్చి జేబులోంచి ఫొటో తీసి చూచుకుని సరిపోల్చుకున్నాడు.

"రారా రాస్కెల్ దిగు! అంటూ సుమంత్ జబ్బ పట్టుకు ఈడ్చుకు వెళ్ళాడు ఎస్.ఐ.

"ఏమిటిది? నన్నెందుకు పట్టుకు వెళుతున్నారు?" అని అడుగుతున్న సుమంత్‌ను ఎడా పెడా బాది—

"ఆపరా నీ దొంగ వేషాలు! రాంజీని విషమిచ్చి చంపి రాత్రికి రాత్రి శవాన్ని దహనం చేసిందెవ్వరా?" అంటూ రోడ్డు వారన వున్న జీపులోకి నెట్టి జీపును పోనిచ్చాడు ఎస్.ఐ.

"రాంజీ ఎవరు సార్" అని అడుగుతున్న సుమంత్‌ను లాఠీతో బాది "చుప్ వెర్రి వేషాలు వేస్తే వదుల్తాననుకున్నావా?" అ ˜ ˜రుకున్నాడు.

జీపు మాచర్ల స్టేషన్ ముందాగగానే గిల గిల లాడుతున్న సుమంత్‌ను తీసుకెళ్ళి లాకప్‌లో పారేయించి—

"జాగ్రత్తగా చూస్తుండండి మస్కా వేసి పారిపోగలడు" అన్నాడు యస్.ఐ.

"పోయి సుందూని పిలుచుకురండి" అని కానిస్టేబుళ్ళని పంపాడు ఎస్.ఐ.

నడ్డి తిప్పుకుంటూ వచ్చాడు సుందూ. ఎస్ఐ ముందు నిలబడి వంగి నమస్కరించి దండాలు బాబు గారూ అన్నాడు.

'అరేయ్! రాంజీని చంపిన వాడిని పట్టుకున్నాం రా ఐడెన్‌టిఫై చేద్దూ గాని" అన్నాడు ఎస్.ఐ.

కటకటాల తలుపు తెరుచుకుని లోనికి వస్తున్న ఎస్ఐ సుందూల వంక ఆశ్చర్యంగా చూడసాగాడు సమంత్

"వీడేగదూ!"

"ఆ వీడే ఆ వుండండి..." అంటూ సుమన్ దగ్గరగా వచ్చి పరకాయించి చూసి వీడు కాదు సార్! వాడు అచ్చం సాంబలానేవున్నాడు కాని వీడు సాంబ కాదు" అన్నాడు సుందూ.

'అలాగా అయితే వీడెందుకు లాకప్‌లో తిండి దండగ పోరా పో" అంటూ బయటకు గెంటాడు సుమన్‌ను ఎస్.ఐ.

సుమన్ పోలీసు స్టేషన్ నుండి బయటకు వస్తుంటే సుందూ "బాబు ఓ మాటడుగుతా ఏమనుకోబాక నీకు గాని ఓ అన్నయ్యుండేవాడా?" అని అడిగాడు.

రుస రుస లాడుతూ అతనికి సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాడు సుమన్!

* * * *

"శ్యాం! మాలీ! మీరిద్దరూ ఈ రోజు థియేటర్‌కు రండి కాసేపట్లో దివాకర్‌కు ఆపరేషన్ చేస్తున్నాను!" అన్నాడు డాక్టర్ రవి కన్సల్టింగ్ రూంకు వచ్చిన శ్యాం మాలిలతో

"అలాగే సార్!" అంటూ తలూపారిద్దరూ. అరగంట తర్వాత ఆపరేషన్ థియేటర్‌లో వో మూల మాస్‌లు కాప్‌లు వేసుకుని నిలబడ్డారిద్దరూ!

బల్ల మీద చలనం లేకుండా పడుకున్నాడు దివాకర్.

ఎనస్థటిస్ట్ బెల్లోస్ నొక్కుతుంటే నైట్రస్ ఆక్సైడ్ ఆక్సిజన్ మిశ్రమంతో వూపిరి తిత్తులలోనికి వెళ్ళి అతన్ని స్పృహలోకి రాకుండా అట్టిపెడుతున్నది.

నగ్నంగా వున్న దివాకర్ శరీరాన్ని క్లీనింగ్ సొల్యూషన్‌తో స్క్రబ్ చేసి ఏక్రిక్ఫ్లేవిన్ స్పిరిట్‌తో క్లీన్ చేసి ఆకుపచ్చని టవల్స్‌తో కప్పాదు డాక్టర్ రవి— పొత్తి కడుపు దిగువ భాగం అనాచ్ఛాదితంగా వుంచాడు.

దివాకర్ నగ్న దేహాన్ని వీక్షించిన క్షణాన శ్యాం మాలిలలోకల్గిన జుగుప్స క్రమంగా సర్దుకుపోయింది.

ఇనుప తీగను పురుషాంగం బీజాల చుట్టూ చుట్టి బలంగా మెలితిప్పి వేసినందువలన పెనిస్ టెస్టిస్ తెగి కింద పడిపోతాయి. అలా కాస్ట్రేట్ చేసిన కుర్రవాళ్ళను గుంపులో కలుపుకుని సంఖ్య పెంచుకుంటూరు కొజ్జాలు.

దివాకర్ విషయంలో వాళ్ళు పొరపడ్డారని నా ప్రగాఢ విశ్వాసం!" అంటూ ఆపరేషన్ కుపక్రమించాడు రవి.

పొత్తి కడుపు దిగువ భాగంలో సరిగా మధ్యన మూత్రం వచ్చే రంద్రం చుట్టు ప్రక్కల బహు జాగ్రత్తగా డిసెక్షన్ మొదలెట్టాడు రవి.

ఆసక్తిగా చూడసాగారు శ్యాం మాలి. రవి చేతిలో స్కాల్‌పెల్ ఒకోసారి కుంచెకంటే సున్నితంగా పని చేయసాగింది. స్టార్‌టిష్యూకింద తెల్లగా తాటిముంజె గుజ్జు లాంటి పదార్థం వుంది.

"ఓ ఫైలేరియల్ టిష్యూ" అంటూ క్రమంగా తెల్లటి పదార్థాన్ని తొలగించి లోతులకు వెళ్ళబోయే ముందు వేలితో ఆ ప్రదేశాన్ని మెమ్మదిగా తడిమి చూచాడు.



ఇక్కడ ఇతని పెనిస్ వుందని నా అనుమానం! అంటూ కాథెటర్‌ను మూత్ర వెలికి వచ్చే రంధ్రం గుండా లోనికి చొనిపి వుంచాడు.

"ఓ దిస్ ఫెలో ఈజ్ ఎ లకీగై" అంటూ జాగ్రత్తగా డిసెక్ట్ చేస్తూ స్టార్ టిష్యూ లోనూ ఫైలేరియల్ బ్లబ్బరీ టిష్యూలోను అతుక్కునివున్న దివారక్ పురుషాంగాన్ని రిలీజ్ చేసాడు.

దివాకర్ శరీరం నుండి పుంస్త్వ చిహ్నమైన పురుషాంగం బయల్పడగానే శ్యాం మా ఆసక్తితో చూడసాగారు. ఆ క్షణాన వాళ్ళిద్దరిలోనూ విపరీతమైన లైంగికావేశం కల్గింది అప్పటి వరకు వాళ్ళిద్దరి జీవితాల్లోనూ మున్నెన్నడూ ఎరుగని ఆ విపరీతావేశం వాళ్ళ మనస్సుల్లో మారు మూల దాగి వున్న మ్యానతను అవతలకు నెట్టి వేసింది.

దివాకర్ ఇప్పటి వరకు స్త్రీలు పురుషులు అసహ్యించుకునే ఒక కొజ్జా. అత్యం హేయపూరితమైన జీవితం గడిపాడు. డాక్టర్ రవి స్కాల్పెల్ మహిమ వలన పూ పురుషత్వం సంతరించుకుని సుఖ ప్రదమైన జీవితం గడపటాని ఆయత్తుడవుతున్నాడు. మట్టిని మణిగా మారుస్తున్నాడు డాక్టర్ రవి.

"దివాకర్‌తో పోల్చుకుంటే మేమిద్దరం ఎంతోఅదృష్టవంతులం" అనుకుంటూ ఆసక్తిగా చూడసాగారు.

"ఇక ఇప్పుడితని పెనిస్‌పై స్కిన్ గ్రాఫ్ట్ చేయవలసిన వుంటుంది. అంతకుముంద ఇంగై్వనల్ కెనాల్స్‌లో వుండి పోయిన ఇతని బీజాలను డిసెక్ట్ చేసి మామూలు స్థానాలలో వుంచాలి" అంటూ పొత్తి కడుపు దిగువ భాగంలో ఇరువై పులా వున్న బీజాలను కిందకు తీసుకు వచ్చి స్క్రోటమ్ తాలూకు చర్మ అవశేషంలో వాటిని జొనిపాడు.

తొడల లోపలి భాగాల పైన చర్మం తీసి పెనిస్ పై అమర్చి పొజిషన్ తప్పకుండా వుండేందుకై సన్నని సిల్క్‌తో కుట్టి వేసాడు.

డ్రెసింగ్ వేస్తూ "నౌ ద ఆపరేషన్ ఈజ్ ఫినిష్డ్" అన్నాడు రవి.

"సర్ ఈజిట్ సక్సెస్‌ఫుల్?" కుతూహలం ఆపుకోలేక అడిగాడు డాక్టర్ రవిని శ్యాం.

"ఫెంటాస్టిక్ సక్సెస్. నెల రోజులలో హి విల్ బి ఫిటెఫర్ ..." థియేటర్ నర్స్ వుందని తర్వాత మాటలు ఆపేసాడు గాని ఆయన చెప్పబోయిందేమిటో అర్థం అయి నర్స్‌తో సహా అంతా పక పక నవ్వారు.

* * * *

చీకటి నుండి వెలుగులోకి వచ్చినట్లు దివాకర్ అపస్మారక స్థితి నుండి బయటకు

రాసాగాడు.

తన శరీరంలో జరిగినమార్పులు అర్థం అయిన క్షణం జీవితంలో మున్నెన్నడూ ఎరుగని ఆనందాన్ని పొందాడు తను.

సముద్రంలో బడబాగ్ని దాగినట్లు లైంగికావేశం అంతర్గతంగా దాగి వుండేదతనిలో అది వరకు.

ఫలితం లేని క్రియా శూన్యమైన ఆ ఆవేశానికి లోనయి మానసికంగా నరకంను అనుభవించే వాడు తను. లైంగికానందం తనకు జన్మకు అందుబాటులో వుండే అవకాశం లేదని బాధపడి ఆ బాధను శాడిజమ్‌గా మార్చుకుని ఒకవిధమైన తృప్తి పొందుతుండేవాడు!

కాగజ్ మహల్ జీవితం గుర్తొచ్చింతనికి. దీనంగా బేలగా తనకు నమస్కరిస్తూన్న మాలతి గుర్తొచ్చింది.

"నిన్ను అనవసరంగా హింసించాను మాలతీ. లైంగిక శక్తిలేని స్థితిలో పశువులా నిన్ను యమ యాతనలు పెట్టాను. ఇప్పుడైతే నిన్నలా హింసించను.

ఎక్కడున్నావు మాలతీ ఎక్కడ?

"మాలతీ!" బిగ్గరగా అరిచాడు దివాకర్.

స్పృహ వచ్చాక అతనికి మొదటి సారి జ్ఞాపకం వచ్చింది మాలతి.

సంవత్సరాల నాడు కాగజ్‌మహల్‌లో తన చేతిలో చిత్ర హింసను అనుభవించిన మాలతిని తలచుకుని బాధపడిపోసాగాడతను.

దివాకర్ 'మాలతీ' అని పిలవడం విన్న నర్సు వులిక్కిపడింది.

దివాకర్‌ను పరీక్షగా చూసిన నర్స్ కళ్ళలో జ్ఞాపకాలుపొరలు కదిలాయి. ఇంజక్షన్ చేయడానికి సిద్ధమైన ఆమె చేతులు వణికాయి.

'ఇతను సాంబ! సందేహంలేదు.' దివాకర్‌ను చూస్తూ వుండిపోయింది నర్స్.

"ప్రపంచంలో క్రూరత్వాన్ని తనూ నింపుకున్న సాంబ చూపులనుఎలా మరచిపోగలను. కాగజ్‌మహల్ చీకటి గదిలో వారం రోజులునరక హింసలు పెట్టిన సాంబ నరరూప రాక్షసుడు" అనుకుంటూ అతని వంక చూసింది నర్స్ మాలతి కోపంగా.

దివాకర్ చూపులు మాలతిని గుర్తు పట్టే ప్రయత్నంలో సఫలీకృతం కాబోతున్న సమయంలో అత్యంత దీనంగా అర్థిస్తున్నట్లు అతని స్వర పేటిక నుండి మాటలు వెలువెడ్డాయి.

'నన్ను క్షమించు మాలతీ' అని.



పరమ క్రూరమైన తోడేలు కళ్ళలోకి చూస్తున్నా ననుకున్నప్పుడు ఎదురుగా వున్నది తోడేలు కాదు గొర్రె పిల్ల అని తెలిసి రిలీఫ్ ఫీలయినట్లు అనిపించింది మాలతికి ఆ క్షణాన.

"మీరు నువ్వు నువ్వు సాంబని కదూ!"

"ఆ! సాంబనే. డాక్టర్ గారి పుణ్యమా అని దివాకర్‌గా మారబోతున్నాను."

దివాకర్‌కు ఇంజక్షన్ చేసింది మాలతి.

"మాలతీ నేనునిన్ను క్రూరాతిక్రూరంగా హింసించాను. కాని ఇప్పుడు నువ్వు నాకు స్వస్థత చేకూర్చటానికి మందులిస్తున్నావు!"

మాలతి అతని వంక చురుక్కున చూసింది. దివాకర్ కళ్ళు పశ్చాత్తాప జ్వాలలో పుటం పెట్టబడ్డ మేలిమి బంగారంలా మెరసి పోతూ కనపడ్డాయి.

మాలతి చూపుల్లోని జుగుప్స అసహ్య కోపం ఆవేశం పోయాయాక్షణాన.

"ఆపరేషన్ చేయించుకుని మామూలు మనిషి అయిన ఇతడు వెనుకటి జీవితంలో చేసిన పనులు గుర్తొచ్చి పశ్చాత్తాప పడుతున్నాడు! ఇప్పుడితనిమీద కోపం తెచ్చుకోగూడదు! కోపగించుకుని బాధపడేవాడిని మరీ బాధించడం మానవ లక్షణం గాదు!" అనుకుని అనునయపూర్వకంగా అతని వంక చూసింది!

"మాలతీ! నువ్వు.... మీరు ఇక్కడ నర్స్‌గా"

"కాగజ్‌మహల్ నుండి నన్ను మార్వాడీ సేట్ కొనుక్కువెళ్లి నరకయాతనలు పెట్టాడు. అదృష్టవశాత్తు అతను హఠాత్తుగా మరణించడంతో నాకు విముక్తి కలిగింది! తెగిన గాలిపటంలా గుంటూరు జేరిన నాకు డాక్టరుగారు ఆశ్రయం ఇచ్చి నర్సుగా తర్ఫీదు ఇచ్చారు! అప్పట్నుంచీ ఇక్కడే వుంటున్నాను!"

"మాలతీ క్షణం క్రితం జీవితంలో మళ్ళీ నిన్నుచూడలేమోనని భయపడ్డాను. కాని ఈ క్షణాన నాకంటే అదృష్టవంతుడు లేడని అనుకుంటున్నాను.

ఒక మనిషిగా పునర్జన్మను ఎత్తబోతున్న సమయంలో నీవు నా దగ్గరగా వుండి నాకు స్వస్థత కల్గించబోతున్నావు!"

"సాంబ! సారీ! దివాకర్!"

"మాలతీ!"

దివాకర్ మాలతి అలా ఒకర్నొకరు ఆప్యాయంగా సంబోధించుకుంటూ మాట్లాడుకోవడం గది లోపలకు వస్తున్న డాక్టర్ రవి, శ్యాం, మాలిలేగాక దశరథరామయ్య సీతమ్మలు చూసారు.

వాళ్ళిద్దర్నీ డిస్టర్బ్ చేయడం ఇష్టంలేని డాక్టర్ రవి వెనుదిరిగాడు— తన వెంట వస్తున్న శ్యాం మాలితో "దివాకర్ షేజ్ మేడె ఫాస్ట్ ప్రోగ్రెస్!" అన్నాడాయన. పకాలున నవ్వారు శ్యాం మాలి!

* * *

సుమన్ మాచర్లలో పోలీస్‌స్టేషన్ నుండి పంపించివేసాక రోడ్డువెంట అయోమయంగా తిరిగాడు. అతని జీవితంలో మున్నెన్నడూ కనీ వినీ ఎరుగని అవమానాల పాలయ్యాడారోజు!

"నేనిప్పటివరకు బతికిన బతుకేమిటి ఈ రోజు నేను పడిన పాట్లేమిటి? అని బాధపడి పోసాగాడు.

అతనికి ముందూ "బాబూ! నీకో అన్నయ్యుండేవాడా?" అని అడిగిన విషయం గుర్తొచ్చింది!

రాణి అవమానపరచి ఇంట్లోంచి వెళ్ళగొట్టిన దగ్గరనుండి జరిగిన అవమానాలన్నిటికి అన్నే కారణభూతుడు అని అనిపించసాగింది!

"స్వర్గలోకంలో సంచరిస్తున్న వాడిని ఒక్కసారిగా పాతాళంలోకి నెట్టివేసావుగదరా అన్నా!" అనుకుంటూ రోడ్డు వారన కిళ్ళీకొట్టు ముందున్న బెంచీమీద కూలబడిపోయాడు సుమంత్. విపరీతమైన నిరాశ నిర్వేదంలో మునిగివున్న అతని మనసులో చిన్న ఆశారేఖ పొడసూపింది.

"రాజేష్! స్నేహితుడంటే రాజేష్‌ను చెప్పుకోవాలి! యౌవనంతో మదించిన మగువలు, ఖరీదైన రుచికరమైన మదిర— ఏదైనాసరే తనతో షేర్ చేయాలని కోరుకునే వాడే నిజమైన స్నేహితుడు!

సుమంత్‌కు ఎదురుగా సత్తెనపల్లి వెళ్ళే బస్ కనపడింది. ఎక్కి కూర్చున్నాడు!

* * *

సత్తెనపల్లిలో ఒక బార్‌లో స్కాచ్ విస్కీ చప్పరిస్తూ "అరేయ్ సుమంత్! నీ మనసేం బాగున్నట్లు లేదు! నిన్నిలా చూస్తుంటే నాకేదోలా వుంది!

ప్రాణ స్నేహితుడిని ఖుషీ చేయడానికి ఇక్కడ సరియైన మగువా దొరకదు— ఖరీదైన మంచి మదిర అసలే దొరకదు!

చలో గుంటూరు! నీ మనసులో మూగవేదనకు సరి అయిన మందు దొరికేదక్కడే!

"రాజేష్! నేనిప్పుడు కోట్లకు పడగలెత్తిన రాణీ భర్తను కాదు! లక్షాధికారి



దశరథరామయ్య ఏకైక వారసుడునూ కాదు!"

"అన్నీ మరచిపోయూరు! నువ్వేమైనా కాకపోయినా ఈ రాజేష్ నేస్తానివి!"

మందుకొట్టించిన ప్రగల్భాలమధ్య మత్తులోకెళ్లిపోయారు మిత్రులిద్దరూ!

గుంటూరు వచ్చేసారు సుమన్, రాజేష్! సంపెంగి కంపెనీలో చక్కని చుక్క భామ వాళ్ళిద్దరికీ స్కాచ్ విస్కీని తనవంటి పంపుల్నీ సమానంగా పంచి ఇచ్చి ఖుషీగా వుంచింది!

మరుసటిరోజు మధ్యాహ్నానికిగాని లేవలేదు మిత్రులిద్దరూ! మత్తు ఒక విధమైన నీరసం హేంగోవరు తలనొప్పితో కూర్చున్న సుమన్‌తో రాజేష్ ఖాళీ పర్సుచూపుతూ—

"గురూ! మీనాన్న ఈ వూళ్ళోనే సుశ్రుత నర్సింగ్‌హోంలో వున్నాడన్నావు! అవసరంగా కావాలని అడిగి డబ్బుట్టుకు వస్తావేంటి?" అని అడిగాడు.

క్షణం తటపటాయించాడు సుమన్. రాత్రి పొందిన అనుభవం, ఆనందం గుర్తొచ్చాయతనికి! "డబ్బులేకపోతే ఆ అనుభవం తిరిగి పొందలేను" అన్న ఆలోచన అతన్ని సుశ్రుత నర్సింగ్ హోం వైపుగా నడిపించింది.

"నాన్నా!" వరండాలో నిలబడి కేకేస్తున్న చిన్న కొడుకు పిలుపువిని బయటకు వెళ్ళాడు దశరథరామయ్య.

"చిన్నాడొచ్చాడు!" అంది సీతమ్మ ఆనందంగా. దివాకర్‌తో తమ్ముడొచ్చాడన్న వార్త దివాకర్‌లో విపరీతమైన ఆనందోద్రేకాన్ని కల్గించింది. కొంతకాలం క్రితం తమ్ముడు గుంటూరు బజారులో కనపడిన దృశ్యం గుర్తొచ్చిందతనికి. అంధకారంలో, పెంటకుప్పలో పడివున్న తనకు మొదటిసారిగా మనసులో సంఘర్షణ కలిగించిందా సంఘటన!

చిన్నప్పుడు తమ్ముడితో ఆడుకున్న విషయాలను జ్ఞాపకం తెచ్చుకుంటూ సుమన్‌ను కళ్ళారా చూద్దామని ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

ఆ సమయంలో—

బయట వరండాలో చిత్రమైన సంభాషణ సాగింది తండ్రీకొడుకుల మధ్య!

సుమన్ వంటిమీదవున్న నలిగిన దుస్తులు, ఎరుపెక్కిన అతని కళ్ళు, తూలుడు నడక చూసి కొంచెం విస్తుబోతూ "అన్నయ్య కనపడ్డాడురా!" అన్నాడు దశరథరామయ్య ఆనందంగా.

"నాన్నా! అర్జంటుగా నాలుగొందలు కావాలి!" సుమన్ చిన్నప్పటినుండీ అతను అడిగిన వెంటనే డబ్బులు తీసి ఇచ్చే అలవాటుంది దశరథరామయ్యకు! వెంటనే జేబులో

చేయిపెట్టి నాలుగువందలు తీసి సుమంత్‌కిచ్చాడు.

"అమ్మకూడా లోపలుందిరా!" అంటూ గదిలోకి వెళ్ళాడు దశరథరామయ్య.

తీరా గదిలోకి వెళ్లాక వెనుదిరిగి చూసినప్పుడు సుమంత్ లోపలకు రాలేదని వరండాలో నుంచి వెనుతిరిగి వెళ్ళిపోయాడని అర్థం అయింది దశరథరామయ్యకు.

తమ్ముడిని చూడాలని ఆశపడ్డ దివాకర్‌కు నిరాశే మిగిలింది!

* * *

"దివాకర్! రాత్రి బాగా నిద్రపట్టిందా?" అంటూ లోపల కొచ్చింది మాలతి.

"ఆ! నీ దయవలన బాగానే నిద్రపోయాను!" అని అటుఇటూ చూసి తల్లీ తండ్రీగదిలో లేరనుకున్నాక—

"పగలంతా నీ గురించి ఆలోచిస్తూ కాలం గడుపుతున్నాను! రాత్రంతా నీ గురించి కలలు కంటూ కాలక్షేపం చేస్తున్నాను!" అన్నాడు చిలిపిగా నవ్వుతూ!

"అబ్బాయిగారికి వేరే పనేం లేదులాగున్నది!"

"ఊహూ!"

"అలా అయితే డాక్టరుగారితో చెప్పి బాగా నిద్రపట్టేందుకు మందు ఇప్పిస్తాను!"

"ఆ పని చేయకు మాలతీ! నీకు పుణ్యం వుంటుంది"

"మంచంమీద పడుకుని అందులోనూ ఆపరేషన్ చేయించుకుని నాలుగురోజులయినా కాకముందే పోకిరీ పోకడలు పోవడం వంటికి మంచిదికాదు!"

మాలతి చేతిని తన చేతులలోనికి తీసుకుని మాలతీ! నాకు కోపం తెప్పించకు! కోపం తెప్పిస్తే ఏం చేస్తానో తెలుసుగదా!" అంటూ ఆమె చేతిని మృదువుగా నొక్కాడు.

"ఏం చేస్తావు! చీకటికొట్లో తోస్తావు" అంటున్న మాలతి నోటిని తన చేతివేళ్ళతో మూసివేసి.

"మాలతీ! ఆ విషయం మర్చిపో!" అంటూ మళ్ళీ తన గొంతులో కొంటెతనం నింపుకుని.

"ఈసారి చీకటి కొట్లోకి తీసుకువెళ్తే శిక్ష ఇంకోరకంగా వుంటుంది సుమా! వెనుకటి అనుభవాన్ని మర్చిపోతావు ఎప్పుడూ చీకటి కొట్లోకి వెళ్లాలి అని జీవితాంతం కోరుకుంటూ వుంటావు!"

"ఛీ! ఆపు నీ పోకిరీ మాటలు!" పకపక నవ్వుతున్న మాలతి దివాకర్‌లను రూం వాకిలి దగ్గర నిలబడ్డ డాక్టర్ రవి, శ్యాం, మాలిలు చూసారు!

మాట్లాడకుండా వెనుదిరిగిన డాక్టరు రవి శ్యాంతో "సిన్సియర్‌గా పనిచేసే నర్సును



త్వరలో నేను పోగొట్టుకోవాల్సి వుంటుంది!" అన్నాడు.

పకపక నవ్వారు శ్యాం మాలి జవాబుగా! మాలతి దివాకర్ చనువుగా వుండడంచూసిన దశరథరామయ్య సీతమ్మ మనసులలో ఆనందపడిపోయారు.

"మాలతి నాకు బాగా తెలుసు" అని మాత్రం చెప్పాడేగాని పూర్తి వివరాలు తల్లికి తండ్రికి చెప్పలేదు దివాకర్!

ఆమె గతచరిత్ర విన్న తర్వాత ఆమెను వాళ్ళిద్దరూ తమ కోడలిగా అంగీకరించలేరేమోనని భయపడ్డాడతను!

చిన్నప్పుడు తప్పిపోయిన పెద్దకొడుకు దొరికాడన్న సంతోషాన్ని చెదరగొడుతూ సుమన్ రోజూ వచ్చి వందలకు వందలు డబ్బు అడిగి తీసుకువెళ్లడం— కనీసం అలా డబ్బుకోసం వచ్చినప్పుడయినా లోపలకు వచ్చి అన్నను పలుకరించకపోవడంతో మనసు విరిగి ఒకరోజు "ఆరే చిన్నాడా! డబ్బులయిపోయినయ్‌రా!" అన్నాడు తండ్రి.

"బజార్లెంట బికారిలా తిరిగే వాడికోసం వేలకు వేలు తగలేస్తున్నారుగాని నాకవసరం అయి అడిగితే డబ్బివ్వరు!" అని రుంజుకున్నాడు సుమన్.

"ఎంత ఘోరంగా మాట్లాడుతున్నావురా చిన్నాడా! దొరకక దొరకక అన్న దొరికాడని సంతోషించేది పోయి నిష్టూరాలాడుతున్నావా?"

"నికృష్టంగా బతుకుతున్న వాడిని తెచ్చి నా పెద్ద కొడుకని చెప్పుకోవడానికి సిగ్గులేదూ! ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములువాడి అని అన్నారందుకే!"

"ఎంత మాటన్నావురా? వాడు నా పెద్ద కొడుకు. నాకు వాడి తర్వాతే నువ్వు!"

"ఖానీకోరుని, దొంగవెధవని నెత్తిన బెట్టుకుని వూరేగండి!" అంటూ వెళ్ళిపోయాడు సుమంత్.

హోటల్‌రూంలో రాజేష్‌తో "అరేయ్! మా నాన్న డబ్బులు లేవన్నాడు! అడగాల్సినని నాలుగూ అడిగి వచ్చేసాను" అని చెప్పాడు.

"అరేభాయ్! ముసలాడు విసుక్కుంటే దిగులుపడుతున్నావా? డోంట్‌వర్రీయార్! డబ్బుకోసం దిగులుపడకు! తిను! తాగు! ఆనందించు!

డబ్బు విషయం నాకొదిలెయ్!"

"రాజా నువ్వుండగా నాకు దిగులేముంటుంది!" అని విస్కీ గ్లాసందుకున్నాడు!

గంటసేపున్నాక రాజేష్ సుమంత్ ఎక్కిన రిక్షా మార్వాడీ చాంద్‌రావ్ షాపు ముందాగింది.

"సేట్‌జీ! ఇదుగో నా స్నేహితుడు సుమంత్! బంగారుపిచ్చిక! లక్షల విలువచేసే ఆస్తికి వారసుడు! చిన్న అవసరం తగిలి డబ్బు కావాల్సి వచ్చింది!"

"అరే భైటీయే బాబాజీ! బాబుగారికి అవసరం అయితే కావలసినంత డబ్బు తీసుకోమనండి!"

"సరే నాల్గువేలుతే!"

నాలుగువేలు అయ్యేదాకా సుమంత్‌ను భూమిమీద నిలవనియ్యలేదు రాజేష్!

కావాల్సినప్పుడు కావాల్సినంత డబ్బు ఇస్తున్న చాంద్‌రాం వలన డబ్బుకు బాధపడలేదు కొన్నాళ్ళపాటు సుమంత్! గుంటూరుకు నాలుగుమైళ్ల దూరంలో అమరావతి వెళ్ళేదారిలో రోడ్డుకు అరమైలుదూరంలో రోజ్‌గార్డెన్ వుంది!

ప్రతిరోజూ నీల ప్రియ శ్యాంమాలి సాయంత్రం రోజ్‌గార్డెన్‌లో కొంతసేపు విహరిస్తూ కులాసాగా కాలం గడుపుతున్నారు!

ఒకరోజు సాయంత్రం నీల ప్రియ కారులో ఎక్కికూర్చున్నారు రోజ్ గార్డెన్‌కు ప్రయాణమై! డాక్టరు రవి పిలవడంతో శ్యాం మాలి ఆగిపోయారు.

"నీలా! మీరిద్దరూ వెళ్ళండి! మేమొక పావుగంటలో ఆటోలో బయల్దేరి వస్తాం!" అని శ్యాం అనడంతో నీల కారు డ్రైవ్ చేసుకొంటూ వెళ్ళింది!

సరిగా బ్రాడీపేట సెంటరు దగ్గరసిగ్నల్ క్లియర్ అవక కారాపింది నీల.

ఆ సమయంలో అక్కడ నిలబడి వున్న రాజేష్ సుమంత్ నీలప్రియలను కారులో చూసారు!

"జంట గులాబి పువ్వుల్లా వున్నార్రా!"

"రోజూ శ్యాం మాలిలు బాడిగార్డుల్లా వుండేవాళ్లు!"

"ఈ రోజు వాళ్ళిద్దరూ లేరు!"

"లెటస్ ఫాలోదెమ్ అండ్ ట్రై అవర్ లక్!"

"కమాన్! అదిగో టాక్సీ!"

నీల, ప్రియల కారు రోజ్‌గార్డెన్ ముందాగిన రెండు నిముషాలలో రాజేష్, సుమంత్‌లు వచ్చిన టాక్సీ వచ్చి ఆగిందక్కడ. చుట్టూ చూసి కనుచూపుమేరలో జనం లేకపోవడంతో టాక్సీ డ్రైవర్‌కు డబ్బిచ్చి పంపించేసాడు రాజేష్!

ఆరోజు రోజ్ గార్డెన్ మాలి కూడా ఎరువు చిమ్ముతూ తోడుతో ఒక మూలన వున్నాడు.

కొన్ని రోజులుగా వస్తుండడంతో అలవాటు చొప్పున నీలప్రియ చెరొక వైపుగా వెళ్ళారు.

"గురూ! నువ్వటు నీలకేసి వెళ్ళు! నేనిటు ప్రియ వెళ్ళిన దిశగా వెళ్తాను!" అంటూ వెళ్ళాడు రాజేష్.



విరగబూచిన గులాబి పూల పరిమళం నింపుకున్న శీతల వాయువుల మత్తులో కన్నులర మూసుకుని సిమెంట్ బెంచీమీద కూర్చుంది నీల.

కనులు మూసుకుని గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ శ్యాం సుందర రూపం ఎదురయ్యాక మాత్రమే కనులు తెరవాలనుకుందామె.

సుమంత్ వచ్చి నీల పక్కన కూర్చున్నాడు చప్పుడు చెయ్యకుండా.

"శ్యాం!" అంటూ కనులు తెరిచిన నీల అరుణారుణ నేత్రాలతో స్వల్పంగా కంపిస్తున్న సుమంత్‌ను చూసి క్షణం భయపడి అంతలో తేరుకుని

"నువ్వా?!" అంది.

"ఆ! నేనే! రోజూ గులాబి తోటకువచ్చి కాగితం పూవు వాసన చూసి వెళ్తున్న నీ మీద జాలేసి వచ్చాను!" అంటూ నీల చేయిపట్టుకుని బలవంతంగా తనమీదకు లాక్కున్నాడు సుమంత్!

"ఛీ వదులు! పెళ్ళయి పెళ్ళాంతో కాపురం చేస్తున్న వాడివి నీకిదేం పాడుబుద్ధి?"

"బావిలోపల తోడిన కొద్దీ వూరుతుంది! పెళ్ళయిన వాడు నిషేధ పురుషుడా ఏం?

రా నీలా! నా అందమైన నీలా సుందరీ!

నీ గురించి ఆలోచిస్తూ ఎన్ని రాత్రులు నిద్రలేకుండా గడిపానో తెలుసా?" ఎడ్వాన్సయిపోతున్న సుమంత్‌ను వదలించుకోవాలని గుంజుకోసాగింది నీల.

"ఇంత దూరం వచ్చింది వదలడానికి కాదు!" నీలను దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టుకో బోయాడు సుమంత్.

చప్పున తలపక్కకు తిప్పుకుని "శ్యాం!" అని ఎలుగెత్తి అరచింది నీల.

అదే క్షణాన "మాలీ!" అన్న ప్రియ ఆర్తనాదం వినపడింది!

రోజ్ గార్డెన్ ముందు ఆగిన ఆటోలోవున్న శ్యాం మాలిలకు నీల ప్రియల అరుపులు వినపడ్డాయి. పందెపు గుర్రాల్లా పరుగెత్తి శ్యాం సుమంత్‌మీద మాలి రాజేష్‌మీద కాట్లకుక్కల్లా వురికి చావుదెబ్బలు కొట్టారు.

దెబ్బలు తిని వళ్ళు హూనమైన పరాభవం భరించలేక తలవంచుకని పరారయ్యారు సుమంత్ రాజేష్.

భయంతో, షాక్‌తో అవమానంతో గడగడ వణికిపోతున్న నీల ప్రియలను ఓదార్చి గుంటూరు తీసుకు వచ్చారు శ్యాం మాలి.

సుశ్రుత నర్సింగ్ హోం గేటు ముందు నిలబడ్డ రవి కారు దిగుతున్న శ్యాంను "ఏమిటి? నీల ప్రియ అలా వున్నారు" అడిగాడు.

"సార్! రోజ్‌గార్డెన్‌లో సుమంత్ రాజేష్ కీచకులలా మారిపోయారు!" అన్నాడు శ్యాం.

"సమయానికి శ్యాం మాలి రాకపోతే నేను ప్రియ ప్రాణాలతో తిరిగివచ్చే వాళ్ళం కాదు!" అంది నీల.

"ఇలాటి దుష్సంఘటనలు మళ్ళీ జరగకుండా వుండాలంటే ఒకటే పరిష్కారం వుంది!" అన్నాడు డాక్టరు రవి.

"ఏమిటి సార్ పరిష్కారం?" శ్యాం మాలీ ఒకేసారి అడిగారు.

"శ్యాం నీలను, మాలి ప్రియను అర్జంటుగా వివాహం చేసుకోవాలి!"

"ఐయామ్ రెడీ!" శ్యాం మాలీ ఒకేసారి అనేసారు!

"వాట్ ఎ బౌట్‌యు?" అని నీల ప్రియల వంక తిరిగిన డాక్టరు రవికి సిగ్గుతో తలలు వంచుకున్న స్నేహితురాళ్ళ ముఖాలు కనపడనేలేదు!

* * *

తాతయ్య కాలి ప్లాస్టర్ తీసేసాడు డాక్టర్ రవి.

"డాక్టరు బాబూ! ఇప్పుడు నొప్పిలేదు! మీరు లేచి నడవమంటే నడవాలని వుంది!"

"అప్పుడే కాదు! రెండు నెలలాగి నడవాలి! అప్పటివరకు మంచంమీదే విశ్రాంతి తీసుకోవాలి మీరు! తాతగారూ! మీరు చేయాల్సిన పని ఇంకోటి వుంది!"

"ఏమిటి బాబూ! చెప్పండి! నీ కంటే మాకు కావల్సిన వాళ్ళెవరున్నారు!"

"ఇప్పటికే ఆలస్యం అయింది! నీలా శ్యాంల వివాహం జరిపించాలి!"

"అంతకంటే సంతోషమైన వార్త మరేముంటుంది బాబూ ఒక్కమాట!"

"ఏమిటి తాతగారూ!"

"మనుమడు సుదర్శన్‌కు కబురుచేసి ఏర్పాట్లు చేయిస్తానుకోండి! ఆ ముహూర్తానికే ప్రియ మాలిల పెళ్ళి కూడా చేయిస్తే బాగుంటుందని నేను మా ఇంటావిడ అనుకున్నాం!"

"సరే! మంచంమీద పడుకుని ఇవే ఆలోచిస్తున్నారన్నమాట! రెండు పెళ్ళిళ్ళూ ఒకే ముహూర్తాన జరిపించండి!"

"బాబూ!" కాటికి కాళ్ళు చాచుకున్న వాడి కాలు బాగు చేసావు! నీ మాట మాకు వేదవాక్కు!"

* * *

"ప్రియా! నీల శ్యాంల వివాహంనాడే నీకూ మాలికి వివాహం చేస్తానంటున్నాడు



తాతయ్య! నీ తరపున చెప్పవలసిన వాళ్ళెవరూ దగ్గర్లో లేకపోవడంతో నీకే ఈ విషయం చెబుతున్నా!"

అంగీకార సూచకంగా తలూపింది ప్రియ.

* * *

సుమంత్ చేతిలో డబ్బయిపోయింది! అలవాటు ప్రకారం చాంద్‌రావ్‌ దగ్గరకు వెళ్ళాడు.

"అరే భాయ్! నా దగ్గర డబ్బులేదు! మీరు ఇదివరకు తీసుకున్న వాటిమీద వడ్డీ పెరిగిపోతున్నాది! కొంత డబ్బు జమచెయ్యి!"

"ఇదేమిటి సేట్! డబ్బివ్వమని వస్తే డబ్బడుగుతున్నావు!"

"నా దగ్గర డబ్బు లేంది ఎలా ఇచ్చేది!"

"ఎవరి దగ్గరయినా బదులు తీసుకుని ఇవ్వు!"

"భాయ్! మీ తండ్రి ఆస్తి మంచిదే! కాని నీకో అన్న వున్నాడు! ఆస్తి సర్వస్వం మీ తండ్రి స్వార్జితం!

నీకు వాటా పంచిఇస్తే తప్ప ఆ ఆస్తిమీద నీకు హక్కులేదు!

ఇక నీకు అప్పు ఎలా పుడుతుంది?!" లేచి పళ్ళుమారుతూ కోపంతో బయల్దేరాడు సుమంత్!

"దివాకర్ సాంబ అవతారంలో వున్నప్పుడు రాంజీని చంపాడని మాచర్ల పోలీసులు అంటున్నారు! దివాకర్ ఆచూకీ వాళ్ళకు తెలియజేస్తే అరెస్టు చేసి తీసుకువెళ్తారు! వురిశిక్షో యావజ్జీవ కారాగారమో పడుతుంది! వాడి అడ్డం వదలి ఆస్తి అంతా నా సొంతం అవుతుంది!" అనుకుంటూ సుస్రుతా నర్సింగ్‌హోం దిశగా నడుసాగాడు సుమంత్. "కాని నేను దివాకర్‌ను పట్టిచ్చానని తెలిస్తే ఆ కోపంలో నాన్న నాకు ఆస్తి అందకుండా చేయవచ్చు! అందుకని ముందు మర్యాదగా అడిగా చూస్తాను! వినకపోతే నాకు ఆస్తి పంచకపోతే— అనుకున్న పనిచేసేస్తాను!" క్రూరత్వం కుటిలం నిండిన ఆలోచనలు మనసును వుక్కిరిబిక్కిరి చేస్తుంటే ముందుకు నడిచాడు సుమంత్.

* * *

"బాబూ! కుట్లు విప్పదీసారు! నీ ఆరోగ్యం బాగుంది! ఇక మన ఇంటికి వెళ్దాం!" దశరథరామయ్య దివాకర్ మంచందగ్గర కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

"నాన్నా! నువ్వు ఏమీ అనుకోనంటే ఒకమాట చెబుతాను!"

"ఏమిటది?"

"నేను ఇంటికి రాలేను! నాకంటే ముందు నాగత చరిత్ర మనవూరు చేరుతుంది.

అందరూ నన్నూ మిమ్మల్ని చులకనగా చూస్తారు!''

''ఓహో అదా నీ అనుమానం! పోనీ ఇక్కడే గుంటూరులో ఇల్లు కొంటాను ఇక్కడే వుండు!''

''నాన్నా! ఇన్నేళ్ళుగా తమ్ముడు నీ ఆస్తికంతకూ తనే ఏకైక వారసుడిననే నమ్మకంతో వున్నాడు! ఇప్పుడు నువ్వు ఆస్తిలోసగం నాకు పంచియిస్తే తమ్ముడికి ఆస్తి ఆ మేరా తగ్గిపోతుంది!''

''అదేమిట్రా దివాకర్! ఇద్దరు కొడుకులున్నాక ఆస్తి చెరిసగం వస్తుంది! చిన్నాడు పిచ్చివేషాలు వేస్తే ఆస్తి మొత్తం నీకే రాసి ఇస్తాను!''

''ఆ పని చేయొద్దు నాన్నా! అదృష్టవశాత్తు నా బ్రతుకు తెరువు చూసుకోగల శక్తియుక్తులు నాకున్నాయి! నీ దగ్గర వున్నా నీ ఆస్తి తింటున్నా నలుగురిచేతా వేలుపెట్టి చూపించుకోవాల్సి వస్తుంది! అది నా కిష్టంలేదు!

పైగా తమ్ముడు చిన్నప్పట్నుంచీ కష్టం తెలియకుండా పెరిగాడు. తనది అనుకున్నది తనది కాదని అనుకున్నప్పుడు కలిగే బాధ భరించటం కష్టం! వద్దునాన్నా! నాకు నీ ఆస్తి వద్దు!''

''మరి ఎలా బతుకుతావురా?''

''డాక్టరు రవిగారి దగ్గర కాంపౌండరుగా వుందామనుకున్నాను! నాకు పునర్జన్మనిచ్చిన డాక్టరుగ్గారి దగ్గరే వుండాలని అనుకున్నాను!''

''దివాకర్!''

''నాన్నా! నా దింకోకోరిక వుంది! నేను మాలతిని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నా!''

''అలాగే బాబూ! నీ ఇష్టప్రకారం కానిద్దాం!''

''నాన్నా! నీ ఆస్తి అంతా తమ్ముడికే ఇవ్వు! అమ్మ నువ్వు నాకు ఈనెల రోజులుగా ఎంతో సేవ చేసారు! జీవచ్ఛవంలా వున్న నన్ను మనిషిని చేసారు.

అప్పుడప్పుడూ వచ్చి నన్ను చూసి వెళ్తుండండి. నేను మన వూరికి రావడం శ్రేయస్కరం కాదు కాబట్టి మీరే వస్తుండాలి!''

''బాబూ! దివాకర్!'' అంటూ కనులు వత్తుకున్నాడు దశరథరామయ్య.

వాకిలి వద్ద— మూసిన తలుపుల అవతల నిలబడి అన్న—తండ్రి సంభాషణ విన్న సుమంత్ మనసులోని అనుమానం తొలగిపోయింది.

''అమ్మయ్య! వీడి గురించి పోలీసులకు ఇన్ఫార్మ్ చేయాల్సిన అవసరం తప్పింది!'' అనుకున్నాడతను! బయటకు నడచి వెళ్ళుతూ.

* * *



''శ్యాం! నీల తండ్రి సుదర్శన్‌గారు ఈ రోజు వస్తున్నారు. సాయంత్రం ఆయన సిరిపల్లె వెళ్ళి నీలతో నీ వివాహ విషయమై మీ అమ్మగారితో మాట్లాడబోతున్నారు!'' అని చెప్పాడు డాక్టరు రవి.

అప్పటివరకు ఆ విషయమై అమ్మకు తెలియచేయలేదన్న విషయం గుర్తొచ్చింది శ్యాంకు.

''సార్! అలాగయితే నేను ముందుగా వెళ్ళి అమ్మకు ఈ విషయం తెలియజేస్తాను!'' అంటూ డాక్టరు రవి దగ్గర సెలవు తీసుకుని సిరిపల్లె వెళ్ళిపోయాడు శ్యాం!

సున్నం కొట్టి కోటప్రాకారంలా మెరిసిపోతున్న ప్రహరీగోడ— కొత్తగా రంగులు వేసినందువలన కొత్త మేడలా కన్పడుతున్న ''రాజగృహం'' వంక ఆశ్చర్యంగా చూస్తూ లోపలకు వెళ్ళాడు శ్యాం.

''అమ్మా! ఈ రోజు నీల వాళ్ళ నాన్న మనింటికి వస్తున్నారు! నీ కిష్టమైతే నీల నీ కోడలుగా రాజగృహంలో అడుగుపెడుతుంది!

''అదేమిటి శ్యాం! అలా అంటావు? రాజగృహం ఎందుకు కళ కళలాడుతున్నదో తెలుసుకోలేదా నువ్వు! శ్యాం భార్యగా నీల ఇంట్లో అడుగుపెట్టే శుభగడియ కోసం రాజగృహం ఎదురు చూస్తున్నది!''

''అమ్మా! అయితే నీ కంతా తెలుసన్నమాట!''

''శ్యాం! బిడ్డ మనసులో ఏముందో తెలుసుకోలేని తల్లి వుంటుందా!''

''అమ్మా!''

* * *

చేబ్రోలులో తాతయ్య మందువాలోగిలి ముందున్న పెద్ద ఆవరణలో చిత్ర విచిత్రంగా అలంకరించిన పెద్ద తాటాకు పందిరి కింద నిర్మించబడ్డ రెండు కళ్యాణవేదికలలో నీల శ్యాం, మాలి ప్రియల వివాహాలు ఒకే ముహూర్తాన జరిగాయి.

డాక్టరు రవి, దివాకర్, మాలతి, దశరథరామయ్య సీతమ్మ నీల శ్యాం మాలి ప్రియల స్నేహితులూ స్నేహితురాళ్ళు అంతా వచ్చారు!

వివాహం అయిన వెంటనే మాలి ప్రియ గుంటూరు వెళ్ళి సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్‌క్లాస్ కూపేలో హానీమూన్‌కు బయల్దేరి వెళ్ళిపోయారు!

''రీసెంట్లీ మారీడ్! డునాట్ డిస్టర్బ్!'' అని రాసి వున్న బోర్డుచూసి టికెట్ కలెక్టర్లు సర్వర్లు కూపే తలుపు తట్టకుండా వెళ్ళిపోయారు!

* * *

శ్యాం నీల ఎక్కిన కారు "రాజగృహం" ముందాగింది!

ముత్తయిదువులు ఎదురొచ్చి హారతి పట్టి కొత్త దంపతులను లోపలకు తీసుకొని వెళ్ళారు! కొత్త పెళ్ళికూతురుగా రాజగృహంలో అడుగుపెట్టిన నీలకు స్వాగత సత్కారాలకు లోపం జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేయబడి వుండడం చూసి ముచ్చటపడ్డారు నీల శ్యాం.

తల్లి ఎదురు రాలేదేమా అని క్షణం ఆలోచించి ఈ సమయంలో ఎదురవటం ఇష్టంలేక లోపల పనులు చేయిస్తూవున్నదేమో అనుకుంటూ మూడో అంతస్తులోని తన గదికి వెళ్లాడు శ్యాం!

అక్కడ బల్లమీద తల్లి దస్తూరితో వున్న ఉత్తరం కనపడగానే ఆత్రంగా తీసి చదువ సాగాడతను!

బాబూ శ్యాం!

ఏడు తరాలుగా శాపగ్రస్తమైన రాజగృహం చరిత్ర నీకు ఈ పాటికి పూర్తిగా తెలిసే వుంటుంది!

చరిత్ర పునరావృతం కారాదంటే గత తరం శాపావశేషంగా మాయని మచ్చలా మిగిలివున్న నేను రాజగృహంలో ఇంకొక్క నిముషం వుండకూడదు!

నిన్నూ నీలను పసుపుబట్టలతో కళకళలాడుతూ వుండగా చూడాలని— మీ ఇద్దరూ చెట్టా పట్టాలేసుకుని రాజగృహంలో తిరుగుతుండగా చూడాలని నీల కడుపుపండి ఓ ఆడపిల్ల పుట్టి ఇంట్లో తిరుగుతుంటే వీక్షించి ఆనందించాలనీ ఎన్నెన్నో కోరికలు నన్ను ఆందోళన పెడుతున్నా అన్నిటినీ దిగమింగి మనసును రాయిచేసుకుని రాజగృహం నుండి వెళ్ళి పోతున్నాను!

నేను ఇక్కడే వుంటే నా కోర్కెలు నిజం అయే అవకాశం వుండదనే శంక నా మనసు మారుమూల పురుగులా తొలచి వేస్తున్నది!

నేనెక్కడ వున్నానో అని వెదికించాలని చూడకు! ఎక్కడవున్నా నీ క్షేమం కోరే,

అమ్మ

"అమ్మా!" శ్యాం హృదయపు లోతుల్లోంచి వచ్చిన ఆక్రందనతో గది దద్దరిల్లింది.

* * *

శ్యాం కర్తవ్యం బోధపడని వాడిలా నిశ్చేష్టుడైవుండిపోయాడు. కొంతసేపున్నాక



లేచివెళ్ళి డాక్టరు రవికి ఫోన్ చేసాడు గద్గద కంఠంతో జరిగిన విషయం ఆయనకు చెప్పాడు.

"శ్యాం! నీ ముందు రెండు దారులున్నాయి! అమ్మకోసం వెదకటమా! లేక అమ్మకోరిక తీర్చడమా?

తనంతట తాను రాజగృహం నుండి వెళ్ళిపోయింది గనుక నువ్వు ఈ విశాల ప్రపంచంలో ఎంత వెతికినా ఆమె నీకు కనపడదు!

ఈ వయసులో మీ అమ్మ సంతోషపడాలన్నా నువ్వు ఆమె రుణం తీర్చుకోవాలన్నా ఆమె మనసులోని కోర్కెలను తీర్చడం ఒక్కటే నీకు అందుబాటులో వున్న మార్గం!"

"అంతేనంటారా డాక్టర్‌గారూ!"

"అక్షరాలా! ఆమె నీకెదురుగా రాజగృహంలో కనపడుతూ వున్నంతకాలం నువ్వు మామూలు మనిషివి కాలేవు! న్యూనతాభావం పెంపొంది వాసనలేని కాగితం పువ్వులా మారిపోతావు!

ఏడు తరాలుగా శాపం రూపంలో రాజగృహం యజమానులను నిర్వీర్యులుగా మారుస్తున్న ఫిక్సేషన్‌కు నువ్వుకూడా బలి అవుతావు! న్యూనత అనే మానసిక రుగ్మతకు బానిసవుతావు"

"అలాగయితే నన్నేం చెయ్యమంటారు!"

"అమ్మ వెళ్ళిపోయిన విషయం గమనించనట్లు ప్రవర్తించు! రాజగృహం యజమానిగా నీల భర్తగా నీ కర్తవ్యం నీవు నిర్వర్తించు!

అదే మీ అమ్మ కోరిక!"

"అలా చేస్తే అమ్మ సంతోషిస్తుందంటారా?"

"తప్పకుండా!"

మనసును నిశ్చలపరచుకుంటూ ఫోన్ పెట్టేసాడు శ్యాం! సరిగా పదినెలల తర్వాత కలకత్తా నుండి వచ్చిన ట్రంక్‌కాల్ రిసీవ్ చేసుకుని—

"నీలా! నీల్! ఓ నీల్!" అని అరుస్తూ కిందకు దిగి వచ్చాడు శ్యాం.

నిండు గర్భిణి కావడంతో నడుంమీద చేయుంచుకుని "ఏమిటి శ్యాం?" అంది నీల.

"ప్రియకు మగపిల్లవాడు పుట్టాడు! ఇప్పుడే మాలి ఫోన్ చేసాడు!"

"గుడ్‌న్యూస్! వుండు శ్యాం! నీ నోరు తీపిచేస్తాను!" అంటూ వంటసాలలోకి

వెళ్ళబోయింది నీల.

"అదేమిటే? నోరు తీపి చేస్తానని వంటింట్లోకి వెళ్తావు"

"మరి?!"

"జుంటి తేనె కన్న, జున్నుకన్న, చెరకు రసంకన్న, పనస తొనలకన్న తీయనైన ముద్దొకటి నా ముఖాన పారేసి వెళ్లు!"

అటూ ఇటూ చూసింది నీల బెరుకుగా! ఈ లోపలే నీల దగ్గరకొచ్చిన శ్యాం అడిగినది కాస్తా పు చ్చేసుకున్నాడు.

"ఓరగా వేసిన కిటికీ తలుపు అవతల నిలబడి నిక్కి చూస్తున్న కామమ్మ ఆ దృశ్యం చూసి "అయ్యో! అయ్యో! పెళ్ళయి ఇన్నేళ్ళయినా నిండా నెలలు వచ్చినా ఇదేం విడ్డూరమో!" అనుకుంటూ కుతూహలంగా చూడసాగింది.

"అబ్బా! అమ్మా!"

"ఏమయింది నీలా?"

"నడుం నొప్పి!"

"ఆ! ఇప్పుడేం చేయాలి! కామమ్మత్తా!"

"ఏమిటి బాబూ పిలిచావు?"

"అత్తా! నీలకేమిటో జబ్బు చేసింది!"

"ఓ! అదా! కారు తీసుకురా! ఆస్పత్రికి తీసుకువెళ్దాగాని!"

"ఇంతకు ముందుదాకా బాగానే వుందిగదా! ఇంతలో ఏమయింది?"

"మీ అమ్మకోరిక ప్రకారం ఆడపిల్ల పుడుతుందో! నీలమ్మ కోరిక ప్రకారం మగపిల్లవాడే పుడతాడో తేలిపోతుందివాళ!"

"ఆ! అలాగా ఇప్పుడే కారు తీసుకువస్తా!"

* * *

"శ్యాం! కంగ్రాట్యులేషన్స్! నీలకు ఆడపిల్ల పుట్టింది! మీ అమ్మ కోరిక **తీరింది!** రాజగృహం శాప విముక్తమయింది!"

"థాంక్యూసార్!"

* * *

"శ్యాం!"

"ఊ! ఏమిటి? ఏమంటున్నారు మీ ప్రియసఖి ప్రియగారూ!"

"వాళ్ళ బాబుకు 'అతన్‌రాయ్' అని బెంగాలీ పేరు పెట్టిందట!"



"అతన్ అంటే మన్మథుడు కదూ!"

"ఆ!"

"అయితే మనపాపకు అనిందిత అని పేరు పెడదాం. మనమేం తీసిపోయామా?"

"అనిందిత! ఎంత మంచిపేరు!

"ఉండు శ్యాం! కలకత్తా డైరెక్టుగా డయల్‌చేసి ప్రియకు ఈ విషయం చెబుతా!"

"అయితే ఈ పేరు నీ కిష్టమేనన్నమాట!"

"ఓ"

"అట్లయితే పాపను ఎప్పుడూ తిట్టకూడదు ఎప్పుడూ తిట్టకుండా వుంటేనే ఆ పేరు సార్థకమయ్యేది!"

"అలాగే! వుండండి ఫోన్ చేసి వస్తాను!"

"ప్రియ ఏమంది నీలా?" "ఏమందా! అనిందిత అని పేరెట్టి కోప్పడకుండా గారాబంగా పెంచితే కోడలు గడుగ్గాయిలా తయారయి తన కొడుకును వేధిస్తుందని భయపడుతున్నది"

"అప్పుడే కోడలు మీద దాష్టీకం మొదలెట్టిందా?"

"దాష్టీకం మొదలెడితే వూరుకుంటావా? పళ్లు రాలగొడతాను!"

* * *

నక్షత్రాలను మాలగా వేసుకున్న స్వర్గ సౌధంలా విద్యుత్తోరణాలను అలంకరించుకొన్న రాజగృహం తళతళ మెరసిపోతుంది.

ఆ వుదయమే అనిందిత అతన్‌రాయ్‌ల వివాహం జరిగింది!

నవవధూవరులను దివ్యంగా అలంకరించిన బెడ్‌రూంలోకి పంపి కిందకు వెళ్ళిపోయారు ప్రియ నీల.

"మీవాడు మా అమ్మాయిని కోప్పడకూడదు!"

"మీ అమ్మాయి మా వాడికి ఏ లోటు లేకుండా సేవ చేయాలి!" ప్రియ నీలా కింద అంతస్తులో పరాచికాలాడుతున్న సమయంలోనే రెండో అంతస్తు బెడ్ రూం నుండి.

"అమ్మోయ్! బాబోయ్! డాడీ! మమ్మీ!" అనిందిత అరుపులు కేకలు వినపడి పరుగెత్తుకు వెళ్లారు! పై అంతస్తు నుండి మాలి శ్యాంలు డాక్టరు రవి పరుగెత్తుకు వచ్చారు.

తలుపులు భళ్ళున తెరుచుకుని బెదిరిన లేడికూనలా చెంగున పరుగెత్తుకువెళ్ళి

శ్యాంను కౌగలించుకుంది అనిందిత.

"డాడీ! అతన్ నన్ను...." వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

మిత్రులు ముఖ ముఖాలు చూసుకున్నారు! విషయం అర్థం చేసుకున్న డాక్టరు కిందకు వెళ్ళి అయిదు నిమిషాలలో పాలగ్లాసుతో తిరిగి వచ్చాడు.

"అనిందితా! ఈ పాలు తాగు! అలసిపోయి వున్నావు!" అరచి ఏడ్చి అలసి

అనిందిత పాలు గడగడ తాగేసింది.

అనిందిత ముఖంలో కనబడుతున్న ఆందోళన అలజడి తగ్గిపోయింది!

డాక్టరు రవి సైగ చేయగా ఆమెను గదిలోపలకు పంపించి వచ్చింది నీల.

మిత్రులు నలుగురూ డాక్టరు రవి వెంట కిందకు దిగి వెళ్ళిపోయారు.

అనిందిత అరుపులు వినాల్సి వస్తుందేమోనని భయంతో కూర్చుండిపోయిన నలుగురికి ఆ రాత్రి నిద్రపట్టనేలేదు భళ్ళున తెల్లవారింది! కారెక్కి వెళ్ళిపో

"ఇకనైనా వెళ్లి నిద్రపోండి!" అన్నాడు డాక్టరు రవి!

అప్పటికిగాని నీల శ్యాం మాలి ప్రియుల మనసులలో చిక్కు ముళ్ళు వేస్తు ఆందోళన తొలగిపోలేదు!

బాలేందు కిరణాలను చూసి కళకళలాడే కలువబాలలా మేడ దిగివస్తున్న అని తను చూసిన తల్లి తండ్రి అత్తమామ సంతృప్తిగా నిట్టూర్చారు.

అయిపోయింది